వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 17 సంచిక : 6 హైదరాబాద్ 215 జూన్ 2019 పేజీలు : 68 రు. 25

- లోక్‌సభ, ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలు
- విద్యార్థుల మరణాలు - ఆందోళనలు
- మల్లన్నసాగర్ కొత్త పరిణామాలు
- విత్తన హక్కుపై బహుళజాతి సంస్థల దాడి
- అన్యాయం నిండిన న్యాయవ్యవస్థ
- గోదావరి లోయ ప్రతిఘటనా స్వరం
- బ్రిటన్‌ను వణికిస్తున్న బ్రెగ్జిట్ సంక్షోభం

వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

ఆర్థిక వ్యవస్థ - సామ్రాజ్యవాదం

ఒక దళారీ పశ్చాత్తాపం	జాన్ పెర్కిన్స్	రు. 75
కుట్రాజకీయం	స్టీఫెన్ కింజర్	40
అభివృద్ధిని ఇలా చూద్దాం	ముదునూరి భారతి	80
కొత్తచూపు	ఆర్.ఎస్. రావు	120
ఊరి దారి	ఎన్. వేణుగోపాల్	60
రాబందు వాలిన నేల	ఎన్. వేణుగోపాల్	180
వ్యవసాయం - ప్రపంచీకరణ	కె.ఆర్. చౌదరి	100
రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే	రైతు సేవా సమితి	100
భారతదేశంలో ఉత్పత్తి విధానం- ఉత్పత్తి సంబంధాలు	విరసం	20
ప్రపంచీకరణ ప్రాభవంలో...	విద్యాభూషణ్	120
మార్క్స్ రాసిన పెట్టుబడి	డేవిడ్ స్మిత్, ఫిల్ ఇవాన్స్	200

తెలంగాణ

తెలంగాణార్థం	ఎన్. వేణుగోపాల్	150
లేచినిలిచిన తెలంగాణ	ఎన్. వేణుగోపాల్	120
కొత్త వంతెన	కె. శ్రీనివాస్	120
సమగ్ర తెలంగాణ	వీక్షణం ప్రచురణ	295
ఎవరికోసం మల్లన్నసాగర్?	తెలంగాణ ఆత్మగౌరవ వేదిక	20
మానని గాయాలు	తెలంగాణ విద్యావంతుల వేదిక	100

శాస్త్రవిజ్ఞానం

విశ్వాంతరాళం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మానవ పరిణామం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవకణాలూ నాడీకణాలూ	కొడవటిగంటి రోహిణీప్రసాద్	80
ప్రకృతీ - పర్యావరణం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవశాస్త్ర విజ్ఞానం - సమాజం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మనుషులు చేసిన దేవుళ్లు	కొడవటిగంటి రోహిణీప్రసాద్	120
అణువుల శక్తి	కొడవటిగంటి రోహిణీప్రసాద్	150
విజ్ఞాన శాస్త్రం మనిషి విస్తరణ	జెడి బెర్నాల్	80

కులం-మతం

భారతదేశంలో కుల సమస్య	అనురాధ గాంధీ	120
పంచతంత్రం	బొజ్జా తారకం	200
కులం వర్గం	బొజ్జా తారకం	60
చరిత్ర మార్చిన మనిషి	బొజ్జా తారకం	150
శూద్రవర్ణం ఎలా పుట్టింది	ఆర్.ఎస్. శర్మ	150
గులాంగిరి	జోతిబా ఫూలే	60
కుల నిర్మూలన	అంబేద్కర్	60
శూద్రులు - ఆర్యులు	అంబేద్కర్	20
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	30
వెలివాడల వెతలు	కుల నిర్మూలన ప్రచురణ	100

తత్వశాస్త్రం

మార్క్సిస్ట్ తత్వశాస్త్రం	న్యూవిస్టా పబ్లికేషన్స్	80
మార్క్సిజం-లెనినిజం-మావోయిజం	విరసం ప్రచురణ	125
మార్క్స్ పెట్టుబడి రచనా క్రమం	విరసం ప్రచురణ	50
మార్క్సిస్టు నిఘంటువు-1	లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్	350
మార్క్సిస్టు పదకోశం	లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్	50

చరిత్ర-జీవిత చరిత్ర

భారత చరిత్ర అధ్యయానికి ఒక పరిచయం	డి.డి. కోసంబి	250
భారత చరిత్ర పరిచయ వ్యాసాలు	డి.డి. కొశాంబి	70
భగవద్గీత చారిత్రక పరిణామం	డి.డి. కొశాంబి	20
ప్రాచీన భారత దేశ చరిత్ర	కె. బాలగోపాల్	100
తరతరాల భారతదేశ చరిత్ర	రొమిల్లా థాపర్	100
ఇండియాలో దాగిన హిందుస్థాన్	పెరి ఆండర్సన్	150
బాబాసాహెబ్ అంబేద్కర్	బి. విజయభారతి	120
చేగువేరా	కాత్యాయని	120
మహాత్మా జ్యోతిరావ్ ఫూలే	ధనుంజయ్ కీర్	100
ఛత్రపతి సాహూ మహరాజ్	కాత్యాయని	40
తలపుల తోవ	షౌకత్ కైఫీ	100
ఏడవకు బిడ్డా...	గుగి వా థియాంగో	150
కశ్మీర్‌లో నిషిద్ధ రాత్రి	బషారత్ పీర్	170

సాహిత్య విమర్శ - వ్యాసాలు

గురజాడ దేశభక్తి	ఎన్. వేణుగోపాల్	20
కవిత్వంతో ములాఖాత్	ఎన్. వేణుగోపాల్	120
సాహిత్య వ్యాసాలు	చలసాని ప్రసాద్	100
చలసాని ప్రసాద్ రచనలు	చలసాని ప్రసాద్	100
చలసాని ప్రసాద్ సాహిత్య సర్వస్వం-1	విరసం ప్రచురణ	270
మహోదయం	కె.వి.ఆర్.	200
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-2	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-3	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సామాజిక వ్యాసాలు	కె.వి.ఆర్.	300
కెవిఆర్ డిటెన్యూ డైరీ	కె.వి.ఆర్. శారదాంబ కమిటీ	170
కెవిఆర్ కవిత్వం	కె.వి.ఆర్. శారదాంబ కమిటీ	200
అల్లంరాజయ్య కథలు పరిశీలన	ఎస్. నీళాదేవి	75
కొలిమి రవ్వలు	గౌరి లంకేశ్ రచనలు	150
సహచరులు	వరవరరావు	100

విప్లవోద్యమం

మంద్రస్థాయి యుద్ధం	విరసం ప్రచురణ	100
జగిత్యాల జంగల్‌మహల్-1	విరసం ప్రచురణ	75
జగిత్యాల జంగల్‌మహల్-2	విరసం ప్రచురణ	100
నేటి రాయలసీమ	విరసం ప్రచురణ	100
దండకారణ్యంలో గ్రీన్‌హంట్	విరసం ప్రచురణ	60
మావో రచనలు - 1	విరసం ప్రచురణ	170
మావో రచనలు - 2	విరసం ప్రచురణ	220
జనతన రాజ్యం	పాణి	300
30 ఇయర్స్ దండకారణ్య కల్చరల్ మూవ్‌మెంట్	ఎన్.ఎం. చేతనా	250
సంకెళ్ల సవ్వడి	అరుణ్ ఫరేరా	150
మలుపు తిప్పిన మహా ఉద్యమం	విరసం ప్రచురణ	60
బోల్షివిక్ పార్టీ చరిత్ర	విరసం ప్రచురణ	250
ఆవాజ్	విరసం ప్రచురణ	65
మెరిసే అక్షరాల వెనుక	సృజన ప్రచురణ	30
నక్సల్బరీ ఒక ఊరు మాత్రమే కాదు	విరసం ప్రచురణ	80
పికెఎం ప్రభాకర్ రచనలు	విరసం ప్రచురణ	70
కార్మికవర్గ విప్లవం-విప్లవ ద్రోహి కౌట్స్కీ	విరసం ప్రచురణ	60
భీమా కోరేగాం 12 - వివి	స్వేచ్ఛా సాహితి ప్రచురణ	50

కథ - నవల

దండకారణ్య కథలు (2005-2012)	విరసం ప్రచురణ	100
వసంతగీతం	అల్లం రాజయ్య	250
ఏడుతరాలు	అలెక్స్ హేలీ	150
వనవాసి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	120
నేల నాగలి - మూడెద్దులు	బొజ్జా తారకం	25
దళితులు - రాజ్యం	బొజ్జాతారకం	25
స్పార్టకస్	హోవార్డ్ ఫాస్ట్	120
బీజభూమి	వరవరరావు	100
మరల సేద్యానికి	శివరామ కారంత్	150
హింసపాదు	బమ్మిడి జగదీశ్వరరావు	180
అభాగ్యజీవులు	ఫ్రాంజ్ ఫనాన్	170
నిషిధ	నల్లూరి రుక్మిణి	180
మాటిగరి	గుగి వా థియోంగో	120
మట్టికాళ్ల మహారాక్షసి	గుగి వా థియోంగో	200
బందీ	గుగి వా థియోంగో	200
నేను చావును నిరాకరిస్తున్నాను	జి.ఎన్. సాయిబాబా	125

డివిడి

వీక్షణం (2003 - 2012)	200
సృజన (1966-1992)	240
అరుణతార (1970-2013)	125
'ఓయు'ద్ధకాండ	100

వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

215

ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

జూన్ 2019
సంపుటి : 17
సంచిక : 6

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై '**VEEKSHANAM**' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

పాఠకుల వీక్షణం

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థిక సహాయం అందించిన పావని, ప్రొద్దటూరు - రు. 1500, టి. క్రాంతి, నిజామాబాద్ - రు. 10,000, రమాసుందరి, ఒంగోలు - రు. 3,000, ఆళ్ల దుర్గారావు, పశ్చిమగోదావరి - రు. 500, ఎన్.ఎం.ఎన్.జె. శర్మ, పశ్చిమగోదావరి - రు. 1,000; కుర్ర చౌడయ్య, ప్రకాశం - రు. 500; మిత్రులకు కృతజ్ఞతలు - సం.

వీక్షణం మే సంచికలో వచ్చిన 'చట్టసభలకు నేర చరితులా?' వ్యాసం చట్టసభలకు పోటీ చేస్తున్న వివిధ పార్టీ అభ్యర్థులు ఎన్ని హత్యలకు, అత్యాచారాలకు, కిడ్నాప్‌లకు పాల్పడ్డారో వివరంగా ఉంది. ప్రజా సమస్యల కోసం పోరాటం చేస్తున్న రచయితలను, మేధావులను జైల్లో పెడుతూ, ఇలా అనేక నేరాలకు పాల్పడుతున్న రాజకీయ నాయకులకు ప్రభుత్వాలు, కోర్టులు ఎలాంటి శిక్షలు వేయకుండా వారికి అండగా ఉంటున్నాయి. అలాగే 'విఫలమవుతున్న ఎన్నికల కమిషన్' వ్యాసంలో కేంద్ర ఎన్నికల కమిషన్ తన విధి నిర్వహణలో ఎలా విఫలమవుతుందో, ఎన్నికలలో పోటీ పడుతున్న అభ్యర్థులు డబ్బు, మద్యం పరఫరా చేస్తున్నా వాటిని చూసి చూడనట్లు వ్యహరిస్తుందో చాలా వివరంగా రాశారు.

– కృష్ణహరి
మహబూబ్‌నగర్

మార్క్స్ 200 జయంతి సందర్భంగా 2018 మే సంచికలో మార్క్స్ మీద ప్రత్యేక వ్యాసాలు వేసినట్టుగా 2019 మే సంచికలో కూడా ఒకటి రెండు వ్యాసాలైనా మార్క్స్ మీద వేసి ఉండవల్సింది.

– షేక్ అహ్మద్
సూర్యపేట్

వీక్షణం మే సంచికలో మితాలీ అగ్రవాల్ రాసిన 'భాజపా మళ్లీ అధికారానికొస్తే' వ్యాసంలో ప్రజా జీవనరంగాలపై అది ఎలాంటి దుష్పరిణామాలను కలుగజేస్తుందో చాలా వివరంగా చెప్పారు. ఎన్నికలకు ముందు బిజెపి నాయకులు చేస్తున్న హెచ్చరికలను చూస్తే మనం ప్రజాస్వామ్యం పేరుతో కొనసాగుతున్న నియంతృత్వ పాలనలో ఉన్నామనేది అర్థమవుతుంది. ఇక ప్రజాస్వామ్య ముసుగును కూడా తీసివేసే విధంగా తమ పాలన ఉండబోతుందనే విషయాన్ని సాక్షి మహరాజ్ 2019 తరువాత ఇక ఎన్నికలే ఉండవన్న ప్రకటన, అమిత్ షా బిజెపి అధికారంలోకి వచ్చింది పదేళ్లకోసం కాదు 50 ఏళ్లకోసమనే ప్రకటలు చూస్తుంటే ముందు ముందు దేశాన్ని ఏం చేయబోతున్నారనే భయం ఆవరించింది. భారత సమాజంలోని బాల్య వివాహాల్లాంటి దురాచారాలను మళ్లీ తిరిగి తెచ్చే అవకాశం లేకపోలేదు. విషయాన్ని బిజెపి అనేకసార్లు వ్యక్తపరిచింది. మైనారిటీల పట్ల బిజెపి ప్రవర్తిస్తున్న తీరుపట్ల సమాజం జాగరుకతతో ఉండాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ప్రజల వెనకబాటుతనం, పేదరికం, బావోద్వేగాలను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన బిజెపి కల్పించే భ్రమలకు లోనుకాకుండా ప్రజలు చైతన్యవంతంగా ఆలోచింపచేయడానికి వీక్షణం లాంటి పత్రికల అవసరం ఇప్పుడు మరింత పెరిగింది. వీక్షణం పత్రిక అవసరం ఈనాడు సమాజానికి చాలా ఉంది. వీక్షణం పత్రికకు ఉన్న ఆర్థిక ఇబ్బందుల్ని మనమంత తలో చేయి వేసి ఆదుకొని నిలబెట్టుకోవాల్సిన అవసరం నేడు మరింత ఉందని దానికి నా వంతు కృషి చేస్తాను.

– రమేష్
కరీంనగర్

వీక్షణం గత సంచికలో అచ్చయిన 'నిజామాబాద్‌లో రైతాంగ నిరసన' వ్యాసం అధికార మార్పిడి జరిగాక దేశంలో రైతుల సమస్యలు పట్టించుకోక పోవడంతో 20 సంవత్సరాలకే బెంగాల్‌లోని నక్సల్బరీలో ప్రారంభమైన రైతాంగ పోరాటాలు దేశ వ్యాప్తంగా ఎలా విస్తరించాయో చాలా వివరంగా చెప్పారు. ఇప్పటికి రైతులు తమ సమస్యలకోసం పోరాడుతుంటే రైతుబంధు, రైతు భీమా లాంటి పథకాలతో రైతులను అసలు సమస్యల నుంచి పక్కదోవపట్టించే ప్రయత్నం చేస్తున్నారనే విషయాన్ని వివరించారు. దేశ రైతాంగాన్ని ఆదుకోవాల్సింది పోయి 70 ఏళ్లుగా వ్యవసాయరంగాన్ని విదేశీ కార్పొరేట్ సంస్థలకు ఎలా కట్టబెట్టడం వల్ల మన రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుపోయి ఆత్మహత్యలపాలవుతున్న తీరును చూస్తే పాలకుల ద్రోహం అర్థమవుతుంది. ఇలాంటి ఆలోచింపజేసే వ్యాసాలు మరిన్ని అచ్చువేయాలని వీక్షణం పత్రికను విజ్ఞప్తి చేస్తున్నారు.

– సురేష్
సిద్దిపేట్

వీక్షణం మే సంచికలో 'ఆదివాసుల అస్తిత్వానికి సుప్రీం సవాల్' వ్యాసం బాగుంది. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను తెలియజేసింది. ఆదివాసుల పరిస్థితులు మనకు చాలా తక్కువగా తెలుస్తాయి. వారి జీవనస్థితిగతులు, దైనందిన పోరాటాలు, ఒకవైపు పోలీసులు దాడులు, మరోవైపు బతుకు దెరువు కోసం పోరాటం వారి బతుకులు ఛిద్రం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వారికి ఉన్న కొద్దిపాటి భూమిని కూడా ప్రభుత్వాలు గుంజుకోవడానికి చూడ్డం నిజంగా దారుణం. ఈ అంశంపై మరింతగా వ్యాసాలు రావాలి. వీక్షణం ఈ దిశగా ఆలోచించాలి. అలాగే ఎన్నికల కమిషన్‌పై, పార్టీలపై వచ్చిన వ్యాసాలు కూడా బాగున్నాయి. అంతర్జాతీయ విషయాలపై మరిన్ని వ్యాసాలు రావాలని ఆశిస్తున్నాను. మన దినపత్రికల్లో వాటిపై అంతగా దృష్టి సారించవు. వీక్షణం వంటి విశ్లేషణాత్మక పత్రికలైనా అంతర్జాతీయ సమాజం గురించి, అలాగే ఆర్థికపరమైన అంశాలపై కూడా తెలుగు పాఠకులకు విశ్లేషణాత్మక వ్యాసాలు అందించాలి. పత్రికకు చేయూతనివ్వడంలో ప్రతి ఒక్క పాఠకుడు తమవంతు సాయం చేయాలని ఈ సందర్భంగా వేడుకుంటున్నాను. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ పనిని చేపట్టాలి. అప్పుడే వీక్షణం లాంటి ప్రత్యామ్నాయ వేదిక నిలబడుతుంది.

– టి. రాములు
మిర్యాలగూడ

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

(ఈ సంచికలోని హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్నవారు ఎస్. వెంకటేశ్)

మరొకసారి విద్వేష ప్రభుత్వం - కర్తవ్యం ఏమిటి?

ఎన్నికలు ముగిసి, ఫలితాలు కూడ వెలువడ్డాయి. నరేంద్ర మోడీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ – ఎన్‌డిఎ ప్రభుత్వం ఓడిపోతుందని, మరొక ప్రభుత్వం వస్తుందనీ, దేశంలో కొనసాగుతున్న కుల, మత విద్వేష, అసహన రాజకీయాల నుంచి కొంతయినా ఉపశమనం దొరుకుతుందనీ అనుకున్న చాలమంది ప్రగతిశీల బుద్ధిజీవుల, ప్రజల ఆశలు భగ్నమయ్యాయి. గత ఐదు సంవత్సరాలలో అమలు చేసిన ప్రజా వ్యతిరేక, విష విద్వేష రాజకీయాలను యథాతథంగానో, మరింత ఎక్కువగానో కొనసాగించడానికి సంఘ్ పరివార్‌కు "ప్రజామోదం" అనబడే బారాఖూన్ మాఫ్ అనుమతి దొరికింది. ఈ పరిణామం ఎట్లా సంభవించింది, మన సమాజం ఇంతగా మతోన్మాదపూరితమై పోయిందని మనం గుర్తించలేదా లేక మరేదైనా ఆకస్మిక, ఐంద్రజాలిక, సాంకేతిక కనుకట్టు విద్యలతో సంఘ్ పరివార్ మళ్లీ గద్దెనాక్రమించిందా, ఇది సంఘ్ పరివార్ బలమా, ప్రతిపక్షాల వైఫల్యమా, ప్రగతిశీల శక్తుల ఆచరణలోపమా అని ఎన్నెన్నో ప్రశ్నలు సమాధానాలు కోరుతున్నాయి. పార్లమెంటరీ రాజకీయ పక్షాలలో ఎవరు గెలిచి ఎవరు ఓడినా అంతిమ ఓటమి ప్రజలదే అవుతుంది. పాలకవర్గ ప్రయోజనాలను ఓడిన ముఠా కన్న తానే ఎక్కువగా కాపాడతానని గెలిచిన ముఠా తమ యజమానులను ఒప్పించిందనడానికి సూచికే ఎన్నికల ఫలితాలు. అందువల్ల ఓడిన ముఠా ఓటమికి కారణాలను అన్వేషించే బదులు ప్రజల ఓటమికి కారణాలను అన్వేషించడం అవసరమైన పని.

అయితే మన సమాజ సంక్లిష్టత వల్ల ఏ ఒక్క అంశమూ సరళంగా, సూటిగా, సమీకరణం లాగ చెప్పలేము. పాలకవర్గ ముఠాలన్నీ ఒక్క తానులోని ముక్కలేనని తెలిసిన వారు కూడ ఒక ముక్క గెలుపును కాకపోయినా, కనీసం మరో ముక్క ఓటమిని కోరుకునే సందర్భం వస్తున్నది. ప్రజల కనీస అవసరాలు తీర్చే ప్రజానుకూల పాలన అందించకపోవడం, దేశాన్ని బడా భూస్వాములు, దళారీల, సామ్రాజ్యవాదుల చేతుల్లో పెట్టడం, అవసరం అనుకున్నప్పుడు మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం, జనహననానికి పాల్పడడం, ప్రాథమిక హక్కులను ఉక్కుపాదంతో కాలరాయడం వంటి పనుల జాబితా తయారు చేస్తే భాజపా ఎంతటి నేరస్తురాలో కాంగ్రెస్ అంతటి నేరస్తురాలని స్పష్టమవుతుంది. రెండు పక్షాల చరిత్రా ఒక్కటేనని తేటతెల్లమవుతుంది. అయినా ఈ ఎన్నికల్లో చాల మంది ఉద్యమకారులు, ప్రగతిశీలవాదులు, అంచులలోకి నెట్టబడిన వర్గాలు భాజపా – ఎన్‌డిఎ ఓడిపోవాలని, ప్రభుత్వం నుంచి దిగిపోవాలని కోరుకున్నారు. అదేమీ కాంగ్రెస్ – యుపిఎ పట్ల ప్రేమ కాదు, వారు ప్రజా ప్రయోజనాలను నెరవేరుస్తారనే భ్రమ కాదు. విషవాయు ప్రయోగంతో ఐదు సంవత్సరాలు ఉక్కిరి బిక్కిరైన వర్గాలు ఈ జైలు కన్న పక్కన అగడ్తలోకి దూకడమైనా సరే అనుకున్నాయి. ఈ మంటల్లో కాలిపోవడం కన్న ఎగిరి పెనం మీద దూకితే వేగినా సరే అనుకున్నాయి. ఎంతకాదన్నా కాంగ్రెస్ బహుళత్వాన్ని నమ్మే, ఆచరించే రాజకీయ పక్షం. అనేక చారిత్రక కారణాల వల్ల దానికి ఆ వెసులుబాటు వచ్చింది గనుక ప్రజలకు కూడ కనీసం గాలి పీల్చుకునే అవకాశం, బేరసారాలకు దిగే వీలు వస్తాయని కొందరైనా అనుకున్నారు. ఆ స్థానంలో ఏకాత్మతను నమ్మే, ఆచరించే, హింసా దౌర్జన్యాల పార్టీగా భాజపా ఐదు సంవత్సరాల అధికారాన్ని ఎంత ప్రజా కంటకంగా నిర్వహించగలదో నిరూపించింది.

కారణాల గురించి వివరంగా విశ్లేషించుకోవచ్చుగాని, అంతకన్న ముఖ్యంగా అలా తెలుసుకున్న కారణాలను తొలగించడానికి, తగ్గించడానికి, అంతిమంగా ఈ దుర్మార్గ పాలనను బలహీనపరచడానికి, రద్దు చేయడానికి ప్రతిపాదిస్తున్న ఆచరణ ఏమిటి అనేది ఇవాళ కీలకమైన ప్రశ్న. ఈ స్థితిలో, ఈ దుస్థితిలో మీరు వ్యక్తిగతంగానో, సామూహికంగానో మీ కర్తవ్యం ఏమిటని నిర్వచించుకుంటున్నారు? ఈ దుర్మార్గ పాలనలో బాధితులుగా, పీడితులుగా మిగలబోయే ప్రజాసమూహాలేవో స్పష్టమే. మనువాదాన్ని ఖండించే సమూహాలు, ఈ దేశం బహుళత్వ దేశమనీ దీన్ని ఏ ఒక్క మతంతోనో, ఏ ఒక్క జీవనవిధానంతోనో ఏకాత్మతా సంస్కృతిగా మార్చడానికి వీలులేదని ఎలుగెత్తే సమూహాలు, హింసకూ అసమానతకూ ఆలవాలమైన ఈ బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్టు సామాజిక స్వభావాన్ని కూలదోయాలనీ, సమభావం పునాదిగా, ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయాన్ని నిర్మించాలనీ కలలు గనే సమూహాలు అన్నిటినీ ఈ పాలన ఉక్కుపాదంతో అణచివేయాలని ప్రయత్నిస్తుంది. వాక్సభాస్వాతంత్ర్యాలను, వ్యక్తిస్వేచ్ఛను, పత్రికాస్వేచ్ఛను, సామాజిక న్యాయాన్ని ప్రతిపాదించే ప్రజాస్వామ్యమన్నా, రాజ్యాంగమన్నా ఈ పాలకులకు కంటగింపు. ఆ విలువలను ఎత్తిపట్టదలచినవారందరినీ నిర్బంధాల పాలు చేయడం ఈ పాలన లక్ష్యం. 'ఏకీభవించనోడి పీకనొక్కు సిద్ధాంతం' ఈ పాలనకు శిరోధార్యం. ఇరవయో శతాబ్ది తొలి అర్ధభాగంలో ఇటలీలో బెనిటో ముస్సోలినీ, జర్మనీలో అడాల్ఫ్ హిట్లర్ ఏ మానవతా హనన ప్రయత్నాలు చేశారో ఆ ప్రయత్నాలనే మరెన్నో రెట్లు ఎక్కువగా, మరింత విచ్చలవిడిగా, ఎన్నోరెట్లు విశాలమైన ఈ దేశంలో అమలు చేయాలనేది ఈ పాలకుల కల.

బుద్ధిజీవులుగా, చరిత్ర విద్యార్థులుగా, సున్నితమైన హృదయ స్పందనలు గలవాళ్లుగా, సామాజిక జీవులుగా తమను తాము గుర్తించుకునే వాళ్లందరిముందరా ఇవాళ చరిత్ర ఒక సవాల్ విసురుతున్నది. ఎప్పుడో భూస్థాపితమైన నరహంతకుల మీద మీ వైఖరి సరే, వారి మీద పోరాడిన యోధుల గురించి మీ ప్రశంసలు సరే, ఇవాళ ఆ నరహంతకుల వారసులే అధికారపీఠాలు అధిరోహిస్తున్నప్పుడు మీరేం చేస్తున్నారు, ఏం చేయదలచారు అని. తమ గురించి తాము ఏమి ఆలోచించుకుంటున్నా, సమాజం గురించి, సమాజ భవిష్యత్తు గురించి ఏమి ఆలోచిస్తున్నా, ఎన్నెన్నెన్ని అభిప్రాయభేదాలున్నా, ఒకరిది తూర్పుదారి, మరొకరిది పడమటిదారి అయినా సరే, మహమ్మారి ముంచుకొస్తున్నది, సునామీ అందరినీ ముంచబోతున్నది. మిగిలిన విభేదాలూ వివాదాలూ అన్నీ పక్కన పెట్టి ఒకటవుతామా లేదా, సకల రంగాల్లో సకల స్థాయిల్లో సకల తలాల్లో సకల స్థలాల్లో ఈ మహమ్మారిని ప్రతిఘటించేందుకు మన శక్తి సామర్థ్యాలన్నిటినీ కలగలిపి సమగ్ర, విశాల, సమన్వయ, దీర్ఘకాలిక, అర్థవంత, ప్రజా ప్రయోజనాత్మక పోరాటానికి సిద్ధపడతామా లేదా అనేదే మనలో ప్రతి ఒక్కరినీ ఇవాళ సమాజం, చరిత్ర నిలదీస్తున్న ప్రశ్న. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

పదహారంటె సగమాయె, బిడ్డోడిపాయె, ఎందుకైనట్లిట్ల?

తాడిని దన్నెటోడుంటె వాని తలను దన్నెటోడుంటడు, ఢిల్లికి రాజయిన తల్లికి కొడుకె, కూట్లె రాయి దీయలేనోడు ఏట్లె రాయి దీస్తడట, మంచోడు మంచోడంటె మంచం ఇరగ్గొట్టిండట, తొండి మొండి దేవుడు జూస్తడు...ఇట్ల జెప్పుకుంట బోతె శాన శాత్రాలున్నయి. ఎంతటోడైన ఎప్పుడో ఒగప్పుడు బొక్క బోర్ల పడ్తడు అని జెప్పెటియి. ఎవ్వడైన ఎగిరెగిరి పడొద్దు అని జెప్పెటియి. ఇగ మన తెలంగాణల్నయితె తుపాకి ఎంకట్రాముడి ముచ్చట్లె ఉండె. చెరువుల వడ్లు బోసి తూముల మంట బెట్టిన కథలు. ఇప్పుడు తెలంగాణ మారాజుల కత గంతె ఆయెనా. నా అంత మొనగాడు లేడు, నాదే రాజ్జెం అని మస్తు సీట్లు దెచ్చుకున్నాక గుడ ఆడోణ్ని ఈడోణ్ని గొని దొడ్లె గట్టేసుకునె. పత్రికలన్నిటి నోరు మూసె. ఇగ మాట్లాడెటోడు లేడు, ఇగ ఎదురు లేదు అని పెగ్గెలు గొట్టె. ఇగ ఈ రాజ్జెం కొడుకు చేతుల బెట్టి, నేన్ ఢిల్లి పోత, ఆడ చక్రం తిప్పెదున్నది. ఆడ చక్రాలన్ని నాకోసమే ఎదురు చూస్తానయి అని ఒక్కతీర్గ జెప్పె. గాలి మోటరేస్కోని ఆడంగ ఈడంగ చెంగడ బింగడ ఎగిరె. కొసాకరికి ఏమయింది? ఇంటి మాలచ్చిమి ఓడిపాయె. రెక్కల్ల బొక్కల్ల అరుసుకున్న మేనల్లుడు ఓడిపాయె. సారు కారు సర్కారు పదహారు అని కూత బడితె, పదహారుల సగం తెగ్గొట్టి చేతుల బెట్టిరి. అదే మరి ఢిల్లికి రాజయిన తల్లికి కొడుకె, పల్లెకు కొడుకె. కాళోజి తాత జెప్పినట్టు ఎమ్మెల్లెవంటె, ఎంపివంటె, మంత్రివంటె వోటుకు పుట్టినవు బిడ్డా. ఢిల్లికి రాజువయిన వోటు దెబ్బకు పడిపోక తప్పది. ఇంతకు ఇంత గాచారమెట్లొచ్చెనో జియ్యర్ స్వామి ఏమన్న జెప్పెనా? మల్లొక్క యాగం జేస్తె తెలుస్తదా? మారె, జియ్యర్ స్వాములు బొయ్యర్ స్వాములు జెప్పేది గాదిది, యాగాలు జేసి నెయ్యి పాలు పారబోస్తే తెలిసేది గాదిది. గిది జనం దెబ్బ. జనానికి కోపమొస్తె పెద్దపెద్దోళ్లె, వాండ్లను పుట్టిచ్చినోళ్లె మంట్లె గలిసిపోయింద్రు. ఇంక ఇది మొత్తం దెబ్బ గుడ గాదు, ఇది బయాన. గంతె. మొత్తం లెక్కలు తర్వాత జూస్కుందాం. ఈ దెబ్బ ఎందుకో ఎరికెనా? పుట్టిన తెలంగాణ గడ్డను మరిచినందుకు, తెలంగాణ జనాల కొట్లాటను మరిచినందుకు, జనాలు ఎందుకు కొట్లాడింద్రో మర్చినందుకు, తెలంగాణ అర్గీజ్ ఒద్దన్నోల్లను దగ్గరికి పిల్చి, తొడమీద కూకోబెట్టుకున్నందుకు, కొలువుల కోసమే తెలంగాణ అని కొట్లాటల దిగిన పడుసు పోరలకు కొలువులు ఇయ్యకుండ ఉసురు పోసుకుంటున్నందుకు, ఎన్నడు లేనిది తెలంగాణల కులాల చిచ్చు బెడుతున్నందుకు, వీపు మీద గొట్టినా మానె కడుపు మీద కొట్టకయ్యా అని పాతరోజుల్ల అంటుంటిమి, ఇప్పుడు వీపు మీద కొట్టుడే గాదు, కడుపుల తన్నుడే గాదు, నోరు గుడ తెరవొద్దు, అయ్యో అని ఏడ్వద్దు అని మూతి మీద గూడ గుద్దుడు మొదలైంది గద. గందుకు జనానికి కోపమొచ్చింది. ఒక్క పీకుడు పీకింద్రు. అరె నాలుగు నెల్ల కింద కొట్టలేదు గాని ఇప్పుడు గొడ్తరా అంటరు గావచ్చు. అరె దేన్నికైనా కాలం రావాలె. కాలంబు రాగానె కాటేసి తీరాలె అని కాళోజీ అన్లేదా? శిశుపాలుని కత ఎరికె గద. తొంబై తొమ్మిది తప్పులైనంక పాపం బండింది. నీల్లు పొయి మీద బెట్టంగనె మస్లుతయా? లోపల్లోపల మసిలి మసిలి జెప్పున ఆవిరి గొడ్తది గద. గట్లనె, అదును కోసం ఎదురుజూస్తాంద్రు జనం. ఇత్తనాలు జల్లుటానికి రోయిణి ఎప్పుడు బోతదా, మొగులు ఎప్పుడు బడ్తదా, చినుకు ఎప్పుడు గొడ్తదా అని ఎదురు చూసినట్టు ఎప్పటెప్పటి కోపమో ఇప్పుడు తీర్చుకున్నరు. మారె, పెనం మీది నుంచి పొయిల బడ్డట్టు ఢిల్లి బుడ్డర్ ఖాన్ లకు గుద్దింది గుడ బాగలేదనుకో, కని ఏం జేస్తం. దొరవారి మీద కోపంల బందిపోటు దొంగ మంచోడనిపిచ్చె. దిక్కు లేకపాయె. వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

అవే దోపిడీ, పీడక వర్గాలకు అధికారం

ఇటు అవిభక్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగానూ, అటు విభక్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగానూ నారా చంద్రబాబు నాయుడు ప్రజా వ్యతిరేక పాలనకు, అవినీతికి, అక్రమాలకు, అహంకారానికి పెట్టింది పేరుగా మారి, అందుకు తగిన ఫలితాన్ని, పరాభవాన్ని ఒక్కసారి కాదు, రెండుసార్లు అనుభవించారు. అయితే ఇప్పుడిక చచ్చిన పామును మరొకసారి కొట్టనక్కర లేదు గాని, ఆ స్థానంలో అధికారానికి వచ్చిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అంతకన్న భిన్నమైన, ప్రజా ప్రయోజనకర పాలన అందించగలరా అని ఆలోచించాలి. గత చరిత్ర తెలిసిన ఎవరైనా, ఆ చరిత్ర చంద్రబాబు అనుకూల మీడియా సృష్టి అని కొట్టేసే వారైనా సరే, జగన్ ప్రజానుకూల పాలన అందిస్తారని ఆశించడానికి అవకాశం లేదు. జగన్ అవినీతి గురించి తెలుగుదేశం అనుకూల ప్రచార సాధనాలు కొంత ఎక్కువచేసి, అతిశయోక్తులు రాసి ఉండవచ్చు గాని, తండ్రి పాలనా కాలంలోనే క్విడ్ ప్రో కో అవినీతి కథనాలు, విపరీతమైన ఆస్తుల పెరుగుదల, రాజ్యాంగేతర శక్తిగా అధికార లాలస బైటపడ్డాయి. తండ్రి ఆకస్మిక మరణం తర్వాత ఆ అధికార లాలస స్పష్టంగానే అందరికీ తెలిసిపోయింది. అధికారం కోసం పది సంవత్సరాల పాటు కష్టపడడం, ప్రత్యర్థుల చేతిలో అవమానానికీ, తప్పుడు ఆరోపణలకూ, జైలు నిర్బంధానికీ గురి కావడం నిజమే కావచ్చు గాని, వ్యక్తిగా, రాజకీయ నాయకుడిగా అవినీతి, అక్రమ, అహంకార స్వభావాల సమ్మేళనంగా జగన్‌కూ చంద్రబాబుకూ తేడా ఏమీలేదు. కనీసం చంద్రబాబుకు ఆ లక్షణాలతో పాటు సుదీర్ఘ పాలనానుభవం ఉన్నది. జగన్‌కు అది కూడ లేదు. అందువల్ల ముఖ్యమంత్రిగా చంద్రబాబు అవినీతి, అక్రమాలు, అహంకారం ప్రదర్శిస్తూనే అధికార యంత్రాంగాన్ని తన అదుపులో పెట్టుకోగలిగేవారు. బహుశా జగన్ తన అవినీతికి, అక్రమాలకు, అహంకారానికి పరిమితమైపోయి, పాలనను పూర్తిగా అధికార యంత్రాంగం చేతికి అప్పగిస్తారేమోనని అనుమానం కలుగుతున్నది. ఇప్పటికే ఉమ్మడిఆంధ్రప్రదేశ్ రోజుల నుంచీ అవినీతిమయమైన అధికార యంత్రాంగం, ప్రజాకంటకమైన పోలీసు యంత్రాంగం బలపడి ఉన్నాయి. విభజన తర్వాత రెండు రాష్ట్రాలలోనూ అవే కొనసాగుతున్నాయి. జగన్ వంటి తన ఇల్లు తాను చక్కబరచుకునే ఆలోచన మాత్రమే ఉన్న, పాలనానుభవం లేని, అధికార యంత్రాంగాన్ని అదుపు చేయలేని ముఖ్యమంత్రి పాలనలో ఆంధ్రప్రదేశ్ ఐపిఎస్, ఐఎఎస్ అధికారుల ఇష్టారాజ్యంగా మారబో తుందనీ, గద్దెలమీద ఉన్నవారికి ముడుపులు అందజేసి ఆంధ్రప్రదేశ్ ప్రజల వనరులన్నిటినీ దోచుకోవడానికి సిద్ధంగా ఉన్న అవే రియల్ ఎస్టేట్, కాంట్రాక్ట్, ఫైనాన్స్, ట్రాన్స్‌పోర్ట్, సినిమా, విద్యా, ఆరోగ్య, మీడియా వ్యాపార దోపిడీ పీడక వర్గాల అధికారం కొనసాగనున్నదనీ భయం కలుగుతున్నది. ఉజ్వలమైన పోరాట చరిత్రగల ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డారా, నూతిని తప్పించుకోబోయి గోతిలో పడ్డారా అతిత్వరలోనే వెల్లడవుతుంది. ప్రజల సమస్యలు మరింత జటిలమయ్యే అవకాశం ఉంది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బాధిత సమూహాలను సంఘటితం చేసి, ఉద్యమాలలో నడిపించవలసిన మహత్తర బాధ్యత ప్రజాసంఘాల మీద, మిగిలి ఉన్న అతితక్కువ ప్రజానుకూల రాజకీయపక్షాల మీద, బుద్ధిజీవుల మీద మరింతగా పెరుగుతున్నది. వీ

స్పెయిన్ ఎన్నికలలో జాతీయవాద ప్రమాద ఘంటికలు


- రాజేంద్రబాబు అర్విణి


ఈ ఏడాది ఏప్రిల్ చివరన జరిగిన స్పెయిన్ ఆకస్మిక ఎన్నికలలో (స్నాప్ పోల్) స్పానిష్ సోషలిస్టు వర్కర్స్ పార్టీ (పిఎస్ఒఇ) రంగంలో ఉన్న అన్ని పార్టీలకంటే అధిక స్థానాలు గెలుచుకొని ముందు స్థానంలో నిలిచింది. వామపక్ష పార్టీగా గుర్తింపు ఉన్న సోషలిస్టు పార్టీకి మొత్తం పోలైన ఓట్లలో 28.7 శాతం ఓట్లు వచ్చి 123 (మొత్తం 350) సీట్లు గెలుచుకోగా చిన్న చితక లెఫ్టిస్ట్ గ్రూపులు కూడా తమ ఉనికిని చాటుకున్నాయి. వామపక్ష భావాలుగల అన్ని పార్టీలను కలుపుకొని సోషలిస్టు వర్కర్స్ పార్టీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో ఇబ్బందులు ఏమీ లేకపోయినా ఈ ఎన్నికలలో అంతర్లీనంగా కొన్ని ప్రమాద ఘంటికలు పొడసూపినాయి. వాటిల్లో ప్రధానమైనది యూరప్‌లో ప్రబలుతున్న జాతీయవాద భావనలు స్పెయిన్‌లో కూడా ప్రతిఫలించడం. ఫాసిస్టు పోకడలు కలిగిన వోక్స్ (విఒఎక్స్) పార్టీ 10.30 శాతం ఓట్లతో 24 పార్లమెంట్ స్థానాలు కైవసం చేసుకోవడం ఆందోళన కలిగించే విషయం. మితవాద పార్టీగా పరిశీలకులు వ్యాఖ్యానించిన వోక్స్ పార్టీ ముస్లిం వ్యతిరేక సంస్థ. ప్రజలలో జాతీయ వాదాన్ని ప్రచారం చేయడమే లక్ష్యంగా నిర్దేశించుకున్న పార్టీ. బయటి నుండి వచ్చే వలసలను వ్యతిరేకిస్తూ 'స్పెయిన్‌లో స్థానం స్పెయిన్ దేశీయులకే' అన్న నినాదంతో ప్రజలలోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నిస్తున్న పార్టీ.

మెడిటరేనియన్ సముద్రం దాటి యూరప్‌లోకి ప్రవేశించే కాందిశీకుల పట్ల సోషలిస్టు ప్రభుత్వం ద్వేషభావం లేకుండా సహనంతో వ్యవహరిస్తున్నది. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్నది వోక్స్ పార్టీ. స్పెయిన్‌లో అంతర్భాగమైన కెటలోనియా స్వాతంత్ర్య పోరాటం చేస్తున్నది. ఆ పోరాటాన్ని వ్యతిరేకిస్తున్నది వోక్స్ పార్టీ. స్వాతంత్ర్య ప్రకటనను కూడా విడుదల చేసిన 'కెటలాన్ రాజ్యం' అన్న పార్టీ పట్ల, ఉద్యమకారుల పట్ల సోషలిస్టు పార్టీ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నది. ఈ ఉదాసీన వైఖరిని ఖండించండి అని కూడా ఎన్నికలలో ప్రచారం చేసింది వోక్స్ పార్టీ.


యూరప్ ఖండంలోని చాలా దేశాలలో ఇటీవల జాతీయవాదాన్ని తమ కరవాలంగా ధరించి ప్రజలలోకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి కొన్ని రాజకీయ పార్టీలు. ఈ మధ్య జరిగిన సాధారణ ఎన్నికలలో ఆయా దేశాలలో జాతీయవాద పార్టీలు సాధించిన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి. స్వీడన్ – 17.6 శాతం, డెన్మార్క్ – 21 శాతం, నెదర్‌లాండ్ – 13 శాతం, ఫ్రాన్స్ – 13 శాతం, స్విట్జర్‌లాండ్ – 29 శాతం, ఇటలీ – 17.4 శాతం, గ్రీస్ – 7 శాతం, జర్మనీ – 12.6 శాతం, ఆస్ట్రియా – 26 శాతం, బల్గేరియా 9 శాతం, హంగరీ – 19 శాతం. రాబోయే రోజుల్లో ప్రపంచ శాంతికి విఘాతం కలిగించే ఈ పరిణామం ఆహ్వానించ తగ్గది కాదు.

నాలుగేళ్ల కాలంలోనే స్పెయిన్‌లో మూడు సార్లు సాధారణ ఎన్నికలు జరిగాయి. ఇంత అనిశ్చితస్థితి నెలకొన్న దేశంలో ఈ ఎన్నికలతోనైనా రాజకీయ స్థిరత్వం నెలకొంటుందన్న ఆశ ఏమాత్రం లేదు. 1970 తర్వాత మొట్ట మొదటిసారి పార్లమెంట్‌లో ప్రవేశించిన మితవాద పార్టీల ప్రాతినిధ్యం పట్ల స్పెయిన్ దేశ ప్రజాస్వామికవాదులు అప్రమత్తంగా ఉండి, ఫాసిస్టు ఛాయలను మొగ్గలోనే తుంచివేసే ప్రయత్నం చేయడం స్పెయిన్ దేశ ప్రస్తుత అవసరం. భారతదేశానికి చెందిన బిజెపికి స్పెయిన్‌లోని వోక్స్ పార్టీకి పోలికలు చాలానే ఉన్నాయి. ఏమైనా మితవాద పార్టీలు యూరప్‌లో వ్యాప్తి చెందుతున్నాయన్న వాస్తవానికి సంకేతం మొన్న స్పెయిన్‌లో జరిగిన ఎన్నికలు. ఇది అభిలషణీయమైన పరిణామం కాదు. వీ






❖ **వ్లదీమిర్ ఇల్యీచ్ లెనిన్** – మూలం మయకోవ్‌స్కీ – అనువాదం శ్రీశ్రీ – కూర్పు సింగంపల్లి అశోక్‌కుమార్ – శ్రీశ్రీ సాహిత్యనిధి విజయవాడ ప్రచురణ – 87 పేజీలు, 1/8 డెమీ, రు. 75



❖ **అమ్మా** – రచన కారల్ చాపెక్ – అనువాదం శ్రీశ్రీ – కూర్పు సింగంపల్లి అశోక్‌కుమార్ – శ్రీశ్రీ సాహిత్యనిధి విజయవాడ ప్రచురణ – 71 పేజీలు, 1/8 డెమీ, రు. 65




❖ **రెక్కవిప్పిన రివల్యూషన్** – రచన ఏంజెలో కాత్రోచ్చీ – అనువాదం శ్రీశ్రీ – కూర్పు సింగంపల్లి అశోక్‌కుమార్ – శ్రీశ్రీ సాహిత్యనిధి విజయవాడ ప్రచురణల – 79 పేజీలు, 1/8 డెమీ, రు. 70




❖ **సంపెంగ తోట** – ఆంటన్ చెహోవ్ – కూర్పు సింగంపల్లి అశోక్‌కుమార్ – శ్రీశ్రీ సాహిత్యనిధి విజయవాడ ప్రచురణ – 55 పేజీలు, 1/8 డెమీ, రు. 50




❖ **ప్రభవ** – శ్రీశ్రీ – కూర్పు సింగంపల్లి అశోక్‌కుమార్ – శ్రీశ్రీ సాహిత్యనిధి విజయవాడ ప్రచురణ – 47 పేజీలు, 1/8 డెమీ, రు. 40, పై ఐదు ప్రతులకు: శ్రీశ్రీ సాహిత్యనిధి, 305, ప్రగతి టవర్స్, వీరయ్య స్ట్రీట్, మారుతీ నగర్, విజయవాడ – 520004, ఫోన్ : 9246277375, 9848504649



❖ **దేశభక్తి** – (గేయ సంపుటి)– బూర భిక్షపతి – ప్రగతి ప్రచురణలు – 52 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: బూర భిక్షపతి, ఇ.నెం. 2-12-293/20, విజయనగర్ కాలనీ, గోపాల్‌పూర్ రోడ్, హన్మకొండ, వరంగల్ – 506009, ఫోన్: 9866612717




❖ **అద్లూరి అయోధ్యరామకవి రచనలు** – తెలంగాణ మంటల్లో... (కథలు) – హైదరాబాద్‌పై పోలీసు చర్యలు (బుర్రకథ) – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 64 పేజీలు, 1/8 డెమీ, రు. 30,



❖ **సుగ్రీవ విజయము** – యక్షగానము – కందుకూరి రుద్రకవి – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 59 పేజీలు, 1/8 డెమీ, రు. 30, పై రెండు ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభారతి, రవీంద్రభారతి ప్రాంగణము, హైదరాబాద్ – 500004, ఫోన్ : 040-29703142



❖ **చురకలు** – (మినీ కవితలు) – అలిశెట్టి ప్రభాకర్ – నవ్య సాహిత్య పరిషత్ – కరీంనగర్ ప్రచురణ – 24 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో




❖ **తెలుగు నవల ప్రయోగ వైవిధ్యం** – నవలా విమర్శ – కె.పి. అశోక్ కుమార్ – సామ్రాట్ పబ్లికేషన్స్ – 215 పేజీలు, 1/8 డెమీ, రు. 80, ప్రతులకు: కె.పి. అశోక్ కుమార్, 6, మా సంతోషి కాలనీ, తుర్కపల్లి రోడ్, బొల్లారం, సికిందరాబాద్ – 500010




❖ **విరమించని వాక్యం** – కవిత్వం – దాసరాజు రామారావు – మంజీర రచయితల సంఘం ప్రచురణ – 130 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు: డి. విజయలక్ష్మి, ప్లాట్ నెం. 143, ఇ.నెం. 13-30/79, సాయి భగవాన్ కాలనీ, (బీరామ్‌గూడ) బిఎచ్ఇఎల్, రామచంద్రపురం, సంగారెడ్డి – 502032, ఫోన్ : 9618224503




❖ **సూర్యుని ఏడో గుర్రం** – కవితా సంపుటి – ఏ. సూర్యప్రకాశ్ – తెలుగు రచయితల సమాఖ్య ప్రచురణ – 94 పేజీలు, 1/8 డెమీ, రు. 90, ప్రతులకు: ఏ. సూర్యప్రకాశ్, ప్లాట్ నెం. 33, ఇ.నెం. 8-7-195/5, పి.వి. ఎన్‌క్లేవ్, సమతానగర్ కాలనీ, ఓల్డ్ బోయిన్‌పల్లి, సికిందరాబాద్ – 500011, ఫోన్ : 9885664169



❖ **పూల చాదర్** – కథల సంపుటి – అమ్జద్ – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 140 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: మహమ్మద్ అమ్జద్ అలీ, ఇ.నెం. 11-2-209, రోడ్ నెం. 7, శ్రీ వెంకటేశ్వర కాలనీ, సరూర్‌నగర్, హైదరాబాద్ – 500035



❖ **తెలుగు దీప్తి –** మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ కరదీపిక – సంపాదకులు మాడభూషి సంపత్ కుమార్ – సహ సంపాదకులు డాక్టర్ కోదండ లక్షణ – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 192 పేజీలు, 1/8 డెమీ, రు. 100



❖ **దిక్కారం –** నవల – సింహప్రసాద్ – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 216 పేజీలు, 1/8 డెమీ, రు. 120



❖ **అభయం –** నవల – సింహప్రసాద్ – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 200 పేజీలు, 1/8 డెమీ, రు. 120, పై మూడు ప్రతులకు: పాలపిట్ట బుక్స్, ఇ.నెం. 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500036

ఎన్నికల ఫలితాలు - అనుకూల, ప్రతికూల గుణపాఠాలు

దేశంలో ఆలోచనాపరులను ఒక కుదుపు కుదిపిన 2019 లోకసభ ఎన్నికల ఫలితాల నుంచి గ్రహించవసిన గుణపాఠాలేమిటో వివరిస్తున్నారు **ఎన్. వేణుగోపాల్**

పరిచయం

2019 లోకసభ ఎన్నికల ఫలితాలు వర్తమాన రాజకీయాలపై ప్రచారసాధనాలలో అభిప్రాయాలు ప్రకటించే చాలమంది వ్యాఖ్యాతల అంచనాలకు భిన్నంగా వెలువడ్డాయి. దేశంలో గత ఐదు సంవత్సరాలలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఎ పాలనాకాలంలో అమలైన అనేక ప్రజావ్యతిరేక విధానాల వల్ల ప్రజలలో అసంతృప్తి పెరిగిందనీ, ఆ అసంతృప్తి దానికదే ఎన్‌డిఎ ఓటమికి దారి తీస్తుందనీ వేసిన అంచనాలు తారుమారయ్యాయి. నాలుగు సంవత్సరాల పాటు ముస్లింలు, దళితులు, ఆదివాసులు, మహిళలు అనే నాలుగు ప్రధాన సమూహాలకు అసంతృప్తి కలిగించే విధానాలు చేపట్టినప్పటికీ సంఘ్ పరివార్ పాలనకే మరొకసారి అధికారం చేజిక్కింది. అసహన సంస్కృతిని రెచ్చగొట్టి, భిన్నాభిప్రాయం పట్ల హింసను ప్రయోగించి మధ్యతరగతి బుద్ధిజీవులలో ఆగ్రహాన్ని పెంచి, ప్రచారసాధనాలలో విపరీతమైన వ్యతిరేకత మూటగట్టుకున్నప్పటికీ ప్రజాక్షేత్రంలో సంఘ్ పరివార్ మరొకసారి గెలిచింది. ఎన్నికలకు రెండు నెలల ముందు "పుల్వామా దాడి - బాలాకోట్ ప్రతిదాడి" ఉదంతంతో భావోద్వేగాలు రెచ్చగొట్టి వాతావరణాన్ని అనుకూలంగా మార్చుకుని, అంతకు ముందరి నాలుగేళ్ల అక్రమాల చిట్టాను విస్మరణలోకి తోయడంలో విజయం సాధించిన మోడీ ఆ భావోద్వేగాల ఆధారంగానే అధికారానికి వచ్చాడు. ఐదు సంవత్సరాల పాలనలో మోడీ ప్రభుత్వపు అపజయాల గురించి ప్రజలకు అర్థం చేయించడంలో, ఒప్పించడంలో, ఆ సమాచారాన్ని, విశ్లేషణను ప్రజాభిప్రాయంగా, వోట్లుగా మార్చుకోవడంలో విఫలమైన ప్రతిపక్షాలు ఓటమిని చవిచూడక తప్పలేదు.

భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్‌డిఎ కూటమి ఓడిపోతుందనీ, ఏ కూటమికీ ప్రభుత్వాన్ని స్థాపించే ఆధిక్యత రాదనీ, అన్ని పార్టీలనూ ఐక్యం చేసి కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ ప్రభుత్వం స్థాపించవచ్చుననీ, ఎన్‌డిఎ అధికారం చేపట్టినా అది స్వల్ప ఆధిక్యతతో మాత్రమే సాధ్యమవుతుందనీ వెలువడిన అంచనాలన్నిటినీ ఫలితాలు తారుమారు చేశాయి. ఇతరుల మద్దతు లేకుండా ప్రభుత్వం స్థాపించగలదా అని అనుమానించిన భారతీయ జనతా పార్టీ ఒంటరిగానే అంచనాలను మించి ఫలితాలను సాధించింది. 2014 ఎన్నికల్లో గెలిచిన 282 స్థానాలకన్న కూడ ఎక్కువగా 303 స్థానాలను సాధించింది. ఎవరి సహకారమూ లేకుండానే, ఒంటరిగానే ప్రభుత్వం స్థాపించగల స్థితి కన్న ముప్పై స్థానాలు ఎక్కువే సాధించింది. ఎన్‌డిఎలోని ఇతర భాగస్వామ్య పక్షాలకు వచ్చిన 50 స్థానాలు (శివసేన 18, జనతా దళ్-యు 16, లోక్ జనశక్తి 6, అప్నా దళ్-ఎస్ 2 , అకాలీదళ్ 2, అన్నాడిఎంకె 1, ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ 1, నేషనల్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ 1, రాష్ట్రీయ లోక్ తాంత్రిక్ పార్టీ 1, సిక్కిం క్రాంతికారి మోర్చా 1, నేషనల్ పీపుల్స్ పార్టీ 1) కలిసి 353 స్థానాలతో, సరిగ్గా లోకసభలో మూడింట రెండు వంతుల స్థానాలతో పాలన సాగించనున్నది.

ప్రజలలో మోడీ విధానాల పట్ల తీవ్రమైన అసంతృప్తి, వ్యతిరేకత ఉన్నాయని, నాలుగు నెలల కింద జరిగిన శాసనసభ ఎన్నికల్లో అది వ్యక్తమయిందనీ, పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి, నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, భిన్నాభిప్రాయాల మీద అసహన దాడులు అనే ఐదు ప్రధాన అంశాలు భాజపాను ఓడిస్తాయనీ, తాము ఏమీ చేయకపోయినా ఆ వ్యతిరేకతే తమకు అధికారం సంపాదించి పెడుతుందనీ భ్రమ పడిన కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ మొత్తం 92 స్థానాలతో తృప్తి పడవలసి వచ్చింది. భారతీయ జనతా పార్టీ సాధించిన స్థానాలలో ఆరవ వంతుకు పరిమితమై కాంగ్రెస్ 52 స్థానాలు మాత్రమే సాధించగా, ఇతర భాగస్వామ్య పక్షాలు 40 స్థానాలు (డి ఎం కె 23, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ 5, ముస్లిం లీగ్ 3, నేషనల్ కాన్ఫరెన్స్ 3, జార్ఖండ్ ముక్తి మోర్చా 1, కేరళ కాంగ్రెస్ 1, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ 1, విడుథలై చిరుథైగల్ కచ్చి 1, జనతా దళ్ - ఎస్ 1, ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ 1) గెలుచుకున్నాయి.

ఇక ఆ రెండు కూటములలో ఏ ఒక్కదానికీ సొంతంగా ప్రభుత్వం స్థాపించగల ఆధిక్యత రాదనీ, అందువల్ల తామే నిర్ణాయక శక్తిగా మారుతామనీ, అసలు ఏర్పడనున్న క్లిష్ట పరిస్థితిలో తమలో ఒకరో, తామే ప్రతిపాదించినవారో ప్రధానమంత్రి కూడ కాగలరనీ కలలు గన్న, ప్రయత్నాలు కూడ ప్రారంభించిన ఇతర పార్టీలలో తృణమూల్ కాంగ్రెస్ 22, వైకాపా 22, బిజూ జనతా దళ్ 12, బహుజన సమాజ్ పార్టీ 10, తెలంగాణ రాష్ట్ర సమితి 9, సమాజ్‌వాది పార్టీ 5, తెలుగు దేశం పార్టీ 3, సిపిఎం 3, సిపిఐ 2, మిగిలిన పార్టీలూ స్వతంత్ర అభ్యర్థులూ కలిసి 9 స్థానాలతో సరిపెట్టుకోవలసి వచ్చింది.

మొత్తం మీద ఈ ఎన్నికల ఫలితాలు భారత పార్లమెంటరీ రాజకీయాల ఏడు దశాబ్దాల చరిత్రలో అసాధారణమైన పరిణామాలను ప్రదర్శించాయి. ప్రస్తుతం జరుగుతున్న పద్ధతిలో ఈ పార్లమెంటరీ ఎన్నికలు ప్రజాభిమతానికి చిహ్నంగా చూడలేమనీ, ఇతరేతర సంక్లిష్ట, సంకీర్ణ అంశాలెన్నిటి కలగలుపుగానో ఈ ఎన్నికలను చూడాలనీ అనుకునేవారు కూడ గుర్తించక తప్పని కీలకాంశాలు ఈ ఫలితాలలో ఉన్నాయి. ఈ

ఫలితాలు ప్రజాభిమతం అనబడేదాన్ని పాలకవర్గ ముఠాలు ఎలా తమకు అనుకూలంగా మార్చుకోగలవో చూపుతున్నాయి. కొంతకాలంగా వ్యక్తమవుతున్న ప్రజాభిమతానికి కొంత భిన్నంగా ఉండడం మాత్రమే కాదు, పాలకవర్గాలలో కొన్ని ముఠాలకు కూడ వారు ఊహించనన్ని స్థానాలు ఇచ్చి ఆశ్చర్యంలో ముంచాయి, మరి కొన్ని ముఠాల ఆశలను భగ్నం చేశాయి. చాల మంది పరిశీలకుల అంచనాలను, అవగాహనలను ప్రశ్నించాయి.

స్పందనలు – పైపై విశ్లేషణలు

ఇటువంటి చిక్కుముడి లాంటి ఎన్నికల ఫలితాలను చూసి భిన్నమైన ప్రతిస్పందనలు రావడం సహజమే. ఎక్కడో గుర్తించలేని అక్రమం జరిగి, తత్ఫలితంగానే ఫలితాలు ఇలా ఉన్నాయని అనుకోవచ్చు. పాలకవర్గాలలో ఒక ముఠా మరొక ముఠాకన్న తెలివైన ఎత్తుగడలతో, అంగబలంతో, అర్థబలంతో అధికారం సంపాదించిందని అనుకోవచ్చు. ప్రజలు తెలివితక్కువగా తమ తలలను బలిపీఠం మీద పెట్టుకున్నారని ప్రజల మీద నెపం వేయవచ్చు. ఆశ్చర్యం, దిగ్భ్రాంతి, అపనమ్మకం, ఆరోపణలు, 'పెసర చేనులో పోగొట్టుకున్న కడియాన్ని పప్పు దాకలో వెతకడానికి చేసే ప్రయత్నాలు', సాంకేతిక కారణాల వైపు వేలు చూపడం, ఆత్మవిమర్శ లేమి, హేతుబద్ధ అన్వేషణ చేసి తప్పులు ఒప్పుకోలేనితనం వంటి అనేక ప్రతికూల స్పందనలు ఒకవైపునా, విజయగర్వం, తాము చేసే అక్రమాలన్నిటికీ ఆమోదముద్ర లభించిందనే తప్పుడు అంచనాలు, ప్రజాభిమతం తమకు అనుకూలంగా ఉందనే ప్రగల్భాలు, అతిశయోక్తులు మరొకవైపునా ఫలితాలు వెలువడినప్పటినుంచీ వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రతిస్పందనలలో అత్యధిక భాగం భాజపా గెలుపును పైపైన మాత్రమే చూసి వ్యాఖ్యానిస్తున్నాయి, విశ్లేషిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలలో, విశ్లేషణల్లో కొన్ని అంశాలు నిజమే కూడ కావచ్చు గాని ఈ పరిణామాన్ని మరింత లోతుగా, దీర్ఘకాలిక చరిత్ర నేపథ్యంలో, రాజకీయార్థిక, భావజాల కారణాలతో విశ్లేషించవలసి ఉంది. సంఘ్ పరివార్ బలపరచిన అభ్యర్థులకు వోట్లు వేసి గెలిపించినందుకు ప్రజలను నిందించేవారు, ఆ వోట్లు నిజంగా ప్రజాభిప్రాయానికి చిహ్నమేనా అనే ప్రశ్నతో పాటు, ప్రజలలో ఈ స్థాయిలో తప్పుడు చైతన్యం ఎందుకు, ఎలా వ్యాపించిందనే ప్రశ్నకు కూడ జవాబు వెతకవలసి ఉంది. వ్యక్తిగా నరేంద్ర మోడీని, లేదా ఈ ఐదు సంవత్సరాల పాలనను మాత్రమే కాక మొత్తంగా సంఘ్ పరివార్ భావజాలాన్ని, ఆచరణను పరిగణనలోకి తీసుకుని ఈ ఫలితాలను విశ్లేషించవలసి ఉంది.

ఈ ఎన్నికల ఫలితాలను సాంకేతిక కారణాలు, రాజకీయార్థిక కారణాలు, భావజాల కారణాలు అనే మూడు స్థాయిలలో వివరించవచ్చు. సాంకేతిక కారణాలలో భారతీయ జనతా పార్టీకీ, సంఘ్ పరివార్ కూ సంపూర్ణంగా సహకరించిన అధికార యంత్రాంగం, అందరికంటె ముఖ్యంగా ఎన్నికల కమిషన్, ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషిన్ ల మాయాజాలం, సంఘ్ పరివార్ ప్రణాళికా బద్ధంగా జరిపిన బూత్ మేనేజిమెంట్ వంటి అంశాలున్నాయి. రాజకీయార్థిక కారణాలలో సంఘ్ పరివార్, అది అధికారంలోకి రావాలని కోరుకున్న సంపన్న వర్గాలు కుమ్మరించిన డబ్బు, మిగిలిన పాలకవర్గ ముఠాల అశక్త, అసమర్థ, నిర్లక్ష్య పాత్ర, వ్యక్తికి ప్రాధాన్యత పెరిగిన రాజకీయాలు, నిత్యజీవిత సమస్యలను మరిపించేలా భావోద్వేగ అంశాలను పెచ్చరిల్లజేయడంలో సంఘ్ పరివార్ చాకచక్యం, ప్రచారసాధనాల పాత్ర వంటి అంశాలున్నాయి. భావజాల కారణాలలో సంఘ్ పరివార్ ఆధ్వర్యంలో హిందూ మతోన్మాదులను, హిందుత్వవాదులను మాత్రమే కాక సాధారణ హిందువులను సమీకరించిన పద్ధతులు, బాలట్ పత్రాల, ఇవిఎంల రిగ్గింగ్ స్థానాన్ని ఆక్రమించిన మానసిక రిగ్గింగ్, పీడిత ప్రజారాశులను విభజించి, ఒక సమూహం మీదికి మరొక సమూహాన్ని శత్రువుగా నిలిపి, తక్షణ సమస్యలను మరిచి ఈ శత్రుత్వంలో కూరుకుపోయేలా చేయగలిగిన సంఘ్ పరివార్ వ్యూహం, ఆ వ్యూహాన్ని అడ్డుకోవడంలో చేయవలసినంత, చేయగలిగినంత చేయలేకపోయిన ప్రగతిశీల శక్తుల వైఫల్యం వంటి అంశాలున్నాయి.

సాంకేతిక కారణాలు

గత నాలుగైదు రోజులుగా వివిధ దేశీయ, అంతర్జాతీయ పత్రికలలోను, ప్రసార సాధనాలలోను, విభిన్న రాజకీయ పక్షాల ప్రకటనలలోను ఈ సాంకేతిక కారణాల గురించి చర్చ పెద్ద ఎత్తునే జరుగుతున్నది. ఇలా వ్యక్తమవుతున్న సాంకేతిక కారణాలలో అత్యధిక భాగం నిజాలు కావచ్చు కూడ. కాని ఆ సాంకేతిక కారణాలను మాత్రమే చర్చించి ఆగిపోతే, ప్రస్తుత సంఘ్ పరివార్ విజృంభణను పూర్తిగా అర్థం చేసుకోలేం. అయితే సంఘ్ పరివార్ గెలుపులో వాటి ప్రాధాన్యత ఉంది గనుక వాటిని కూడ పరిగణనలోకి తీసుకోవలసి ఉంది.

వాటిలో మొదటిదీ అన్నిటికన్న ముఖ్యమైనదీ సంఘ్ పరివార్ కు సంపూర్ణంగా సహకరిస్తూ అధికార యంత్రాంగం, ముఖ్యంగా ఎన్నికల సంఘం నిర్వహించిన పాత్ర.

సైద్ధాంతిక స్థాయిలో చూస్తే సక్రమమైన పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థలో విభిన్న రాజకీయ పార్టీలు విభిన్న వర్గాలకు, ప్రజాసమూహాలకు ప్రాతినిధ్యం వహిస్తుండగా, ప్రభుత్వం, అధికార యంత్రాంగం అన్ని వర్గాల మధ్య సమాన దూరాన్ని, తటస్థతను పాటించాలి. అధికార యంత్రాంగం రాజ్యాంగానికి, ప్రజలకు మాత్రమే జవాబుదారీగా ఉండాలి. ఏదో ఒక రాజకీయ పార్టీకి తొత్తుగా పనిచేయగూడదు. మరీ ముఖ్యంగా ఎన్నికల సమయంలో ప్రజలు ఏ రాజకీయ పార్టీకి అధికారం ఇస్తారో తెలియదు గనుక అధికార యంత్రాంగం మరింత ఎక్కువ నిష్పాక్షికంగా ఉండాలి. కాని భారత పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థ అసలు ప్రజాస్వామ్యమే కాదు గనుక, ఉన్న కొద్దిపాటి ప్రజాస్వామ్యమైనా సక్రమంగా లేదు గనుక, అధికార యంత్రాంగంలో భాగంగా ఉన్న వ్యక్తులకు కూడ వ్యక్తిగత రాజకీయాభిప్రాయాలు ఉంటాయి గనుక అధికార యంత్రాంగం ఎవరో ఒకరివైపు మొగ్గు చూపడం కనిపిస్తూనే ఉంది.

గత ఐదు సంవత్సరాల పాలనలో అన్ని రాజ్యాంగ వ్యవస్థలనూ, అధికార యంత్రాంగాన్నీ సంఘ్ పరివార్ భావజాలం ఉన్న వ్యక్తులతో, లేదా తాము చెప్పినట్టు ఆడే కీలుబొమ్మలతో నింపినందువల్ల ఈ ఎన్నికల నాటికి అధికార యంత్రాంగం స్వతంత్రంగా, నిష్పాక్షికంగా ఉండాలనే ఆలోచనే మరిచిపోయింది. ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి

ఎన్నికల సంఘం, సుప్రీం కోర్టు వ్యవహరించిన తీరు ఇందుకు ప్రబల నిదర్శనం. ఇవిఎంల గురించి ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో, ఇవిఎంలలో ఒక పార్టీకి బటన్ నొక్కితే మరొక పార్టీకి వోటు పడేలా చేయవచ్చునని కొందరు సాంకేతిక నిపుణులు చేసి చూపిన ప్రదర్శనల్లో పూర్తి నిజం లేకపోవచ్చు గాని పూర్తిగా అబద్ధమని కొట్టివేయడానికి కూడ వీలు లేదు. ఇవిఎంలు పూర్తిగా మాయాజాలం కాకపోవచ్చు, ఒక నియోజకవర్గంలో ఉపయోగించే ఇవిఎంలన్నిటినీ అధికారపార్టీ తనకు అనుకూలంగా మార్చిపెట్టడం సాధ్యం కాకపోవచ్చు. కాని ఆ పనిని మరింత పకడ్బందీగా జరిపే అవకాశం ఉంది. గతంలో బాలట్ పత్రాల రిగ్గింగ్ జరిగిందని ఆరోపణలు వచ్చినప్పుడు కూడ అన్ని పోలింగ్ బూత్ లలోను రిగ్గింగ్ జరిగేది కాదు. రాజకీయ పార్టీలు రిగ్గింగ్ కళలో నైపుణ్యం సంపాదించి తమకు తక్కువ వోట్లు వస్తాయని అంచనా ఉన్న పోలింగ్ బూత్ లను జాగ్రత్తగా గమనంలోకి తీసుకుని అక్కడి వోటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు చేసేవి. అక్కడ మాత్రమే రిగ్గింగ్ చేసేవి.

సరిగ్గా అలాగే దేశవ్యాప్తంగా దళితులు, ముస్లింలు, మొత్తంగా తమకు వ్యతిరేకంగా వోట్ వేసే అవకాశం ఉన్న ప్రజాసమూహాలు ఎక్కడెక్కడ ఉన్నాయో సంఘ్ పరివార్ చాల ప్రణాళికాబద్ధంగా, జాగ్రత్తగా జాబితాలు తయారు చేసుకున్నది. గుజరాత్ మారణకాండకు చాల ముందే సర్వేల పేరు మీద ముస్లిం వ్యాపారస్తుల, ఇళ్ల జాబితాలు తయారు చేసుకుని, మారణకాండలో భాగంగా ఆ ప్రత్యేకమైన దుకాణాలమీద, ఇళ్ల మీద దాడులు చేసినట్టు, ఇప్పుడు కూడ ఎక్కడెక్కడ ఇవిఎంలను గోల్ మాల్ చేయవలసి ఉంటుందో ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. మొత్తంగా భాజపా సాధించిన 41 శాతం వోట్లలో కనీసం ఐదు నుంచి పది శాతమైనా ఇలా తయారయి ఉంటాయి. గతంలో ఎన్నికలంటే ఆకర్షణీయమైన వాగ్దానాలతో ఎన్నికల ప్రణాళిక రచన, దాని ప్రచారం, విస్తృతంగా ఇంటింటికీ సందేశం చేర్చడం వంటి అంశాలుండేవి. ఆ తర్వాత బూత్ మేనేజిమెంట్, పోలింగ్ మేనేజిమెంట్, మీడియా మేనేజిమెంట్ అనే ప్రక్రియలు ప్రవేశించాయి. ఇప్పుడు ఇవిఎం మేనేజిమెంట్ దశ ప్రారంభమైనట్టుంది.

అయితే ఈ సాంకేతిక కారణాలు ఎక్కువలో ఎక్కువ ఆధిక్యత పెంచగలవేమో, ఓడిపోవలసిన చోట గెలుపు సాధించి పెట్టగలవేమో మొత్తంగా ఇప్పుడు వెలువడిన లాంటి ఫలితాలు ఇవ్వజాలవు. ఈ కారణాల సంభావ్యతను అంగీకరిస్తూనే, మరింత లోతైన కారణాలను అన్వేషించవలసి ఉంది.

రాజకీయార్థిక కారణాలు

ఈ ఎన్నికల్లో గతంలో కనీవినీ ఎరగని స్థాయిలో డబ్బు ప్రభావం ఉంది. డబ్బు పెట్టని రాజకీయ పార్టీ లేదు గాని, ఏ రాజకీయ పార్టీ తమ ప్రయోజనాలను ఎక్కువగా నెరవేరుస్తుందో ఆ పార్టీకే బహుళజాతి సంస్థలు, దేశీయ దళారీలు ఎక్కువ వనరులు అందజేశారు. అంబానీల, అదానీల సహచరుడిగా పేరుపొందిన నరేంద్ర మోడీ సహజంగానే ఈ పోటీలో, ఇతర పాలకవర్గ పార్టీల కన్న ఎక్కువ నిధులు సేకరించగలిగాడు. ఒక అభ్యర్థి పెడుతున్న ఖర్చును ఎదుర్కోవాలంటే ప్రత్యర్థులందరూ కూడ అంతకన్న ఎక్కువో, దానికి సమవుజ్జీగానో డబ్బులు వెదజల్లవలసి ఉంటుంది. అలా 2019 ఎన్నికలు చరిత్రలోకెల్లా ఖరీదైన ఎన్నికలుగా మారాయని ఆధిపత్యవర్గాల పత్రికలే రాస్తున్నాయి. ఒక్కొక్క లోకసభ స్థానానికి సగటున పది కోట్ల రూపాయల నుంచి యాభై కోట్ల రూపాయల దాకా ఖర్చయిందనీ, కొన్ని కీలక స్థానాల్లోనైతే వందకోట్ల రూపాయలు కూడ ఖర్చు అయి ఉంటుందని అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని అమేథీలో ఓడించి తల ఎత్తుకోకుండా చేయాలని, అందుకు ఆకాశమే హద్దుగా ఖర్చు పెట్టాలని భాజపా నిర్ణయించిందని, ఆ క్రమంలో ఆ ఒక్క నియోజకవర్గంలోనే రు. 500 కోట్లు ఖర్చు పెట్టిందని, దానికి ప్రతిగా కాంగ్రెస్ కూడ రు. 150 కోట్లు ఖర్చు పెట్టిందని పత్రికలు రాస్తున్నాయి. అలా సంఘ్ పరివార్, అది అధికారంలోకి రావాలని కోరుకున్న సంపన్న వర్గాలు విచ్చలవిడిగా కుమ్మరించిన డబ్బు, దానికి ప్రతిగా ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అయినా, మిగిలిన పాలకవర్గ పార్టీలైనా ప్రదర్శించిన అశక్తత, అసమర్థత, నిర్లక్ష్యం భారతీయ జనతా పార్టీ గెలుపుకు గల ప్రధాన కారణాలలో ఒకటి.

అంతేగాక, మొత్తంగా భారత పార్లమెంటరీ రాజకీయాల్లో రాజకీయాల స్థానంలో నాయకుడికి, విధానాల స్థానంలో వ్యక్తికి, విలువల స్థానంలో అతిశయోక్తులతో నిర్మించిన వ్యక్తి ఆరాధనకు పెరుగుతూ వచ్చిన ప్రాధాన్యత ఈ ఎన్నికల్లో విశ్వరూపం చూపెట్టింది. 1919లో వలసవ్యతిరేక ఉద్యమంలో గాంధీ ప్రవేశించిన నాటి నుంచీ భారత రాజకీయాలలో ఈ వ్యక్తివాద అపసవ్య ధోరణి ఉన్నప్పటికీ నరేంద్ర మోడీతో అది అత్యున్నత స్థాయికి చేరింది. ఒకరకంగా అధ్యక్ష పాలన అమలులో ఉన్న అమెరికా వంటి దేశాలలో ఉన్నటువంటి వ్యక్తి ప్రాధాన్యత భారత రాజకీయాల్లోకి కూడ వచ్చింది. పాలకవర్గాలకు, బహుళజాతిసంస్థఅకు, సంపన్నవర్గాలకు కూడ ఒక పార్టీని, దాని విధానాలను, ఎన్నికల ప్రణాళికలను, వాగ్దానాలను నమ్ముకోవడం కంటే ఒక వ్యక్తిని నమ్ముకోవడం సులభమనే అవగాహన వచ్చింది. గెలుపుకైనా ఓటమికైనా, దేశాన్ని అమ్మడానికైనా దేశ వనరులను అప్పగించడానికైనా, దేశ సంపదను కొందరికి హక్కు భుక్తం చేయడానికైనా దేశవనరులను లోపాయకారీ ఒప్పందాల్లో పళ్లెంలో పెట్టి ఇవ్వడానికైనా ఒక ప్రభుత్వం, ఒక పార్టీ, ఆ పార్టీకి కొన్ని ఆశయాలు, కొంత వ్యవస్థానిర్మాణం, అందరినీ ఒప్పించాలనే ఇబ్బంది ఈ బాదరబందీ ఏమీ లేకుండా ఒక్కరితో బేరసారాలాడే స్థితి ఉండాలని బహుళజాతిసంస్థలు, వారి దళారీలు, దేశదేశాల సంపన్నులు కోరుకున్నారు. ఆ కోరిక నరేంద్ర మోడీ రూపంలో సాకారమైంది.

ఇటీవలి రాజకీయాల్లో నానాటికీ పెరిగిపోతున్న మరొక అంశం కూడ సంఘ్ పరివార్ గెలుపుకు మార్గం సుగమం చేసింది. అది రాజకీయాల్లో పెరిగిపోయిన భావోద్వేగాల పాత్ర. రాజకీయాలంటే నిర్వచనం ప్రజల నిత్యజీవిత సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలు అన్వేషించే ప్రక్రియ అని. కాని భారత సమాజంలో అన్ని పార్లమెంటరీ రాజకీయ పక్షాలూ రాజకీయాలంటే తప్పుడు పరిష్కారాలు చూపే, అసలు సమస్యలనే విస్మరింపజేసే ప్రక్రియగా మార్చివేశాయి. సమస్యల పరిష్కారం దిశగా ప్రజలు కదలకుండా ఉండడానికి, అసలు సమస్యలను పట్టించుకోలేని మత్తులో ఉండిపోవడానికి ఏమి చేయాలో అది చేస్తూ వచ్చాయి. 'రొట్టె ఇవ్వకపోతే సర్కస్ ఇవ్వు' అని రోమన్ చక్రవర్తులు

అన్నట్టుగా, ప్రజల సమస్యలకు పరిష్కారాలు ఇవ్వలేని భారత పాలకవర్గాలు వారి మెదళ్లను పక్కదారి పట్టించే చౌకబారు కాలక్షేపం ఇవ్వడం ప్రారంభించాయి. ఆ కాలక్షేపంతో కూడ ఎప్పుడో ఒకసారి మొహం మొత్తుతుంది గనుక రాగద్వేషాల భావోద్వేగాలలో ప్రజలను ముంచితే, విద్వేష రాజకీయాలు మప్పి ఎప్పుడూ ఒక శత్రువు బూచిని చూపుతూ ఉంటే సరిపోతుందని పాలకులు గుర్తించారు. మూతి ముందర గడ్డి వేలాడదీస్తే గుర్రం పరుగెత్తినట్టుగా నిరంతర వ్యర్థ చలనం సాగుతుంటుందని పాలకులు కనిపెట్టారు. కూడూ గూడూ గుడ్డా ఆత్మాభిమానం వంటి కనీస మానవ అవసరాలకు ఎంతమాత్రం ఉపయోగపడని భావోద్వేగాల మైమరపులో ప్రజల్ని ముంచడానికి ప్రయత్నాలు ప్రారంభించారు.

ఈ భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రయత్నాలలో సంఘ్ పరివార్ శక్తులు అందరికన్న ఎక్కువ శక్తిమంతమైనవి, ఎకువ నైపుణ్యం సాధించినవి. వాదనకు నిలవని, హేతుబద్ధత లేని, పచ్చి అబద్ధాలు నిండిన కొన్ని భావనలతో భావోద్వేగాలను రెచ్చగొట్టి ప్రజలను సమీకరించడాన్ని వాళ్లు ఒక కళగా అభివృద్ధి చేశారు. దేశభక్తి, పొరుగుదేశపు ఆగడాల గురించి అబద్ధాలు, ముస్లిం జనాభా పెరిగిపోతున్నదనే, ముస్లింల పట్ల మితిమీరిన దాతృత్వం సాగుతున్నదనే ఆరోపణలు వంటి భావాలతో భావోద్వేగాలను రెచ్చగొట్టి, ఆ వాతావరణాన్ని రాజకీయ సోపానంగా మార్చుకోవడం సంఘ్ పరివార్ దశాబ్దాలుగా సాగిస్తూ వచ్చింది.

ఈ భావోద్వేగ అంశాలను రెచ్చగొట్టినప్పుడు, దానికి గురైన వారు సంఘ్ పరివార్ వెనుక సంఘటితం కావడం అనేది ఒక కోణమైతే, వారి నిత్య జీవిత సమస్యలను మరిచిపోవడం, ఆ సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వాల బాధ్యతారాహిత్యాన్ని ప్రశ్నించలేకపోవడం మరొక కోణం. ఈ పని సంఘ్ పరివార్ చాల కాలంగా చేస్తూనే ఉన్నది గాని ఈ ఐదు సంవత్సరాలలో దానికి అధికార బలం, పెద్ద ఎత్తున ప్రచార సాధనాల మద్దతు కూడ లభించాయి. ఈ పరిణామాల ఫలితంగా ఈ ఐదు సంవత్సరాలలోనే ప్రత్యేకంగా ప్రజారాశులన్నీ ఎదుర్కొన్న, ఇబ్బందుల పాలైన పెద్దనోట్ల రద్దు, జి ఎస్ టి, నిరుద్యోగం వంటి నిత్యజీవిత రాజకీయార్థిక సమస్యలను, విపరీతంగా సాగుతున్న రైతుల ఆత్మహత్యలు, భిన్నాభిప్రాయాల మీద దాడులు, గోరక్షణ పేరుతో దాడులు వంటి నైతిక అంశాలను మరచిపోయి రాజకీయ, భావోద్వేగ అంశాల ఉరవడిలో కొట్టుకుపోవడం జరిగింది.

ఆ ఐదు సంవత్సరాల సుదీర్ఘ వ్యవధి దాకా కూడ పోనక్కరలేకుండా ఎన్నికలకు ముందరి తక్షణ వ్యవహారమే చెప్పాలంటే ఎన్నికల ప్రకటనకు కొద్ది ముందు నాటకీయంగా జరిగిన పుల్వామా దాడి, దానికి సమాధానమంటూ బాలాకోట్ సర్జికల్ స్ట్రైక్స్ అప్పటివరకూ పడిపోతున్న మోడీ స్థానాన్ని పైకి లేపాయి. ప్రజలు తాము నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలు మరిచిపోయి పాకిస్తాన్ బూచి గురించీ, తీవ్రవాద బూచి గురించీ ఆలోచించడం ప్రారంభించారు. కనీసం కొందరికైనా కాలుతున్న కడుపు కలిగించే బాధ కన్నా, ఇంట్లో కొనసాగుతున్న నిరుద్యోగం కన్నా, ప్రభుత్వం చెప్పే అబద్ధపు పొరుగుదేశపు బూచి, తీవ్రవాద బూచి ఎక్కువ ఆందోళనకరమనిపించాయి. ఆ బూచి నుంచి దేశాన్ని రక్షించగలిగింది నరేంద్ర మోడీ మాత్రమే అనే ప్రచార సాధనాల ఊదరతో ఎన్నికల వాతావరణంలో చెప్పుకోదగిన మార్పులు వచ్చాయి.

పుల్వామా – బాలాకోట్ దాడుల ముందుకీ తర్వాతకీ భారతీయ జనతా పార్టీకి 7 నుంచి 9 శాతం వోట్ల పెరుగుదల ఉందని సర్వేలు చెపుతున్నాయి. భాజపా సొంతంగా 2014లో సాధించిన 282 స్థానాల కన్న ఎక్కువగా 303 స్థానాలు సాధించడం, అప్పుడు సాధించిన 31 శాతం వోట్ల కన్న 6.4 శాతం ఎక్కువ వోట్లు సాధించి, 37.4 శాతం గెలుచుకుంది. మొత్తంగా ఎన్‌డిఎ కూటమి వోట్ల వాటా 2014 లోని 38 శాతం నుంచి ఈ ఎన్నికల్లో 45 శాతానికి చేరింది.

భావజాల కారణాలు

సాంకేతిక, రాజకీయార్థిక కారణాల విశ్లేషణ దగ్గరే ఆగిపోతే సంఘ్ పరివార్ ఇంతగా మితిమీరిన ఆధిక్యత సాధించగలిగిన పరిణామాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేం. అంతేకాదు, వాటి దగ్గరే ఆగిపోతే, రానున్న రోజుల్లో సంఘ్ పరివార్ తో దేశ ప్రజలు మొత్తంగానూ, ముస్లింలు, దళితులు, ఆదివాసులు, మహిళలు, ప్రగతిశీల శక్తులు ప్రత్యేకంగానూ చేయవలసిన పోరాటాల విస్తృతిని కూడ అర్థం చేసుకోలేం.

ఈ ఎన్నికల గెలుపుకు ప్రధానంగా దోహదపడిన కారణాలలో భారత సమాజపు భావజాలంలో సంఘ్ పరివార్ ప్రవేశపెట్టిన, విస్తరించిన భావజాలం కీలకమైనది. ఆ భావజాలం గత ఐదు సంవత్సరాలలో పెద్ద ఎత్తున వ్యాపించడానికి అవకాశం వచ్చి ఉండవచ్చు గాని, అది ఒక్కరోజులోనో, ఒక సంవత్సరంలోనో, ఒక దశాబ్దంలోనో సాధ్యమయినది కాదు.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పుట్టినప్పటి నుంచీ గడిచిన తొంబై నాలుగు సంవత్సరాలుగా ఆ చీడపురుగు భారత సమాజాన్ని లోలోపలి నుంచి తొలిచివేస్తున్నది. చాపకిందనీరులా విస్తరిస్తున్నది. మనువాద వర్ణాశ్రమ ధర్మాన్ని, బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని, కుల మత విద్వేషాలను, సంపదకు, పెట్టుబడికి ఊడిగాన్ని వ్యాపింపజేస్తున్నది. దశాబ్దాలపాటు లోలోపల సాగిన ఆ కృషి ఫలితం ఇవాళ అనుకూల పరిస్థితులలో బహిరంగంగా, ముక్కుగుద్దినట్టుగా కనబడుతున్నది. మిగిలిన పాలకవర్గ పార్టీలన్నీ ఒక ఎన్నికల సమయంలో, ఒక నియోజకవర్గంలో, ఒక పోలింగ్ బూత్ లో రిగ్గింగ్ చేస్తాయేమో గాని, సంఘ్ పరివార్ గత తొమ్మిది దశాబ్దాలుగా మేధో రిగ్గింగ్, మానసిక రిగ్గింగ్ చేస్తూ వస్తున్నది. అంతకుముందు మూడు వేల సంవత్సరాలుగా భారత సమాజంలో ప్రతి మనసునూ విషపూరితం చేయడానికి మనువాదం ఏ ప్రయత్నం చేస్తూ వచ్చిందో, ఆ ప్రయత్నాన్నే ఆర్ ఎస్ ఎస్ ప్రణాళికాబద్ధంగా, క్రమబద్ధంగా, దూరదృష్టితో, పద్ధతి ప్రకారం చేస్తూ వచ్చిన ఫలితమే ఇవాళ్టి ఎన్నికల ఫలితాలు.

హిందూ మతం పేరుతో సమాజంలోని గణనీయమైన భాగాన్ని తన వెనుక సమీకరించుకోవడం, ఆ హిందూ సమాజానికి ముస్లింల వల్ల, మత మైనారిటీల వల్ల, లౌకికవాదం వల్ల, సామ్యవాదం వల్ల ప్రమాదం ఏర్పడనున్నదనే అబద్ధపు బూచి చూపి, హిందువుల రక్షకురాలిని తాను మాత్రమేననే కుహనా వాగ్దానంతో హిందూ సమాజాన్ని తన వెనుక నిలుపుకోవడం ఆర్ ఎస్ ఎస్ లక్ష్యం. అలా సమాజంపై, సంస్కృతిపై సాధించిన అధికారాన్ని ఆధిపత్యశక్తుల ప్రయోజనాల కోసం రాజకీయంగా వినియోగించడం ఆర్ ఎస్ ఎస్

ఆచరణ. ఆ లక్ష్యాన్ని చేరడానికి అది ప్రారంభించిన ప్రణాళికాబద్ధ కార్యక్రమాలలో కీలకమైనవి ఈ తొమ్మిది దశాబ్దాలలో ముక్కుపచ్చలారని శిశువుల నుంచి రాజకీయాలలో తలపండిన వృద్ధుల దాకా ప్రతి ఒక్క ప్రజా సమూహంలోకి ప్రవేశించడానికి, పాతుకుపోవడానికి, తన భావజాలం ప్రచారం చేయడానికి, తన భావజాలానికి సైనికులను తయారు చేసుకోవడానికి అది చేసిన నిరంతర ప్రయత్నాలు. సరస్వతీ శిశు మందిర్, విద్యాభారతి, శాఖల పేరుతో శైశవదశ నుంచే మతోన్మాదాన్ని నూరిపోయడం, ఆ ప్రభావంలోకి వచ్చిన విద్యార్థుల్లో పని కోసం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, రైతుల్లో పని కోసం భారతీయ కిసాన్ సంఘ్, కార్మికుల్లో పని కోసం భారతీయ మజ్దూర్ సంఘ్, మహిళల్లో పని కోసం రాష్ట్ర సేవికా సమితి, దళితుల్లో పని కోసం అనుసూచిత్ జాతి ఆరక్షణ్ బచావో పరిషత్, ఆదివాసుల్లో పని కోసం వనవాసి కళ్యాణ్ ఆశ్రమ్, సేవా కార్యక్రమాల పేరుతో సేవా భారతి, బహిరంగంగా, పచ్చిగా మత విద్వేషాలను రెచ్చగొట్టడానికి విశ్వహిందూ పరిషత్, హిందూ స్వయంసేవక్ సంఘ్, బజరంగ్ దళ్, మేధావుల్లో, విద్యావంతుల్లో పని కోసం భారతీయ విచార్ కేంద్ర, వివేకానంద కేంద్ర, ప్రజ్ఞాభారతి, సమాచార సంబంధాల కోసం విశ్వ సంవాద్ కేంద్ర, రాజకీయ పార్టీగా భారతీయ జనతా పార్టీ వంటి ఎన్నెన్నో రంగాలలో అనేక సంస్థలను సంఘ్ పరివార్ నడుపుతున్నది. వీటిలో ఒక్కొక్క సంస్థలో కొన్ని వేల మంది నుంచి కొన్ని కోట్ల మంది వరకూ పనిచేస్తున్నారు. అన్ని సంస్థలలోనూ కలిపి మొత్తంగా సంఘ్ పరివార్ భావజాలంలో నిండా మునిగి కార్యకర్తలుగా, స్వయంసేవకులుగా ఉన్నవారు దేశవ్యాప్తంగా కనీసం పది కోట్ల మంది ఉండవచ్చు.

దీనికి తోడుగా పుట్టుకతో హిందువు అయిన ప్రతివారినీ ఆకర్షించడానికి సంఘ్ పరివార్ దగ్గర ఎన్నెన్నో సాధనాలు, ఆయుధాలు, ఆకర్షణలు ఉన్నాయి. శూద్రులను అణచివేయాలని చెప్పే మనుస్మృతిని ఆరాధించే సంఘ్ పరివార్ ఆ శూద్రులనే మాయమాటలతో తన నిర్మాణాలలోకి తీసుకోగలుగుతున్నది. కుల అసమానత, కుల వివక్ష సహజమేనని బహిరంగంగా చెప్పే, అస్పృశ్యత కూడ ఆమోదయోగ్యమేనని రహస్యంగా భావించే సంఘ్ పరివార్ దళితులను ఆకర్షించగలుగుతున్నది. హిందువులు కానివారిని కూడ హిందూ శిబిరంలోకి ఆకర్షించగలుగుతున్నది. ఆకలి, రోగం, దుఃఖం, నిరుద్యోగం వంటి నిత్య జీవిత సమస్యలకు కారణం ఇతర మతస్తులలో, పొరుగుదేశాలలో ఉన్నదనే తప్పుడు భావజాలంతో ఆ బాధితులను ఆకర్షిస్తున్నది. ఇలా ఆకర్షించిన విభిన్న వర్గాలను ఇతర మతస్తుల మీద ప్రత్యక్ష, పరోక్ష యుద్ధాలకు వాడుకుంటున్నది. అంతిమంగా వర్ణాశ్రమ ధర్మాన్ని, మూఢనమ్మకాలను, అభౌతిక శక్తుల మీద నమ్మకాన్ని, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య ఆధిపత్యాన్ని, ఇతర కులాల నుంచి పైకి ఎదిగి వచ్చిన సంపన్నుల పెత్తందారీతనాన్ని, బహుళజాతి సంస్థల, సామ్రాజ్యవాదుల ఊడిగాన్ని, ఒక్కమాటలో యథాతథ స్థితిని నిలిపి ఉంచడమే సంఘ్ పరివార్ లక్ష్యం.

సంఘ్ పరివార్ అసలు ఉద్దేశాలను, దాని పనితీరును, భారత సమాజానికి అది ఎంత ప్రమాదకరమైనదో, ప్రత్యేకించి కుల అసమానతల నిచ్చెనమెట్ల వ్యవస్థ కింద నలిగిపోతున్న అణగారిన కులాలకు, ఇతర మతాలకు, మహిళలకు, మొత్తంగా భిన్నాభిప్రాయానికి ఎంత హానికరమైనదో వివరించడంలో, దాని బాధితులను సమీకరించడంలో, సంఘటితం చేయడంలో ప్రగతిశీల శక్తులన్నీ విఫలమైన కారణంగానే, చేయవలసినంత కృషి చేయని కారణంగానే ఇవాళ్టి ఫలితాలు సంభవించాయి. నిజానికి హిందుత్వ భావాలను ప్రచారం చేస్తున్న స్థాయి కన్న ఎన్నోరెట్లు ఎక్కువగా సంఘ్ పరివార, హిందుత్వ ప్రమాదం గురించి చెప్పవలసి ఉన్నది. ఎందుకంటే, హిందుత్వ భావాలేమో అసంకల్పితంగానే పుట్టుక వల్ల, పెంపకం వల్ల, సంస్కృతి వల్ల, సామాజికీకరణ వ్యవస్థల వల్ల ప్రతి మనిషికీ అందుతున్నవే. అలా ఆ పునాది సిద్ధంగా ఉన్నది గనుకనే దాని మీద విష విద్వేష భవనం నిర్మించడానికి సంఘ్ పరివార్ కు సులభ సాధ్యమవుతున్నది. హిందుత్వ వ్యతిరేక, హేతుబద్ధ, ప్రగతిశీల, లౌకిక వాద, సామ్యవాద భావాలు ఆ సామాజికీకరణను తోసివేసి కొత్తగా జీర్ణం చేసుకోవలసినవి. వ్యవస్థతో పోరాటంలోనూ, తనతో తాను జరుపుకునే నిరంతర పోరాటంలోనూ భాగంగా నింపుకోవలసిన, ఎప్పటికప్పుడు పునరుద్ధరించుకోవలసిన భావాలు ప్రగతిశీల భావాలు. అందువల్ల హిందుత్వ వ్యతిరేక ప్రగతిశీల భావాల ప్రచారం హిందుత్వ భావాల ప్రచారం కన్న పెద్ద ఎత్తున, ఎక్కువ రెట్లు, హెచ్చు స్థాయిలో జరగవలసి ఉంటుంది.

కాని సరిగ్గా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పుట్టిన సమయంలోనే పుట్టిన కమ్యూనిస్టు పార్టీ గాని, ఆ తర్వాత తొమ్మిది దశాబ్దాలలో దేశంలో ఉనికిలోకి వచ్చిన ఇతర ప్రగతిశీల, సామ్యవాద, ఉదారవాద నిర్మాణాలు గాని ఆ హిందుత్వ వ్యతిరేక, సంఘ్ పరివార్ వ్యతిరేక ప్రచారానికి ఇవ్వవలసినంత ప్రాధాన్యత ఇవ్వలేదు. ఇప్పుడు చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న తీరుగా దిగ్భ్రాంతి చెందితే ప్రయోజనం లేదు. ఇప్పటికైనా చేయవలసిన పని ఎంత విస్తారమైనదో గ్రహించి, గుర్తించి, ఆ పని చేయడానికి ఎంత విశాలంగా ఏయే శక్తులను కలుపుకోవాలో, ఏయే శక్తుల మీద ఆధారపడాలో, ఎన్ని రకాల దీర్ఘకాలిక, మధ్యంతర, తక్షణ కార్యక్రమాలు రూపొందించుకోవాలో, ఎంత జాగరూకతతో అమలు చేయాలో ఆలోచించవలసి ఉన్నది. ఈ పని ఏదో పాలకవర్గ పార్టీయో, పార్లమెంటరీ పార్టీయో చేసిపెడుతుందని భ్రమ పడకుండా ప్రగతిశీల శక్తులు ఇది తమ బాధ్యతగా గుర్తించవలసి ఉన్నది. ఈ పని ఏదో బాధిత సమూహాలది మాత్రమేనని, ఏదో ఒక సామాజిక శకలానిదని పక్కకు నెట్టకుండా ఈ పని మొత్తం సమాజానిదని, సమాజ భవిష్యత్తుదని గుర్తించి అంత లోతుగా, విస్తారంగా, సృజనాత్మకంగా నిర్వహించవలసి ఉన్నది. అలాగే ఈ పని సైద్ధాంతిక చర్చల స్థాయిది, ఆలోచనల స్థాయిది మాత్రమే కూడ కాదని, సంఘ్ పరివార్ తన విష భావజాలం సహాయంతో అంతిమంగా ఒక ప్రజావ్యతిరేక రాజకీయ లక్ష్యాన్ని సాధించదలచింది గనుక నిరంతర ఆచరణలో ఉన్నదని, దాన్ని ఎదుర్కోవడం ఆచరణ రంగంలో కూడ జరగాలని గుర్తించి అందుకు సిద్ధపడవలసి ఉన్నది. ఇటలీలో, జర్మనీలో ఫాసిజం, నాజీజంలను మట్టికరిపించిన ప్రతిఘటనా ఉద్యమాలు సైద్ధాంతిక, ఆలోచనా స్థాయిలో ఎంత కృషి చేశాయో, ఆచరణ స్థాయిలో కూడ అంతకన్న ఎక్కువ కృషి చేశాయనే ఉజ్వల చరిత్ర పాఠం భారత ఫాసిస్టు వ్యతిరేక ప్రతిఘటనా ఉద్యమం గ్రహించవలసి ఉన్నది.

(రచయిత వీక్షణం సంపాదకులు) వీ

నీ వల్లే గెలిచి... నీ వల్లే ఓడి...

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘోరపరాజయం ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు స్వయం కృతాపరాధమేననీ, అయిదేళ్ల ప్రజా వ్యతిరేక పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పనీ అంటున్నారు **వై.ఎచ్.కె. మోహన్ రావు**

సీతామాతను అపహరించి చెరబట్టాడని రావణుని ద్వేషిస్తున్నాం. ద్రౌపదీమాతను వస్త్రాపహరణ యత్నించిన కారకులనూ, ప్రేరకులు అయిన దుర్యోధనాదులను దూషిస్తాం. ఎందుకూ? వీరిలో ఎవరితోనూ, ఈ అమానుష ఘటనలతోనూ మనకు ఎట్లాంటి సంబంధం లేదే! ఈ ఇద్దరు మాతలూ మన కుటుంబీకులు కారు, మన పూర్వ దాయాదులూ కారు. మనమెందుకు వీరికి జరిగిన అవమానాల పట్ల నిరసిస్తున్నాం! విశ్లేషిస్తే పరాయి వ్యక్తులకు జరిగే అన్యాయాల పట్ల కూడా మానవ సమాజం స్పందిస్తుందని స్పష్టమౌతుంది. ఇతరుల ఇక్కట్ల పట్ల జాలి ప్రదర్శించడం దాని సహజ గుణం. ఇట్లాంటి పరిణామాన్ని ప్రస్తుతం ఆంధ్రరాష్ట్ర ప్రజలు అనుభవిస్తున్నారు. 2019 ఏప్రిల్ 11న జరిగిన ఉభయ ఎన్నికల్లో తమ వ్యతిరేకతను ఆకాశమంత ఎత్తున చాటుకున్నారు. ప్రజలను, ఉద్యోగ అధికారులనూ పీడించి, ముప్పుతిప్పలు పెట్టి ప్రజాస్వామ్యం పీకనొక్కిన తెలుగుదేశం పాలకులను ఓటర్లు తరిమి తరిమి కొట్టి తమ కసిని ప్రదర్శించారు. ఓటు పోటుతో చావగొట్టి చెవులు మూశారు.

2014లో చంద్రబాబు టక్కరితనంవల్లే టిడిపి గెలిచి పాలన అందుకుంది. 2019లో ఆయనపై సడలిపోయిన విశ్వాసాలతోనే అధికారాన్ని కోల్పోయి ఆ పార్టీ బొక్కబోర్లా పడింది. అలవికాని వాగ్దానాలు, బురిడీ పథకాలు, డొల్ల హామీలతో గెలిచి పీఠాన్ని దక్కించుకున్న చంద్రబాబు నాయుడు అమలులో చతికిలబడి 2019 ఎన్నికలలో కుర్చీని కోల్పోయి, నమ్ముకున్న వారందరినీ నట్టేట ముంచాడు. మోసాన్నీ, ద్రోహాన్నీ సహించేదిలేదని ఆంధ్రప్రదేశ్ ఓటర్లు మరోమారు రుజువు పరిచారు. సర్వే సంస్థలూ, మాధ్యమాలూ, ఎనలిస్టులూ, సెఫాలజిస్టుల ఊహలకందని విధంగా 23 స్థానాలతో ఆయన పార్టీ కురచబారింది. రాజకీయ పార్టీలకు ఓటమి సహజ పరిణామమే కాకపోతే ఇంత హీనమైన ఓటమినే ఆ పార్టీ నేతలే గాకుండా మధ్యస్థులు కూడా నిబిడాశ్చర్యంతో విస్తుపోతున్నారు. ప్రతిపక్షం బలంగా వుంటేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని విశ్వసించే వారంతా చంద్రబాబునే దోషిగా ఎంచుకున్నారు. అధికారముందని ఇష్టారాజ్యంగా కన్నూమిన్నూకానని చేష్టలకు వడిగట్టే అన్ని రాజకీయ పార్టీలకూ 2019 ఎన్నికల ఫలితం చెంపపెట్టు.

ప్రజాస్వామ్యానికి పసుపు నీళ్లొదిలి

ఐదేళ్లలో చంద్రబాబు అరాచక పాలనను వ్యక్తం చేయడానికి భయకల్పిత వాతావరణం ఏర్పడింది. ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనపై పెదవి కదలాలంటే వణుకు, పలుకు రాలాలంటే బెరుకుతో ప్రజాస్వామ్య వాదులు స్తంభించిపోయారు. గడప దాటితే సంకెళ్లు, నినాదాలిస్తే కేసు, రోడ్డు మీదకు వస్తే జైలు, అంతెందుకు ఆలోచిస్తేనే అదుపులోనికి తీసుకునే పోలీసు మార్కు పాలనతో నియంతృత్వం రాజ్యమేలింది. అనధికార కర్ఫ్యూ అమలు జరిగింది. సిపిఐ, సిపిఎం, జనసేన, వైసిపి వంటి విపక్ష పార్టీల వారు ఎవరు కదిలినా అరెస్టుల మీద అరెస్టులు జరిగాయి. వాకిలి దాటకుండానే గృహనిర్బంధాలు సాధారణమయ్యాయి. ప్రత్యేక హోదా సాధన ఆందోళనలో పాల్గొనేందుకు విశాఖ చేరుకున్న జగన్మోహన్ రెడ్డి, ఆయన అనుచర నాయకులను విమానాశ్రయం నుండి వెలుపలికి రాకుండానే నిర్బంధించి తిరుగు ప్రయాణానికి నిర్బంధంగా విమాన మెక్కించి హైదరాబాదుకు చేర్చారు. మహిళా సాధికార సదస్సుకు శాసనసభ్యురాలు ఆర్.కె. రోజాను ఆహ్వానించి విజయవాడ విమానాశ్రయంలోనే అడ్డుకుని బలవంతంగా రోడ్డు మార్గం ద్వారా హైదరాబాదు తీసుకెళ్లి, పగలంతా నగరం అంతటా తిప్పి ఇంట్లో వదలివెళ్లారు. ప్రత్యేక హోదా అని ఉచ్చరిస్తే జైలుకెళతారని బెదిరించిన చంద్రబాబు తగుదునమ్మా అంటూ 2019 ఎన్నికలకు కొద్ది నెలలముందు తానే ప్రత్యేక హోదా సాధన ఉద్యమ బ్రాండ్‌నంటూ ఫోజులు పెట్టి ధర్మపోరాట దీక్షల పేరున ప్రభుత్వ సొమ్మంతా సభలూ సమావేశాలు నడిపి ప్రజలు వెర్రివాళ్లని భ్రమ పడ్డాడు. ఎన్నికల ప్రణాళికతో తానే ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండు చేస్తూ కాపు ఉద్యమాన్ని ప్రారంభించిన ముద్రగడ పద్మనాభాన్ని అడుగు కదలనీయకుండా అరెస్టుల మీద అరెస్టులు సాగించారు. వందల మంది పోలీసులను కాపు నాయకుని గృహం వద్ద కాపు కాయించారు. రహదారి ముఖం దర్శించకుండా పలుపర్యాయాలు నిలువరించారు.

పనికిరాని పార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ

సిపిఎస్ అమలుపై చంద్రబాబు మనోగతం ఇప్పటికీ డోలాయమానమే. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఈ విషయంలో ప్రశ్నార్థకంగా నిలుస్తుంది. అసలు చంద్రబాబు సమగ్రంగా ఆలోచన చేయరా? లేక ఇతరులు చెప్పినా చెవికెక్కించుకోరా అనే సందేహం ఈ వ్యవహారంలో తలెత్తుతుంది. బహుశా ఆయనకు చెప్పగలిగే సాహసం వున్న వారు కూడా ఎవరు లేరా? అని కూడా సంశయం ఉదయిస్తుంది. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దు చేయాలంటూ రోడ్డెక్కిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులపై ఉక్కుపాదం మోపారు. ఆందోళన చేస్తున్న వైట్ కాలర్ శ్రామికులను ఈడ్చి పడేసి చుక్కలు చూపించారు. ఆడపిల్లల డ్రస్సులు చించి పడేశారు. చున్నీలు లాగి అవమానపరిచారు. ఈ హింస ఊరికే పోతుందా? 6 లక్షల మంది ఉద్యోగులూ, వారి కుటుంబ సభ్యులూ కలసి ఈ ఎన్నికలలో బాబుకు కళ్లు బైర్లు కమ్మించారు. ఎన్నికల విధులకు హాజరైన ఉద్యోగుల పోస్టల్ ఓట్ల ఫలితాలే ఇందుకు దర్పణం పట్టాయి.

ఐనా! సిపిఎస్ రద్దు చేస్తే చంద్రబాబుకు ఇప్పటికిప్పుడు పోయేదేమిటి. రాష్ట్ర ప్రభుత్వంపై భారమేమీ కాదుగా! 2005 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. అప్పటి నుండి రాష్ట్రం కూడా అమలు పరుస్తుంది. పెన్షన్ ప్రారంభమయ్యేది 60 సంవత్సరాల వయసు అనంతరం వచ్చే రిటైర్మెంటు తరువాతనే. అంటే 2005లో 30 ఏళ్ల వయసులో ఒక వ్యక్తి ఉద్యోగంలోకి వస్తే, అక్కడి నుండి 30 ఏళ్ల తదుపరి మాత్రమే పెన్షన్ ఇవ్వవలసి ఉంటుంది. స్కీం ప్రారంభమై గడిచిన 13 ఏళ్లను మినహాయిస్తే, ఇంకా 17 ఏళ్ల తదుపరి ఈ స్కీం వాళ్లకు నిరంతర పెన్షన్ పథకం అమలు జరపాలన్నది ఖచ్చితమైన మూల్యాంకనమే. అంటే సిపిఎస్ రద్దు ప్రభావం 17 ఏండ్ల తరువాత మాత్రమే రాష్ట్ర ఖజానాపై చూపుతుంది. ఐతే చంద్రబాబు ఇట్లా ఎందుకు ఆలోచించలేదో బోధపడదు. ఇదే క్రమంలో జగన్మోహన్‌రెడ్డి తెలివిగా ముందుచూపుతో, పాదయాత్ర ప్రారంభించగానే తనను తొలిసారిగా కలిసిన ఉద్యోగ బృందానికి, తాను అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు చేస్తానని నిఖార్సైన హామీ ఇచ్చారు. అదే హామీని పదేపదే వల్లెవేశారు. ఉద్యోగులను బలంగా నమ్మించారు. గంపగుత్తగా ఉద్యోగులూ వారి కుటుంబసభ్యుల ఓట్లనుపొందారు. 40 ఏళ్ల చంద్రబాబు అనుభవం 46 ఏళ్ల వయసున్న జగన్మోహన్‌రెడ్డి ఆలోచన ఎదుట వెలవెల బోయింది. పై సంఘటనలన్నీ బాబు మితిమీరిన నియంతృత్వ వైఖరులకూ, ఆకాశమంత అహంకార భావాలకూ మచ్చుతునకలుగా దర్శనమిస్తాయి.

అమాయకులపై అక్రమ కేసులు

సాధారణంగా అశ్రిత పక్షపాతంతో తమవారు దోషులైనా కేసులు నమోదు చేయకుండా వదలడమో, లేకపోతే కేసు బలహీనపరుస్తూ చట్టాలను నీరు గార్చడమో జరిగేది. అందుకు భిన్నంగా, అక్రమాల పరాకాష్టగా ఫిర్యాదుదారులను బెదిరించడం, బాధితులను వేధించడం, వారిపైనే కేసులు నమోదు చేసే ఘనత టిడిపి ప్రభుత్వం దక్కించుకుంది. ఇదొక విపరీత, విపత్కర పోయే పరిణామం. రాజధానికి భూములు ఇవ్వని రైతులను అదుపులోకి తీసుకుని లాఠీలతో దారికి తెచ్చుకోవడం, తోటలను తగులపెట్టించి సంబంధం లేని వారిపై దమనకాండ జరపడం, శాసనసభ్యుల దోపిడీని న్యాయస్థానాల ఎదుటకు తీసుకవెళ్లిన వారిపై దౌర్జన్యం చేయడమేగాకుండా, దారికాచి మూకుమ్మడిగా దాడి చేయడం, తిరిగి ఫిర్యాదిపైనే కేసులు నమోదు చేసి, కుటుంబ సభ్యులకూ, విపక్ష పార్టీ వారికీ, ప్రజలకు తెలియకుండా స్టేషన్లు మార్చి మార్చి వారాలకు తరబడి కుళ్లబొడవడం వంటి అమానుషాలను తలకెక్కించుకున్న ఓటర్లు సమయం కోసం ఎదురు చూసి పోలింగు నాడు ఒక్కమారుగా ఆ పార్టీని బలి తీసుకున్నారు. ఇనిమెట్లలో తాజా శాసన సభాపతిని ఆ గ్రామ స్త్రీపురుషులంతా ఏకమై చేసిన మర్యాదే ఇందుకు ప్రబల నిదర్శనం. ఎదురు చూసిచూసి అదను చిక్కగానే ఒక్కసారిగా విరుచుకపడ్డారు. మాదాల రంగారావు చిత్రాలలో చివరగా సీన్లలో ప్రజలంతా కలిసి ప్రతి నాయకుని పైకి కర్రలూ, కట్టెలు, చీపుర్లూ, చాటలు తీసుకుని గ్రామం నుండి తరిమే సన్నివేశాలే గుర్తుకొచ్చాయి. అందరూ ఐక్యంగా మారి ఆయనా, తనయుడు, తనయల రాక్షస క్రీడను అంతమొందించారు. తుని రైలు దుర్ఘటన రాయలసీమ వాసులపైకి నెట్టి ప్రచారం చేసిన బాబు వక్రభాష్యాలు అక్కడి ప్రజల మనోభావాలపై తీవ్ర ప్రతికూల ముద్రవేశాయి. చెఱుకు తోట దహనం ఘటనను జగన్మోహన్‌రెడ్డిపై నెట్టి ప్రయోజనం పొందాలనే దుష్ట ఆలోచన చంద్రబాబుకు అష్టదరిద్రాలను తెచ్చిపెట్టింది. అందుకే రాయలసీమ జిల్లాల్లోనూ, రాజధాని స్థానాల్లోనూ 'దేశం' పార్టీని ఉతికి పారేశారు ఓటర్లు. ఇది ఇట్లా వుంటే విశాఖపట్నం విమానాశ్రయంలో జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం టిడిపిని ప్రజల ముంగిట దోషిగా నిలబెట్టింది. సానుబూతి చూపాల్సిన టిడిపి పెద్దలు జగన్మోహన్‌రెడ్డిపై దుష్ప్రచారం చేయడం, ఆయన వైపే వేలెత్తి చూపడం, ప్రచారం కోసం, సానుబూతి కోసం చేయించుకున్నాడని మాట్లాడటం వంటి దిగజారుడుతనం 'దేశం' పార్టీకి చేటుతెచ్చి పెట్టింది. ఈ హత్యాయత్నంపై బాబు అతని అనుచరగణం ఎంత అవహేళన చేసిందో అంత అప్రదిష్ట మూటగట్టుకుంది. ఆఖరికి వైసిపిని కోడికత్తి పార్టీ అంటూ హీనమైన వాఖ్యలు చేసీ చేసీ, జగన్మోహన్‌రెడ్డికీ, ఆయన పార్టీకి సానుభూతిని మూటగట్టి అందించారు. జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న వివేకానందరెడ్డి హత్యను సైతం జగన్ కుటుంబానికే ఆపాదించి వారినే ముద్దాయిలుగా ప్రచారం చేసిన అనైతికతను రాష్ట్ర ప్రజలు ఏమాత్రం జీర్ణించుకోలేక పోయారు. ఇతరులు బాధితులైనా వదలని బాబు తమ పార్టీ ఎమ్మెల్యేలు, నేతలూ ఎంతటి నేరం చేసినా తెలియనట్లు నటించడం, రాజీలు పెట్టడం, కొన్ని సందర్భాల్లో బాధితులపైనే ఆగ్రహాన్ని ప్రకటించడం వంటి వినోదాలు మొత్తం పార్టీనే కురచబరిచాయి. ఇటువంటి సంఘటనలన్నీ ఏతావాతా ఆ పార్టీకి ప్రజల్లో వ్యతిరేకతనే కూడగట్టాయి.

వాగ్దానాలు తుంగలో తొక్కి

2014 ఎన్నికల సమయంలో ఏదోవిధంగా అధికారాన్ని చేజిక్కించు కోవాలనే కపట ఆలోచనతో ఇచ్చిన హామీలను గంగలో కుక్కినబాబు, వాగ్దానాలను తుంగలో తొక్కారు. ఏ ఒక్క వాగ్దానాన్ని సంపూర్ణంగా అమలు పరిచిన దాఖలా లేనేలేదు. 89 వేల కోట్లుగా వున్న రైతు రుణాలనూ, 18 వేల కోట్లుగా వున్న డ్వాక్రా మహిళల రుణాలనూ నూతన రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను అవగాహన చేసుకున్న జగన్మోహన్‌రెడ్డి మాఫీ చేయడం సాధ్యం కాదని పదే పదే చెప్పుకొచ్చారు. ఆయన పార్టీలోని అనేకమంది రుణమాఫీ ప్రకటన కోసం ఎంత వత్తిడి తెచ్చినప్పటికీ విశ్వసనీయత, వాస్తవికత ప్రాతిపదికగా జగన్మోహన్‌రెడ్డి సమ్మతించలేదు. ఈ విషయంపై ఆ పార్టీలోని కొందరు నాయకులు జగన్‌తో విభేదించారు, కినుక వహించారు. అయితే ఇదే కోవలో అడ్డ దోవలో తమ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు పైన చెప్పుకున్న రుణాలు మొత్తాన్నీ మాఫీ చేస్తానని ఊదరగొట్టారు. రుణాలెవరూ చెల్లించవలదని, బ్యాంకుల్లో తాకట్టుపెట్టిన గృహిణుల మంగళసూత్రాలు ఇంటికే వచ్చేస్తాయని ఎన్నికల సభల్లో స్వరం పెంచి చెప్పుకొచ్చారు. ఈ వంచనను ప్రజలు నమ్మి టిడిపికి అధికారమిచ్చారు. అధికారంలోకి వచ్చినవెంటనే వాగ్దానభంగం చేస్తూ బాబు కోటయ్య కమిటీని నియమించి మాఫీని 24 వేల కోట్లకు పరిమితం చేశారు. ఒక్కోరైతు కుటుంబానికి లక్షా యాభై వేలకు కుదించి, 30 వేల చొప్పున ఐదేళ్లపాటు 5 కిస్తీలుగా మాఫీని ప్రకటించి రుణ విమోచన పత్రాలు విడుదల చేశారు. ఈ మాఫీని ఒక నానుడితో పోల్చితే "పంచపాండవులు అరచేతి వేళ్ల వలే నలుగురని, మూడువేళ్లు చూపించి, రెండు అంకెతో పోల్చి, ఒకటి వేయబోయి, సున్నాచుట్టాడట" ఓ ప్రబుద్ధుడు. అట్లావుంది బాబు మాఫీల కథనం. ఐతే ఆమాత్రమన్నా చేశాడా! అంటే అదీనూ లేదు. ముచ్చటగా మూడు కిస్తీలు మాఫీ చేసిన

తరిమిలా నాలుగైదు కిస్తీలను రైతులకు పంగనామమే పెట్టేశాడు. ఆనాడే ఎనలిస్టులూ, ఎకనమిస్టులూ ఎట్లా చేస్తారన్న ప్రశ్నకు సమాధానంగా, తనకు 9 ఏళ్ల ముఖ్యమంత్రి అనుభవం వుందీ, చేసే చూపిస్తానంటూ బెదరగొట్టి నోరు మూయించాడు. పాపం ప్రజలు అమాయకులు కదా! నమ్మేశారు. ఇంకేం మన బాబు ఇక్కడ నుండే ప్రారంభించాడు తన యూటర్న్ జర్నీ. డ్వాక్రా మహిళలకు ఒక్కో సభ్యురాలికి లక్ష రూపాయలు మాఫీ కావలసి వుండగా ఒక పర్యాయం పదివేలూ, ఎన్నికలకు ముందుగా చెక్కుల్లో పదివేలిచ్చి ఓట్లు కొల్లగొట్టే కుటిల యత్నం చేశారు. ఇక సుమారు 600 హామీల ఎన్నికల టిడిపి ప్రణాళిక అమలు గురించి మాట్లాడు కోవడం అవివేకమే అవుతుంది.

జన వ్యతిరేక కమిటీలు

చంద్రబాబు ఎప్పుడు అధికారానికి వచ్చినా జన్మభూమి కమిటీలతో అనధికార పాలనకు తెరతీస్తారు. ఏ ఉద్యోగీ, అధికారీ పని చేయాలన్నా ఈ కమిటీలే కీలకంగా వుంటాయి. రేషన్ కార్డు దగ్గర నుండి ఓటర్ కార్డు వరకూ అన్ని ప్రభుత్వ అధికారాలూ ఈ కమిటీలకే దారాదత్తం అయ్యాయి. ఈ దళారి కమిటీలే ఆ పార్టీ కొంప ముంచాయి. టిడిపికి ఓటేసిన వారెవరు? వైసిపి ఎవరు? అని వర్గీకరించి తమ పార్టీకి అనుకూలం కాదనుకున్న వారికి ప్రభుత్వ పథకాలనూ, ప్రయోజనాలను అందకుండా నిర్భయంగా ప్రవర్తించారు. అంతేగాక ఈ కమిటీలోని సభ్యుల అవినీతి విశృంఖలమై అవినీతి గ్రామాలలోని క్షేత్రస్థాయికి చేరుకుని 'దేశం' పార్టీ వెన్ను విరిచింది. చెయ్యి బరువెక్కకుండా పెన్షన్, రేషన్ కార్డు ఇతర పథకాలూ లబ్దిదారులకు అందలేదు. తారాస్థాయికి చేరుకున్న ఈ అవినీతి ప్రజలను అత్యంత చికాకు పరిచింది. ఇక ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, పోలీసు స్టేషన్ల నుండి లంచగొండితనం ఏరులైపారింది. ముఖ్యంగా రెవెన్యూశాఖ అవినీతిలో రికార్డు సృష్టించింది. ప్రభుత్వ కార్యాలయాలతో పని రావడం ప్రజలంతా దురదృష్టంగా భావించారు. పోలీసు, ప్రభుత్వ కార్యాలయాలన్నీ శాసనసభ్యుల జాగీర్లుగా, వాటిలో పనిచేసే సిబ్బంది తమ జాగీర్దార్లుగా, అనుంగు సైన్యంగా దున్నిపడేశారు. అంతంలేని అవినీతి, ఆద్యంతం అక్రమాలతో దుష్టపాలనే అందించారు. "అగ్రిగోల్డు" ఒక మానని గాయం: ఐదేళ్లుగా అగ్రిగోల్డు డిపాజిట్ దారులూ, ఏజెంట్లు ఆర్తనాదాలు పక్షులు ఆలకించాయి. మదుపుదారుల అవస్థలు ఏమాత్రం ఆలకించని ప్రభుత్వ పెద్దలు ఆగ్రిగోల్డు ఆస్తులు కొట్టేయాలని కుట్రలు చేశారని బాధితులూ, ప్రజలూ గగ్గోలు పెట్టారు. వేలకోట్ల విలువైన హాయ్‌లాండ్‌ను కాజేయడానికి చినబాబు ప్రణాళిక వేసుకున్నాడు, కొందరు మంత్రులు కూడా భాగస్వాములుగా పథకం వేసుకున్నారని గట్టిగా విశ్వసించారు. బహుశా ఇది ఆరోపణే కావచ్చు. ఐతే ఈ ప్రచారాన్ని తిప్పికొట్టే నిర్దిష్టమైన కార్యాచరణ ప్రభుత్వం వైపు నుండి రాని కారణంగా ఈ నింద బలపడింది. వెయ్యి కోట్లు ఇస్తే 80 శాతం మదుపుదారులకు విమోచన లభిస్తుందని అగ్రిగోల్డు ఉద్యమకారుల కమిటీ నాయకులు నెత్తీనోరూ బాదుకున్నా బాబు ఏమాత్రం ఆ దిశగా స్పందించనేలేదు. ఎన్ని లక్షల మంది ఉంటారు! ఈ అగ్రిగోల్డు బాధితులూ, ఏజెంట్లూ, వారి కుటుంబాల సభ్యులూ! వత్తిడి అధికమై మదుపుదారులూ, ఏజెంట్ల ప్రాణాలు గాల్లో కలుస్తున్నా స్పందించాల్సిన ప్రభుత్వం ఉలకనూ లేదు, పలకనూ లేదు. పర్యవసానం గా టిడిపినే అనుభవించింది.

సాగునీటి ప్రాజెక్టుల మొద్దు నిద్ర

కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్మాణమయ్యే జాతీయ ప్రాజెక్టు పోలవరం మినహా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పూర్తిగావలసిన ఇతర ప్రాజెక్టులన్నింటినీ గాఢ నిద్రలోకి పంపిన బాబు కమీషన్లు వరద పారించే వట్టిసీమను పట్టిసీమగా మార్చాడు. పోలవరానికి నిధులు ఇవ్వకుండా కేంద్రం మోకాలడ్డుతుందన్న నిరంతర కీచులాట మినహా, వివిధ దశలలో వున్న రాష్ట్రంలోని ఇతర ప్రాజెక్టుల పట్ల తన బాధ్యతను ఏనాడూ గుర్తుకు తెచ్చుకోలేదు. తెలంగాణా ప్రాంతంలో ముంపుకు లోనయ్యే గ్రామాల ప్రజలకు నష్టపరిహారం కేవలం వందకోట్లు ఇస్తే 42 టియంసిల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన పులిచింతల ప్రాజెక్టు పూర్తి అవుతుంది. పరాయి రాష్ట్రాలతో ఎప్పుడు గొడవ పడదామా! అంటూ కాచుకు కూర్చోడం తప్ప, సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకుందామని బాబు ఏనాడు ఆలోచించి ఎరుగడు. వెలిగొండను వెలివేశాడు. ఇతర ప్రాజెక్టులను అటకెక్కించాడు. తెల్లవారి పొద్దు పొడిస్తే చాలు పోలవరం, కేంద్రం, మోడీ అడ్డు అంటూ మీడియా ఎదుట రభస సృష్టించి, గంటల తరబడి సమావేశాలతో జర్నలిస్టుల సహనాన్ని పరీక్షిస్తాడు. పోలవరం, పట్టిసీమల అవినీతి కూడా చంద్రబాబు పుట్టిముంచాయి.

రెండు కొమ్మలు కొడితే

తిరుమల నారాయణగిరిపై రెండు ఎర్రచందనం కొమ్మలు కొట్టిన కారణానికే తమిళ కూలీలను దారుణంగా, నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారు. వాస్తవానికి వారంతా పొట్టకూటికోసం వచ్చిన పనివారే. వారేమీ స్మగ్లర్లు కాదు. అసలు స్మగ్లర్లను నేటికీ పట్టుకుందీ లేదు. ఆధారం కోల్పోయిన ఆయా కూలీల కుటుంబాలు మొత్తం నేడు దిక్కులేక అలమటిస్తున్నాయి. అదే! తెలుగు తమ్ముళ్లు, నాయకులూ, శాసన సభ్యులూ లక్షల టన్నుల సున్నపురాయి, బాక్సైట్, మట్టీ, ఇసుక కొట్టిన వాళ్లను ఏమి చెయ్యాలి? వీరందరినీ బాబు సమున్నత గౌరవంతో లాలించారు. నదులను, నేలనూ, నింగిని సైతం కోట్లాది రూపాయల మేర కొల్లగొట్టి సహజ వనరు లన్నింటినీ గుల్ల చేశారు. కొమ్మలు కొట్టిన వారు దొంగలైతే, క్వారీలను కొట్టినవారు దొరలుగా చలామణి అయ్యారు. ఇది ఇట్లావుంటే తాత్కాలిక రాజధాని నిర్మాణానికి చదరపు అడుగుకి 11 వేలు కాంట్రాక్టర్లకు కట్టబెట్టి ధనాగారాన్ని డొల్లచేశాడు. ఈ మొత్తంలో అధిక భాగం పాలకుల జేబుకే చేరిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. హైదరాబాద్ మెట్రోపాలిటన్ సిటీలో కూడా చదరపు గజం 3 వేల నుండి 4 వేలకు మించదనే విషయం జగమెరిగిన సత్యం. 7 నుండి 8 వేలు ఏకంతకు చేరాయి. రాజధాని భూసేకరణలో భూయజమానులను కంట తడిపెట్టించిన బాబు, వారి నుండి స్వాధీన పరుచుకున్న భూ విక్రయాల్లోనూ అవినీతి రాజ్యమేలింది. కేంద్ర ప్రభుత్వ రిజర్వుబ్యాంకు, ఎల్ఐసి వంటి సంస్థల కార్యాలయాల నిమిత్తం ఎకరం 4.5 కోట్లకు విక్రయిస్తే, కొన్ని తస్మదీయ ప్రైవేటు సంస్థలకు ఉద్యోగ కల్పన సాకుతో ఎకరం ఒక్క రూపాయికే స్వాధీన పరచిన వైనం బాబు ప్రభుత్వ అవినీతి పరాకాష్టకు గీటురాయి.

నిర్మూలనా ఫార్ములా

నంద్యాల ఉపఎన్నిక సందర్భంలో పోలింగుకు కొద్దిరోజుల ముందుగా డ్వాక్రా మహిళల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వ సొమ్మును జమ చేయించి

ఓట్లు కొల్లగొట్టిన విధంగా 2019 ఎన్నికల్లో కూడా లబ్ధి పొందాలనే పన్నాగాన్ని అమలు పరిచారు. కానీ ప్రజలు, లబ్ధిదారులు బాబు బండారాన్ని కనిపెట్టి ఆ దుష్టక్రియను తుత్తునియలు చేశారు. ఆయన ఆశలను అడియాశలుగానే మిగిల్చారు. 2014 ఎన్నికల ప్రణాళికను మడిచి ప్రజల చంకలో పెట్టిన బాబు పసుపు కుంకుమ, అన్నదాత సుఖీభవ అంటూ ప్రసాదం పెట్టి అధికార మకుటాన్ని కాజేయాలని అత్యాశకు పోయాడు. గత ఎన్నికల్లో మాఫీ చేస్తానని వాగ్దానం చేసిన రుణాల విషయంలో రైతులను, డ్వాక్రా మహిళలను, వెన్నుపోటు పొడిచి ఎన్నికల ముందు ఇచ్చిన చెక్కులూ, బ్యాంకు ఖాతాల చిన్న మొత్తాల జమలను, బాబు ఓట్ల జిమ్మిక్కులుగా తేల్చిపారేసిన ఓటర్లు బాబుకే పసుపు కుంకుమ నిలువెల్లా పూసి ఇంటికి సాగనంపారు.

వేటుకు రావాలని

ఏప్రిల్ 11వ తేదీన జరిగిన పోలింగ్‌లో ఓటింగ్ శాతం తక్కువగా ఉండటం గమనించిన బాబు మధ్యాహ్నం గంటల సమయంలో మీడియా ముందుకు వచ్చి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో, మహిళలంతా పసుపు కుంకుమ లిచ్చిన అన్నయ్య విజ్ఞప్తి నందుకుని తండోపతండాలుగా పరుగు పరుగున పోలింగ్ కేంద్రాలకు చేరి సైకిల్ గుర్తుపై ఎడాపెడా నొక్కారని "దేశం" గళాలన్నీ విస్తృత ప్రచారం గావించాయి. ఐతే విజ్ఞప్తితో బాబు తమ పార్టీకే ఓటేయమని కోరని కారణంగా బహుశా మహిళామణులంతా గాలి కోసం ఫ్యాన్‌కు వేసినట్లుగా ఫలితాలు వెల్లడి చేశాయి. ఇదేంటండీ! ఓటు వేయమంటే! చంద్రబాబుకు వేటు వేయడం అన్యాయం కదా! ప్రజలను మభ్యపెట్టడంలోనూ, నమ్మించడంలోనూ, ఎట్లాంటి పరిస్థితులనైనా తమకు అనుకూలంగా మలుచుకోగలిగిన తమ్ముళ్లు విస్తృత ప్రచారం గావించడంలోనూ, ఎంత సిద్ధహస్తులో ఈ ఒక్క సంఘటనతోనే మనం అర్థం చేసుకోగలుగుతాము.

ముంచిన స్వంత సర్వేలు

చంద్రబాబు మీడియాను నమ్ముకున్నంతగా ప్రజలను విశ్వసించి నట్లుగా కనిపించదు. తన పాలనపై ప్రజల అభిప్రాయాలను ఆయన మీడియా కథనాల ద్వారానే తెలుసుకోవడానికి ఇష్టపడి ఆనందించారు. ఆంధ్రజ్యోతి, ఈనాడు ప్రింటు మీడియా, ఎబిఎన్ ఆంధ్రజ్యోతి, ఈ టివి, మహా టివి, టివి 5, టివి 9 భజంత్రీలై ఊదిన బాకాలకూ, భజనకీర్తనలకూ పొంగిపోయిన బాబుకు ప్రజల దీననాదాలు వినిపించ కుండానే ఫ్యాన్ గాలిలో కలిసిపోయాయి. తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి చేసిన ఫోను కాల్స్ కూడా బాబును ఇంటికి పంపాయి. ఫోన్ కాల్స్ ద్వారా ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్న క్రమం కూడా అపహాస్యమే. తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి వచ్చే ఫోన్ కాల్స్‌కు సమాధానంగా సంతృప్తిగా వున్నామని తెలిపే ఒకటో నెంబరునే ప్రతి ఒక్కరూ నొక్కారు. ఒకటి మినహా మరొక నంబరు నొక్కితే ఎక్కడ తమకు లభిస్తున్న ప్రభుత్వ పథకం తీసివేస్తారో, రేషన్ కార్డో, ఓటరు కార్డో మాయమౌతుందనే భయంతో పౌరులంతా పాలన భేష్ అంటూ ఒకటో నెంబరు నొక్కి పడేశారు. ఈ పరిణామమే బాబు పాలనపై ప్రజాభిప్రాయం 80 శాతం మేర సంతృప్తి గుట్టలుపడింది. వాస్తవంలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉందని మనం ఫలితాలను బట్టి తెలుసుకోగలిగాం. ఒకటో నంబరు నొక్కి నొక్కి చేతులు నొప్పులు వేసిన ఏపి ఓటర్లు తడబాటుతో పోలింగులో తెలుగుదేశం పార్టీ పీకనే నొక్కారు.

ఫ్రీ వెర్స్ పొలిటీషియన్

చంద్రబాబు శాస్త్రంలో చెయ్యదగినవీ, చెయ్యకూడనివీ అంటూ లేనేలేవు. ఆయన ప్రయోజనం కోసం, అవసరం మేరకు అన్ని ధర్మాలనూ పరిత్యజించగలరు. స్వార్థమే పరిమావధిగా ఎంతకైనా దిగజారగలరు. ఒక విధంగా విశ్లేషించాలంటే బాబు ఫ్రీవెర్స్ థింకర్. విపక్ష వైసిపికి చెందిన ముగ్గురు ఎంపిలను, 23 మంది ఎమ్మెల్యేలను తన పార్టీలోకి తీసుకుని, ప్రపంచం తప్పు పడుతుందేమోననే సంశయం ఏ కోశానా లేకుండా పార్టీ కండువాలు కప్పి, నలుగురిని మంత్రివర్గంలోకి కూడా తీసుకున్నారు. ఏమాత్రం చాటుమాటు, తెరచాటు లేకుండా ఇట్లాంటి అకృత్యానికి పాల్పడి రాజకీయాలను తనకు మించి ఎవరూ భ్రష్టు పట్టించలేరని ఛాలెంజ్ విసిరారు. 2014కు ముందుగానీ, 2019 తరువాతా ఈ స్థాయిలో రాజకీయాలను ఇంకొకరు కలుషితం చేయలేరేమో! ఈయన దుష్ట కార్యక్రమాలకు దన్ను మన గౌరవనీయ శాసన సభాపతి "కోడెల". అందుకే ఆయన అపూర్వ సన్మానం అందుకున్నారు. రెండు నియోజక వర్గాలలో కోడెల, తనయుడూ, తనయ ఇష్టారీతిన సాగించిన రాక్షసక్రీడకు అంతం పలికారు. ఇనిమెట్ల గ్రామంలో కోడెలకు జరిగిన పరాభవం, మాదాల రంగారావు ఎఱ్ఱ చలన చిత్రాలలో ముగింపులో విలన్‌ని గ్రామస్థులంతా ఆడామగా ఏకమై కర్రలూ, బడితెలూ, చీపుర్లు, చాటలు, కొడవళ్లూ చేపట్టి గ్రామం నుండి తరిమిన సీన్లు గుర్తుకు తెస్తుంది. ప్రజాగ్రహమంటే అట్లాగే వుంటుంది మరి. సాధు జంతువులన్నీ ఏకమైతే పులి, సింహమైనా పరారే! "బలవంతమైన సర్పం చలిచీమల చేత చిక్కి చావదె సుమతి". గడిచిన ఐదేళ్ల బాబు పాలనను ఏపి ప్రజలు దుష్ట, దుర్మార్గ పాలన గానే భావించారు. రాజకీయ ఉద్దండులు సైతం గమనించని విధంగా తెలుగుదేశం తీవ్ర ప్రజావ్యతిరేకత ను చవిచూడడమే ఇందుకు దర్పణం పడుతుంది. 175 శాసనసభ్యుల స్థానాలకు గాను, 23 స్థానాలతోనూ, 25 పార్లమెంటు స్థానాలకు 3 స్థానాలనూ ఇచ్చి ఓటర్లు చిత్తుగా ఓడించారు. గెలిచిన వారు కూడా చావు తప్పి కన్ను లొట్ట పోయిన విధంగా అత్యల్ప ఆధిక్యతలతోనే నెగ్గుకొచ్చారు. 2019 ఏపి ఎన్నికల ఫలితాలు టిడిపికే కాదు, అధికారం ఉందికదా అని విర్రవీగుతూ ప్రజలనూ, ప్రజాస్వామ్యాన్ని విస్మరించే దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకూ వీపు చరిచి జాగ్రత్త అంటూ చేసిన హెచ్చరికగా భావించాలి.

ప్రస్తుతం బాబు దీనావస్థ జాలిగొలుపుతుంది. ప్రజలను ఇంత స్థాయిలో బాధకు గురిచేశామా! అనే ప్రశ్నతో ఆయన అంతర్మథనం చేసుకుంటున్నారు. ఈ హీన ఫలితాలపై కారణాలను ఆయనకు ఆయన ప్రశ్నించుకుంటూ బేలచూపులు చూస్తున్నారు. అయితే ఈ పరిస్థితులను ఆయనకు ఆయనే కొనితెచ్చుకున్నారు. స్వయంకృతాపరాధంగానే భావించాలి. ధృతరాష్ట్రుడు పుత్రవాత్సల్యంతో అమితమైన దుర్భరాన్ని అనుభవించిన విధంగా శాసనసభ్యులూ, పార్టీ వర్గాల ఆగడాలను ఆమోదించిన సందర్భంగానే బాబు ఇంతటి దారుణ దుర్భర పరిస్థితిని కౌగిలించుకున్నారు.

(రచయిత అధ్యక్షులు, నవ్యాంధ్ర రచయితల సంఘం) వీ

ఎన్నికల ఫలితాలు - ఒక విశ్లేషణ

***ఎన్నికల తంతు అంతా ఒక దోపిడీదారు నుంచి మరో దోపిడీదారుకు అధికార మార్పిడి తప్ప మరేమీ కాదనీ, ఎన్నికల్లో ప్రజల మౌలిక సమస్యలకన్నా భావోద్వేగాలు, జాతీయవాదం, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టి బిజెపి అధికారంలోకి వచ్చిందనీ అంటున్నారు* షేక్ కరిముల్లా**

'మతం ప్రజల పాలిట మత్తు మందు' – మార్క్స్

'ఏ భావజాలం వెనుక ఏ వర్గ ప్రయోజనాలు దాగి ఉన్నాయో గ్రహించనంత కాలం ప్రజలు మోసపోతూనే ఉంటారు' – లెనిన్

బాబ్రీ మసీదు విధ్వంస చర్య భారత సమాజంలో ఒక ప్రధాన మలుపు. ఆ రోజును హిందూ మతోన్మాదులు తమ విజయోత్సవ దినంగా ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. బాబ్రీ మసీదు శిథిలాల మీదుగా నడుస్తున్న హిందూ మతోన్మాదాన్ని తమ రాజకీయ అవసరాలకు వాడుకొని, రెండు సీట్ల నుండి నేడు 303 సీట్లకు ఎగబాకింది బిజెపి. 2019 మే 23 భారతీయ చరిత్రలో ఒక చీకటి రోజు. దేశం పూర్తిగా ఫాసిస్టుల చేతుల్లోకి వెళ్లిపోయిన రోజు. భారత జాతీయోద్యమం అందించిన 'లౌకిక స్ఫూర్తి', 'ప్రజాస్వామ్య రాజ్య భావన' మీద, విలువల మీద హిందూ మతోన్మాదుల ప్రణాళికలు విజయం సాధించిన రోజు. మన సమాజంలోని సమానత్వ భావనల మీద కూడా దారుణమైన దాడి జరిగింది. మన సాంస్కృతిక వైవిధ్యం మీద ఆధిపత్య భావజాలం బలవంతంగా రుద్దబడింది. ఈ దేశంలోని సౌభ్రాతృత్వ భావనను, భారత లౌకిక జాతీయవాదాన్ని నిట్టనిలువున హతమార్చిన ఇలాంటి సంఘటనలు ఎన్ని జరిగినా మతోన్మాద శక్తులు 2019 ఎన్నికల్లో పూర్తి విజయాన్ని సాధించాయి. మేధావులను సైతం నివ్వెరపరిచిన ఈ ఎన్నికల ఫలితాలను పరిశీలిద్దాం.

2014 నాటి ఎన్నికల ప్రచారంలో నరేంద్రమోడీ 'అచ్చేదిన్' (మంచి రోజులు) 'సబ్‌కాసాత్' – సబ్‌కా వికాస్' అంటూ రానున్న దినాల్లో అంతా మంచే జరుగుతుందని ఊదరగొట్టాడు. నల్లధనం వెలికితీసి ప్రతి ఒక్క భారతీయుని అకౌంట్‌లో పదిహేను లక్షల రూపాయలు జమ చేస్తానని నమ్మపలికాడు. అలాగే మేక్ ఇన్ ఇండియా అంటూ లక్షల ఉద్యోగాలు యువతకు అందిస్తానన్నాడు. కాని నోట్ల రద్దుతో ప్రజలు బజారున పడ్డారు. జిఎస్‌టి వలన 50 లక్షల ఉద్యోగాలు పోయాయి. చిన్న సన్నకారు వ్యాపారుల నడ్డి విరిగింది. ఈ రెండు చర్యల వలన కోట్ల మంది ప్రజల జీవనాధారం దెబ్బతిన్నది. గణాంకాలను గారడీలతో తారుమారు చేసినప్పటికీ జిడిపి పడిపోయింది. ప్రజలు అనేక కష్టాలు పడ్డారు. మోడీ సృష్టించిన భ్రమలు చిన్నగా తొలగిపోయాయి.

ముస్లింలు, దళితులు, మేధావులపై దాడులు, చంపివేసిన ఘటనలు, వరవరరావు, సాయిబాబా లాంటి ప్రజా మేధావులపై అన్యాయంగా తప్పుడు కేసులు పెట్టి జైళ్లలో వేయడం, కన్హయ్య కుమార్ లాంటి విద్యార్థులు, మేధావులపై దేశ ద్రోహం కేసులు పెట్టారు. స్త్రీలపై అత్యాచారాలు, దళిత, మైనారిటీ ప్రజలపై మూకదాడులు జరిగాయి. వీటిపై బిజెపి ప్రభుత్వం కనీసం సమాధానం కూడా చెప్పుకోలేని స్థితిలోకి వెళ్లిపోయింది. అయినా బిజెపి ఈ ఎన్నికలలో పూర్తి మేజారిటీ సాధించింది. గతం కంటే ఎక్కువ సీట్లు వచ్చాయి. ఇది ఎలా సాధ్యపడింది?

2014 ఎన్నికల్లో ప్రజల ప్రధాన ఆర్థిక విషయాలపై సంక్షేమ పాట పాడిన బిజెపి, ఈ ఎన్నికల్లో ఎక్కడ ప్రజల మౌలిక ఆర్థిక విషయాలు, సంక్షేమం గురించి ప్రస్తావించలేదు. అయినా ఆ పార్టీ గెలిచింది? ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ, వామపక్ష పార్టీలు బలహీనంగా ఉండడం, ప్రాంతీయ పార్టీల అనైక్యత బిజెపికి కలిసి వచ్చినప్పటికీ ప్రధానంగా బిజెపి తన మతోన్మాద ఫాసిస్టు పోకడల పైనే ఆధారపడింది. ఈ ఎన్నికల్లో దేశభక్తి, జాతీయవాదం, పాకిస్తాన్‌పై యుద్ధం, పుల్వామా దాడి, బాల్కోట్ అంశాల పైనే ఆధారపడి హిందూ మతోన్మాదాన్ని ప్రజల్లో రెచ్చగొట్టి లాభపడింది.

ఫాసిజం ఒక సంఘటన కాదు. సామ్రాజ్యవాద ప్రపంచ దోపిడీకి ఇది ఒక సాధనమని చరిత్ర చెప్పింది. కాబట్టి ఇది ఒక క్రమంలో వ్యాప్తిచెంది, అదొక రాజకీయ భావజాలంగా దోపిడీ శక్తులకు ఉపయోగపడుతుంది. ప్రజలకు కష్టాలు, కన్నీళ్లు మిగిల్చే దుష్టశక్తి.

2014లో మోడీ సర్కార్ రావడానికి చాలాకాలం ముందు నుండే భారతీయ సమాజంలో ఫాసిస్టు భావజాలం వ్యాప్తి చెందుతూ ఉంది. సామాన్య పేద, మధ్యతరగతి ప్రజల్లో కూడా చాపకింద నీరులా సంఘ్‌పరివార్ శక్తులు దీన్ని వ్యాప్తి చేశాయి. ఆర్ఎస్ఎస్ రూప మాత్రంగానే మతోన్మాద సంస్థ. కానీ సారాంశంలో ఫాసిజం దాని తత్వం అని ప్రజలు గుర్తించాలి. జాతీయోద్యమంలో పాల్గొనకుండా దూరంగా ఉండి, ప్రజల్లో వదంతులు వ్యాపింపచేసి మతకల్లోలాలు సృష్టించి పాల్గొన్న చరిత్ర దీనిది. ఈ సంస్థ ఉద్దేశం హిందూ రాజ్య స్థాపన. అందుకు తమ 'మనువు' ఆలోచనలు, ఆ భావజాలాన్ని దేశ ప్రజలపై రుద్దేందుకు పనికట్టుకొని అబద్దాలు, తప్పుడు విషయాలను ప్రచారం చేస్తూ దళిత, మైనార్టీ ప్రజలపై దాడులకు ఉసిగొల్పుతుంది. నాజీ హిట్లర్ నియంతృత్వం వీరికి ఆదర్శం. హిట్లర్‌కు నిషే అనే తాత్వికుడు గురువు. నిషేకు గురువు మనువు ఇక అర్థం చేసుకోండి.

జర్మనీలో నాజీ నియంతలు జాతి సిద్ధాంతం పేరిట కమ్యూనిస్టులు, యూదులపై దారుణ హత్యాకాండ కు పాల్పడిన చరిత్ర మనకు తెలుసు. ఫాసిజం, నాజీయిజం జాతి పేరిట సామ్రాజ్యవాద దోపిడీ ప్రయోజనాలు సంరక్షిస్తాయి. ఇక్కడ సంఘ్‌పరివార్ శక్తులు కూడా దేశభక్తి ముసుగులో దేశ, విదేశీ, కార్పొరేట్, బహుళజాతి కంపెనీల ప్రయోజనాలు

కాపాడుతున్నాయి. ఇందుకు ఉదాహరణ 1990 తర్వాత హిందుత్వం ఒక్కసారిగా విజృంభించడం, బాబ్రీ మసీదు నేలమట్టం ఉదంతాలతో ప్రజల ఆలోచనలు హైజాక్ చేయబడ్డాయి. కారణం 1991లో అప్పటి పాలకులు (పి.వి. నరసింహారావు) నూతన ఆర్థిక విధానాల పేరిట దేశాన్ని ప్రపంచ బ్యాంకుకు దాసోహం చేశారు. బహుళజాతి కంపెనీల దోపిడీకి తలుపులు బార్ల తెరిచారు. 'స్వావలంబనకు సలామ్ – విదేశీయులకు గులామ్'లు అయ్యారు. దేశ వనరులు, ప్రజల్ని దోచుకోవడానికి పూర్తి అవకాశం ఇచ్చారు.

ఈ విధానం వలన దేశంలో పేదరికం, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, రైతుల ఆత్మహత్యలు, తీవ్ర ఆర్థిక సంక్షోభాలు ఏర్పడతాయి. ప్రజలు వీటిని నిరశిస్తూ ప్రత్యామ్నాయ రాజకీయాలైన సోషలిస్టు వ్యవస్థల వైపు ఉద్యమించకుండా, సోషలిస్టు వ్యవస్థలు ఏర్పడకుండా చేయడానికి, ప్రజల ఆలోచనలు పక్కదారి పట్టించడానికి హిందూ మతోన్మాదం దోపిడీ శక్తులకు సాధనంగా మారింది. ప్రజల్ని మతాల పేరిట విభజించి భావోద్వేగాలు రెచ్చగొట్టి మారణ హోమాలు సృష్టించి, దోపిడీ చేసుకోవడానికి సున్నిత అంశమైన మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారు. ఈ వెలుగులో సంఘ్‌పరివార్ దాని రాజకీయ విభాగం బిజెపిని, ఆ పార్టీ విధానాలను పరిశీలించాలి.

ఇక్కడ మనం గుర్తించాల్సింది భారతీయ లక్షణాలతో కూడిన ఒక నయా ఫాసిజం దేశంలో ఏర్పడింది. ఒక ప్రత్యేక రూపంలో హిందుత్వంగా గుజరాజ్ ప్రయోగాన్ని (2002 మారణకాండ) దేశవ్యాప్తం చేసే పనిలో ఈ నయా ఫాసిజం ఉంది. ఇది చాలా ప్రమాదకరం. ప్రపంచంలో రెండవ అతిపెద్ద దేశమైన భారతదేశంలో సంఘ్‌పరివార్ శక్తుల ఈ గెలుపు ఒక హెచ్చరిక. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈ దృక్పథం నుండి ఈ ఎన్నికల్లో బిజెపి విజయం వెనుక ఉన్న అంశాలను చూద్దాం.

ఈ ప్రజా తీర్పును అంగీకరించాల్సిందే, తప్పు పట్టకూడదు అనే ఒక వైఖరి ఫలితాలపై చర్చల సందర్భంగా వెల్లడైంది. ఇది సరైనది కాదు. ఎన్నికల ప్రక్రియ పూర్తిగా మోసపూరితంగా మారింది. అలాగే కొన్ని దశాబ్దాలుగా దేశ ప్రజల్ని నిరక్ష్యరాసులుగా ఉంచుతూ, ప్రజల మూఢనమ్మకాలను పెంచి పోషిస్తూ, హిందూ మతానికి ఇతర మతాల వలన ముప్పు ఏర్పడిందని తప్పుడు ప్రచారం చేస్తూ, అమాయక మెజారిటీ హిందూ ప్రజల్లో మతోన్మాదంను రెచ్చగొట్టిన ఫలితాలు ఇవి.

బిజెపి నేత సుబ్రమణ్యస్వామి ప్రకటనే అందుకు సాక్ష్యం. 'ఇప్పుడు వీస్తుంది మోడీ వేవ్ కాదు, హిందుత్వ వేవ్' ఈ ప్రకటన అర్థం చేసుకుంటే అసలు విషయం బోధపడుతుంది. ప్రజల బలహీనతలైన మతం మత్తు, జాతీయవాదం, యుద్ధోన్మాదం, పుల్వామా దాడి, బాల్‌కోట్ అంటూ సామాన్య పేద హిందూమత ప్రజల్లో సైతం హిందుత్వను పులిమారు. ఇలా భావోద్వేగాలను రెచ్చగొట్టి హిందూ ప్రజల మెదడును రిగ్గింగ్ చేశారు. జనాలు తండోపతండాలుగా బారులు తీరి మరీ హిందుత్వకు ఓటు వేశారు.

ఈ ఎన్నికల్లో ప్రజల మౌలిక ఆర్థిక సమస్యల ప్రస్తావనే లేదు. వీటి పరిష్కారంలో బిజెపి పూర్తిగా విఫలమైంది. అయినా రెండవసారి ప్రజలు బిజెపికి ఓటు వేశారంటే వారి మెదళ్లు ఎంతగా రిగ్గింగ్ అయ్యాయో అర్థం చేసుకోవచ్చు. ఈ ధోరణి చాలా ప్రమాదకరం. రానున్న రోజుల్లో ప్రజలు మరింత కష్టాల పాలు కానున్నారు.

ఇదిలా ఉంచితే, కొన్ని నిరాధార అనుమానాలు కూడా ప్రజల్లో లేకపోలేదు. అది ఇవిఎంల టాంపరింగ్, రష్యన్ల సహకారంతో అమెరికన్ ఎన్నికల్లో ట్రంప్ ఇవిఎంలను టాంపరింగ్ చేసి గెలిచాడని, అలాగే ఈ ఎన్నికల్లో కూడా బిజెపి కొన్ని సెలెక్టెడ్ ప్రాంతాల్లో ఇవిఎం టాంపరింగ్ చేసి గెలిచిందని, లేకుంటే ఇన్ని సీట్లు ఎలా వస్తాయనే అనుమానాలు కొందరి ప్రజల్లో ఉన్నాయి. ఇందుకు ఉదాహరణగా ఇటీవల ఆరు నెలల కింద కొన్ని రాష్ట్రాలకు జరిగిన శాసన సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలిచినా, ఇతర ప్రాంతీయ పార్టీలు గెలిచినా రాష్ట్రాలలో సైతం బిజెపి ఎక్కువ సీట్లు కైవసం చేసుకోవడం అనుమానాలకు తావిస్తుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

మధ్యప్రదేశ్, చత్తీస్‌గడ్, రాజస్థాన్ ఈ మూడు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు. ఈ రాష్ట్రాలలో మొత్తం 65 లోక్‌సభ స్థానాలుంటే బిజెపి ఏకంగా 61 స్థానాలను కైవసం చేసుకుంది. అలాగే తెలంగాణలో సైతం బిజెపి పట్టులేని నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో బిజెపి అభ్యర్థులు గెలవడం ఆశ్చర్యం! ఆరు నెలల కింద జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఇక్కడ టిఆర్ఎస్ గెలుపొందడం గమనార్హం. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన కొన్ని పాశ్చాత్య దేశాలలో బ్యాలెట్ విధానం అమల్లో ఉండడం చూస్తే ఇవిఎంలు సురక్షితం కాదని అర్థమవుతుంది. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఇవిఎంలు వద్దు, బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు జరగాలని గట్టిగా వాదిస్తున్నారు.

ఏది ఏమైనా ఈ ఫలితాలు దేశంలోని లౌకిక శక్తులకు ఒక సవాల్ విసిరాయి. కాబట్టి మైనారిటీ, దళిత ప్రజలు, వామపక్ష వాదులు, ప్రగతిశీల శక్తులు ఏకమై ప్రజలను చైతన్యపరిచి ఫాసిస్టు చీకటి శక్తులపై పోరాటం చేయాలి. ఏ పార్టీ కూడా ప్రజల మౌలిక అవసరాల గురించి మాట్లాడడం లేదు. భూ సంస్కరణలు, వనరుల పంపిణీ, ప్రజల జీవించే హక్కు గురించి ప్రస్తావించడం లేదు.

ప్రతి ఎన్నికల్లో జరిగేది ఒక్కటే.. పార్టీలు గెలుస్తుంటాయి, ఓడిపోతూ ఉంటాయి. కాని ప్రజలు ఎప్పుడూ ఓడిపోతూ ఉంటారు. ప్రజల సమస్యలు పరిష్కరించలేని ఈ ఎన్నికలు, పార్టీలు ఎందుకోసం, ఎవరి కోసమో ప్రజలు ఆలోచించాలి.

(రచయిత సామాజిక విశ్లేషకులు) వీ

పాఠకులు ఫిర్యాదులు, సమాచారం కోసం వీక్షణం కార్యాలయానికి పనిదినాల్లో ఉదయం 10:30 నుండి సాయంత్రం 6.00 గంటలలోగా స్వయంగా లేదా ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు. మిగతా సమయాల్లో ఫోన్ చేస్తే అది ఫ్యాక్స్‌లోకి వెళ్లి మీకు జవాబు రాదు. అప్పుడు మీరు ఫోన్ ఎత్తికూడా మాట్లడడంలేదని అనుకునే అవకాశం ఉంది. ఇది గమనించగలరు. – సం.

ఇంటర్మీడియట్ విద్యార్థుల ఆందోళన

ఫలితాల్లో జరిగిన అవకతవకల వల్ల నష్టపోయిన విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే అధికారులు, పాలకులు తమ వైఫల్యాల్ని కప్పిపుచ్చుకోవడానికి ఆందోళనకు దిగిన విద్యార్థులపై, వారి తల్లిదండ్రులపై తీవ్ర నిర్బంధాన్ని అమలుచేశారని అంటున్నారు బైరెడ్డి సతీష్

పరీక్షల కాలం, ఫలితాల కాలం పిల్లల పాలిట పాడు కాలం అయ్యింది. మండే ఎండల్లో రాలిపోతున్న పిట్టల్లా ఫలితాల పిడుగుపాటుకు పిల్లలు అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు. అనుత్తీర్ణులవడమో, అనుకున్నంత మార్కులు రాకపోవడమో వారిక బ్రతుకగూడదనుకున్నంత స్థితికి నెట్టివేయనడుతున్నారు.పచ్చి వ్యాపారమైయిపోయిన మార్కెట్ చదువుల్లో అమ్మా నాన్నల మార్కులు, ర్యాంకుల ఒత్తిళ్లతో ప్రెజర్ కుక్కర్ వాతావరణంలో చదువుకోవడం, ఫలితాల కోసం నరాలు తెగే ఉత్కంఠ తో ఎదురుచూడటం తీరా ఫలితాలు తీవ్ర నిరాశ పర్చాయని విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. మనో వికాసాన్ని, స్థైర్యాన్ని అందించి పరిపూర్ణ వ్యక్తిగా తీర్చిదిద్దాల్సిన చదువులు ఆత్మహత్యలకు పురిగొల్పు తున్నాయి. లక్షలు పోసి కొనుక్కున్న చదువులో రాణించలేక పోయానని, మార్కులు రాకపోతే మార్కెట్‌లో మనిషిగా నిలబడలేననే మనోస్థితే విద్యార్థులు తీవ్ర నిర్ణయాలు తీసుకునేలా ప్రేరేపిస్తున్నవి. కార్పొరేట్ భ్రమావరణంలోకి తల్లిదండ్రులను నెట్టి వేస్తున్న 'పెట్టుబడి' చదువులు పిల్లల పాలిట మరణ శాసనాలవుతున్నాయి. విద్యార్థులను ప్రతిభావంతు లుగాను, ఫలితాలను అందించే వాళ్లుగాను తీర్చిదిద్దాల్సిన వ్యవస్థాగత ప్రయత్నాల వైఫల్యాలను వ్యక్తుల వైఫల్యంగా చూపెట్టి ఏ జవాబుదారీ తనంలేని వాతావరణాన్ని చదువుల వ్యవస్థనిర్మాణం చేస్తున్నది.

తెలంగాణ రాష్ట్రంలో ఏప్రిల్ 18న ప్రకటించిన ఇంటర్ పరీక్షల ఫలితాల నేపథ్యంలో జరిగిన 25 మందికి పైగా ఆత్మహత్యలు, పౌర సమాజపు స్పందన దానికి ప్రభుత్వం వ్యవహరించిన తీరు చూస్తే అసలు మాది బాధ్యతే కాదన్నట్టుగా ప్రవర్తిస్తున్నదని అర్థమవుతోంది. అసలు తెలంగాణా ప్రభుత్వానికి గురుకుల పాఠశాలలు, కళాశాలలు నెలకొల్పడం మినహా మరే రకమైన విద్యా విధానం లేదని స్పష్టమవుతుంది.

పరీక్షల ఫలితాలు రావడం ఏదో ఒక చోట ఫెయిల్ అయ్యామనే మనస్తాపానికి గురై విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారనేది అతి సాధారణం అయిపోయినవి. ఎప్పుడూ ఉండేదేలే అని సరిపెట్టుకో నివ్వకుండా ఈసారి ఇంత పెద్ద ఎత్తున జరిగిన ఆత్మహత్యలు సహజం గానే స్పందించే హృదయాలను కలవర పెట్టాయి, ఆందోళన పర్చాయి. అసలు ఫలితాలు ప్రతిసారి కంటే ఈసారి ఆలస్యంగా వెలువడడంతోనే 'ఏదో' జరిగిపోయిందన్న అనుమానాలు, భయాలు అనేకం అలుము కున్నాయి. ఆంధ్రప్రదేశ్‌తో పాటే ఏకకాలంలో పరీక్షలు జరిగినప్పటికీ ఫలితాల వెల్లడిలో సాధారణ ఎన్నికల దృష్ట్యా అనుకున్న దానికంటే ముందే మూల్యాంకనం ముగించినా జాప్యం ఏర్పడింది. వెలువడ్డ ఫలితాల్లో వేలాది మందికి తప్పుడు మార్కులు రావడమూ, పాస్ అయిన వాళ్లు ఫెయిల్ అయినట్టు రావడమే కాకుండా కొత్త కొత్త కోడ్ పదాలు వాళ్ల మెమోల్లో కనిపించడంతో పెద్ద గందరగోళం ఏర్పడింది.

99 మార్కులు వచ్చిన విద్యార్థికి సున్నా మార్కులు చూపించడం, ఒకే హాల్ టికెట్ నంబర్‌తో ఒక రోజు ఒక రిజల్ట్ మరో రోజు మరో రిజల్ట్, 90 శాతం మొదటి సంవత్సరం పాస్ అయిన వాళ్లు సెకండ్ ఇయర్‌కి వచ్చేసరికి ఫెయిల్ అయినట్టు రిజల్ట్ రావడం లక్షలాది విద్యార్థుల్ని తల్లిదండ్రులను తీవ్రమైన భయాందోళనకు గురిచేసింది.

ఒకేషనల్ కోర్సుల్లో అయితే అసలు ప్రాక్టికల్ పరీక్షల మార్కులే ఎంటర్ కాకపోవడం కనిపించింది. భవిష్యత్ చదువుకు , ఉద్యోగానికి సంబంధించినంత వరకు ఇంటర్ అత్యంత కీలకమైనది కనుక సహజం గానే భావోద్వేగాలతో కూడిన స్పందనకు, ఆందోళనా కార్యక్రమాలకు దారితీసింది. వందలాదిమంది విద్యార్థులు తల్లిదండ్రులు ఇంటర్ బోర్డ్ ఎదుట ధర్నా, వివిధ రూపాల్లో ఆందోళనలు చేశారు.

ఏం జరిగిందో, జరుగుతున్నదో ఎవరూ చెప్పలేని పరిస్థితి నెలకొన్నది. భయాందోళనకు గురైన పిల్లలకు వారి తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాల్సిన అధికార యంత్రాంగం అణచివేత ధోరణిని ప్రదర్శించింది. పోలీసులకు పని అప్పగించి అడగడానికి వచ్చిన ప్రతి ఒక్కరిని అరెస్ట్ చేసి ఠాణాల్లో బంధించారు. 144 సెక్షన్లు, నిషేధాలు నిర్బంధాలకు కేంద్రం అయ్యింది ఇంటర్‌మీడియెట్ బోర్డ్.

అధికారులు చేసిన తప్పిదాలకు బలియైపోయిన, నష్టపోయిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అసలు తమకు ఎందుకు ఎలా నష్టం జరిగిందన్న విషయాన్ని ధృవీకరించుకునే హక్కును కూడా కాలరాసింది అధికార యంత్రాంగం. ఓ వైపు ఆత్మహత్యలు, నిరసనలు, ఆందోళనలు కొనసాగుతుంటే రాజకీయ నాయకత్వం తమకేమీ పట్టదన్నట్టు నేరపూరిత నిర్లిప్తతను, నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది.

విద్యార్థుల్లో మరింతగా ఆందోళన పెంచేలా వ్యవహరిస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీలు, సంఘాలు వ్యవహరిస్తున్నాయని విద్యా మంత్రి వారం రోజుల తర్వాత నిద్రలోంచి లేచివచ్చినట్టు ప్రకటించారు. ఎన్నికలకు ముందు ఓ రైతు తన భూమి కాజేసి పట్టాదారు పాసు పుస్తకం తనకు ఇవ్వకుండా రెవెన్యూ యంత్రాంగం తనను వేధిస్తున్నదని, తనకు ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదని ఫేస్‌బుక్‌లో పోస్టింగ్ పెడితే క్షణాల్లో స్పందించి రెవిన్యూ యంత్రాంగాన్ని, దాని అవినీతిని కడిగి పెట్టి కలెక్టర్‌ను కదిలించి పరిష్కరించిన ముఖ్యమంత్రికి పిట్టల్లా రాలిపోయిన విద్యార్థుల ఆత్మ'హత్యలు', తన కార్యాలయానికి కూతవేటు దూరంలో జరిగిన నిరసనలు, ఆందోళనలు తన చెవిన పడలేదెందుకో? ఘోరం జరిగిపోయాక ముఖ్యమంత్రి సంబంధిత శాఖాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు ఫెయిల్

అయిన విద్యార్థులందరి పరీక్ష పత్రాలను పునఃపరిశీలన ఉచితంగా చెయ్యాలని, ప్రతి సంవత్సరం లాగానే తగిన రుసుముతో రీవెరిఫికేషన్, రీకౌంటింగ్ కోరుకున్న వారికి చెయ్యాలని విద్యాశాఖ కార్యదర్శి స్వయంగా ఆ పనిని పర్యవేక్షించాలని పురమాయించడంతో మునుపెన్నడూ లేనంతగా అర్ధ శతాబ్దపు ఇంటర్ బోర్డ్ చరిత్రలో నడి ఎండా కాలం ఫెయిలైన 3.7 లక్షల విద్యార్థుల పరీక్ష పత్రాలను పునఃపరిశీలన చేయాల్సి వచ్చింది.

ఈలోగా లోపభూయిష్టంగా ప్రకటించబడిన ఫలితాల ప్రక్రియను విచారించడానికి నియమించిన 3 సభ్యుల కమిటీ ఫలితాలను ప్రకటించడానికి ముందు జరిగే వ్యవహారాన్నంత పరిశీలించి సాంకేతిక తప్పిదాలు జరిగాయని తేల్చి చెప్పింది.

ఈ మొత్తం సాంకేతిక, సాఫ్ట్‌వేర్ ప్రక్రియ తప్పిదమంతా బోర్డు నియమించుకున్న గ్లోబరీనా సాఫ్ట్‌వేర్ సంస్థదే అని చెప్పకనే చెప్పింది. అయితే ఈ ముగ్గురు సాంకేతిక నిపుణుల కమిటీ విచారణ పరిధి అంతా కూడా సాంకేతికాంశాలకే పరిమిత మయ్యేలా వ్యవహరించి అసలు గ్లోబరీనా సంస్థ బోర్డుకు సాఫ్ట్‌వేర్ సేవల్ని అందించేలా ఎలా చొరబడగల్గింది, దాని నేపథ్యం ఏమిటి, ప్రభుత్వంలో ఏ పెద్దల అండదండలతో ఇది జరిగిందన్న అసలు అంశాన్ని ఉద్దేశ్య పూర్వకంగానే విస్మరించారు.

గ్లోబరీనా సంస్థ కంటే ముందు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వంటి ప్రభుత్వ సంస్థ అత్యంత సమర్థవంతంగా సాఫ్ట్‌వేర్ సేవలను అందిస్తూ వస్తుంటే గత అకడమిక్ సంవత్సరం నుండి గ్లోబరీనా ఎవరి ప్రోద్బలంతో ఎంటర్ అయ్యిందనే ప్రశ్నకు సమాధానం లేదు. ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా నియమింపబడిందనే అధికారులు చెబుతున్నప్పటికి బయట ఉన్న అనేక స్వతంత్ర సాంకేతిక నిపుణులు, సంస్థలు దాని పైన అనేక అనుమానాలు, అనుభవాలను బయటకు చెబుతూనే ఉన్నారు. జెఎన్‌టి యూనివర్సిటీ గతంలో తమకు సాఫ్ట్‌వేర్ సేవలను అందివ్వడంలో విఫలమైందని, అది అంత సమర్థవంత మైన సంస్థ కాదని స్వయంగా ఆ యూనివర్సిటీ అధికారులే ప్రకటించారు. సాఫ్ట్‌వేర్ సేవలను అందించే సంస్థకు ఉండాల్సిన అన్ని ప్రాతిపదికలను అది సంతృప్తిపర్చలేదని, కనీసం 12 లక్షల అభ్యర్థుల డేటాను అది అప్పటికే హ్యాండిల్ చేసి ఉండాలన్న నిబంధనను గ్లోబరీనా కోసం ఉల్లంఘించడమో, సవరించడమో జరిగిందని, ఆ సంస్థతో ఎటువంటి ఒప్పందం కుదుర్చుకోని పద్ధతే తెలియజేస్తుంది.

ఇంటర్‌లో విద్యార్థుల చేరిక ప్రక్రియ నుండి మొదలుకుంటే పరీక్ష ఫలితాలు బయటకు వెల్లడించే వరకూ గ్లోబరీనా బ్లండర్స్ చేస్తూనే ఉన్నప్పటికీ ఫలితాలు అనేవి పెద్ద అంశమూ, అందరికీ తెలిసే విషయం కనుక దాని అసమర్థత ఫలితాల ప్రకటన పాయింట్ దగ్గర బట్ట బయలైంది. ఇంటర్ అడ్మిషన్లకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ పనులన్నీ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ చూసుకున్నప్పటికీ ఆ డేటాను అంతా స్వీకరించడంలో, ప్రాసెస్ చేయడంలోనూ ఘోరంగా వైఫల్యం చెందింది గ్లోబరీనా. విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపు దగ్గర తీవ్రమైన సాంకేతిక ఇబ్బందులను రాష్ట్రంలో ఉన్న దాదాపు అన్ని కాలేజీలు ఎదుర్కొన్నాయి. ఫీజు కట్టిన విద్యార్థుల సంఖ్యను సరిగ్గా చూపించకపోవడం, కట్టిన వారి పేర్లు కట్టని వారి జాబితాలో కనిపించడం, ఒకరి పేరుకు బదులు మరొకరి పేరు కనిపించడం వంటి 'అంతర్గత' సమస్యలు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బందికి మాత్రమే తప్ప బయటి ప్రపంచానికి తెలిసే అవకాశం లేదు. ఉన్నా అది పెద్దగా ఆందోళన పరిచే అంశమూ కాదు! ఫలితాలు అలా కావు కదా మరీ! అడ్మిషన్ల ప్రక్రియ నుండి పరీక్ష ఫీజు, ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతుండగా ఏర్పడిన సాంకేతిక సమస్యలు అన్ని ఇన్ని కావు.

పరీక్షలు అయిపోయాకా సాయంత్రం ఆన్‌లైన్‌లో మార్కుల ఎంట్రీ కోసం లాగిన్ అవడానికి పరీక్షలు నిర్వహించడానికి ఎంత సమయం పట్టిందో అంతే సమయం పట్టింది అంటే సమస్య ఎంత తీవ్రంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. తీరా ఫలితాల ప్రకటన నాటికి కూడా వందలాది విద్యార్థుల ప్రత్యేకించి ఒకేషనల్ విద్యార్థుల ప్రాక్టికల్ మార్కులు ఎంటర్ కాకపోవడంతో వారంతా ఫెయిల్ అయినట్టు మెమోల్లో రావడం వారిని మరింత కలవర పెట్టింది.

ఇదంతా ఒకవైపు జరుగుతుంటే బోర్డు ఉద్యోగుల అంతర్గత విభేధాలు ఈ స్థితికి దారితీసినవి అనే ప్రచారం కూడా జరిగింది. నిజానికి తెలంగాణా ఏర్పడక ముందు బోర్డుకు ప్రత్యేకంగా ఒక కార్యదర్శిని నియమించేది. సిలబస్, పరీక్షలు, మూల్యాంకనం, ఫలితాలు వంటి అంశాలు కార్యదర్శి పరిధిలో ఉండేవి. ఉద్యోగుల సర్వీసు, శిక్షణ వంటి అంశాలను పర్యవేక్షించేందుకు డైరెక్టర్/కమీషనర్ పేరుతో మరో అధికార స్థానం ఉండేది. ఈ రెండింటిని విలీనం చేసి ఇంటర్ బోర్డు కార్యదర్శి పేరుతో ఒక్కదాన్ని మాత్రమే ఏర్పరిచారు. ఏ శాఖ అవినీతికి అతీతం కాదన్నట్టే బోర్డు అధికారులేమి నిఖార్సయిన, నీతివంతమైన వారు కాదనేది నిష్ఠుర సత్యం. ఆందోళన, భయమంతా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ మీద ఉంటే ప్రభుత్వమేమో ఎలకలుంటే ఇల్లు తగుల బెట్టినట్టు అసలు బోర్డును రద్దు పరచాలని ఆలోచనలో ఉన్నది. తన జవాబుదేతనం నుండి తప్పించుకునేందుకు, ప్రజల దృష్టిని మరల్చేందుకు ఈ కొత్త చర్చను బలంగా బయటకు తోస్తున్నది.

కొనుక్కుని చదువులు, కార్పొరేట్ విద్య, మార్కెట్ మాయాజాలం అంతా విద్యార్థులను మనుషులుగా కాకుండా యంత్రాలుగా తయారు చేసే అమానవీయమైన విద్యా వ్యవస్థ పైన చర్చను నిరాకరిస్తున్నది ప్రభుత్వం. ప్రశ్నలను అసహనంతో అణచివేయ చూస్తున్నది.

మన రాష్ట్రం మన ప్రభుత్వం అని గర్వంగా చెప్పుకోవాలని ఊదరగొట్టిన నాయక గణ ఏలుబడిలో కొన్ని గురుకులాల పోస్టులు తప్పిస్తే ఒక్క బోధనా పోస్టు నియామకం కూడా తెలంగాణా రాష్ట్రంలో జరగలేదు. జూనియర్ కాలేజీల్లో దశాబ్దం క్రితం నియామకాలు జరిగినవి తప్ప 'మన' రాష్ట్రంలో దిక్కే లేదు. 404 పైగా జూనియర్ కాలేజీలు ఉన్న తెలంగాణాలో 6 వేలకు పైగా అధ్యాపకులు ఉండాల్సిన చోట శాశ్వత ప్రాతిపదికన పని చేస్తున్నది కేవలం 800 లోపే అంటే నమ్మి తీరాల్సిందే!

ఇది విద్య పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం. ఆత్మహత్యలు, పిల్లల ఎదుగుదలపై చదువు హింసాత్మకం అయిన పరిణామాలు మొత్తంగా విద్య వ్యవస్థ మౌలిక లోపాన్ని ఎత్తి చూపెట్టే మచ్చుతునకలు మాత్రమే. రాజకీయ జవాబుదారీతనం లేకుండా దబాయించడం, అణచివేత ధోరణితో వ్యవహరించడం అన్ని ప్రజాస్వామిక హక్కులను హరించడమే గాక విద్యను అందుకునే ప్రాథమిక హక్కును దూరం చేయడమే.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

ఉద్యమిస్తున్న విద్యార్థులపై కేసులు

విద్యార్థులు పోరాడి సాధించుకున్న తెలంగాణలో పాలకులు వాక్, సభా స్వాతంత్ర్యాలను కూడా అనుమతించకుండా ప్రశ్నిస్తున్న ప్రజాస్వామికవాదులను నిర్బంధాలకు గురిచేస్తున్నారని, దీన్ని ప్రజలు చైతన్యవంతంగా ఎదుర్కోవాలని అంటున్నారు లక్ష్మణ్ గడ్డం

తెలంగాణ రాష్ట్రంలో రాజ్యహింస పెచ్చరిల్లుతున్నది. ఎమర్జెన్సీ చీకటి రోజులను తలపిస్తుంది. హాలుకు పరిమితమైన సభలు, సమావేశాలను భగ్నం చేస్తున్నది. సమావేశ గదులకు తాళాలు వేస్తున్నది. ధర్నాలకు, ఆందోళనలకు పర్మిషన్ నిరాకరిస్తున్నది. అనుమతుల దగ్గర పక్షపాత ధోరణిని అనుసరిస్తున్నది. రాజనీతిని పక్కకు పెట్టి ప్రత్యామ్నాయ ఉద్యమాల ఎడల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నది. రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంఘిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర సమితి రెండవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్ట పగ్గాల్లేకుండా వ్యవహరిస్తున్నది. ప్రజల మీద నిర్బంధాన్ని ప్రయోగించడంలో చెలరేగిపోతున్నది. ప్రతి చిన్న సమస్య దగ్గర క్షణాల్లో వందలాది మంది పోలీసులు వచ్చి వాలుతున్నారు. ప్రజాస్వామిక బద్ధంగా తమకు జరిగిన అన్యాయానికి నిరసన వ్యక్తం చేయాలనుకున్న మరు క్షణమే పోలీసులు దిగిపోతే నోటికాడి బుక్క గుంజుకున్నట్లుగా నిరసనకారులు బిత్తరపోయి చూస్తున్నారు. తేరుకునే లోపలే రోడ్డు మీద ఈడ్చుకెళ్లడంతో కర్తవ్యవిమూఢులవుతున్నారు. అసలు విషయం మరుగునపడి పోలీసుల చేతివాటం చర్చకు మిగులుతుంది.

వరవరరావును, ప్రొ. సాయిబాబాలతో పాటు మరో 10 మందిని దేశ వ్యాప్తంగా అరెస్టు చేసి అక్రమంగా జైల్లో నిర్బంధించడం అన్యాయమని, ఏ నేరానికి ఒడిగట్టని వీరిని వెంటనే విడుదల చేయాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ భవన్‌లో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) ఏప్రిల్ 13న సభ నిర్వహించ తలపెడితే పోలీసులు ఆ భవన్‌కు తాళాలు వేసి సభను భగ్నం చేశారు. ఆఫీస్‌కు తాళం వేసే అధికారం పోలీసులకు ఏ చట్టాలిస్తున్నాయి. విచిత్రంగా ఏ ఆఫీసు కేంద్రంగా నైతే తెలంగాణ కోసం ఉద్యోగుల పోరాటం ఉధృతంగా సాగిందో ఇప్పుడు అదే ఆఫీసుకు తెలంగాణ ఏర్పడిన తర్వాత తాళాలు వేయడం అత్యంత విశాధకరం. సభకు వచ్చిన వారిని వక్తలతో సహా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లలో నిర్బంధించారు. తెలంగాణలో హాలుకు పరిమితమైన సభలను నిర్వహించుకోవడం నేరమవుతుంది. మరీ విచిత్రంగా ఈ భవన్ కేంద్రంగా ఉద్యమాన్ని ఉగ్రరూతలూగించిన ఉద్యోగ సంఘాల నాయకులు పాలకుల్లో కలిసిపోయి వారి ఆఫీసుకు తాళాలు వేసినా పెదవి విప్పకపోవడం మరింత శోచనీయం. తెలంగాణలో 2014 సెప్టెంబర్ 21న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక సభను భగ్నం చేయడం తెలంగాణ ప్రభుత్వం మొట్ట మొదటిగా మొదలుపెట్టి 2019 ఏప్రిల్ 13 డిటిఎఫ్ సభ భగ్నం వరకు కొనసాగుతుంది..

మే 14న మల్లన్న సాగర్ రిజర్వాయర్ కింద భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తున్నారా లేదా అని పరిశీలించడానికి వెళ్లిన పౌరహక్కుల సంఘం బృందాన్ని తోగుట గ్రామంలో అరెస్టు చేసి దౌల్తబాద్ పోలీస్ స్టేషన్‌లో నిర్భంధించారు. నిజానికి మల్లన్న సాగర్ కింద ముంపుకు గురవుతున్న 15 గ్రామాలు పోలీస్ క్యాంపులుగా మారాయి. ప్రజాస్వామిక వాదులనెవరినీ ఆ గ్రామాల్లోకి వెళ్లనివ్వడం లేదు.

దేశ వ్యాప్తంగా ప్రజలు డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలను జరుపుకోవడానికి సన్నద్ధమవుతున్న సందర్భంలో హైదరాబాద్‌లో పంజగుట్ట క్రాస్ రోడ్డులో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని 2019 ఏప్రిల్ 13న మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తొలగించి ముక్కలు చేసి చెత్తకుప్పలో పడేసి జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించారు. విషయం తెలిసిన అంబేద్కర్‌వాదులు ఆందోళనకు దిగారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఇందిరా పార్కు వద్ద నిరసనగా ధర్నా తలపెడితే పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో ఎంఆర్‌పిఎస్ రాష్ట్రంలో అన్ని అంబేద్కర్ విగ్రహాల దగ్గర ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. అందులో భాగంగా అంబర్‌పేట్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద తలపెట్టిన ధర్నాకు తరలివెళుతున్న మందకృష్ణ మాదిగను వందలాది మంది పోలీసులు చుట్టుముట్టి అదుపులోకి తీసుకొని ఆయన ఇంట్లో పడేసి గృహనిర్బంధం విధించారు. అసలు విషయమైన అంబేద్కర్ విగ్రహాన్ని ప్రభుత్వమే ఎందుకు ముక్కలు చేసి చెత్తకుప్పలో పడేసిందన్న విషయం మరుగునపడి పోలీసుల జులుం, మందకృష్ణ మాదిగ గృహ నిర్బంధం తెరపైకి వచ్చింది. అయితే అంబేద్కర్ విగ్రహాన్ని ఇప్పటివరకూ పునః ప్రతిష్టించలేదు.

గతంలో ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు 125 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని హైదరాబాద్‌లో ప్రతిష్టిస్తానని వాగ్దానం చేశారు. అందుకు గాను మంత్రులను అధ్యయనం కోసం విదేశాలకు పంపి ప్రచారం చేసుకున్నారు. ప్రజా ధనాన్ని వృథా చేశారు. కాని ఇప్పటి వరకు ఆ హామీ అమలు కాలేదు సరికదా ఉన్న విగ్రహాలను ప్రభుత్వమే కూల్చేస్తుంది. దళితులంటే, దళిత ప్రతినిధి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అంటే పాలకులకున్న గౌరవం ఈ చర్యలు బట్ట బయలు చేస్తున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి అంబేద్కర్ విగ్రహానికి ఏనాడు తన చేతులతో పూలమాల వేయని మొదటి ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోయాడు. ఒకప్పుడు అంబేద్కర్ జయంతి ఉత్సవాలు అట్టహాసంగా జరిగేవి. తెలంగాణ ఏర్పడిన తర్వాత అవి మొక్కుబడిగా, నిర్జీవంగా సాగడానికి

కారణం ప్రభుత్వమే. యజ్ఞాలు, యాగాలు, పూజలు, దేవాలయాల నిర్మాణాలు, పుణ్యక్షేత్రాల పేరుతో యాత్రలు మాత్రం ఆర్భాటంగా కొనసాగుతున్నాయి. రాజ్యాధినేతలు ఒక మతానికి చెందిన పూజా పురస్కారాలు నిర్వహించడం లౌకిక రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.

మళ్లీ అదే డిమాండు – వరవరరావు, సాయిబాబాలను విడుదల చేయాలని విద్యార్థి బృందాలు ముందుకు వచ్చాయి. తెలంగాణ విద్యార్థి వేదిక (టివివి) ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారాందోళన కార్యక్రమాలు చేపడుతూ ముగింపుగా ఇందిరా పార్కు వద్ద 2019 మే 17న ధర్నా నిర్వహించ తలపెట్టింది. కాని రాజ్యం మేధావుల విడుదల డిమాండునే నేరంగా చిత్రీకరించింది. వారిని విడుదల చేయాలని ఎవరు కోరినా సహించడం లేదు. విడుదల డిమాండ్ చేసిన వారిమీద కేసులు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు.

ఉపాధ్యాయులు అందించిన ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు తమ బాధ్యతగా ముందుకు తీసుకెళ్లాలనుకున్నారు. టివివి విద్యార్థులు తమ ప్రచారంలో భాగంగా శాతవాహన యూనివర్సిటీలో ఆందోళన నిర్వహించారు. దీనిని తీవ్రంగా భావించిన పోలీసులు వారిమీద తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించారు. ఈ విద్యార్థి సంఘాన్ని మావోయిస్టు అనుబంధ సంస్థగా ముద్ర వేశారు. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని, సంఘం కార్యక్రమాలకు మావోయిస్టులు నిధులు సమకూరుస్తున్నారని, అందుకుగాను వీరు ఈ యూనివర్సిటీలోని విద్యార్థులను మావోయిస్టులుగా మార్చి రిక్రూట్‌మెంట్‌కు పాల్పడుతున్నారని పోలీస్ కమిషనర్ కమలాసన్ రెడ్డి నిందలు మోపి కార్యక్రమాలను అడ్డుకున్నారు. పైగా సోషియాలజీ ప్రొఫెసర్ సూరెపల్లి సుజాత స్టడీ టూర్‌ల పేరుతో విద్యార్థులను అడవిలోకి తీసుకునిపోయి అన్నలకు కల్పిస్తున్నదని కూడా పత్రికా ముఖంగా ప్రకటించారు. పోలీసులు చెప్పినట్లుగా శాతవాహన యూనివర్సిటీ నుండి ఇప్పటివరకు ఏ ఒక్క విద్యార్థి కూడా నక్సలైట్లను కలిసినట్లుగా గాని, లేదా నక్సలైట్‌గా కన్వర్టయి కలిసిపోయినట్లుగా దాఖలాలు లేవు. విద్యార్థులు విద్యార్థులుగానే ఉన్నట్టుగా వారి అటెండెన్స్ రిజిస్టర్లు గాని, వారి ప్రొఫెసర్లు గాని చెప్పాలి గాని పోలీసులు నిర్ధారించే అంశం కాదిది.

విశ్వవిద్యాలయాల్లో పోలీసుల జోక్యం పెరిగిపోతున్నది. లేలేత ఆలోచనలు సంఘర్షించాల్సిన చోట పోలీసుల ఘర్షణలు అధికమయ్యాయి. పోలీసులు తామే సుప్రీం అనుకుంటున్నారు. తామే రాజ్యాధినేతలమనుకుంటున్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన తర్వాత ప్రజా ప్రతినిధులు మా గుప్పిట్లోకి వచ్చిపడుతున్నారని అనుకుంటున్నారు. నేరాలు నిర్ధారించేది, తీర్పులు చెప్పేది తామేనని నమ్ముతున్నారు. సమాజాన్ని తామనుకున్న ఆర్డర్లో పెట్టేది తామేనని అధికారం చేలాయిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, రాజ్యాధినేతలు తాము చేయాలనుకున్నది పోలీసులే నిర్వహిస్తున్నారు కదా అని చేతులు దులుపుకుంటున్నారు. ఫలితంగా పోలీసు రాజ్యం ఏర్పడి ప్రజలు విలవిల్లాడిపోతున్నారు.

టివివి విద్యార్థులు మే 2 నుంచి మొదలుపెట్టిన ప్రచార కార్యక్రమాలను 16 జిల్లాల్లో విజయవంతంగా కొనసాగించారు. ప్రతి జిల్లాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా మేధావులను విడుదల చేయాలని, పౌర, ప్రజాస్వామిక హక్కులను పరిరక్షించుకుందామని, రాజ్యాంగాన్ని కాపాడుకుందామని నినదించారు. అయితే వీరిని వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో పోలీసులు అరెస్టు చేశారు. అలా మొదలై విశ్వవిద్యాలయాలకు చేరుకుంది. తెలంగాణ యూనివర్సిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీల్లో విజయవంతంగా ముగించుకుని కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీకి మే 14న చేరుకున్నారు. ఇక్కడ కూడా ప్రచారం ముగిసింది. మరోవైపు 2019 మే 17న హైదరాబాద్‌లో ఇందిరా పార్కు వద్ద ధర్నా కోసం అనుమతి నిమిత్తం ధరఖాస్తు చేసుకున్నారు.

ఇంతలో 'నక్సలైట్ల బాధితుల సంక్షేమ సంఘం' అకస్మాత్తుగా పుట్టుకొచ్చి దుమారం రేపింది. దీనిని పోలీసులు సృష్టించారు. గతంలో నల్ల తాచులు, ఎర్ర తాచులు, కోబ్రాలు, నకిలీ ఎంఎల్ పార్టీలు సృష్టించిన చరిత్ర కలిగిన పోలీసులు ఇప్పుడు దీన్ని కూడా సృష్టించారు. ఈ నకిలీ సంక్షేమ సంఘం టివివి విద్యార్థులు శాతవాహన యూనివర్సిటీలో చొరబడి నక్సలైట్ల రిక్రూట్‌మెంట్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీంతో రంగంలోకి దిగిన ఎబివిపి విద్యార్థులు పోటీగా ఆందోళనలు నిర్వహించారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. నకిలీ సంఘం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. టివివి మావోయిస్టు పార్టీ అనుబంధ సంస్థ అని, నిధులు అక్కడి నుండే సమకూరుతున్నాయని, ప్రొఫెసర్ల సహకారం ఉందని తీవ్ర ఆరోపణలు చేశారు. పోలీసులు పరిశోధనాత్మకంగా పరిశీలించకుండానే వారి ఆరోపనలను ఆమోదించారు.

ఎక్కడా ఎదురు కాని ఈ విచిత్ర పరిణామంతో విద్యార్థులు గందరగోళానికి గురయ్యారు. ఖండనలు, ప్రతి ఖండనలతో వాతావరణం మారిపోయి మే 17 నాటి ఇందిరా పార్కు వద్ద ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించారు. అసలైతే నేను ముఖ్యమంత్రినైతే ధర్నాలు, ఆందోళనలకు అవకాశం లేకుండా చేస్తానని 2014లో చెప్పినప్పుడు నిజంగానే సమస్యలు లేకుండా చేస్తాడేమో అనుకున్న ప్రజలకు అధికారంలోకి వచ్చాక ధర్నా చౌక్‌ను రద్దుచేసి ధర్నాలు జరగకుండా చేశాడు. అయితే ప్రజలు పోరాడి ధర్నా చౌక్‌ను పునరుద్ధరించుకున్నారు. ఇప్పుడు ధర్నా చౌక్‌లో తెలంగాణ ప్రభుత్వం ధర్నాలకు అనుమతి నిరాకరిస్తున్నది. విచిత్రమేమంటే ఇదే ధర్నా చౌక్ ద్వారా ఇదే కెసిఆర్ ముఖ్యమంత్రి కాక పూర్వం ఎన్నో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించి తెలంగాణ సాకారానికి తోడ్పడ్డాడు. అధికారంలోకి వచ్చాక గాలి మాటల మూటలోకి ఇది కూడా చేరిపోయింది.

అనుమతి నిరాకరించడం వల్ల ప్రజాస్వామిక హక్కులకు ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు ప్రమాదం ఏర్పడుతుంది. ధర్నాలు కొనసాగాలా వద్దా అనేది రాజకీయ నిర్ణయం కావాలి కాని, పోలీసులెలా నిర్ణయిస్తారు? ధర్నాకు నక్సలైట్లు హాజరవుతారని పోలీసులు అనుమతి నిరాకరించారు. నక్సలైట్లను మన రాష్ట్రం నుండి తుడిచిపెట్టామని పోలీసులే కదా చెబుతున్నది. అయితే వేరే రాష్ట్రం నుంచి వస్తారేమో! వస్తే మంచిదే కదా! పోలీసులు అడవుల్లో కూంబింగ్ నిర్వహించి ప్రాణాలకు తెగించి పట్టుకోవాల్సిన నక్సలైట్లను ఇక్కడే ఏ శ్రమ లేకుండా సునాయాసంగా పట్టుకోవచ్చు కదా? ఇది ఎవరైన నమ్మదగిన కారణమేనా? టివివి విద్యార్థులను నక్సలైట్లతో జమకట్టి మాట్లాడడం చివరికి వారిని ఎక్కడికి నెట్టేస్తున్నారు? వారి భవిష్యత్తు జీవితాలేం కావాలి?

మాధ్యమిక విద్య మధ్యలో ఆగిపోతున్న ప్రాణాలు

పాలకులు ప్రభుత్వ విద్యను బలహీనపరుస్తూ కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తూ విద్యను మార్కులు, ర్యాంకులకే పరిమితం చేసి విద్యార్థుల బలవన్మరణాలకు కారణమవుతున్నారని అంటున్నారు బి. వేణుగోపాల్ రెడ్డి

విద్య వల్ల సమాజంలో ఎవరు ఊహించని విధంగా మార్పులు జరుగుతున్నా మారని 'విద్యా విధానం' వల్ల మనుషులే పతనమవుతున్నారు. పాఠశాల విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నత విద్యావకాశాలు అందిపుచ్చుకుంటారని అనుకుంటే మధ్యలోనే ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇంత విషాదం తరువాత కూడా ప్రభుత్వాలు ఇంటర్మీడియట్ విద్యను ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేయకపోవడం విచారకరం.

ఇంటర్మీడియట్ విద్యలో విద్యార్థుల ఆత్మహత్యలు కొత్తగా జరుగుతున్నవి కావు. ఆగిపోతాయన్న భరోసా కూడా లేదు. ఒత్తిడితో, మార్కులు రాలేదని, ఫెయిలయ్యామని, ఎంసెట్‌లో సీటు రాలేదని ప్రతి సంవత్సరం విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. గత ప్రభుత్వాల వైఫల్యాలు, కార్పొరేట్ విద్యా సంస్థల అక్రమ ధనార్జన, తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలకు విద్యార్థులు సమిధలవుతున్నారు.

మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ బలవన్మరణాలు ఇంకా ఎక్కువ అవుతున్నాయి. తల్లిదండ్రులకు ఆరని శోకాన్ని తెచ్చిపెడుతున్నాయి. కండ్ల ముందర బిడ్డలు చనిపోవడం ఎంత విషాదం. దీనికంతటికి కారణం ఈ మూడు 'ఇన్‌స్టిట్యూషన్స్' (ప్రభుత్వం, విద్యా సంస్థలు, కుటుంబం)ల బాధ్యతారాహిత్యమే. సామాజిక నియమాల విచ్ఛిన్నత (అనామిక్ కండీషన్స్) ఉత్పన్నం కావడం వలన పచ్చగా చిగురించాల్సిన బిడ్డలు తమను తాము అంతం చేసుకుంటున్నారు.

ఇంటర్మీడియట్ విద్య తరువాత ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యకున్న వ్యామోహం వల్ల ఇంజనీరింగ్, మెడిసిన్ చదువులే గొప్ప చదువులు. ఇవి చదివితేనే సమాజం గౌరవిస్తుంది అనే తప్పుడు భావన వల్ల ఇంటర్మీడియట్ విద్య విలువైనదిగా, సంపన్నమైనదిగా, అంగడి సరుకుగా చివరకు ఆత్మహత్యల కేంద్రంగా మారిపోయింది. ఏ మాత్రం మానవీయత లేని ఇంటర్ విద్య సమాజానికి అవసరమా? విద్యార్థుల నైపుణ్యాలను పెంచని ఎంసెట్ లాంటి అర్హత పరీక్షలు అవసరమా? ఇంజనీరింగ్, మెడిసిన్ సీట్ల కోసం లక్షలు పెట్టుబడి పెట్టి చదివిస్తున్న తల్లిదండ్రులు ఆ లక్షలను కోట్లను చేసే ఒక యంత్రాన్ని తయారు చేస్తున్నామనే స్పృహను కోల్పోయారు.

కార్పొరేట్ విద్యా సంస్థలకు ఇంటర్ విద్య కాసుల పంటగా మారింది. కేవలం రెండు సంవత్సరాల విద్య కోసం లక్షలు వసూలు చేస్తున్నారు. అపుడే ఎదుగుతున్న ఆ వయసు పిల్లల మీద ఆ చదువులు గుదిబండలుగా మారాయి. ఆ కాలేజీలు, కోచింగ్ సెంటర్లు పౌల్ట్రీ ఫారంల కంటే దారుణంగా తయారయ్యాయి. ఆ విద్యా సంస్థలు ప్రభుత్వాన్ని శాసించే స్థాయికి ఎదిగాయి. రాజకీయ పార్టీలకు ఆర్థిక వనరులుగా కూడా ఉపయోగపడుతున్నాయి. 'కోస్తా పెట్టుబడికి ఆలస్యంగా పుట్టిన బిడ్డ (లేట్ బేబీస్)'లే ఈ విద్యా సంస్థలు. తొందరగా పాలు మర్చి తెలంగాణ మధ్య తరగతిని దోచుకుంటున్నాయి. వీరిని చూసి తెలంగాణలోని అగ్రకులాలు చోటా మోటాగా ఇంటర్మీడియట్ కళాశాలను ఏర్పాటు

ధర్నా భగ్నం కావడంతో అదేరోజు ఆ సమయానికి టివివి విద్యార్థులు, చైతన్య మహిళా సంఘం, అమరుల బంధు మిత్రుల సంఘం, ప్రజాకళా మండలి కార్యకర్తలతో కలిసి 30 మంది ట్యాంక్‌బండ్, అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఇలాంటి నిరసన కార్యక్రమం పలు సంఘాలు అనేక సందర్భాల్లో చేపట్టడం అనవాయితీ. ఈ రూపం అనుమతి లేకుండానే కొనసాగుతుంది. కనుక నిరసనకారులు అర్ధగంటకు మించి కొనసాగించరు. తర్వాత అందరూ వెళ్లిపోతారు. కాని ఈ సారి పోలీసులు కక్షగట్టి నిరసన మొదలయ్యే సమయానికే అక్కడికి చేరుకుని కార్యకర్తలను ఈడ్చుకెళ్లి వాహనాల్లో పడేశారు. వివిధ పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారు. ఈ సారి నలుగురిని ఒక్క స్టేషన్‌లో ఉంచలేదు. అరెస్టు కాబడిన కార్యకర్తలు, విద్యార్థులు 32 మంది వరకు ఉన్నారు. వీరిలో 6 మంది స్త్రీలు ఉన్నారు. అందరి మీద సెక్షన్ 143, 341, 290, 186 కింద కేసులు పెట్టి కౌన్సిలింగ్ చేసి రాత్రి 10 గంటలకు వదిలిపెట్టారు.

ప్రజా మేధావులను వదిలి పెట్టాలన్న చిన్న డిమాండ్‌తో నిరసన తెలియజేస్తే ఇంత పెద్ద రాద్ధాంతం చేశారు పోలీసులు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. బడుగు బలహీన వర్గాల నుండి ఇప్పుడిప్పుడే విద్యకు దగ్గరవుతున్న విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర జరుగుతున్నది. ఈ వర్గాల నుండి చైతన్యవంతంగా ఆలోచించే వారిని, ప్రశ్నించే వారిని టార్గెట్ చేసి వేటాడుతుంది రాజ్యం. ఇలాంటి వేటలోనే రోహిత్ వేముల రాలిపోయాడు. అయినా కాని పాలకుల, పోలీసుల ఆలోచనలో మార్పులేదు. సహనంతో కూడిన ప్రజాస్వామిక దృక్పథం ఏర్పడని, అహంకారంతో కూడిన పాలకులున్నంత వరకు, ప్రజా రాజ్యాలు ఏర్పడనంత వరకు ఈ పరిస్థితులు కొనసాగుతాయి. నిర్బంధం ప్రయోగించి మాత్రమే పాలించగలమనుకున్న నిరంకుశ పాలకులు మాకొద్దనుకునే ప్రజా చైతన్యమొక్కటే పరిస్థితులను మార్చగలదు. మేధావులు, ప్రజా సంఘాలు ప్రజల చైతన్యం పెంచడానికి మరింత సృజనాత్మక కృషి చేయాల్సి ఉంది.

(రచయిత అధ్యక్షులు పౌరహక్కుల సంఘం) వీ

చేసుకున్నారు. లాంగ్ టర్మ్ కోచింగ్ సెంటర్లు మాత్రం విజయవాడ, గుంటూరు వాళ్లయే సుమా! ఈ విద్యా సంస్థలను పెట్టిన తెలంగాణలోని అగ్రకులాలు హిందుత్వ భావజాలాన్ని వ్యాప్తి చేసే సెక్షన్ కావడం గమనార్హం. వీరంతా వెనుకబడిన తెలంగాణను ఉద్ధరించడానికి వచ్చినవారు కాదు. వీరి కళాశాలలు నలంద, నాగార్జునలాంటి బుద్ధుడి సంప్రదాయానికి చెందిన పేర్లను, కొన్ని మెమోరియల్ కాలేజీలుగా వారి సొంత పేర్లను తగిలించుకున్నాయి. ఇవి డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజ్‌లుగా ఊరురా విస్తరించాయి. మధ్యతరగతి ఆశలను సొమ్ము చేసుకోడానికి వచ్చిన ఈ విద్యా సంస్థలు సుదీర్ఘంగా విద్యా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి.

మధ్య తరగతి, ఉన్నత వర్గాల పిల్లలు కార్పొరేటు విద్యా సంస్థలో సైన్సు సబ్జక్టులతో ఇంటర్ పూర్తిచేసి, ఎంసెట్‌లో సీటు రాకపోతే మళ్లీ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకొని మెడిసిన్, ఇంజనీరింగ్‌లో సీటును పొందుతున్నారు. నిరుపేదలకు ఈ చదువులు ఆర్థిక భారంగా మారాయి. ఆసక్తి ఉన్న విద్యార్థులు ప్రభుత్వ కాలేజీల్లో ఆర్ట్స్ సబ్జక్టులతో చదువును కొనసాగిస్తున్నారు. వివిధ కారణాలతో చాలామంది మధ్యలోనే ఆగిపోతున్నారు. దళితులు, ఆదివాసులకు విద్యనందకుండా చేసే కుట్ర దీనిలో దాగి ఉన్నది.

అదే ఇంటర్ విద్య పాఠశాలలోనే దొరికితే తమ చదువులు కొనసాగించి మంచి డాక్టర్‌లుగా, ఇంజనీర్లుగా సమాజానికి అందేవారు. ఈ విద్యకు దూరమైన నిరుపేద వర్గాలు మానవీయ శాస్త్రాలను, సామాజిక శాస్త్రాలను చదివి యూనివర్సిటీకి చేరుకున్నారు. వీరు రావడమే ఆలస్యం పాలకులు ఆ విద్యను కూడా భ్రష్టు పట్టించారు.

యూనివర్సిటీకి వచ్చిన చదువుకున్న మొదటితరం ఇంటర్ నుండి తాము చదివిన శాస్త్రాలకు ఎలాంటి విద్యావకాశాలు లేకపోవడంతో, కేవలం ఇంజనీరింగ్, సైన్సు సబ్జెక్టులు చదివిన ఉన్నత వర్గాల పిల్లలు మాత్రమే ఉపాధి పొందే స్థితి దాపురించడంతో ఈ పిల్లలు తీవ్ర మానసిక క్షోభను అనుభవించారు.

దీనికి విరుగుడుగా తెలంగాణ ఉద్యమాన్ని తమ భుజాలపైన మోశారు. సాధించుకునే తెలంగాణలో ఈ స్థితి ఉండకూడదని పోరాడారు. కాని నేడు జరుగుతున్నది ఏమిటి? తెలంగాణ సమాజం తీవ్ర నిర్లిప్తతలోనికి వెళ్లిపోయింది. ఏర్పడిన తెలంగాణ ఎట్లా ఉండాల్నో బ్లూ ప్రింట్ కాలబిలంలో పడిపోయింది.

కేవలం ఎంసెట్, నీట్, ఐఐటీలో అర్హతను సాధించడానికి ఇంటర్ విద్యను 'అంగడి సరుకు'గా మార్చుకున్న విద్యాసంస్థల కార్పొరేట్ దోపిడీకి అడ్డుకట్ట వేయకపోతే మార్కులే కొలమానంగా సాగే విద్యతో విద్యార్థులు ఎప్పటికి బలిపశువులవుతారు. 'ఒకటి, రెండు, మూడు ర్యాంకుల పంట, మా సంస్థ ప్రభంజనం' అంటూ ఊదరగొట్టే కార్పొరేట్ విద్యా సంస్థలు మార్కుల కోసం విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టించాయి. ఆ మార్కుల కోసం రాత్రి పగళ్లు విద్యార్థులను సానబెట్టి నరకం చూయించి, చివరకు పరీక్ష కేంద్రాలను కొని మాస్ కాపీయింగ్ జరిపించి మార్కులు తెప్పించడం పరిపాటిగా సాగుతున్నది.

విద్యార్థులకు ఏ మాత్రం ఉపయోగపడని, దేనికి కూడా అర్హతగా నిర్ణయించని ఇంటర్ మార్కులు కార్పొరేట్ సంస్థలకు పెట్టుబడిగా మారుతున్నాయి. విద్యార్థులు మానసిక క్షోభకు కారణమవుతున్నాయి. పుట్నాలలాగా మార్కులు వందకు తొంభై తొమ్మిది రావడం ఏమిటి? బాడర్ మీద ముప్పయి ఐదు, యాభై మార్కులతో కలెక్టర్లయినవారు ఉన్నారు. మార్కులతో విద్యను కొలవలేం. కాని ఇంటర్ బోర్డు కార్పొరేట్ విద్యాసంస్థల లబ్ధి కోసం ఇంటర్‌లో మార్కులను వందకు వంద ఇస్తున్నారు. మరి ఈ మార్కుల వల్ల విద్యార్థుల నైపుణ్యాలు ఏమైనా పెరిగాయా? అంటే ఏమి పెరగలేదు.

కార్పొరేటు విద్యాసంస్థల చొరబాటుతో ఇంటర్ విద్యావ్యవస్థ నాశనమైంది. అటువంటిది ఇంటర్మీడియట్ బోర్డులోకి ఏకంగా మార్కులు వేసే పని ప్రైవేటు సంస్థలకు ఇవ్వడం బాధ్యతారాహిత్యమే. పరీక్ష పేపర్లు దిద్ది ఎవరికి ఎన్ని మార్కులు వచ్చినాయో లెక్కించి వారికి మార్కులు వేసే చిన్నపనికి గ్లోబరీనా సంస్థ ఎందుకు? ఊర్లో గొర్లమంద కాసే ఎలమంద సరిపోతాడు కదా! జవాబుదారీతనంలేని సంస్థలు విద్యా వ్యవస్థలో చొరబడడం ఏమిటి? ఇంటర్ విద్యా బోర్డు స్వతంత్రంగా తనపని తాను చేసుకోలేదా? ప్రభుత్వ సంస్థలలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం గుట్టుగా కొనసాగుతున్నది అనే దానికి ఇది చిన్న ఉదాహరణ.

నిమిషం ఆలస్యమైతే విద్యార్థులను పరీక్షా కేంద్రానికి అనుమతించం అనే ప్రభుత్వం ఫలితాలను ఇంత నిర్లక్ష్యంగా ప్రకటించవచ్చునా? ప్రతి సంవత్సరం తప్పుల మీద తప్పులు చేస్తున్న ఇంటర్మీడియట్ బోర్డును గేటు ముందర విలపిస్తున్న విద్యార్థుల ముందు లక్షసార్లు ఉరి తీయాలి. నియమాలన్ని విద్యార్థులకు పెట్టి నిర్లజ్జగా తప్పులు చేస్తున్న ప్రభుత్వ విద్యాసంస్థల వైఖరి ఆక్షేపణీయం.

ఏ విద్యా సంస్థ కూడా చెప్పిన సమయానికి ఫలితాలు ప్రకటించలేదు. ఒకవేళ ప్రకటిస్తే తప్పుల కుప్పలుగా. ప్రశ్నపత్రంలో తప్పులు, మాస్ కాపీయింగ్, మార్కుల గణనలో తప్పులు, ఫలితాలలో అవకతవకలు – ఇట్లా ఎన్నో అవలక్షణాలతో ప్రభుత్వ విద్యాసంస్థలు అలరారుతున్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థల బాధ్యతారాహిత్యం ఇట్లా ఉంటే ప్రైవేటుస్వామ్యంలో కొనసాగుతున్న విద్యలో బాధ్యతతో కూడిన దోపిడిస్వామ్యం భయంకరం విహరిస్తున్నది.

నూటికి ఎనభై శాతం ఇంటర్ విద్య ప్రైవేటు యాజమాన్యాల గుప్పిట్లోకి వచ్చింది. మండలం, జిల్లా, పట్టణ కేంద్రాలలో, నగరాలలో చిన్న సందులలో నాలుగు క్లాసు రూములుండే భవంతులు కళాశాలలుగా మారిపోతున్నాయి. ప్రభుత్వం నిర్లజ్జగా ప్రైవేటీకరణను ప్రోత్సహించింది. సంపూర్ణ విద్య ఈ కళాశాలలో ఎండమావే. కేవలం ప్రభుత్వం నిర్వహించే పరీక్షలలో ఉత్తీర్ణులవడానికి మాత్రమే ఉపయోగపడతాయి. పదవ తరగతిలో అత్యధిక మార్కులను తెచ్చుకున్న కొంతమంది విద్యార్థులను ఉచిత విద్య, తక్కువ ఫీజులతో విద్యనందిస్తామని గాలం వేసే ప్రైవేటు కళాశాలలు రెండు సంవత్సరాలు ఆ విద్యార్థులపైననే దృష్టి కేంద్రీకరిస్తాయి. విధిగా వారికే ర్యాంకులు వస్తాయి. ర్యాంకులు వచ్చిన ప్రతిభా పాటవాలు గల విద్యార్థులను మళ్లీ ఎరగా ఉపయోగించుకొని తల్లిదండ్రులను, విద్యార్థులను ఆకర్షిస్తారు. రెండు ఆకులు ఎక్కువ చదివిన కార్పొరేట్ కళాశాలలు ర్యాంకులు వచ్చిన ఇతర విద్యాసంస్థలలో చదివిన విద్యార్థులను కొంటారు. వారికి వచ్చిన ర్యాంకులను తమ ఖాతాలో జమచేసుకుంటారు. ఆల్ ఇండియా ర్యాంకులు సాధించామని, స్టేట్

ర్యాంకులు సాధించామని ప్రచార మాధ్యమాల ద్వారా ఊదరగొడతారు. ఇది ఒక జూదంలా కొనసాగుతుంది. ర్యాంకుల పరుగుపందెంలో ఆహుతి అవుతున్న విద్యార్థులెందరో? అందరికి ర్యాంకులు ఎందుకు రావాలి. ఎవరి ప్రతిభ వారిది. ఎవరి రంగం వారిది. ర్యాంకులకు ప్రతిభకు సంబంధం లేనే లేదు. చిగురించే వయసులో ప్రతిభా పాటవాలు, నైపుణ్యాలు అంతమవుతున్నాయి. మాధ్యమిక విద్య మిథ్యగా కొనసాగుతున్నది.

ప్రైవేటు కళాశాలల సంగతే ఇట్లా ఉంటే ప్రభుత్వ కళాశాలల దీన స్థితి మరో విధంగా ఉంది. దళితులు, నిరుపేద విద్యార్థులు చదువుకునే కళాశాలలు పూర్తిగా నిర్లక్ష్య ధోరణితో కునారిల్లుతున్నాయి. కనీస సౌకర్యాల మాట అటుంచితే సరిపడే అధ్యాపకులు లేక ఇంటర్ విద్య అవస్థలు పడుతున్నది. ఇరవైయేళ్లుగా కంట్రాక్ట్ సిబ్బందితో ఇంటర్ విద్యను కొనసాగించడమేమిటి? ప్రపంచంలో ఎక్కడైనా ఇట్లా ఉంటుందా? నైపుణ్యాలు లేని అధ్యాపకులు, అడ్మిషన్ తీసుకొని పరీక్షకే హాజరయ్యే విద్యార్థులు వెరసి సర్కార్ అధీనంలో నడిచే ఇంటర్ విద్య తుంటరి విద్యగా కొనసాగుతున్నది. పాలకులే ప్రైవేటు విద్యా సంస్థల అధిపతులుగా కొనసాగడం వలన ప్రభుత్వం తన అధీనంలో నడిచే విద్యా సంస్థను క్రమంగా బలహీన పర్చింది. ఎదుగుతున్న భారతానికి విద్యను ఇవ్వడకపోవడమంటే ప్రభుత్వం తన కన్నును తాను పొడుచుకున్నట్లే. ప్రభుత్వ అధీనంలో నడిచే విద్యా సంస్థలలో విద్యార్థులకు చదువు రాకపోవడం, ప్రైవేటు యాజమాన్యాల చేతిలో నడిచే విద్యా సంస్థలలో విద్యార్థుల ఆత్మహత్యలు కొనసాగడం బాధాకరం. ప్రభుత్వం ఇంటర్ విద్యను ప్రక్షాళన చేయకపోతే ఒక బలహీన సమాజం సృష్టి జరుగుతుంది. పోరాటాల తెలంగాణ ఆత్మహత్యల తెలంగాణగా, వట్టిపోయిన తెలంగాణగా మారుతుంది.

ఇంటర్మీడియట్‌లోనే ఆత్మహత్య ధోరణులు అధికమవుతున్నాయి. టెన్త్, ఇంటర్ విద్యార్థి దశ సాఫీగా సాగాలి. ఒత్తిడితో కూడుకున్న దశగా మారడంతో ఏదో ఒక సందర్భంలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కొంతకాలంగా సాగుతున్న ఈ విద్యా విధానం వలన ఒక బలహీనతరం తయారైంది. లేట్ ఎయిటీస్ తరంలా 'పదండి ముందుకు పదండి తోసుకు పోదాం, పోదాం పైపైకి' లా లేదు. అందుకే సైకాలజీ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అంటూ మరో మూక వ్యాపారాన్ని విస్తరించింది. ఆత్మహత్యలకు కారణాలు తెలిసినపుడు వాటిని పరిష్కరించే మార్గాలు అన్వేషించాలి. విద్యా విధానాన్ని మార్చకుండా ఇదే చదవాలి, ఇట్లానే నడుచుకోవాలి అనే తత్వం విద్యా వ్యవస్థలో ఎక్కువైంది. ముందుగా తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పు రావాలి.

తక్షణమే ప్రభుత్వం విద్యా వ్యాపారాన్ని ప్రోత్సహించడం మానుకోవాలి. అంగడి సరుకుగా మారిన విద్యవల్ల మానవీయ సమాజం ఏర్పడదు. కావున కార్పొరేట్ విద్యా సంస్థలకు చరమ గీతం పాడాలి. ఇంటర్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలి. దీనివలన అందరికి సమాన విద్య అందుతుంది. మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితి దిగజారదు. కెజి టు పిజి విద్యా విధానం సాకారమయ్యే దిశగా అడుగులు వేయవచ్చు. ముఖ్యంగా టెన్త్ తరువాత విద్యను ముగిస్తున్న గ్రామీణ నిరుపేదలు ఆదివాసి పిల్లలకు తమ చదువును కొనసాగించుకునే గొప్ప అవకాశం దొరకుతుంది. తరువాత సులువుగా తమకు ఇష్టమైన ఉన్నత విద్యను కొనసాగించవచ్చు. దీనికోసం ఆదివాసి నాయకులు చాలాకాలంగా పోరాడుతున్నారు. ప్రిమిటివ్ ట్రైబ్‌లలో గ్రాడ్యుయేషన్ చేసినవారిని వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు.

రాష్ట్రంలోని చాలా ప్రైవేటు పాఠశాలలో చాలా ఏళ్ల నుండి సిబిఎస్ఇ విద్యా విధానమే కొనసాగుతున్నది. పూర్తిగా ఆ సెలబస్‌నే బోధిస్తున్నారు. కావున 10+2 విద్యా విధానం వలన ప్రభుత్వాలకు పెద్ద ఖర్చు ఉండదు. రెండు బోర్డులు అవసరం లేదు. రెండు సార్లు వార్షిక పరీక్షలను నిర్వహించే అవసరం లేదు. పిల్లల ఎదుగుదల, నైపుణ్యాలు తెలిసిన పిజిటి ఉపాధ్యాయులే బోధిస్తారు. విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఒత్తిడికి గురికారు. విద్యార్థులకు తీరిక సమయం చాలా ఉంటుంది. కావున వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెట్టడం ద్వారా ఇష్టమైన రంగాలలోకి ప్రవేశించవచ్చు. ఇప్పటిలా లక్షలు పోసి ఇంజనీరింగ్ చదివి తిరిగి ఆర్గానిక్ వ్యవసాయం చేస్తున్నట్లుగా కాకుండా ముందుగానే ఆ రంగాలలో కృషి చేయడం వలన కొత్త ఆవిష్కరణలకు దారులు వేయవచ్చు.

సమాజాన్ని నడిపించే సామాజిక శాస్త్రాలను, మానవీయ శాస్త్రాలను మర్చిపోవడం వలననే ఈ దౌర్భాగ్య స్థితి దాపురించింది. శరీరానికి అన్ని అంగాలు అవసరమైనట్లే సమాజానికి అన్ని శాస్త్రాలు అవసరం. గత కొంత కాలంగా ప్రభుత్వం ఒక్క ఇంజనీరింగ్ విద్యనే ప్రోత్సహించడం వలన రెండు తెలుగు రాష్ట్రాలు అవిటి సమాజాలుగా మారాయి. కనీస వసతులు లేని ఇంజనీరింగ్ కాలేజిలకు అనుమతులు ఇవ్వడం వల్ల అవసరం లేకున్నా ఇంజనీరింగ్ విద్యను ప్రోత్సహించారు. లక్షల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలు లేక, పనిలేక ఉన్నారు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం పుట్ట గొడుగుల్లా పెరిగిన ఇంజనీరింగ్ కళాశాలలను రద్దు చేసింది. అన్ని సబ్జెక్టులకు ఉన్నత విద్యావకాశాలున్నా ఉపాధి లేదనే కారణంగా చాలా కోర్సులను బోధించడం లేదు. ఆ సబ్జెక్టులు న్యాయనే అవగాహన విద్యార్థులకు లేదు. సోషియాలజీ, తత్త్వశాస్త్రం లాంటి కోర్సులను బోధించడం లేదు. మేధో వికాసం ప్రభుత్వానికి గిట్టదు. ప్రజలు ఎప్పుడు కుక్కిన పేనులా ఉండాలి అనుకునే ప్రభుత్వ ధోరణియే దీనికి కారణం.

యూరప్ దేశాలలో సాంకేతిక విద్యకు ఎంత ప్రాధాన్యమున్నదో అంతకంటే ఎక్కువ సామాజిక శాస్త్రాలకున్నది. అందుకే ఆ దేశాలు అన్ని రంగాలలో అభివృద్ధిని సాధిస్తున్నాయి. సామాజిక శాస్త్రాలకు ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయి. కావున తెలంగాణ మేధో సమాజం ఆ దిశగా ఆలోచించాలి. సామాజిక, మానవీయ శాస్త్రాలను మార్కుల కోసం కాకుండా విధిగా బోధించడం వలన ఆత్మహత్యలకు ప్రేరణగా మారుతున్న నేటి విద్యావ్యవస్థ తప్పులను సరిదిద్దుకోవచ్చు. ఎంతటి సమస్యలనైనా ఎదుర్కొనే ఉక్కు సంకల్పం, వజ్రంకన్న ధృడమైన చిత్తం కలిగిన మానవులుగా తీర్చబడతారు. గొప్ప ఉద్యోగం, సంపాదన కోసమే చదువులు అనే నానుడి పోవాలి.

గత కొంతకాలంగా విద్యా విధానంలో కొనసాగుతున్న దుష్పరిణామాలను చక్కదిద్దకుంటే విద్యా ప్రమాణాలు ఎన్నటికి మెరుగుపడవు. నిరంతరం తెల్లవాడి (యూరప్ దేశాల) అవసరాల కోసం సాగుతున్న విద్యా విధానంలో యువకిశోరాలు బలిఅవుతున్నారు. ఇకనైన ప్రభుత్వాలు కళ్లు తెరవాలి. లేకుంటే ఇవే తప్పులు నిత్యం పునరావృతం అవుతాయి.

(రచయిత పరిశోధక విద్యార్థి ఉస్మానియా యూనివర్సిటీ) వీ

సామ్రాజ్యవాద చదువులు మనకొద్దు

***ప్రభుత్వ విద్యను ధ్వంసం చేస్తూ, సామ్రాజ్యవాద అవసరాలను నెరవేర్చే విద్యను ప్రోత్సహిస్తూ, వస్తు సంస్కృతిని ప్రోత్సహిస్తూ పాలకులు విద్యార్థులను యంత్రాలుగా మారుస్తున్నారని అంటున్నారు* తక్కళ్లపల్లి సూరి**

తెలంగాణలో నేటికి 25 మంది ఇంటర్‌మీడియెట్ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకొన్నారు. వీరంతా పాఠశాల స్థాయిలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాల్గొన్న వారే కావడం గమనార్హం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని విద్యార్థులు ముఖ్యంగా నిస్వార్థంగా బతికించారు. 1400 పైగా విద్యార్థులు 2009 నాటి మలిదశ ఉద్యమంలో అమరులైనారు. 1969 నాటి తెలంగాణ ఉద్యమంలో 369 మంది విద్యార్థులు అమరులైతే, 2009 నాటి మలిదశ ఉద్యమంలో నాలుగు రెట్ల మంది విద్యార్థులు తమ అమూల్యమైన ప్రాణాలను ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఇచ్చారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ఆది, అంతిమ స్థాయి ఉద్యమాలన్నీ విద్యార్థులు నిర్వర్తించినవే కావడం విశేషం. విద్యార్థుల బలిదానాల మీద రాజకీయ అధికారాన్ని ఆక్రమించిన ఉద్యమ పార్టీ, ఉత్త రాజకీయ పార్టీగానే మారి, 25 మంది ఇంటర్‌మీడియట్ విద్యార్థులు గ్లోబరీన సంస్థ వల్ల ఆత్మహత్య చేసుకొన్నా, పాలకులకు, ప్రభుత్వానికి చింతన పట్టింపు లేదు. బంగారు తెలంగాణలో విద్యార్థుల బలిదానాలు ఇంకా కొనసాగడం తెలంగాణ సమాజం మొత్తంగా సిగ్గుపడవలసిన అంశం.

విద్యార్థుల మరణ వార్తను విన్న వెంటనే రక్తం పోటెత్తి ప్రవాహంలా ప్రసరణ జరుగుతుంది. విద్యార్థుల ఆత్మహత్యలకు, ప్రాణం నిలువెల్ల విలవిలలాడుతూ ఇదేనా బంగారు తెలంగాణ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కూడా విద్యార్థుల బలిదానాలు కొనసాగడమేనా అనే ప్రశ్నలతో హృదయం బరువెక్కింది. దీంతో తెలంగాణ రాష్ట్రంలో తమ బతుకులు బాగుపడుతాయని ఎదురుచూసే యువత, వారి తల్లిదండ్రులు తీవ్రమైన నిరాశకు లోనయ్యే అవకాశముంది. తమ పిల్లలు బంగారు తెలంగాణలో బంగారంలాంటి జీవితముందుందని ఆశపడ్డ తల్లిదండ్రులకు కన్నీళ్లు నిరాశ మిగిలాయి.

తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల ప్రాణాలకు కనీస విలువ లేకపోవడం చాలా బాధాకరం. ఎన్నికలకు, ఓట్లకు, సీట్లకు, ఇతర పార్టీ నేతలను, తమ పార్టీలోనికి రప్పించుకునే శ్రద్ధలో, కొంతమేరకైనా విద్యార్థుల బలిదానాలపై పాలకులకు పట్టింపులేదనేది తేలిపోయింది. నేటి విద్యా వ్యవస్థ మొత్తంగా బానిస ఆలోచన సమహారంగా మార్చివేయబడింది. విద్యవల్ల వ్యక్తుల వ్యక్తిత్వాలు మెరుగుపడడం లేదు. విద్య వల్ల వ్యక్తుల ఆలోచనలో, ఆచారణలో వృద్ధి కనిపించడం లేదు. సమాజం పట్ల బాధ్యత తపన పెంపొందడం లేదు. నేటి విద్యలో కేవలం పోటీని మాత్రమే, అనేక రెట్లు చేసి, వ్యాపార రంగానికి ఉపయోగపడే ముడి సరుకుగా యువత ఆలోచన మార్చబడింది. విద్య తెలివి తేటల కొలమానాలు మారిపోయాయి. ఏ మల్టినేషనల్ కంపెనీకి ఎక్కువ వేతనం ప్యాకేజితో ఉద్యోగం దొరికితే అదే తెలివి తేటల కొలమానంగా తమ ప్రచార సాధనాలు మంత్రదండ అస్త్రాలతో ప్రచారం చేస్తూ, అక్షరాస్యుల్ని, యువతను తమకు తెలియకుండానే, సామ్రాజ్యవాద ఆధిపత్య, ఆక్రమణ వ్యాపార సంస్కృతిని నరనరాల్లోకి తెలియకుండానే దింపేస్తూనే ఉన్నారు. స్వార్థ వ్యాపార సంస్కృతిలో యువతను భాగం చేస్తున్నారు. యువత తమలో దాగిన శక్తియుక్తిల్ని, సమాజంపట్ల ఉన్న సామాజిక బాధ్యతను కనుమరుగు చేసి, ఉత్త డబ్బును మాత్రమే సంపాదించే మర యంత్రాలుగా మార్చివేస్తున్నారు.

మానవ బంధాలకన్న, మనిషి విలువకన్న, వస్తు విలువలు, వస్తు బంధాలు పెనవేసుకుని పోతూనే ఉన్నాయి. వస్తు సేవలను ఉత్తమంగా, ఉన్నతంగా తీర్చిదిద్ది, మనుషుల బంధాల్ని, అనుబంధాల్ని కనుమరుగు చేస్తేనే సమాజంలో, సామ్రాజ్యవాదం బలోపేతమౌతుంది. మనుషుల అవసరాలు, కోరికలు, పద్ధతులు, ఆచార వ్యవహారాలు మార్కెటే నిర్ణయించే స్థాయిలో సామ్రాజ్యవాదం చొచ్చుకుపోతుంది. సామ్రాజ్యవాద శక్తుల అవసరాలే, నేటి సమాజ మనిషి అవసరాలుగా రూపాంతరం చెందింది. ప్రచార సాధనాలు, మీడియా, కవులు, కళాకారులు, విద్యార్థులు, ఉద్యోగులు మొత్తం సమాజంలో తొంబై శాతంపైగా వ్యక్తులు తమకు తెలియకుండానే సామ్రాజ్యవాద భావజాల వ్యాప్తిని పెంపొందించుకున్నారు. అంటే వారు నేర్చుకున్న విద్య, సమాజ సేవా బంధింత, సమాజ ఉన్నత విలువ బంధిత కరిక్యులం చట్రంలో చదువుకున్న సారం ఫలితమిది. విద్యా వ్యవస్థ కూకటి వేళ్లతో సహా విలువలు నశించి కుళ్లి కంపు కొట్టేలా చట్టాలు చేసి, మనిషి ఆలోచనలను వ్యాపారీకరణ చేసి, ధనం కేంద్రంగా, డబ్బు కేంద్రంగా, విలాసాల కేంద్రంగా, రాజకీయ అహంకార అధికార కేంద్రంగా, మనిషిని విచ్చలవిడి విచక్షణ రహితున్ని చేసి, సామ్రాజ్యవాదం జడలు విప్పి మన నట్టింట్లో, మన నెత్తిమీద విలయతాండవం చేసేలా చేశారు.

విద్యాలయాలన్నీ ప్రాథమిక పాఠశాల మొదలు, యూనివర్సిటీల వరకు సామ్రాజ్యవాద ముడి సరుకును తయారుచేసే ఉత్పత్తి సంస్థలుగానే మారిపోతూనే ఉన్నాయి. నేటి సమాజ మనిషి ఆలోచనే అతని శత్రువై కూర్చుంటుంది. మనిషి అవసరాలు మార్కెట్ అవసరాలుగా మారి, అవి తీరకుంటే, తన అవసరాలే తన శత్రువై తనలో దూరిపోతుంది. ఇందుకు ముఖ్య కారణం విద్య కరికులం సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో రూపుదిద్దుకోవడం. భావి సమాజం తరగతి గదిలో, రూపుదిద్దుకోవాలి, కాని రేపటి మార్కెట్ అవసరం ఈ తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుంది. ఇలాంటి విద్యను అభ్యసించడం వల్లనే సామ్రాజ్యవాద శక్తుల వ్యాపారాలు, అమితమైన లాభాలను తెచ్చిపెడుతాయి. ఒక దేశాన్ని, నాశనం

చేయాలంటే యుద్ధం అవసరం లేదు, ఆ దేశ విద్య కరిక్యులంలో సేవ పేరుతో, విద్య సంస్కరణ పేరుతో, ధన సహాయం పేరుతో, విద్య నాణ్యత పెంపు పేరుతో, అంతర్గత కుట్రపూరితంగా అభివృద్ధి నటనతో ప్రవేశించి దానిని అమలు చేస్తే, ఆ దేశం మొత్తం మానవ వనరుల్ని, యువత సమాజ సేవ వనరులన్నీ, సమాజానికి మంచి చేసే యువ సృజనను పూర్తిగా ధ్వంసం చేయవచ్చు. మన దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలన్నీ వాటి ఫలితమేనని చెప్పవచ్చును. ఇందులో పాలకులు ప్రధానంగా అంతర్గత రాజకీయ కుట్రదారుగా వ్యాపార శక్తులుగా, స్వార్థశక్తులుగా, భవిష్యత్ సమాజం పట్ల బాధ్యతరహితంగా దేశంలో, రాష్ట్రంలో విద్య సంస్కరణ పేరుతో జరిగే మార్పులన్నింటిని ఆహ్వానించి, దేశ అమూల్య వనరులైన యువతను, వారి ఆలోచనలను, అవసరాలను, పద్ధతులను, విలువలను మార్చి, వారిని సామ్రాజ్యవాద శక్తులుగా మార్చి వేస్తున్నారు. అందులో భాగంగానే యువతను అనేక వ్యసనాలకు బానిసలుగా మార్చుతున్నారు. డ్రగ్స్, గుట్కా, జట్కా, మట్కా, ఆల్కహాల్, హుక్కా, సెక్స్, ఇంటర్‌నెట్ మొదలగు అనేక అంశాల సామ్రాజ్యవాద అంతర్గత అంశాలుగానే పరిగణించాలి.

యువతను మొత్తంగా ఉన్మాద ఊబిలోకి నెట్టివేసి, వారిని దేశం గురించిగానీ, రాష్ట్రం గురించిగానీ, సమాజం గురించి గానీ, కుటుంబం గురించి గానీ, చివరిగా అతని భవిష్యత్ గురించి గానీ ఆలోచించే శక్తిని హరించి వేయడమే దీని లక్ష్యం. యువతలోనున్న నవ చైతన్యాన్ని సమాజంవైపు కాకుండా వ్యసనాల వైపు దారి మళ్లించి, వాళ్లలోని అమితమైన సృజనను కేవలం మల్టీ నేషనల్ కంపనీలకు లాభాలనిచ్చే వాంఛిత ఉద్దీపన చర్యలలో భాగంగా, కంపెనీలో ఉద్దేశ్యపూర్వకంగా ఊహించని సాలరీ ప్యాకేజిలకు తమ మేదస్సును, శక్తిని, సృజనను తాకట్టు పెడుతున్నారు. గొప్ప సాలరీ ప్యాకేజినే అమితమైన విద్య తెలివితేటలుగా అద్భుత రీతిలో ప్రచారం పతాకస్థాయిలో జరిగి, దేశం మొత్తం దానిగురించి చర్చించి, సమాజ శ్రేయస్సు మరిచే పన్నాగం దానిలో నిభిడీకృతమై ఉంది.

యువత కూడ ప్రభుత్వ ఉద్యోగాలు రాక, తమ దగ్గరనున్న చదువులతో ఆకలి తీరక, కూటి కోసం కోటి విద్యలలో ప్రభుత్వ పట్టా చదువులు చేరక బతుకుకోసం, కుటుంబాలను బతికించడం కోసం, వారికి ఇష్టం లేకపోయిన అనేక కంప్యూటర్ కొత్త, కొత్త ప్రోగాంలను పట్టుబట్టి మరీ నేర్చుకొని ఉద్యోగాలు సాధిస్తున్నారు. ప్రైవేట్, పెట్టుబడిదారుల సంపద మాత్రమే ఆకశాన్ని తాకేలా అభివృద్ధిలోకి వస్తుంది. ప్రభుత్వ పాఠశాలలైన, ప్రభుత్వ వైద్యశాలలైన, బి.ఎస్.ఎన్.ఎల్. లాంటి టెలికం కంపనీలైన నష్టాలే వస్తాయి. అందుకు ప్రభుత్వాలు, పాలకులు తమ పాలసీలతో, పెట్టుబడిదారుల తొత్తులై ప్రభుత్వ సంస్థల నిర్వీర్యానికి ఉద్దేశపూర్వకంగానే పూనుకొని, పైకి మాత్రం ప్రభుత్వ ఉద్యోగులను దోషులుగా నిలబెట్టుటకు సిద్ధమైనారు.

రాజకీయం, భూస్వామ్య కార్పొరేట్ పెట్టుబడి అనే రెండు అంశాలు, వాటి ఆదిపత్యం కోసం, అధికారం కోసం, ఎంతకు దిగజారడానికైన సిద్ధం చేస్తాయి. విలువలను నిలువున పాతరేయడానికైన, మానవత్వాన్ని అమాంతం ఉరి తీయడానికైన, నీతి, నిజాయితీని రాతిపొరల్లో దొరకకుండా పాతిపెట్టడానికైన, అసలు మనిషి తనాన్నే మరిచి మృగత్వాన్ని ఆహ్వానించడానికైనా, ప్రజలకు ఎంతటి ప్రమాదకర అంశాన్నైన, వారి మెదడులో చొప్పించడానికైన, సినిమా నటులే సిగ్గుపడేలా నటించడానికైన, అసాధ్యాలను, ప్రజా కంఠక అంశాలను తలకెత్తు కోవడానికైనా, మాయల ఫకీర్ల కంటే ఘనంగా గారఢీలు చేయడానికైనా, జాతిని, నీతిని, యువత భవితను, ప్రజల సంక్షేమాన్ని, మొత్తం మానవ వనరులను సైతం తాకట్టు పెట్టడానికైనా సిద్ధం చేస్తాయి. ఎందుకంటే రాజకీయ భూస్వామ్య కార్పొరేట్ పెట్టుబడి మహత్తర బీభత్స డ్రగ్ లాంటివి. అందుకే రాజకీయ నాయకులు పదవుల కోసం, అధికారం కోసం, ఆధిపత్యం కోసం, తమ స్వంత ప్రయోజనాలు కొనసాగింపు కోసం, దేశానికి, రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమైన అనేక సంస్కరణలు విద్యా వ్యవస్థలోకి ఆహ్వానించారు. ఆస్ ది సీడ్, సో ఆర్ ది ప్లాంట్ అనునట్లుగానే విద్య విత్తులోనే, మనకు పైకి కనిపించని పెను ప్రమాదాల్ని ఏర్చి, పేర్చి, కూర్చారు. విద్య దీర్ఘ ప్రయోజనకారి కావడం వల్ల, తక్షణమే దాని ఫలితం కనబడదు. విద్యలో జొరబడుతున్న మలినాలను అరికట్టకుంటే, కొన్ని తరాల మానవ సమూహాలు, యువతీ యువకులు, అనేక భ్రమలలోనే జీవనాన్ని కొనసాగించి, దేశానికి, మానవ సమాజానికి తీరని నష్టాన్ని మిగిల్చి, నిజాలను గ్రహించని మేధావులవుతారు.

ఏ దేశానికైన ప్రాథమిక విద్యనే చాలా ముఖ్యమైనది. అనేక సామ్రాజ్యవాద దేశాలు సైతం విద్యను ప్రజాస్వామిక విలువలతో, స్వేచ్ఛగా, సమానంగా, ఖచ్చితమైన నాణ్యత ప్రమాణాలతో అందిస్తుంది. అమెరికా, ఫ్రాన్స్, సింగపూర్, ఫిన్‌లాండ్, జపాన్, జర్మనీ, నార్వే, స్వీడన్ లాంటి దేశాల్లో విద్య ప్రజాస్వామిక వాతావరణంలో స్వేచ్ఛగా, స్వచ్ఛంద సేవ రంగంగా నాణ్యతతో కూడ విద్య కొనసాగుతూ అభివృద్ధిని సాధించుటకు ఉపయోగపడుతుంది. కాని మన దేశంలో ప్రభుత్వ విద్య విధ్వంసం, జరుగుతూ, విద్య ప్రైవేట్ పెట్టుబడిదారులకు కల్పవృక్షంలా మారిపోయింది. ఎక్కడ, విద్య విధ్వంసం జరుగుతుందో, అక్కడ జీవన విధానం విధ్వంసంలోకి నెట్టివేయ బడుతుంది, ఎక్కడ జీవన విధానం విధ్వంసం జరుగుతుందో, అక్కడ మానవ సమూహా విధ్వంసం పెరుగుతుంది. ఎక్కడ మానవ సమూహ విధ్వంసం పెరుగుతుందో, అక్కడ విలువల విధ్వంసం జరుగుతుంది. ఎక్కడ విలువల విధ్వంసం జరుగుతుందో అక్కడ అరాచక, రాజకీయవాదం ప్రభలుతుంది, ఎక్కడ అరాచక రాజకీయ వాదం పెరుగుతుందో అక్కడ అవినీతి, లంచగొండి తనం, స్వార్థం, అన్యాయం, అధర్మం, పెనవేసుకొని పెరుగుతూనే ఉంటాయి.

మానవ అద్భుత సంపదైన కీలకమైన మనిషి ఆలోచన సామ్రాజ్యవాదానికి బానిసలా మారుతుంది. సమాజ శ్రేయస్సు అంతరిస్తూ ప్రజా సంక్షేమం కోసం ఉపయోగపడే సృజన నిర్మూలించబడుతూ, కేవలం పెట్టుబడిదారీ, వ్యాపార సంస్కృతి పెరిగి వస్తు ప్రేమలు ప్రబలి, మానవ బంధాలు ప్రశ్నార్థకంగా మారుతాయి. అందుకే కార్మిక, కర్షక, విద్యార్థి, ఉపాధ్యాయ, మేధావులు, బాధ్యతయుత పౌరులు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక సంస్థలు, స్వచ్ఛంద, ఐక్య ఉద్యమాలు జరిపి, ఈ బానిస పెట్టుబడిదారుల, వ్యాపార చదువులు మన కొద్దనే ఐక్య పోరు నినాదమై, వ్యవస్థకు ఎదురు నిలబడాలి. అప్పుడే ఈ ఆత్మహత్యలు, ఆకలి చావులు పూర్తిగా అరికట్టబడుతాయి. సమసమాజ నిర్మాణం కోసం, ప్రజాస్వామిక విద్య, వైద్యం, ప్రజా సంక్షేమ కేంద్ర నిజమైన ప్రగతి పథకాలు ఉద్యమ స్ఫూర్తితో ఉధృతంగా పురోగమించినపుడే సాధ్యమవుతుంది. అలాంటి సమాజ నిర్మాణం ప్రజా పోరాటాల ద్వారానే సాధ్యపడుతుంది. వీ

(రచయిత ఉపాధ్యాయులు)

రైతు విత్తన హక్కుపై దాడి

రైతులపై కేసులు వేస్తూ వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్న బహుళజాతి కంపెనీలను వ్యతిరేకిస్తూ ప్రజలందరూ ఐక్యంగా రైతులకు అండగా నిలబడి ఉద్యమించాలని అంటున్నారు **డా. కొల్లా రాజమోహన్**

గుజరాత్ రాష్ట్రంలో పెప్సీ కంపెనీ రైతులపై రణానికి సిద్ధమయింది. అదేమంటే పేటెంట్ చట్టం అంటున్నది.

'పెప్సికో ఇండియా హోల్డింగ్ ఎఫ్ ఎల్ 2027' అని పిలవబడే బంగాళదుంప రకాలను పేటెంట్ చట్టం కింద నమోదు చేసుకున్నాం కాబట్టి తన అనుమతి లైసెన్సు లేకుండా ఎవరూ పండించడానికి వీలు లేదని పెప్సీ కంపెనీ అంటున్నది. ఈ బంగాళా దుంపలను ప్రత్యేకంగా 'లే' అనే పేరున చిప్స్ తయారీకి పెప్సీ కంపెనీ వాడుకుంటున్నది. ఈ చిప్స్‌ను ప్రత్యేక రకానికి చెందిన బంగాళాదుంపలతో తయారు చేస్తామని ఆ కంపెనీ చెబుతోంది. మేథోసంపత్తి హక్కుల వలన, డబ్ల్యుటిఓ ఒప్పందం వలన, పేటెంట్ చట్టం వలన తమకు మాత్రమే బంగాళా దుంపలపై హక్కులు ఉన్నాయని పెప్సీకో వాదిస్తోంది. ప్రైవేటు డిటెక్టివులను నియమించి రైతుల పంటల పై రహస్యంగా గూఢచారి చర్యలు జరిపింది. బంగాళాదుంపలను పండించే రైతుల వివరాలు సేకరించి 2018 నుండి కేసులు పెడుతున్న సంగతి అందరికీ తెలియదు. ఎందుకనో మీడియా తగిన ప్రచారం ఇవ్వలేదు.

ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో పెప్సీ కంపెనీ రైతులపై వేసిన కేసులు బహుళ ప్రచారం పొందాయి. నలుగురు రైతులు ఎఫ్.ఎల్ 2027 అని పిలవబడే బంగాళాదుంప రకాలను లైసెన్సు లేకుండా పండించడం, పెప్సీ కంపెనీ హక్కులను ఉల్లంఘించటమనీ, చట్ట విరుద్ధమనీ గుజరాత్‌లో అహమ్మదాబాద్ వాణిజ్య కోర్టులో రైతులపై కేసులను నమోదు చేసింది. కంపెనీ హక్కులను ఉల్లంఘించినందుకుగాను, ఒక్కొక రైతు ఒక కోటి ఐదు లక్షల రూపాయలను నష్టపరిహారంగా కంపెనీకి చెల్లించాలని కేసులో పేర్కొన్నారు. రైతులు ఆ పంటను పండించడంపై స్టే విధించింది. తమ సొంతమైన బంగాళాదుంప పంటను ఆ రైతులు వేశారట! నిజానికి బంగాళాదుంపలు ఆదిమకాలం నుంచి పండిస్తున్నారు. వీటిని పెప్సీ కంపెనీ కనిపెట్టలేదు. కానీ, ఉన్న బంగాళదుంపకు జెనెటిక్‌గా కొద్దిగా మార్పులు చేసింది. పేటెంట్ హక్కులు పొందింది. హక్కులు పొందిన విధానం వక్రమే కాదు, నేరం కూడా. పంటలోని ఒక బంగాళాదుంప లోని ఒక కణం లో కొద్దిగా మార్పు చేస్తేనే పెప్సీకో హక్కులు పొందితే, తరతరాలుగా ఆ పంటల్ని పండిస్తున్న వారికి ఇంకా ఎన్ని హక్కులు ఉండాలి? అయినా పెప్సీ కంపెనీ మాత్రం అంతర్జాతీయంగా కుదుర్చుకున్న డబ్ల్యుటిఒ, ట్రిప్స్, పేటెంట్ చట్టాలను, ఒప్పందాలను సాక్ష్యాలుగా చూపిస్తున్నది. తామే ఈ బంగాళా దుంపలను సృష్టించామని దబాయిస్తున్నారు. పండించిన ప్రతి రైతూ ప్రతి సంవత్సరం తనకు కప్పాన్ని రాయల్టీగా చెల్లించాలంటున్నారు.

ఈ రైతులందరూ 3-4 ఎకరాల భూమిని సాగుచేసుకుంటున్న చిన్న రైతులు. 2009 నుండి తమ పంటలో వచ్చిన మంచి విత్తనాలను దాచుకుని, ఆ విత్తనాలను నాటుకుని పంటను పండించుకుంటూ ఉండగా, ప్రైవేటు డిటెక్టివులు పంటను కొనే దళారీల వేషంలో వచ్చి శాంపుల్స్ తీసుకున్నారు. రహస్యంగా వీడియోలు చిత్రీకరించి అహమ్మదాబాద్ వాణిజ్య కోర్టులో కేసును ఫైల్ చేశారు. తమ కంపెనీ తయారు చేస్తున్న 'లేస్' బ్రాండ్ చిప్స్‌ను ఏ బంగాళా దుంపలతో అయితే తయారు చేస్తారో అలాంటి రకం బంగాళాదుంపలను ఈ రైతులు సాగు చేస్తున్నారని, వాటిని సాగు చేసే హక్కు తమకు మాత్రమే ఉందని పెప్సీకో వాదన.

బనస్కాంత, సబర్‌కాంత, అరవల్లి జిల్లాలలోని తొమ్మిదిమంది రైతులపై మేధోసంపత్తి హక్కుల ఉల్లంఘన కేసులు నమోదయ్యాయి. ఇందులో అయిదుగురు రైతులపై 2018 లోనే కేసులు పెట్టారు. అయితే 2018 లోనే కేసులు పెట్టినా వెలుగులోకి రాలేదు. సోషల్ మీడియా, మెయిన్ స్ట్రీమ్ మీడియా ప్రభావం వలన 2019 లో మొత్తం కేసులన్నీ భారత ప్రజల దృష్టికి వచ్చాయి.

ఎక్స్ పార్టీ డిక్రీ

ఏప్రిల్ 8న అలహాబాదు సిటీ సివిల్ వాణిజ్య కోర్టు జడ్జి మూల్చంద్ త్యాగి రైతులు కోర్టులో లేకుండానే, రైతులను విచారించకుండానే, రైతుల తరపున లాయర్ లేకుండానే పెప్సీ కంపెనీకి అనుకూలంగా ఎక్స్ పార్టీ డిక్రీ ఇచ్చారు. కంపెనీ వాదనలకు పివిపి యాక్ట్ సెక్షన్ 64, 65 ప్రకారం ప్రాథమిక ఆధారాలున్నాయన్నారు. మధ్యంతర ఉత్తర్వులను ఇచ్చారు. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకపోతే కంపెనీకి పూడ్చలేనంత నష్టం జరుగుతుందన్నారు. మధ్యంతర ఉత్తర్వుల అమలుకు కమిషనర్‌ను నియమించి, శాంపుల్స్ తీసి లాబొరెటరీకి పంపమన్నారు. కమిషనర్‌కు పోలీసు రక్షణను కూడా కల్పించారు. ఈ కేసులు దేశవ్యాప్తంగా సంచలనం రేపాయి.

ఎక్కడిదీ పెప్సీ కంపెనీ?

1965 లో రెండు కంపెనీల కలయికతో అమెరికాలో పెప్సీ కంపెనీ ఏర్పడింది. కాలక్రమంలో అనేక కంపెనీలను మింగేసి ఈనాటికి ఈ అవతారం ఎత్తింది. సోవియట్ యూనియన్‌లో కృశ్చేవ్ అధికారానికి వచ్చిన తరువాత అమెరికాతో దోస్తీ పెరిగింది. 1959లో అమెరికాలోని న్యూయార్క్ నగరంలో సోవియట్ సంస్కృతి-టెక్నాలజీ ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేశారు. రష్యాలోని మాస్కో పట్టణంలో వెంటనే ఏర్పాటు చేసిన అమెరికా ఎగ్జిబిషన్‌కు అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్, సోవియట్ ప్రధాని నికిటా కృశ్చేవ్‌లు హాజరయ్యారు. పెప్సీ కూల్ డ్రింకులను చప్పరిస్తూ సరదాగా మాట్లాడుకుంటున్న రెండు వ్యతిరేక వ్యవస్థల అగ్ర నాయకుల ఫొటోలు సోవియట్‌లో విపరీతంగా ప్రచారమయ్యాయి. ఆ దెబ్బతో సోవియట్ కూల్ డ్రింకుల కంపెనీలన్నీ దివాళా తీసి, తమ కంపెనీలను పెప్సీ కంపెనీకే అమ్ముకున్నాయి.

అలాగే రుమేనియా అధ్యక్షుడు సెసెక్యూస్‌తో ఫొటోలు దిగి 1966లో

రుమేనియా కూల్ డ్రింకుల కంపెనీలన్నీ దివాళా తీయించి, తనలో కలుపుకుంది. ఇపుడు, అరబ్ దేశాలు పెప్సీ కూల్‌డ్రింకులకు పెద్ద మార్కెట్. ఇజ్రాయల్ దేశస్థులు పెప్సీ కూల్ డ్రింకులను తాగితే, బద్ధ వైరం ఉన్న అరబ్ ప్రజలు పెప్సీని తాగరేమోనని 1991 వరకూ ఆ దేశాలలో పెప్సీ ఉత్పత్తులను ప్రవేశపెట్టనే లేదు.

కారప్పూస, మురుకులు, బూందీ, బికనీర్ భుజియా, ద్రాక్ష, సుగంధ పాలు, ఆరంజి, నిమ్మకాయ సోడా, గోలీ సోడాలను మింగేసింది. ఎత్తైనకొండ ప్రాంతంలోనైనా, కాకులు దూరని కారడవిలోనైనా పెప్సీ కూల్ డ్రింక్స్, కురుకురేలు, చిప్స్ దొరకని ప్రదేశం లేదు. విపరీతమైన అడ్వర్‌టైజ్‌మెంట్లతో, చిల్లరకొట్ల వ్యాపారులకు అధిక కమీషన్‌లతో ప్రజలను ఆకట్టుకుని, రంగు నీళ్లు, చిరు తిళ్లు అమ్మి ప్రజల జేబులను కొల్లకొడుతున్న కంపెనీలలో పెప్సీ కంపెనీ ముందుభాగాన ఉన్నది. ఇంట్లో వండుకుని తినే చిరుతిళ్ల అలవాటును మెల్లగా తప్పిస్తున్నారు. తెలుగు ప్రజల కారప్పూస, మురుకులు, బూందీ, పకోడీలు మాయమౌతున్నాయి. రాజస్థాన్‌లో ప్రజలు ఇష్టంగా తినే బికనీర్ భుజియాను కురుకురే బికనీర్ భుజియాని అని అందమైన ప్లాస్టిక్ పొట్లాలలో పెట్టి మారుమూల గ్రామాలకు కూడా అందిస్తున్నది. ఒక్క బికనీర్ భుజియా పెప్సీ కంపెనీ సొంతం కావడం వలన, బికనీర్‌లో 50 వేల మంది మహిళల జీవనోపాధి నాశనమయింది. 'కురుకురే మురుకులు' తెలుగు ప్రజలకు అందుబాటులో లేని ప్రదేశమేలేదు. ఈ విధంగా రంగునీళ్లు, చిరుతిళ్లు అమ్మి తన వ్యాపార సామ్రాజ్యాన్ని 200 దేశాలకు వ్యాపింపచేసి లక్షల కోట్లను సంపాదిస్తున్నది. లక్షల కోట్ల వ్యాపార సామ్రాజ్యం ఉన్న అతిపెద్ద ఆహార పానీయాల సంస్థ.

చిరుతిళ్లు, కూల్ డ్రింక్సు తయారుచేసే కంపెనీలలో పెప్సీ కంపెనీ అతి పెద్దది. అమెరికా దేశంలోని న్యూయార్క్ నుండి 200 దేశాలలో తన వ్యాపారాన్ని కొనసాగిస్తున్నది. మన దేశంలో 1989 నుండి వ్యాపారాన్ని కొనసాగిస్తూ లాభాలను పెంచుకుంటూ పోతున్నది. గత సంవత్సరం మన దేశం నుంచి పొందిన ఆదాయం 4.52 లక్షల కోట్ల రూపాయలు. మూడుచోట్ల చిరుతిళ్లు తయారుచేసే ఆహార ఫ్యాక్టరీలు, 38 చోట్ల కూల్ డ్రింక్సు తయారుచేసే ఫ్యాక్టరీలు ఉన్నాయి. దేశంలో 12 రాష్ట్రాలలో 24,000 వేల మంది రైతులకు లైసెన్సుపై బంగాళాదుంప విత్తనాలను అమ్మి, పెప్సీ కంపెనీ కాంట్రాక్టు వ్యవసాయం చేస్తున్నది.

ఆ సంస్థ గుజరాత్‌లోని తొమ్మిది మంది రైతులపై కేసులు పెట్టింది. వీరందరూ మూడు, నాలుగు ఎకరాలున్న రైతులే. వీరి వల్ల కానీ.. వీరు వేసే పంట వల్ల కానీ.. పెప్సీకో ఆర్థిక ప్రయోజనాలకు వచ్చే నష్టం ఏమీ లేదు. ఒకేళ ఉందనుకున్నా ఆ నష్టం నామమాత్రమే. అదే సమయంలో ఈ సామాన్య రైతులు ఓ మల్టినేషనల్ కంపెనీపై.. న్యాయపోరాటం చేయడం సాధ్యమా? పెప్సీ కంపెనీ భారతీయ కంపెనీ కాదు. అయినప్పటికీ మన దేశంలో మన రైతులపై దావా వేయడం ఏమిటి? అహ్మదాబాద్‌లో దాఖలైన ఈ పిటిషన్‌పై అక్కడి కోర్టు కూడా పెప్సీ కంపెనీకి అనుకూలంగా స్పందించింది.

రైతుల, దేశభక్తుల ఆగ్రహం

దేశంలోని రైతు సంఘాలు వెంటనే స్పందించాయి. రైతులపై కేసులను వెంటనే రద్దు చేయాలన్నారు. ముఖ్య పట్టణాలలో ప్రదర్శనలు చేశారు. పెప్సీ కంపెనీల ముందు ధర్నాలు చేశారు. పెప్సీ కంపెనీ ఉత్పత్తులైన లే చిప్స్, కురుకురే పొట్లాలను గుట్టబోసి తగలపెట్టి తమ కోపాన్ని ప్రదర్శించారు. 2009 నుండి సాగు చేసుకుంటున్న బంగాళాదుంపలపై 2016లో పేటెంట్ ఏమిటని ప్రశ్నించారు. భారత దేశరైతులను భయపెట్టి, బెదిరించి లొంగదీసుకోవడానికి కంపెనీ నాటకమని అన్నారు. పెప్సీ కంపెనీ చిరుతిళ్లను, కూల్ డ్రింకులను బహిష్కరించాలని పిలుపిచ్చారు.

గుజరాత్‌లోని రైతు సంఘాలు. మేధావులు, సభ్యసమాజ నాయకులు, సంఘసేవకులు, హక్కుల సంఘాలు, సంక్షేమ సంఘాలు, లాయర్ల సంఘాలు ఆగ్రహించారు.

అహ్మదాబాద్ పట్టణంలో 200 మంది రైతు నాయకులు, మేధావులు, ఒకచోట చేరి మీటింగు పెట్టుకున్నారు. రైతులకు అండగా నిలబడ్డారు. సంతకాలు చేసి ప్రభుత్వానికి పంపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల విత్తన హక్కులను రక్షించాలని డిమాండ్ చేశారు. వెంటనే జోక్యం చేసుకుని రైతులపై అబద్ధపు కేసులను ఎత్తివేయించమని ప్లాంట్ వెరైటీ ప్రొటెక్షన్ అండ్ ఫార్మర్ రైట్స్ సంస్థ ఛైర్‌పర్సన్ డా కె వి ప్రభు, రిజిస్ట్రార్ డా ఆర్.సి. అగర్వాల్‌కు, కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి రాధామోహన్ సింగ్‌కు మెమొరాండాలను పంపారు. రైతులకు, జిల్లా వ్యవసాయ అధికారికి నోటీసులు ఇవ్వకుండా, ముందస్తు అనుమతి లేకుండా రైతుల పొలాలలోనికి వెళ్లరాదని ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. జతన్ ట్రస్ట్ నాయకుడు కపిల షా కన్వీనర్‌గా అందరూ ఐక్యమై పెప్సీ కంపెనీకి హెచ్చరిక జారీచేశారు. కేసులను రద్దు చేయకపోతే పెప్సీ కంపెనీ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందన్నారు.

చట్టపరంగా కూడా రైతుకు విత్తనంపై సంపూర్ణ హక్కులున్నాయి. ప్లాంట్ వెరైటీ ప్రొటెక్షన్ చట్టం సెక్షన్ 39 ప్రకారం, (పివిపి ఆక్ట్ సెక్షన్ 39) రైతులకు పంట విత్తనాలపైకొన్ని ప్రత్యేకమైన హక్కులున్నాయి. బ్రాండెడ్ విత్తనాలు అమ్మనంతకాలం, ఏ విత్తనాలనైనా రైతులు సాగుచేసు కోవటానికీ, ఇతరులతో పంచుకోవటానికీ, ఇతరులకు అమ్ముకోవడానికి అవకాశం ఉంది.

పంటలో తీసిన విత్తనం నాదే

పెప్సీ, మోన్‌సాంటో, బేయర్ లాటి బడా బడా కంపెనీల విత్తన వ్యాపారం లోకి రాక పూర్వం రైతులు విత్తనాలు తయారు చేసుకోవడానికి, నిల్వ చేసుకోవడానికి, అమ్ముకోవడానికి ప్రపంచంలో ఎక్కడా ఏవిధమైన అడ్డంకులూ లేవు. విత్తన కంపెనీలు బలోపేతమై, ప్రభుత్వాలను శాసించే స్థాయికి ఎదిగిన తరువాత, తమకు అనుకూలమైన చట్టాలను చేయించుకుని, రైతుల పొట్టలను కొట్టి లెక్కలేనంత సంపదను పొందుతున్నారు. 'పంటలో తీసిన విత్తనం నాదే' అని ప్రపంచ వ్యాప్తంగా రైతులు తిరగబడుతున్నారు. పంట నుండి విత్తనాన్ని తయారు చేసుకునే హక్కును నిలబెట్టుకుంటున్నారు.

రాజీ ప్రతిపాదనలు

గుజరాత్ బంగాళాదుంప రైతులకు వ్యతిరేకంగా నడుస్తున్న కేసును పరిష్కరించుకునేందుకు కంపెనీ 26న రాజీ ప్రతిపాదనలు చేసింది. రైతులు, లేస్ చిప్స్‌లో ఉపయోగించే రిజిస్టర్డ్ బంగాళాదుంప రకం సాగుచేయకుండా కట్టడి చేయడానికి పెప్సికంపెనీ కొత్త ఎత్తు వేసింది. కేసులను పరిష్కరించుకునేందుకు రైతులకు కంపెనీ ఇచ్చిన గొప్ప అవకాశంగా పెప్సీ చెప్పుకున్నది.

అహ్మదాబాద్ కోర్టులో, పెప్సికో న్యాయవాది ఈ కేసుకు పరిష్కారంగా 3 షరతులను ప్రతిపాదించాడు.

1) రైతులు తమ రిజిస్టర్డ్ రకాన్ని బంగాళాదుంపల వెరైటీని ఉపయోగించరాదు. 2) రైతులు వారి ప్రస్తుత స్టాకును నాశనం చేయాలి.

3) పెప్సికో వ్యవసాయ గ్రూపులలో చేరి కంపెనీకి సంబంధించిన నిబంధనలను పాటించాలి.

రైతుల న్యాయవాది యాగ్నిక్ పెప్సీ ప్రతిపాదనను పరిశీలించడానికి సమయం కావాలని, కోర్టుకు చెప్పారు. తదుపరి విచారణ జూన్ 12కు వాయిదా వేశారు.

రైతుల హక్కుల చట్టం, 2001

పెప్సికో దావా వేయడానికి, ప్లాంట్ రకాలు, రైతుల హక్కుల (పిపివి & ఎఫ్ఆర్) చట్టం, 2001 లోని సెక్షన్ 64 ను ఉపయోగించారు.

రైతులు అదే చట్టం సెక్షన్ 39 ను ఉదహరించారు. 'తన వ్యవసాయ ఉత్పత్తికి విత్తనాలను దాచుకోవడం, వాడడం, విత్తనాలను నాటడం, తిరిగి నాటడం, మార్చుకోవడం, పంచుకోవడం లేదా విక్రయించడాన్ని, ఈ చట్టం కింద రైతు రక్షించబడతాడు. ఈ చట్టం అమలులోకి రాకముందు లాగానే రైతు హక్కులన్నీ ఉంటాయి. అయితే ఈ చట్టం కింద రక్షించబడిన 'బ్రాండ్ సీడ్' విక్రయించకూడదు.

దేశంలోని రైతుల పైన, పంటలపైన, ఆదాయాలపైన, ఆహారభద్రత పైన, వ్యవసాయ స్వాతంత్ర్యంపైన, దేశ సార్వభౌమాధికారంపైన ఈ కేసు విస్తృతమైన ప్రభావాన్ని చూపుతుందని 'ది హిందూ', 'వైర్', వామపక్ష పత్రికలు ప్రజలను అప్రమత్తం చేశాయి.

భారతదేశంలో రైతులకు వ్యతిరేకంగా ఈ కేసులో తప్పుగా నిర్ణయిస్తే రైతుల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం ఉండడమే కాకుండా ఒక తప్పుడు సంప్రదాయం అనవాయితిగా ఏర్పడుతుంది. బడా బహుళజాతి సంస్థలు విజృంభిస్తాయి. రైతులపై స్వారీ చేస్తాయి. ఇది ఒక పరీక్షా కేసు. రైతులు, రైతు సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు అప్రమత్తంగా వుండి రానున్న ప్రమాదాన్ని నివారించాలని వామపక్ష పార్టీలు, పత్రికలు పిలుపునిచ్చాయి.

కేసుల ఉపసంహరణ– రైతుల విజయం

పంటకు మూలమైన విత్తనంపై సహజసిద్ధంగావున్న రైతుల హక్కులను రక్షించటానికి యావత్ భారతదేశం మెరుపువేగంతో స్పందించింది. ప్రజల స్పందన, ప్రజలు ఆందోళనలకు సిద్ధంకావడం పెప్సీకంపెనీకి వణుకు పుట్టించింది. కోర్టులలో లిటిగేషన్ లాయర్ల సహాయ సహకారాలతో రైతులను భయపెట్టి కోర్టువెలుపల సెటిల్‌మెంట్ చేసుకోవడం బహుళజాతి కంపెనీలకు అలవాటే. రైతులపై కేసులను రద్దు చేసుకోవడం బహుళజాతి కంపెనీలకు ఒక కొత్త అనుభవం. దీర్ఘకాల విషయాలను ప్రభుత్వంతో చర్చించామని కంపెనీ చెప్తున్నా ప్రభుత్వ వర్గాలు నోరు విప్పలేదు.

రైతుల హక్కులను రక్షించడానికి భారత ప్రభుత్వం ఏ మాత్రం బాధ్యత వహించకపోవడాన్ని గమనించాలి. భారతదేశ ప్రభుత్వం రైతుల విత్తనస్వేచ్ఛలపైనా, చట్టపరమైన పరిస్థితిపైనా నిశ్శబ్దాన్ని కొనసాగించింది. ఎన్నికల రంగం మధ్యలో ఉండడం వలన భారతీయ జనతా పార్టీ నాయకత్వాన ఉన్న ప్రభుత్వం పబ్లిక్‌గా పెప్సీ కంపెనీ అనుకూల వైఖరి తీసుకోలేకపోయింది. లోపాయికారీగా పెప్సీ కంపెనీకి కేసులను రద్దు చేసుకోమని సలహా ఇచ్చిందనే ప్రచారం కూడా వుంది. పెప్సీ ఉత్పత్తులను కొనవద్దు అనే బాయ్‌కాట్ పిలుపు వలన కంపెనీ కూల్ డ్రింకులు, చిప్స్ అమ్మకాలు తగ్గుతాయేమోనని పెప్సీ కంపెనీకి భయం కలిగింది, కాబట్టి కేసులను రద్దు చేసుకొనివుండవచ్చు. భారతదేశంలోని రైతులు, రైతుసంఘాలు ఐక్యంగా రోడ్ మీదకు రావడం వలన పెప్సీకంపెనీకి తిరుగులేని దెబ్బ తగిలింది. సోషల్ మీడియా మరొక దెబ్బ తీసింది.

మదించిన ఏనుగులాంటి పెప్సీ కంపెనీ

ఏది ఏమైనప్పటికీ, మే 10, 2019: న అహ్మదాబాద్ లోని వాణిజ్య న్యాయస్థానంలో నలుగురు గుజరాత్ బంగాళాదుంప రైతులపైనా, మాడాసా జిల్లా కోర్టులో ఐదుగురు రైతులకు వ్యతిరేకంగా పెట్టిన కేసులనన్నిటినీ పెప్సికో ఇండియా కంపెనీ రద్దు చేసుకున్నది. ఏప్రిల్ 2019 లో సబర్కాంత జిల్లా రైతులపై దాఖలు చేసిన 4 సూట్ల రద్దుకు కూడా కంపెనీ దరఖాస్తు చేసింది. దావాలు ఉపసంహరించు కోవడం బహుళజాతి సంస్థలకు ఒక కొత్త పాఠం. మదించిన ఏనుగులాంటి పెప్సీ కంపెనీని రైతులు అంకుశంతో అదిలించడం, ఒక్క అడుగయినా వెనక్కు వేయించడం రైతులకు తాత్కాలిక విజయం.

అమెరికాలో మోన్‌సాంటో కంపెనీ రైతులపై పెట్టిన 700 కేసులను కోర్టు వెలుపలనే సెటిల్మెంటు చేసుకున్నది. అపరాధ రుసుమును వసూలు చేసుకున్నది. కానీ కేసులను రద్దు చేసుకోలేదు. రైతులపై కేసులను రద్దు చేసుకోవడం కంపెనీకి ఒక కొత్త అనుభవం.

ఈ విజయం వలన పోరాటం, ప్రచారం ముగిసిందని అర్థం కాదు. యుద్ధంలో సగం మాత్రమే విజయం లభించింది. ఫైనాన్స్ కేపిటల్ ఒక్క అడుగే వెనక్కుతగ్గింది.

అయితే బహుళజాతి కంపెనీలు ముఖ్యంగా రైతుతో వివాదాలలో ప్రపంచంలో ఎక్కడా వెనక్కు తగ్గడంలేదు. ఒంటి కాలు మీద లేచి కోర్టు కేసులు పెట్టి భయపెట్టి కోర్టు వెలుపల సెటిల్మెంటు చేసుకుని డబ్బులు వసూలు చేసుకుంటున్నారు. సెటిల్మెంటుకి రాని రైతులను కోర్టుల చుట్టూ తిప్పటం మామూలయింది.

ఇపుడు బేయర్ కంపెనీగా మారిన మోన్‌సాంటో కంపెనీ ఒక్క పేటెంట్ కేసులో కూడా ఓడిపోలేదు. ప్రభుత్వాలు, కోర్టులు కంపెనీలకు అనుకూలంగానే ఉండటం ఒక చారిత్రక సత్యం. ప్రజలు రోడ్డెక్కి ఆందోళనా మార్గం చేపట్టినపుడే న్యాయం గెలుస్తుంది.

వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న సబర్కాంతా, అరావళి, బనస్కాంతా రైతులకు వ్యతిరేకంగా దావాలను వెనక్కి తీసుకున్న మొదటి ఉదాహరణ ఇదే. బహుళజాతి కంపెనీ తన చట్టపరమైన దావాలను ఉపసంహరించుకోవటం చాలా అరుదు అని రైతుల న్యాయవాది ఆనంద్ యాగ్నిక్ అభిప్రాయపడ్డారు. అది కూడా పేద రైతులపై కొంతకాలం కోర్టులో కేసు నడిపించిన తర్వాత ఉపసంహరించుకోవడం ప్రపంచంలోనే అరుదు అన్న విషయాన్ని రైతు కార్యకర్తలు గమనించాలి. ఈ ఉపసంహరణతో, రైతులను భయపెట్టాలన్న, పెప్సికో దుష్ట ప్రయత్నం ప్రస్తుతానికి ముగిసింది.

ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) ఏర్పడిన తరువాత భారతదేశంలో మేధోసంపత్తి హక్కుల ఉల్లంఘన కేసులలో గుజరాత్ కేసులే ప్రథమం.

ప్రపంచంలోనే బలవంతమైన పెప్సీ కంపెనీ రైతులపై కేసులను రద్దు చేయడం రైతులకు, రైతు కార్యకర్తలకు, రైతు సంఘాలకు, దేశభక్తులకు, ఎంఎన్‌సి వ్యతిరేక పోరాటానికి గొప్ప విజయం. ఎందుకంటే భారతదేశంలోని రైతుల హక్కులు, ప్రయోజనాలు. బహుళజాతి సంస్థల హక్కుల కంటే చాలా ఉన్నతమైనవిగా ప్రజలు పరిగణించారు.

అయితే ఈ విజయం తాత్కాలికమే. భారతీయ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఫైనాన్స్ కేపిటల్ ఊరకుండిపోదు. మరో దెబ్బకు రెడీ అవుతుంది. ప్రజలు మరో విజయానికి రెడీ కావాలి.

(రచయిత నల్లమడ రైతు సంఘం సభ్యులు) వీ

మల్లన్నసాగర్ భూసేకరణలో కొత్తపరిణామాలు

కనీసం ఉన్న చట్టాలను అమలు చేయకుండా బలవంతంగా భూసేకరణ చేయడంకోసం జిఓ 123ని తెచ్చి మోసం చేయాలనుకున్న ప్రభుత్వాన్ని మల్లన్నసాగర్ రైతులు తమ పోరాటంతో లొంగదీసి 2013 భూసేకరణ చట్టం అమలుచేసేలా చేశారంటున్నారు **ఎస్. ఆశాలత**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల నీటిపారుదల ప్రాజెక్టులో భాగమైన మల్లన్నసాగర్ రిజర్వాయర్ గ్రామాలలో గత మూడు సంవత్సరాలుగా జరుగుతున్న ప్రజల పోరాటం కొత్త స్థాయికి చేరింది. ఇది బహుశా తెలంగాణ లోనే కాదు మరెక్కడా కూడా ఇంతకుముందు ఎన్నడూ జరగని పద్ధతిలో ఒకవైపు కోర్టులో మరొకవైపు క్షేత్రస్థాయిలో ఒకేసారి సమన్వయంతో జరుతున్న పోరాటం. తెలంగాణలోనే మొట్టమొదటిసారిగా న్యాయ పోరాటం ఫలితంగా 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఉపాధి కోల్పోతున్న వ్యవసాయ కూలీలు పునరావాసం కింద నష్టపరిహారం అందుకున్నారు. ఈ రిజర్వాయర్ కింద ముంపుకు గురవుతున్న అన్ని గ్రామాల వాళ్లు భూములిచ్చేశారు. ఇక ప్రాజెక్టు పనులు పూర్తిచేయడానికి ఎటువంటి అడ్డంకి లేదు అని అధికారులు ఊపిరి పీల్చుకోవడానికి అవకాశం లేకుండా ఆ గ్రామంలో పరిణామాలు ప్రతి రోజూ ప్రతి గంట కొత్త మలుపు తిరుగుతున్నాయి. ప్రాజెక్టుల కోసం జరిగే భూసేకరణలోనూ పునరావాసం, పునః స్థాపన ప్రక్రియలలో ఎన్ని ప్రహసనాలు జరగవచ్చో, ఎన్ని రకాల అవకతవకలు, ఉల్లంఘనలు, ఎన్ని రకాల ప్రతిఘటనలు జరగవచ్చో, అన్నీ మల్లన్నసాగర్‌లో జరిగాయి, ఇప్పటికీ జరుగుతున్నాయి. బ్రోకర్ల బేరసారాలు, ఒకప్పుడు ఈ పోరాటాన్ని బలపరచిన రాజకీయ నాయకుల రంగుమార్పుటాలు, అవతలి గట్టుకు దాటడాలు ఇవేవీ ప్రజల పట్టుదలను నీరు గార్చలేదు. ఇవన్నీ పోలీసు పహారా మధ్య తీవ్ర నిఘా మధ్య జరుగుతున్నప్పటికీ ప్రజలు విజయం సాధిస్తుండడం ఇక్కడి విశేషం. దానిని చూసి తెలంగాణలోని ఇతర ప్రాజెక్టుల గ్రామాల ప్రజలు కూడా స్ఫూర్తి పొందుతున్నారు. ఇది తెలంగాణ చరిత్రలో ప్రాజెక్టుల భూసేకరణ విషయంలో ప్రత్యేకంగా లిఖించదగిన ఒక అధ్యాయంగా మిగిలిపోతుంది.

మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలు మొదటి నుండీ కూడా ప్రాజెక్టు కోసం జరిగే భూసేకరణలో 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చారు. 2015 చివరలో మొట్టమొదటి సారి ప్రభుత్వం మల్లన్నసాగర్ రిజర్వాయర్ కోసం ఆర్డిఓ కార్యాలయంలో భూసేకరణకు నోటిస్ అంటించినప్పుడు దాని ప్రభావిత గ్రామాల్లో కలవరం లేచింది. ప్రాజెక్టుకోసం భూములిచ్చేది లేదని ప్రజలు నిబ్బరంగా ప్రకటించారు. ఈ లోపు ప్రభుత్వం 2015 జూలైలో భూసేకరణ చట్టాన్ని కాదని జిఓ 123ని తీసుకొచ్చి దాని ప్రకారం ప్రాజెక్టు కోసం సేకరిస్తున్న భూములకు మాత్రమే నష్టపరిహారాన్ని ఇచ్చే విధంగా భూసేకరణ చేస్తున్నట్లు ప్రకటించింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం వెళితే ప్రాజెక్టు పనులు చాలా ఆలస్యం అవుతాయని, దానిని ఎట్టి పరిస్థితులలో అమలు చేయమని జిఓ 123 ప్రకారమే చేస్తామని అప్పటి భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఖరాఖండిగా ప్రకటించాడు. అనేక ప్రజా పోరాటాల ఫలితంగా వచ్చిన 2013 భూసేకరణ, పురవాసం, పునస్థాపనలో న్యాయబద్ధమైన నష్టపరిహారం, పారదర్శకత హక్కు చట్టంలో భూములకు నష్టపరిహారంతో పాటు అసలు ప్రాజెక్టు కావాలో వద్దో చెప్పే హక్కు, సామాజిక ప్రభావ అంచనా వంటి అనేక అంశాలున్నాయి, రెండు పంటలు పండే భూములను ప్రాజెక్టు కోసం సేకరించేటప్పుడు మరే దారి లేనప్పుడు ఆఖరి అవకాశంగా మాత్రమే చేయాలనీ, ప్రాజెక్టు కారణంగా జీవనోపాధి కోల్పోయే ప్రాజెక్టు ప్రభావిత ప్రజలకు, ఒంటరి మహిళలకు, 18 ఏళ్లు నిండి ప్రతి ఒక్కరినీ విడికుటుంబంగా పరిగణించి న్యాయబద్ధమైన నష్టపరిహారం అందించాలని చెబుతుంది. వీటన్నిటినీ దాటవేయడం కోసమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చట్టాన్ని కాదని జిఓ 123 తీసుకొచ్చింది. అప్పటి ఉమ్మడి మెదక్ జిల్లా కలెక్టర్ ఈ గ్రామాలకు వచ్చి సమావేశం నిర్వహించి చట్టం ప్రకారం వెళితే ప్రజలు నష్టపోతారు, నష్టపరిహారం ఆలస్యం అవుతుంది, అందుకే జిఓ ప్రకారం భూములు ఇవ్వాలని ఉపదేశించి వెళ్లాడు. అయినా గానీ ప్రజలు భూములు ఇవ్వటానికి వెంటనే సిద్ధపడలేదు.

రాంపూర్, లక్ష్మాపూర్, బ్రాహ్మణ బంజరుపల్లి, ఏటిగడ్డ కిష్టాపూర్, వేములఘాట్, పల్లెపహాడ్, ఎర్రవల్లి, సింగారం అనే 8 గ్రామాలు పూర్తిగా ముంపుకు గురవుతుంటే మరొక నాలుగు గ్రామాలు రెండు తండాల వారు భూములు కోల్పోతున్నారు. మొత్తం 16000 ఎకరాల భూమి ప్రాజెక్టు కింద ముంపుకు గురవుతున్నది. అప్పట్లో దాదాపు అన్ని గ్రామాల్లో ప్రజలు టెంట్లు వేసుకుని ప్రాజెక్టుకు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్షలు చేశారు, పాదయాత్రలు చేశారు, వంటా వార్పూ చేసి నిరసన ప్రకటించారు. అప్పటి నుండి ఇప్పటివరకు ప్రజా ప్రతినిధులు, పార్లమెంటు సభ్యులు, సంబంధిత మంత్రులు ఎవరూ ఆ గ్రామాలలోకి అడుగు పెట్టడానికి సాహసం చెయ్యలేదు. సామాజిక కార్యకర్తలు, పరిశోధకులు, న్యాయవాదుల సహాయంతో ఈ గ్రామాల ప్రజలు 2013 చట్టం గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఉపయోగించిన సామ, దాన, భేద, దండోపాయాలు ఫలితంగా కొన్ని గ్రామాలలో ఒత్తిడికి బెదిరింపులకు, ప్రలోభాలకు లోనై జిఓ 123 కింద భూములివ్వడానికి సిద్ధపడుతున్నట్లు సంతకాలు చేశారు. అయితే వేములాఘాట్ గ్రామంలోని మెజారిటీ ప్రజలు మాత్రం 900 రోజులకు పైగా నిరవధిక రిలే నిరాహార దీక్షలు చేశారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు వల్ల నష్టమే కానీ లాభంలేదనీ, ప్రాజెక్టుకు భూములివ్వబోమనీ, 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలనే ప్రధాన డిమాండ్లతో ఈ పోరాటం సాగింది. ప్రజా సంఘాలు, హక్కుల సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు, ప్రజాస్వామికవాదులూ, రచయితలు, జర్నలిస్టులు, అధ్యాపకులు, ఉద్యమకారులు ఈ పోరాటానికి గట్టి మద్దతు తెలియజేశారు. జిఓ 123 ప్రకారం వేగంగా భూసేకరణ పూర్తి చేయాలన్న ప్రభుత్వానికి వేములఘాట్ పోరాటం పెద్ద ఎదురుదెబ్బగా నిలిచింది. ఆ పోరాటానికి నాయకత్వం వహిస్తున్న వారిని

తీవ్రంగా బెదిరించారు, వారికి పెద్ద మొత్తంలో లంచాల ప్రలోభం చూపారు, లొంగకపోయేసరికి గ్రామంలోనే పోలీసు క్యాంప్ పెట్టారు. ఆగ్రామాలలోకి ప్రవేశించే రెండువైపులా ప్రధాన రహదారుల వద్ద నిత్యం పోలీసు పహారా పెట్టి గ్రామాలలోకి వచ్చిపోయేవారిపై తీవ్ర నిఘా ఉంచారు. వాళ్ల గ్రామాలలోకి వాళ్లు వెళ్లాలన్న కూడా గుర్తింపు కార్డులు చూపించాల్సి వచ్చేది.

ఈ గ్రామాలలోని కొద్ది మంది భూమి ఉన్న రైతులను, ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న కొంతమందిని వారిని స్థానిక ఏంఎల్ఏ, మంత్రి పిలిపించుకుని నయాన భయాన ఒప్పించి భూములు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని వారు పత్రికా ప్రకటనలు ఇచ్చే ఎత్తుగడలు అవలబించారు. అత్యధిక శాతం ప్రజలు, ముఖ్యంగా మహిళలు ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నా అన్ని గ్రామాల ప్రజలు భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని హైదరాబాదు నుండి వెళ్లిన కొంత మంది వ్యక్తులు, రాజకీయ పార్టీలు వారిని రెచ్చగొట్టి ఇవ్వవద్దని చెబుతున్నారని దారుణమైన ఆరోపణలు చేస్తూ వచ్చారు. దీనికి నిరసనగా జాతీయ రహదారి పై రాస్తారోకో చేయటానికి 2016 జూలై 24న ఊరేగింపుగా బయలుదేరిన వేములఘాట్ ప్రజల పై వందలాది మంది పోలీసులు విరుచుకు పడి అమానుషంగా లాఠీ చార్జ్ చేసారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు అని కూడా చూడకుండా రక్తం కారేటట్లు కొట్టారు, బూటు కాళ్లతో తన్నారు. మహిళలు కొందరు స్పృహ తప్పి పడిపోయారు, కొందరికి ఎముకలు విరిగాయి. ఉద్యమంలో కీలక పాత్ర వహిస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని పేరు పేరున బూతులు తిడుతూ దారుణంగా కొట్టారు. వేములఘాట్‌కు ఎర్రవల్లికి మధ్య మూడు చోట్ల లాఠీచార్జ్ జరిగింది. వేములఘాట్ గ్రామానికి చెందిన 160 మందికి తీవ్రంగా దెబ్బలు తగిలాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసే వారందరికి ఇదే గతి పడుతుందని బెదిరించడానికే ఇంత క్రూరంగా విరుచుకుపడ్డారు. అయితే ఈ పాశవిక దాడి వేములఘాట్ గ్రామ ప్రజల దృఢ సంకల్పాన్ని నీరు గార్చలేక పోయింది. వాళ్లు మరింత పట్టుదలగా తమ పోరాటాన్ని కొనసాగించారు.

ఈ పోరాటం అంతటిలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది ఆ గ్రామాల మహిళల పాత్ర. మొదట నుండి ప్రాజెక్టు కోసం భూములు ఇవ్వొద్దు అనడంలో మహిళలే గట్టిగా నిలబడ్డారు. భూములన్నీ ఎక్కువగా పురుషుల పేరు మీద ఉండడంతో వాళ్లు ప్రలోభాలకు లొంగి భూములివ్వడానికి సంతకాలు చేయటానికి సిద్ధపడినప్పుడు మహిళలు భూములివ్వడానికి వీలులేదని మగవాళ్లతో ఘర్షణ పడ్డారు. బయట మీడియాలో పురుషుల అభిప్రాయాలే ఎక్కువగా కనిపించినప్పటికీ రిలే నిరాహార దీక్షలలో, పాదయాత్రలలో, సమావేశాలలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నది మహిళలే, దెబ్బలు తిన్నది కూడా ఎక్కువగా వాళ్లే. ఒకవైపు వ్యవసాయ పనులు చేసుకుంటూనే వంతులవారీగా నిరాహార దీక్షలలో కూర్చున్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో పెద్ద ఎత్తున పాల్గొని రాష్ట్ర సాధనలో పాత్ర వహించిన తమ భూములను ప్రభుత్వం తీసుకోవడాన్ని, తమపై పోలీసు నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని జీర్ణించుకోలేక మహిళలు పెద్ద ఎత్తున కదిలారు. ముఖ్యమంత్రిని నేరుగా విమర్శిస్తూ పాటలు కట్టి పాడారు. పోరాటంలో భాగంగా హైదరాబాదులో రౌండ్ టేబుల్ సమావేశాలలో, పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొన్నారు, ఆర్‌డిఓ, కలెక్టర్ కార్యాలయాల ముట్టడిలో పాల్గొన్నారు. మహిళలు ఇంత పెద్ద సంఖ్యలో కదలడానికి ముఖ్య కారణం ప్రాజెక్టులో గ్రామాలు ముంపుకు గురయితే అందరికంటే ఎక్కువగా నష్టపోయేది వాళ్లే కనుక. భూములు కోల్పోయి, భూములకిచ్చిన కొద్దిపాటి నష్టపరిహారంతో బయట భూములు మళ్లీ కొనుక్కునే పరిస్థితిలేక పొట్టచేత బట్టుకుని వేరే ప్రాంతాలకు వెళితే మహిళల బతుకు దుర్భరమవుతుందని వారికి తెలుసు. ముఖ్యంగా వృద్ధులు, భర్తలు చనిపోయిన, వదిలేసిన ఒంటరి మహిళలు ఎటువంటి ఆధారం లేకుండా గ్రామాలను ఖాళీ చేసి కొత్త చోటకు వెళ్లడం అనేది వారికి మింగుడుపడలేదు. అందరికంటే ఎక్కువ నష్టపోయేది భూమిలేని మహిళా వ్యవసాయ కూలీలు. వారికి జిఓ 123 ప్రకారం ఎటువంటి నష్టపరిహారం అందదు. వాళ్లు ఖాళీ చేతులతో ఊరు విడిచి పోవాల్సి ఉంటుంది. అందుకే 2013 భూసేకరణ చట్టాన్ని అమలుచేయాలనేది వారి పోరాటంలో ప్రధాన డిమాండ్‌గా నిలిచింది.

ఇక ఈ మొత్తం ఉద్యమంలో ప్రధానంగా చెప్పుకోవాల్సింది కోర్టులలో జరిగిన న్యాయ పోరాటం గురించి. కాళేశ్వరం ప్రాజెక్ట్ కింద నిర్మిస్తున్న 22 రిజర్వాయర్ల కోసం, ఇంకా అనేక ఇతర సాగుతున్న భూసేకరణలో అనేక అవకతవకలు వెలుగులోకి వచ్చాయి, అసలు జిఓ 123 చట్టబద్ధతే ప్రశ్నార్థకం అయింది. దీనితో అన్ని ప్రాజెక్టుల ప్రభావిత ప్రజలు కోర్టును ఆశ్రయించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల నుండే 190కి పైగా కేసులు వేశారని, వాటిలో 80 వరకు మల్లన్నసాగర్ గ్రామాల వారివేనని తెలుస్తున్నది. ఇక జహీరాబాద్ సమీపంలో స్థాపించ తలపెట్టిన నేషనల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ మాన్యుఫాక్చరింగ్ జోన్(ఎన్ఐఎంజెడ్) కోసం జిఓ 123 ప్రకారం 12000 ఎకరాలను సేకరించటానికి ప్రభుత్వం 2016లో ప్రయత్నాలు మొదలు పెట్టింది. అక్కడి గ్రామాలకు చెందిన 22 మంది మహిళా వ్యవసాయ కూలీలు ఈ జిఓ కింద భూసేకరణ చేయడం వల్ల జీవనోపాధి పోతున్నా ఎటువంటి నష్టపరిహారం అందడంలేదని కోర్టుకెళ్లారు. చాలా వాదోపవాదాల జరిగిన తర్వాత 2017 జనవరిలో హైకోర్టు ఆ జిఓ 2013 భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నదనీ, ప్రభుత్వం ఒక ప్రయివేటు రియల్‌ఎస్టేట్ వ్యాపారిలాగా పని చేయకూడదనీ వ్యాఖ్యానిస్తూ దానిని కొట్టివేసింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారమే భూసేకరణ జరిపి పునరావాసం కల్పించాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇది అలిగే తుక్కమ్మ, జయమ్మ తదితర వ్యవసాయకూలీలు సాధించిన పెద్ద విజయం. దాని ప్రభావం మల్లన్నసాగర్ తదితర ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల ప్రజలకు కూడా న్యాయ పోరాటం చేయడానికి మంచి బలంచేకూర్చింది. ఆ తర్వాత మల్లన్నసాగర్ గ్రామాలలో అనేక విషయాలపై హైకోర్టులో కేసులు వేశారు. ప్రతి ఉల్లంఘనను ప్రశ్నిస్తూ కేసులు దాఖలయ్యాయి. దీనంతటిలో ప్రజల ప్రతిఘటనా స్ఫూర్తిని గుర్తించకుండా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రాజెక్టును ఆపడానికి కేసులు వేయిస్తున్నదని దుష్ప్రచారం చేసింది. సేకరించిన భూమికి పూర్తి నష్టపరిహారం ఇవ్వడంతో పాటు 2013 భూసేకరణ చట్టం ప్రకారం అర్హులైన వారందరికీ పునరావాసం, పునఃస్థాపన నష్టపరిహారం అందించడం పూర్తి అయ్యేవరకు ప్రాజెక్టు పనులు ప్రారంభించవద్దని కోర్టు అనేక సార్లు స్టే అర్డర్లు ఇచ్చింది. కానీ అధికారులు ఆ ఆదేశాలను ఉల్లంఘిస్తూ భారీ యంత్రాలతో కాలువల తవ్వకాలు, పంట భూములలో తవ్వకాలు చేసి టిప్పర్ల ద్వారా పెద్ద ఎత్తునమట్టి రవాణా, ఇంకా అనేక పనులు చేయసాగారు. దీనితో ఆ గ్రామాల ప్రజలు ఎప్పటికప్పుడు పనులు జరగకుండా వాహనాలను అడ్డుకున్నారు. చాలా చోట్ల అధికారులు పోలీసు బందోబస్తు కల్పించి కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతూ పనులు జరగడానికి సహాయపడ్డారు. దీనికి

వ్యతిరేకంగా ఈ గ్రామాల ప్రజల తరపున తిరిగి కోర్టు ఉల్లంఘన కేసులు దాఖలయ్యాయి. నష్టపరిహారం ఇచ్చే క్రమంలో అర్హులైన వారికి కాకుండా బ్రోకర్లు, స్థానిక నాయకుల ప్రమేయంతో తప్పుడు సాక్ష్యాలతో అనర్హులైన వారికి నష్టపరిహారం ఇప్పిస్తూ పెద్ద ఎత్తున అక్రమాలు, ఉల్లంఘనలు జరిగాయి. వాటి గురించి అక్కడ పోరాటానికి నాయకత్వం వహించిన వారు ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి మీడియా దృష్టికీ తీసుకెళ్లి వాటిని ఆపడానికి ప్రయత్నం చేశారు. దీని గురించి ముఖ్యమంత్రికి ఒక లేఖ కూడా రాశారు. దీనితో కలెక్టర్ జోక్యం చేసుకుని అనర్హులకు నష్టపరిహారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించాడు.

మల్లన్నసాగర్‌కు సంబంధించిన ఈ న్యాయ పోరాటంలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది ఏటిగడ్డకిష్టాపూర్‌కి చెందిన వ్యవసాయ కూలీలు వేసిన కేసు. ఆ గ్రామానికి చెందిన 93 మంది వ్యవసాయ కూలీలు(వారిలో ఎక్కువగా మహిళలు) ప్రాజెక్టు కోసం జరిగే భూ సేకరణలో తాము ఉపాధి కోల్పోతున్నామని తమకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ 2018లో పిటిషన్ వేశారు. ఆ కేసు విచారణ జరుగుతున్న సమయంలో కేసులో మొదటి పిటిషనర్ నాయిని సరిత ఇంకా మిగిలిన మహిళా వ్యవసాయ కూలీలను కేసు ఉపసంహరించుకోవాలని పోలీసులు అనేక సార్లు బెదిరించారు. అయినప్పటికీ భయపడకుండా వాళ్లు గట్టిగా నిలబడ్డారు. ఈ కేసు విచారణ పూర్తయిన తర్వాత, ఉపాధి కోల్పోతున్న వ్యవసాయ కూలీలకు ఇతరులకు నష్టపరిహారం చెల్లించాలని హైకోర్టు ఉత్తరువు ఇచ్చింది. నిజానికి ఇది ఒక చారిత్రాత్మకమైన తీర్పు. ఇది ఆ ఒక్క గ్రామానికే కాక మిగిలిన అన్ని ముంపు గ్రామాలకు కూడా వర్తిస్తుంది. ఇది తెలంగాణలో మొట్టమొదటి సారి మల్లన్నసాగర్‌లోనే జరగడం విశేషం. మొదటి నుండి 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయడానికి తీవ్ర విముఖత తెలియజేసిన ప్రభుత్వానికి ఇది పెద్ద ఎదురు దెబ్బ. అలాగే తెలంగాణలో అనేక ప్రోజెక్టుల కోసం భూసేకరణ జరుగుతున్న ప్రాంతాలలో కూడా ఇదే విధంగా వ్యవసాయ కూలీలకు నష్టపరిహారం అందించడానికి మార్గం ఏర్పడింది. ముందెన్నడూ లేని విధంగా భూమిలేని మహిళా వ్యవసాయ కూలీలు న్యాయపోరాటం ద్వారా చట్టరీత్యా తమకు అందవలసిన నష్టపరిహారాన్ని సాధించుకున్నారు. దీని ప్రకారం భూమిలేని వ్యవసాయ కూలీలు ఒక్కొక్కరికీ 7.5 లక్షల రూపాయలు అందాయి. దీని అమలులో కూడా మళ్లీ అనేక అవకతవకలు జరిగాయి. పునరావాసం పునస్థాపన నష్టపరిహారం చెక్కులు అందించే సమయంలో అధికారులు వారిచేత అనేక చోట్ల అంగీకార (కన్సెంట్) సంతకాలు తీసుకుంటున్నారు, ఆ పత్రాలన్నీ ఆంగ్లంలో ఉండడంతో చదువురాని వ్యవసాయ కూలీలు సంతకాలు చేయడానికి నిరాకరించి ఆ 93 మంది పిటిషనర్లలో 36 మంది చెక్కులు తీసుకోకుండా తిరిగి కోర్టుకెళ్లారు. వారి వాదనలను పరిశీలించి కోర్టు అంగీకార పత్రాలను తెలుగులో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించింది. ఆ 36 మందికి రావలసిన చెక్కులను కోర్టులో డిపాజిట్ చెయ్యాలని ప్రభుత్వం తరపున వాదిస్తున్న అడిషనల్ అడ్వకేట్ జనరల్‌ను ఆదేశించింది. దాని ప్రకారమే ఆ చెక్కులు పిటిషనర్ల తరపు న్యాయవాదికి అందించగా ఆయన చేతితో ఆ చెక్కులను వారికి అందించడం జరిగింది. ఈ విధంగా కోర్టులో వేసిన అనేక పిటిషన్లలో హైకోర్టు పలుమార్లు ప్రభుత్వాన్ని, ప్రభుత్వం తరపున వాదిస్తున్న అడ్వకేట్ జనరల్‌ను అధిక్షేపించి మొట్టికాయలు వేసింది.

రిజర్వాయర్ కింద ముంపుకు గురయ్యే 8 గ్రామాల పరిస్థితి ఇట్లా ఉంటే భూములు మాత్రమే సేకరించబడిన ప్రాజెక్టు ప్రభావిత గ్రామాలలో భూములకు మాత్రమే నష్టపరిహారం అందింది. 2013 చట్టం ప్రకారం ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల ప్రజలకు కూడా జీవనోపాధి కోల్పోతున్నారు కాబట్టి జీవనభృతి నష్టపరిహారం కల్పించాల్సి ఉండగా దానిని అసలు అధికారులు పట్టించుకోవడం లేదు.

ఇక్కడ చెప్పుకోవాల్సిన మరొక విషయం ఏమిటంటే మొదటినుండి 2013 చట్టాన్ని అమలుచేయాలి అని డిమాండ్ చేస్తూ ఉద్యమానికి నాయకత్వం వహిస్తూవచ్చిన దాదాపు 40 మంది భూమికి భూమి ఇవ్వాలని ఇప్పటికీ డిమాండ్ చేస్తున్నారు, ఇది 2013 భూసేకరణ చట్టంలోని ప్రధానమైన నష్టపరిహార అంశం. వాళ్లు ప్రాజెక్టు కోసం భూములిస్తున్నట్లు సంతకాలు చేయకుండా నష్టపరిహారం తీసుకోకుండా ఈనాటికీ గట్టిగా నిలబడ్డారు. వారు తమ పోరాటాన్ని చివరికంటా కొనసాగిస్తున్నారు.

ఒకవైపు అడుగడుగునా పోరాటం చేస్తూ చట్టపరంగా తమకు దక్కవలసిన హక్కులను పొందుతున్నప్పటికీ నష్టపరిహారం పూర్తిగా అందిన తర్వాత ఊళ్లు ఖాళీ చేసి ఎక్కడికి వెళ్లాలో ఆ గ్రామాల ప్రజలకు అగమ్య గోచరంగా ఉంది. ముట్రాజ్‌పల్లి అనే గ్రామంలో వారందరికీ డబుల్ బెడ్‌రూం కోసం 250 గజాల స్థలం కేటాయించి ఇళ్లు కట్టించి ఇస్తామని అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రజలకు హామీ ఇస్తూ వచ్చారు. అయితే ముట్రాజ్‌పల్లి గ్రామంలో వీరికి ఇళ్లు కట్టడానికి కేటయించిన స్థలం వివాదంలో ఉన్నదని కొంత కాలం అక్కడ నిర్మాణం జరగలేదు. ముంపు గ్రామాల ప్రజలకు అక్కడ ఇల్లు కట్టడాన్ని స్థానిక ప్రజల నుండి వ్యతిరేకత ఎదురై మరికొంత ఆలస్యం జరిగింది. ఇప్పటికింకా ఇళ్ల నిర్మాణం పూర్తికాలేదు, భూములకు ఇళ్లకు నష్టపరిహారం తీసుకున్నవారు నోటీసులు ఇచ్చిన నెల రోజులలోపు ఊళ్లు ఖాళీ చేయాలని అధికారులు ప్రకటిస్తున్నారు, మరొక 6 నెలల్లో కొత్త ఇళ్ల నిర్మాణం పూర్తవుతుంది, అంతవరకు అద్దె ఇళ్లలో ఉండడానికి ఇళ్లు కేటాయించబడిన ఒకొక్క కుటుంబానికీ రు. 50,000 ఇస్తామని చెబుతున్నారు. ఇది ఇప్పుడు తిరిగి ప్రజలలో కలవరం రేపుతున్నది. ఒకసారి ఊరు విడిచి చెట్టుకొకరు పుట్టకొకరుగా బయటకు వెళ్లిపోతే ఇప్పటివరకు కలిసి పోరాడినవాళ్లు ఒంటరిగా అయిపోతామనే భయం నెలకొంది. ఎన్నో దశాబ్దాలుగా ఈ గ్రామాలలో ఉంటున్న వాళ్లు చురుగ్గా సాగుతున్న ప్రాజెక్టు పనుల వల్ల దుమ్ము ధూళి నిండిపోయి తమ కళ్ల ముందే ఊళ్లు, పంట పొలాలు మట్టి దిబ్బలుగా మారడం చూడలేక వేదన చెందుతున్నారు. నష్టపరిహారం అందని చాలా మంది వృద్ధ మహిళలు, ఒంటరి మహిళలకు భవిష్యత్తు అగమ్య గోచరంగా ఉంది.

మొత్తం మీద మల్లన్నసాగర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల ప్రజలు దుర్మార్గపు ప్రభుత్వ విధానాలను తిప్పికొడుతూ అడుగడుగునా పోరాటం సాగిస్తూ చట్టప్రకారం న్యాయబద్ధమైన నష్టపరిహారాన్ని పొందడంలో విజయం సాధించారు. నిజానికి ఇవన్నీ టిఆర్ఎస్ పార్టీకి బలమైన గ్రామాలు, తెలంగాణ రాష్ట్ర సాధనకోసం జరిగిన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న గ్రామాలు, అంతకుముందు 1990ల వరకు విప్లవోద్యమానికి బలమైన పునాదిగా ఉన్న గ్రామాలు. ఆ పోరాట స్ఫూర్తే చాలా వరకు ఇప్పటి పోరాటానికి మార్గం చూపిందనుకోవచ్చు

(మహిళారైతుల హక్కుల వేదిక) వీ

క్రీడా మైదానంలో చిందిన చిన్నపిల్లల నెత్తురు

చత్తీస్‌గడ్‌లో వసంతోత్సవం-భూంకాల్ ఉత్సవాల సందర్భంగా కబడ్డీ, ఖోఖో ఆటల పోటీల్లో పాల్గొంటున్న పిల్లలను కాల్చి చంపి, 'ఎన్ కౌంటర్' గా ప్రకటించిన ఘటనపై క్షేత్ర పర్యటన నివేదిక ఇస్తున్నారు సి. వనజ

"అడవిలో 100 నుంచి 150 మంది నక్సలైట్లు సమావేశమయ్యారని తెలిసి ఒక సెర్చ్ పార్టీ ఏర్పాటు చేసి గాలించటం కోసం వెళ్లాం. అక్కడ మాకు పెద్ద సంఖ్యలో సాయుధ నక్సలైట్లు ఎదురయ్యారు. ఆయుధాలు వదిలేసి లొంగిపొమ్మని హెచ్చరించాం. వాళ్లు వినకుండా కాల్పులు జరిపారు. తప్పనిసరై మేమూ కాల్పులు జరపాల్సి వచ్చింది. కాల్పులు ఆగిపోయిన తర్వాత చూస్తే సంఘటనాస్థలంలో 10 మృతదేహాలు కనిపించాయి."

దాదాపు ప్రతి ఎన్‌కౌంటర్ తర్వాత పోలీస్ కథనం ఇదే. అంకెలు అటూ ఇటూ కావచ్చు కాని కథలో పెద్ద తేడా ఉండదు. మావోయిస్టులకు పట్టు ఉన్న చత్తీస్ గడ్ బస్తర్ ప్రాంతం నుంచి ఈ కథ చాలా తరచుగా వింటుంటాం. అంతమంది సాయుధ నక్సలైట్లు కాల్పులు జరిపితే ఒక్క పోలీసు కూడా ఎందుకు గాయపడలేదని ఎవరైనా అడగటం కూడా మానేశారు. ఎందుకంటే ఇప్పుడా కథను ఎవరూ నమ్మరు కాబట్టి. అధికారిక రికార్డుల్లో ఆ కథనమే ఒక వాస్తవంగా ఉండిపోతుంది.

ఫిబ్రవరిలో బస్తర్ ప్రాంతంలో జరిగిన బొడ్గా ఎన్‌కౌంటర్ లో కూడా పోలీసులు ఇదే కథనాన్ని విడుదల చేసారు. కాని ఆ సంధర్భంగా పోలీసులు విడుదల చేసిన ఫోటోలు చూస్తే మాత్రం తీవ్రమైన అశాంతి కలుగుతుంది. హడావుడిగా వేసి, సరిగా గుండీలు పెట్టని కొత్త మావోయిస్ట్ ఆలివ్ గ్రీన్ యూనిఫాం కింది నుంచి రంగురంగుల సివిల్ దుస్తులు కనపడటం ఇలాంటి ఎన్‌కౌంటర్ వార్తలు తరచుగా చూసేవారికి కొత్త కాదు. కాని బొడ్గా ఎన్‌కౌంటర్లో మరణించినట్లుగా పోలీసులు విడుదల చేసిన ఫొటోలో ఉన్న 10 మంది ముఖాలు చాలా లేతగా చిన్న పిల్లల్లాగా ఉండటమే ఇందులో అశాంతి రేకెత్తించే అంశం.

అది రెండు కారణాలవల్ల ఆందోళన కలిగిస్తుంది. ఒకటి, వాస్తవంగా అది నిజమైన ఎన్‌కౌంటర్ కాదా? రెండు, పోలీసులు చెప్పినట్లుగా అంత మంది మావోయిస్టుల భారీ సాయుధ బృందంలో చనిపోయిన వాళ్లంతా అంత చిన్నవాళ్లే ఎందుకున్నారు? 100కి పైగా మావోయిస్టులు ఉన్నప్పుడు వారు మైనర్లను ఎందుకు రక్షించలేదు? అంతమంది సంఘటనాస్థలం నుంచి పారిపోతే కేవలం పిల్లలే ఎలా మిగిలిపోయారు? బయట ప్రచారం జరుగుతున్నట్లుగా నిజంగానే భారీగా మైనర్ల రిక్రూట్ మెంట్ జరుగుతోందా?

వీటికి సమాధానాలు వెతకాలని ఒక చిన్న మహిళా జర్నలిస్టుల బృందం నిర్ణయించుకుంది. ఇది రైలో, బస్సో ఎక్కి వెళ్లిపోయి వెంటనే రిపోర్టింగ్ చేసే ప్రాంతమూ కాదు, అక్కడ ప్రజలతో సంబంధం ఏర్పడటం అంత సులువూ కాదు. కనుక మాకు అక్కడికి చేరటానికి అక్కడ బాధిత ప్రాంతాలతో కాంటాక్ట్ ఏర్పడటానికి సమయం తీసుకుంది.

బోడ్గా ఎన్‌కౌంటర్లో పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం ఈ ఎన్‌కౌంటర్ జరిగిన స్థలం అడవిలో భైరాంగడ్ పోలీసు స్టేషన్ నుండి 60 కిలోమీటర్ల దూరంలో ఉంది. భైరాంగడ్‌లో ఎన్‌కౌంటర్ గురించి మేము తెలుసుకున్న మొట్టమొదటి విషయం ఏమిటంటే, పోలీసులు ఇచ్చిన సంఘటనాస్థలం వివరాలు తప్పు. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న గ్రామం బోడ్గా కి గానీ లేదా అందులో చెప్పిన బోడ్గా నాలా కు గాని ఈ ఎన్‌కౌంటర్ తో సంబంధం ఏమీ లేదు.

సంఘటనా స్థలానికి చేరటానికి భైరాంగడ్‌కు సుమారు 50 మైళ్ల దూరంలో మైదాన ప్రాంతాన్నీ అడవినీ ఇంద్రావతి నది వేరుచేసే చోటకు చేరటానికి రవాణా సౌకర్యం లేదు. దానికి ప్రైవేటు వాహనాలే శరణ్యం. నదిలో కొన్నిచోట్ల వేసవిలో నీరు చాలా తక్కువగా ఉండి కాలినడకన దాటటానికి అవకాశం ఉంటుంది. మేము అలాటి ఒక పాయింట్ ఎంచుకున్నాం. ఎన్‌కౌంటర్ స్థలం నది నుండి 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఒకసారి నది దాటాక మాత్రం ఇక నడక తప్ప దారి లేదు. మేము నడవడానికి సిద్ధపడే వెళ్లాం. కాని అలా నడుస్తూ సంఘటనా స్థలానికి చేరటానికి దాదాపు రెండు రోజులు పట్టింది.

గిరిజన గ్రామాలు మైదాన గ్రామాలకు పూర్తి భిన్నంగా ఉంటాయి. అక్కడ వీధులు ఉండవు. దాదాపు 3-4 కిమీ ప్రాంతంలో అటుఇటు వేసినట్టుగా 10 నుంచి 30 ఇళ్ల దాకా ఉంటాయి. ఒక ఇంటి నుండి మరో ఇంటికి వంద మీటర్ల దూరం. ఇళ్ల మధ్య సరిహద్దులు లేదా కంచెలు ఉండవు. ఇటువంటి నివాస సముదాయాలను పారా (హామ్లెట్) అని పిలుస్తారు. ఇలాంటి నాలుగైదు పారాలు కలిపితే ఒక గ్రామం. మేము నది దాటి అడుగుపెట్టిన మొదటి పారాలోనే ఎన్‌కౌంటర్ కథ మొదలైంది.

ఖోఖో... కబడ్డి కబడ్డి...

ఇంద్రావతి ఒడ్డున మొదటి గ్రామంలోనే మేము అప్పుడప్పుడే యుక్తవయసుకు వస్తున్న 10 మందికి పైగా అమ్మాయిలు, అబ్బాయిలను కలిశాం. ఎన్‌కౌంటర్ గురించి ప్రస్తావించగానే వాళ్లందరికీ తెలుసని, అది జరిగినప్పుడు తమలో చాలా మంది అక్కడే ఉన్నారని కూడా చెప్పారు. అది విని మేము చాలా ఆశ్చర్యపోయాం. గతంలో ఎన్‌కౌంటర్ వార్తలను కవర్ చేసిన వారికి కూడా అది కొత్తే. "ఎన్‌కౌంటర్ జరిగిన చోట మీరంతా ఎందుకు ఉన్నారు?"

"మేము ఆడుకుంటున్నాం. కొంతమంది కబడ్డీ కొంతమది ఖోఖో ఆడుతున్నాం..." దాదాపు ఇదే మాట ప్రతి ఒక్కరూ చెప్పారు. "నేను కాల్పులు జరిగినప్పుడు కబడ్డీ ఆడుతున్నాను", "అప్పుడు నేను ఖోఖోలో

పరుగెత్తుతున్నాను", "నా వంతు ముగిసింది కాని మిగిలినవాళ్ల ఆట చూస్తున్నాను". ఆ పారా నుండి 10 మంది యువకుల బృందం ఎన్‌కౌంటర్ జరిగిన తాడబల్ల గ్రామానికి, అక్కడ ఏర్పాటు చేసిన క్రీడల కార్యక్రమంలో పాల్గొనేందుకు సంఘటన జరిగిన ముందు రోజు రాత్రి వెళ్లారు. వారు మంగళవారం ఫిబ్రవరి 6 రాత్రి దారిలో ఆగి తెల్లవారి తాడబల్ల గ్రామానికి చేరారు. అప్పటికి అక్కడ ఆటల పోటీల్లో రెండో రోజు. మొదట మేము మాట్లాడిన పారా నుంచి వెళ్లిన 10 మందిలో ఐదుగురు ఎన్‌కౌంటర్ అయ్యారు.

అలా ఒక ఇంటి నుండి ఇంకో ఇంటికి, ఒక పారా నుంచి ఇంకో పారాకి వెళ్తూ మేము మర్నాటికి ఎన్ని మైళ్లు నడిచామన్న లెక్క కూడా కోల్పోయాం. ఈ దారంతా ఖోఖో కబడ్డి కబడ్డి అన్న మాటలే పదే పదే వినిపించాయి. దారంతా కలిసిన 15, 16 ఏళ్ల యువతీ యువకులు కాల్పులు జరిగినప్పుడు తాము, తమ స్నేహితులు ఎలా పరిగెత్తారో, ఎలా తుపాకిగుండ్లకు దొరక్కుండా తప్పించుకున్నారో చెప్పారు. అయితే తమ స్నేహితుల్లో కొందరు తప్పించుకోలేక పోయారని కూడా చెప్పారు. కాల్పులు మొదలు కాగానే ఖోఖో ఆడుతున్న ఉత్కల్ గ్రామానికి చెందిన సుక్కి, అదే గ్రామానికి చెందిన తన స్నేహితురాలితో కలిసి పరిగెత్తింది. కాని దార్లో మట్టిగడ్డ తగిలి బోర్లా పడింది. పక్కన పరిగెడుతున్న స్నేహితురాలు పరిగెత్తుతూ ముందుకు వెళ్లి చూస్తే పడిపోయిన సుక్కి జుత్తు పట్టుకుని పైకి లేపుతున్న బలగాలు కనిపించాయి. వెంటనే సుక్కి మీద కాల్పులు జరిపారా లేదా అన్నది ఆమె చూడలేదు. కాని రెండు రోజుల తరువాత సుక్కి మృతదేహం నగ్నంగా గ్రామానికి చేరింది. ఆమె శరీరంపై బుల్లెట్ గాయాలు మాత్రమే కాక, తొడల మీద రైఫిల్ గాయాలు కూడా కనిపించాయి.

మేము ఒక ఇంటి నుంచి ఇంకో ఇంటికి ఒక పారా నుంచి ఇంకో పారాకి నడుస్తుంటే దాదాపు ఇదే కథ మళ్లీ మళ్లీ వినిపించింది. అయితే మాతో మాట్లాడిన వాళ్లంతా 13 నుంచి 18 ఏళ్ల వయసున్న యువతీ యువకులే. అందులో గాయపడి తప్పించుకున్నవాళ్లు కూడా ఉన్నారు. వాళ్లంతా పోలీసులు విడుదల చేసిన ఫోటోల్లో వారి స్నేహితులను గుర్తించారు. మరణించినవారి ఫొటోలతో ఉన్న ఫోన్ వారికి ఇచ్చినప్పుడు ప్రతి పారాలోనూ ఉన్న పిల్లలంతా ఫోన్ చుట్టూ మూగి ఫొటోలు చూస్తూ ఉండిపోయారు. ఆధార్ లేదా రేషన్ కార్డుల మీద ఉన్న అలుక్కుపోయిన ఫొటోలు తప్ప తమ స్నేహితుల జ్ఞాపకాలేవీ వాళ్ల దగ్గర లేవు. వారి స్నేహితుల మృతదేహాల చిత్రాలు చూస్తూ విషణ్ణవదనాలతో ఉన్న ఆ పిల్లల్ని చూస్తే హృదయం ద్రవించిపోయింది.

అవును మీరు చదివింది నిజమే. చనిపోయిన వాళ్లందరికీ ఆధార్, రేషన్ కార్డులు ఉన్నాయి. మేము మరణించిన వాళ్ల కుటుంబాలను కలిసినప్పుడు దాదాపు అన్ని కుటుంబాలు వారి ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు తెచ్చి చూపించారు. అక్కడ మరణించిన వారి పేర్లు ఉన్నాయి. అవి పోలీసులు విడుదల చేసిన వివరాలతో సరిపోయాయి కూడా. ఒక్కటి తప్ప. ఆ కార్డుల ప్రకారం ఇద్దరు మినహా మిగిలిన మృతులంతా మైనర్లే. అంటే దానర్థం వాళ్లంతా పౌరులే అని.

అలా నడుస్తూ ఒక అర్ధరాత్రికి ఒక గ్రామం చేరి మళ్లీ ఉదయాన్నే గ్రామాల్లో ఆగుతూ ఆగుతూ తెల్లవారి మధ్యాహ్నానికి తాడబల్ల గ్రామం దగ్గర ఎన్‌కౌంటర్ స్థలానికి చేరుకున్నాం. అప్పటికి దారిలో మేము కలిసిన గ్రామాల నుండి చాలామంది గ్రామస్తులు అక్కడకు చేరారు. ఎత్తైన చెట్ల కింద పొదలు తీసేసి చదును చేసిన స్థలం అది. అక్కడ కబడ్డీ, ఖోఖో కోర్టులు ఎక్కడ గీశారో గ్రామస్తులు మాకు చూపించారు. సంఘటన జరిగి అప్పటికే రెండు నెలలు అవుతూ ఉండటం వలన ఆ కోర్టులన్నీ అకులతో కప్పబడి ఉన్నాయి.

అసలీ కబడ్డీ ఖోఖో ఏంటి?

మేము దారంతా ఈ ఆటలకు ఎన్‌కౌంటర్‌కు ఉన్న సంబంధాన్ని, మైదాన ప్రాంతాలకు చెందిన ఆటలతో అక్కడొక కార్యక్రమం ఎందుకు జరిగిందన్న దాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ వచ్చాం. మేము తెలుసుకున్నది ఇది.

చాలా పాత గిరిజన ప్రాంతాల్లో ఉన్నట్టే బస్తర్ గిరిజన ప్రాంతంలో కూడా వసంతోత్సవ సంప్రదాయమం ఉంది. యుక్తవయస్సుకు చేరిన బాలురు, బాలికలు వసంతకాలం ఆరంభంలో ఒక చోట చేరి ఆడి పాడి అందులో భాగంగా తమ సహచరులను ఎంచుకోవడానికి ఇది వేదిక. వయసుతో సంబంధం లేకుండా యుక్తవయసుకు చేరిన ఆడ మగ పిల్లలందరికీ ఈ స్వేచ్ఛ ఉంటుంది. ఇక్కడ యుక్తవయసు అంటే 14,15 ఏళ్లు. ఈ ఎంపికకు సహజంగానే కులం, కట్నం, జాతకం వంటి ప్రాతిపదికలు ఉండవు. అయితే గత 100 సంవత్సరాల్లో దీనిలో కొంచెం మార్పు వచ్చింది. 1910లో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా బస్తర్ గిరిజనుల వీరోచిత గిరిజన తిరుగుబాటు తరువాత, ఫిబ్రవరి మొదటి వారంలో బస్తర్ గిరిజనులు భూంకాల్ దివస్ జరుపుకుంటారు. దాంతో ఈ రెండిటినీ కలిపి ఒకే కార్యక్రమంగా జరుపుకుంటున్నారు. మావోయిస్టులు ఈ ప్రాంతంలోకి ప్రవేశించిన తర్వాత, వారు మైదానాల్లో ఆడే ఆట పాటలను కూడా ఇందులో చేర్చారు. దాంతో ఇందులో కబడ్డీ, ఖోఖో వంటి ఆటలు కూడా చేరాయి. ఇప్పుడిది నాలుగు నుంచి ఐదు గ్రామాలకు చెందిన బాలురు, బాలికలు కలిసి మూడు రోజులపాటు ఆడుకుని, ఆ తర్వాత భూంకాల్ దివస్ సమావేశం, చివరికి పాటలు, నృత్యాలు, పానీయాలతో ముగుస్తుంది.

ఈ కార్యక్రమం ప్రతి ఏడాదీ వసంత కాలం ఆరంభంలో నాలుగైదేసి గ్రామాల వాళ్లు కలిసి ఆ ప్రాంతమంతా జరుపుకుంటారు. కాబట్టి గ్రామాల నుండి వాలంటీర్లు ఒకటి రెండు రోజుల ముందే నిర్ణయించిన స్థలానికి ఏర్పాట్లు చెయ్యటం కోసం వెళ్తారు. ఆటల్లో పాల్గొనేవారు ఒకరోజు తరువాత వస్తారు. స్థలాన్ని చదును చేసి, కోర్టులు వెయ్యటంతో పాటు, వచ్చినవాళ్లు రెండు మూడు రోజులు ఉండటానికి వీలుగా స్థలాలను మార్క్ చెయ్యటం, అన్ని రోజులు వంటల కోసం తాత్కాలిక ఏర్పాట్లు చెయ్యటం... ఇవన్నీ నిర్వాహకుల పని. అన్నిటికన్న ముఖ్యం దగ్గరలో ఏదైనా నీటి వసతి ఉండటం. వంట కోసం పాల్గొనే గ్రామాల నుంచి ఆహార ధాన్యాలు, ఇతర సరుకులు వస్తాయి.

మేము తాడబల్ల గ్రామం పక్క అబుజ్‌మాడ్‌కి దగ్గరగా ఉన్న సంఘటనాస్థలానికి చేరుఉండగా మాతో నడుస్తున్న మహిళలు మధ్యలో ఆగిపోయారు. పోలీసులు కాల్పులు జరిపినప్పుడు గ్రామానికి రెండు మూడు వందల మీటర్ల దూరంలోనే ఉన్న స్థలానికి తాము పరుగెత్తుకుని వచ్చామని, కాని వందమీటర్ల ముందుగానే అప్పుడు ఆగిన దగ్గరే తమను పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టి ఆపారనీ చెప్పారు. ఆ మహిళలు చెప్పిన ప్రకారం బుధవారం ఫిబ్రవరి 7 ఉదయం 8 గంటలకు ఆటలు మొదలయ్యాయి. సమయం అనేది ఆకాశంలో సూర్యుని స్థానాన్ని చూపించి చెప్పటమే. ఆరోజు ఉదయం దాదాపు 70–80 మంది వివిధ జట్లలో ఆటల్లోనో, తమ వంతు కోసం ఎదురు చూస్తూనో, తమ ఆట ముగిసి ఇతరుల ఆట చూస్తూనో ఉన్నారు. దాదాపు అంతే సంఖ్యలో సహాయం కోసం గాని చూడటం కోసం గాని గ్రామాల నుంచి

వచ్చినవాళ్లు ఉన్నారు. వారిలో ఎవ్వరూ పెద్దవయసు వాళ్లు కాదు. అందరూ 20 లలో ఉన్నవారే. గిరిజన ప్రాంతాల్లో పోషకాహార లోపంవల్లా, మలేరియా వల్లా జీవితకాలం తక్కువగా ఉంటుంది. చాలామంది వ్యక్తులు 40, 50లు దాటరు కూడా. కాబట్టి మిగిలిన వాళ్లంతా కూడా 20ల్లో 30ల్లో ఉన్నవాళ్లే. కాల్పులు జరిగింది ఉదయం 10.30 కు. అప్పటికి వంట ముగిసి అందరూ ఆట దగ్గర చేరారు.


మాతో సంఘటన స్థలానికి నడిచిన తాడబల్ల గ్రామ మహిళల్లో కొందరు అప్పుడే ఆట చూసి తినటం కోసం ఇంటికి వచ్చారు. కాల్పుల చప్పుడు వినగానే వాళ్లంతా వెనక్కి పరుగెత్తారు. కాని వాళ్లను 100 మీటర్ల ముందే బలగాలు ఆపేసాయి. అప్పటినుంచీ దాదాపు మధ్యాహ్నం రెండు దాక వాళ్లు అరుపులు, ఏడుపులు వింటూనే ఉన్నారు. ఏడుస్తున్నది తమ పిల్లలో ఇతరుల పిల్లలో తెలియని నిస్సహాయ స్థితిలో వాళ్లు అక్కడే ఉండిపోవలసి వచ్చింది.

బలగాలు వెళ్లిపోయాక సంఘటన జరిగిన చోటకి వెళ్లి చూస్తే అక్కడంతా పగలగొట్టిన గిన్నెలు, కాల్చిపడేసిన బట్టలు, బట్టలు తెచ్చుకున్న సంచులు కనిపించాయి. దాదాపు రెండు నెలల తర్వాత కూడా చెల్లాచెదురుగా అక్కడక్కడ మాకు కాల్చిన బట్టల ముక్కలు కనిపించాయి. అప్పటికి పరిసర గ్రామాల ప్రజలంతా అక్కడికి చేరారు. వాళ్లంతా బలగాలు వెళ్లిన దారిలో పరుగెత్తి ప్లాస్టిక్ పట్టాల్లో చుట్టి 10 మృతదేహాలను నది అవతలకి చేరుస్తున్న బలగాలను కలిశారు.

నాకు ఏడుపు వినిపించింది...

ఆధార్ కార్డులు, రేషన్ కార్డుల ప్రకారం, చనిపోయిన 10 మందిలో ఎనిమిది మంది మైనర్లు ఉన్నారు. వారిలో ఒకరికి కేవలం 12 ఏళ్లే. మేజర్లలో ఒకరు పరమేష్, 24 ఏళ్లు, ఇద్దరు పిల్లల తండ్రి. ఇంకొక వ్యక్తికి 20 ఏళ్లు. కాని అప్పటికి బలగాల వెంట పరిగెత్తుకుని వచ్చినవాళ్లకు ప్లాస్టిక్ షీట్లలో ఉన్నవాళ్లు ఎవరో తెలియదు. తమ పిల్లలు కూడా ఆ కార్యక్రమంలో ఉన్నారు కాబట్టి తమ పిల్లలు కావచ్చు. వాళ్లు పోలీసులకు అడ్డుపడి మృతదేహాలను చూపించమని డిమాండ్ చేశారు. కాని పోలీసులు చూపించలేదు. నదికి అవతలి ఒడ్డున మరొకవైపు వేచి ఉన్న వాహనాల్లోకి మృతదేహాలను తీసుకుని పోయారు. ఆ సమయంలో ఆ ప్లాస్టిక్ షీట్లలో ఉన్న శరీరాల్లో ఒకటి నొప్పితో మూలుగుతుండటం పరమేశ్ భార్య విన్నది. అది తన భర్త గొంతులా అనిపించింది. దాంతో ఆమె అడ్డంపడి షీట్ విప్పమని అరిచింది. ప్రతిఘటించింది. అందుకు జవాబుగా నదిని దాటుతున్నప్పుడు పోలీసులు ఆ మూటను నీళ్లలో ముంచేసారు.

ఆమె ఇంటిలో పరమేష్ బర్సా భార్యను కలుసుకున్నప్పుడు ఆమె పరమేష్ రేషన్ కార్డును, ఆధార్ కార్డును తెచ్చి మా ముందు పడేసింది. ఆ తర్వాత ఒక్క ముక్క కూడా మాట్లాడటానికి ఇష్టపడలేదు. ఆమె బాధతో ఒక రాయిలా మారిపోయినట్లుగా ఉంది. కాని అక్కడ ఉన్న మిగిలినవాళ్లు ఏమి జరిగిందో చెప్పారు. పరమేష్ కు ఆరోజు జ్వరం వచ్చిందట. అందుకని వంట ఏర్పాట్ల దగ్గర పడుకుని ఉన్నాడు. అటువైపు నుంచే ప్రవేశించిన బలగాలు పడుకుని ఉన్న అతణ్ని కాల్చేశాకే ఆట జరిగే వైపు వచ్చారు. బలగాలకు చూస్తున్నవాళ్లకు మధ్య ఆడుతున్నవాళ్లు ఉండటం, ఆట ధ్యాసలో ఏం జరుగుతుందో అర్థం కావటానికి కొన్ని క్షణాలు పట్టటంతో ఆడుతున్న పిల్లలు ఎక్కువ మందికి బుల్లెట్లు తగిలాయి.



అయితే పరమేష్ భార్య మాత్రమే కాదు చాల మంది పెద్దలు కూడా ఎక్కువ మాట్లాడటానికి ఇష్టపడలేదు. ఆ సంఘటన జరిగినప్పుడు అక్కడ ఉన్న పిల్లలు, వాలంటీర్లుగా వెళ్లి స్వయంగా చూసిన కొందరు పెద్దలు మాత్రమే ఈ వివరాలు చెప్పారు. దాదాపు తల్లిదండ్రులంతా పిల్లల రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు మాకిచ్చి నిశ్శబ్దంగా ఉండిపోయారు. చుట్టూ ఉన్నవాళ్లతోపాటు వెళ్లి తప్పించుకోగలిగిన పిల్లలే వాళ్ల వివరాలన్నీ చెప్పారు. సంఘటన జరిగిన రెండు నెలల తర్వాత కూడ ఆ సంఘటన కలిగించిన భీతి నుంచి కుటుంబ సభ్యులు బయటపడలేదు.

పోలీసులు మృతదేహాలను భైరాంగఢ్ కు వాహనాల్లో తరలించాక ఆ వెనకే నడుస్తూ ఐదు గ్రామాల ప్రజలు పోలీసు స్టేషన్ కు చేరారు. మృతదేహాలను చూపించాలని డిమాండ్ చేసి పోలీసు స్టేషన్ వద్ద ధర్నా చేశారు. కానీ అప్పటికే మృతదేహాలను బీజాపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. తిరిగి వాళ్లు తెల్లవారేసరికల్లా బీజాపూర్ కు తమ పిల్లలను, కుటుంబసభ్యులను గుర్తించారు. దానికి ముందు ఇది నకిలీ ఎన్‌కౌంటర్ అని నినాదాలు చేస్తూ పట్టణంలో నిరసన రాలీ కూడా చేశారు.

తల్లిదండ్రులు గుర్తించినప్పటికీ ఒక మృతదేహం వివరాలు తప్పుగా నమోదయ్యాయి. అది కేవలం 12 సంవత్సరాల వయసు ఉన్న తాడబల్ల గ్రామ నివాసి పాలో. ఆమె ఇంటి నుండి కొన్ని మీటర్ల దూరంలోనే సంఘటనాస్థలం ఉంది. ఆమె ఖోఖో ఆడుతున్నప్పుడు కాల్పులు జరిగాయి. ఆమె తల్లిదండ్రులు అక్కడినుంచి కొద్ది నిమిషాల ముందే ఇంటికి వచ్చారు. కాల్పుల చప్పుడు వినగానే వారు అందరికంటె ముందే పరుగెత్తారు. కానీ వాళ్లను సాయుధ బలగాలు ముందుకు పోనివ్వలేదు. వాళ్లు అంతసేపూ అరుపులు వింటూనే ఉన్నారు. తెల్లవారి బీజాపూర్

ఆస్పత్రిలో శవాన్ని చూడటానికి ముందే వాళ్లకు తమ బిడ్డ కూడా చనిపోయిందని అర్థమయింది. పోలీసులు శవాన్నయితే తల్లిదండ్రులకే ఇచ్చారు గాని ఆమె ఇనంకో గ్రామానికి చెందిన రామి అని ప్రకటించారు.

మరి సాయుధ నక్సలైట్లు ఎక్కడ?

ఈ ప్రాంతంలో మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువ. మేము వెళ్లిన దారంతా వాళ్ల ఆధ్వర్యంలో నిర్మించిన చెరువులు కనిపించాయి. కొన్నిచోట్ల వాళ్లు నడుపుతున్న పాఠశాలలు కూడా ఉన్నాయట. కాని అప్పుడు తెరిచి లేవు. 2005కి ముందు ఆ ప్రాంతంలో కొన్ని ప్రభుత్వ పాఠశాలలు ఉండేవట. కాని ఆపరేషన్ సల్వాజుడుం తర్వాత, ప్రభుత్వం ఆ పాఠశాలలను మూసివేసింది. దాదాపుగా ప్రభుత్వానికి ఆదివాసులకు మధ్య రోజువారీ సంబంధాలు తెగిపోయాయి. గుర్తింపు కార్డుల కోసమో, రేషన్ కోసమో ఆదివాసులే నడిచి నది దాటి వెళ్తారు. అప్పుడప్పుడు కూంబింగ్ కి వచ్చే పోలీసులు తప్ప అధికారులెవరూ అక్కడికి రారు. దాంతో పాఠశాలలు, ఇతర అభివృద్ధి కార్యకలాపాలు ఇప్పుడు మావోయిస్టులు రూపొందించిన 'జనతన సర్కార్' కింద స్థానిక సంస్థలు చేపడుతున్నాయి. అందులో భాగంగానే చెరువులు, స్కూళ్లు. 'సబ్ కా వికాస్, సబ్ కా సురక్ష' అనేది జనతన సర్కార్ నినాదం.

సల్వాజుడుం మొదలయ్యాక ఆ ప్రాంతంలో ఒకటి మాత్రం పూర్తిగా మారిపోయింది. 2005 వరకూ తాడబల్ల ఎన్‌కౌంటర్ స్థలం లేదా మాడ్ వంటి ప్రదేశాలకు పోలీసు బలగాలు చేరడం దాదాపు అసాధ్యంగా ఉండేది. అడవి దారుల్లో తిరగటం, అదీ బస్తర్, మాడ్ వంటి ప్రాంతాల్లో తిరగటం అంత తేలిక కాదు. ప్రత్యేక పోలీసు అధికారులు (ఎస్ పి ఒలు) గా గిరిజన బాలలను నియమించడం ద్వారా గిరిజన ప్రాంతాల్లోకి ప్రవేశించిన తర్వాతనే సల్వాజుడుం ఆపరేషన్ రచన జరిగింది. మావోయిస్టులను అడవినుంచి తొలగించే ఆపరేషన్ అది. దానికి ప్రభుత్వం ఎన్నుకున్న మార్గం ఆదివాసుల ఇళ్లు, తిండి గింజలు తగలబెట్టటం. దాంతో వాళ్లు అడవిలో ఉండలేక బయటికి వస్తే మావోయిస్టులకు మద్దతు పోయి ఉద్యమం చచ్చిపోతుందని. 2005లో ప్రారంభమైన నాటి నుండి సల్వాజుడుంలో అనేక అత్యాచారాలు, హత్యలు జరిగాయని, మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. అంత చేసినా కూడా జుడుం అనుకున్న ఫలితాలు రాలేదు. జుడుం బలగాలు గ్రామాల్లోకి వచ్చినప్పుడు కొందరు దొరికిపోయి బలగాలతోపాటు రహదారికి ఆనుకుని ఏర్పాటుచేసిన జుడుం శిబిరాలకు పోతే మరికొందరు అడవిలోకి పారిపోయారు. ఛత్తీస్ గఢ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సల్వాజుడుం తరువాత కేంద్ర ప్రభుత్వ సహాయంతో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌గా మారింది.

సల్వాజుడుం తర్వాత అడవిలో ఉండిపోయిన, శిబిరాలకు వెళ్లిన ప్రజల మధ్య ఒక విభజన ఏర్పడింది. ఒక శత్రుపూరిత వాతావరణం వచ్చింది. దాంతో శిబిరాల్లో ఉన్న ఆదివాసుల నుంచి మరింత మందిని ఎస్‌పిఒ లుగా రిక్రూట్ చెయ్యటం తేలికయ్యింది. అడవుల్లో దారులు తెలిసిన ఎస్‌పిఒ లను ఉపయోగించి విపరీతంగా కూంబింగ్‌లు, దాడులు పెరిగాయి. ఈ ప్రాంతంలో పనిచేసిన సామాజిక శాస్త్రవేత్త నందిని సుందర్ వివాదాస్పద ప్రాంతాలలో ఆదివాసులకు వ్యతిరేకంగా ఆదివాసులను వాడటాన్ని వ్యతిరేకిస్తూ పోరాటం చేసి సుప్రీంకోర్ట్ నుంచి అందుకు వ్యతిరేకంగా ఒక ఉత్తర్వును పొందారు. ఇది స్పష్టమైన మానవ హక్కుల ఉల్లంఘనగా భావిస్తూ సుప్రీంకోర్టు ఎస్ పి ఓల కార్యకలాపాల ఉనికిని నిషేధించింది. ఛత్తీస్ గఢ్ ప్రభుత్వం తక్షణమే ఎస్‌పిఒ లను జిల్లా రిజర్వ్ గ్రూప్ (డిఆర్‌జి) గా పేరు మార్చింది. దాంతోపాటు అగ్ని, సామాజిక్ ఏకతా మంచ్ వంటి అనేక కొత్త కొత్త సంస్థలను రంగంపైకి తెచ్చింది. ఈ బోడ్గా లేదా తాడబల్ల ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నవి అదే డిఆర్‌జి దళాలు. ఎన్‌కౌంటర్ సమయంలో ఆదివాసులతో కూడిన ఈ వివిధ దళాలు 'చంపండి చంపండి' అని గోండి భాషలో అరవటం గ్రామస్తులు స్పష్టంగా విన్నారు. విషాదం ఏమిటంటే మరణించినవారికి చెందిన గ్రామాల నుండి కొంతమంది డి ఆర్ జి సిబ్బంది ఆ ఆపరేషన్‌లో ఉన్నారు.

ఈ ప్రాంతంలో జుడుం కార్యకలాపాలు ప్రారంభం అయిన తర్వాత మావోయిస్టుల్లో చేరటానికి అడవుల్లో ఉండిపోయిన ఆదివాసులలో సంసిద్ధత పెరిగింది. ఇప్పుడు అనేక మావోయిస్టు దళాలు మాత్రమే కాదు, పార్టీ ప్రాంతీయ కమిటీలు కూడా గిరిజనుల నాయకత్వంలోకి వచ్చాయి. పెరిగిన నిర్బంధం, దాడులు, మరొకవైపు పూర్తిగా ప్రభుత్వ చేయూత కనుమరుగు అయిన నేపథ్యంలో 'సబ్ కీ వికాస్, సబ్ కీ సురక్షా' కోసం బలమైన అవసరం ఏర్పడింది. అభివృద్ధి కోసం గ్రామ కమిటీలు, రక్షణ కోసం మిలీషియా సాధారణంగా మారాయి. తాడబల్ల సంఘటన జరిగినప్పుడు కూడా పర్యవేక్షణ కోసం పార్టీ నుండి ముగ్గురు వచ్చారని కొందరు యువకులు చెప్పారు. హఠాత్తుగా కాల్పులు జరగగానే వాళ్లు వీలయినంతమందిని తప్పించటానికి ప్రయత్నించారని, వాళ్లు కూడా తప్పించుకుని పోయారని కొందరు చెప్తే, అసలు పార్టీ వాళ్లెవరూ లేరని నిర్వహణలో ఉన్న మరికొందరు చెప్పారు. వాళ్లు ఉండి వుంటే,ఆయుధాలు కూడా ఉండి ఉంటే ఎదురు కాల్పులు జరపకుండా ఎందుకు రిట్రీట్ అయి ఉంటారన్నది తెలియలేదు.

గెరిల్లా యుద్ధం గురించి ముఖ్యంగా బస్తర్ ప్రాంతంలో జరుగుతున్న ఘర్షణల గురించి తెలిసిన ఎవరికైనా 100 మంది మావోయిస్టులు యూనిఫారంలో ఒక చోట ఉంటే భద్రత చాలా ఎక్కువగా ఉంటుందనీ చుట్టూ అనేక సెంట్రీ పాయింట్లు ఉంటాయనీ తెలుస్తుంది. 100 మంది మావోయిస్టులు ఒకేచోట సమావేశం అయ్యే సందర్భాలు అరుదుగా ఉంటాయి. అలాంటి సందర్భాలలో పోలీసు బలగాలు మాత్రమే కాదు పారామిలటరీ దళాలు కూడా తమ ఉనికి తెలియకుండా ఈ ప్రాంతాన్ని చేరుకోవడం దాదాపు అసాధ్యం. అంతమంది ఆటోమేటిక్ ఆయుధాలు కలిగిన మావోయిస్టులు మొదట కాల్పులు జరిపినట్లయితే పోలీసుదళాలలో భారీ సంఖ్యలో ప్రమాదాలు జరుగుతాయి. కానీ ఎఫ్‌ఐఆర్ లో పోలీస్ కథనం ప్రకారం సాయుధ మావోయిస్టులు పోలీసు బలగాలపై మొదట కాల్పులు జరిపినప్పటికీ పోలీసులు ఎవరూ గాయపడలేదు.

పోతే పోలీసులు విడుదల చేసిన అన్ని ఫోటోల్లో మృతదేహాలు మావోయిస్టు యూనిఫాం ధరించి ఉన్నాయి. పోలీసులు 11 బర్మార్లు స్వాధీనం చేసుకున్నట్లుగా కూడా చూపించారు. దీన్ని గురించి ప్రస్తావించినప్పుడు గ్రామస్తులు, నిర్వాహకులు తాము కార్యక్రమం దగ్గరకి 6 బర్మార్లు తెచ్చామని చెప్పారు. ప్రతి గ్రామంలో ఒకటి లేదా రెండు బర్మార్లు ఉంటాయని వాటిని తామే తయారు చేసుకుంటామని చెప్పారు. ఎలుగుబంట్లు, చిరుతపులుల దాడుల నుంచి రక్షించుకునేందుకు వాటిని వాడతామని చెప్పారు. వాటినే అక్కడికి కూడా అలాంటి అవసరాల కోసమే తెచ్చామని చెప్పారు.

"దాడి చేసినప్పుడు రక్షణగా జంతువులను గాయపరిచేందుకు మాత్రమే ఉపయోగపడతాయి. మనుషులను చంపడానికి కాదు. బలగాలు ఆటోమేటిక్ ఆయుధాలతో వస్తే ఈ బర్మార్లతో ఏమీ చేయలేరు. అక్కడ జరిగింది కూడా అదే. కనీసం మేము వాటిని వాడటానికి కూడా

ప్రయత్నం చెయ్యలేదు" అని గ్రామస్తులు చెప్పారు. అయితే అక్కడ 11 బర్మార్లు స్వాధీనం చేసుకున్నట్లుగా పోలీసులు నివేదిక లో రాశారు. మిగిలిన బర్మార్లను వాళ్లే తెచ్చి ఇక్కడ దొరికినట్లుగా రాసి ఉంటారని, మృతదేహాలకు తొడిగిన కొత్త యూనిఫారాలు కూడా వాళ్లే తెచ్చారని గ్రామస్తులు చెప్పారు. 20, 25 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న గ్రామాలన్నిటిలో దాదాపు అందరూ ఇదే చెప్పారు.

గత 15ఏళ్లలో బస్తర్ ప్రాంతంలో కానీ ఇంకా అనేక ఉద్యమ ప్రాంతాల్లో కానీ ఇలాంటి సంఘటనలు కొత్త కాదు. అయితే చత్తీస్ గఢ్ రాష్ట్రంలో తాజాగా బిజెపి నుంచి కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వం మారి, మానవ హక్కుల ఉల్లంఘనలు తగ్గుతాయని మీడియాలో విస్తృతంగా కథనాలు వచ్చాయి. కొత్త ప్రభుత్వం భిన్నమైన విధానం తీసుకుంటుందన్న భావన వచ్చింది. కాని ఈ సంఘటన గురించి మేము ప్రభుత్వంలో వివిధ స్థాయిల్లో ఉన్నవారితో మాట్లాడిన తర్వాత ఆ అభిప్రాయం కలగలేదు. అంతే కాదు, ఎన్‌కౌంటర్లకు, సరెండర్లకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ప్రమోషన్లు ప్రతిగా లభించినంత కాలం ఇది మారే అవకాశం లేదు. కేవలం కూంబింగ్ ఆపరేషన్లు చెయ్యటానికి, దాడులు నిర్వహించటానికే ప్రత్యేకంగా బలగాలను ఏర్పాటు చేసినప్పుడు ఇటువంటి దాడులకు పాల్పడక తప్పని ఒత్తిడి కూడా ఆ బలగాల మీద ఉండి తీరుతుంది. ఇవి కొనసాగుతాయి కూడా.

అది బూటకపు ఎన్‌కౌంటరే: ఎంఎల్ఏ విక్రమ్ మండవి

బాధితుల తెగకే చెందిన బిజాపూర్ శాసనసభ్యుడు విక్రమ్ మండవి ఈ ఎన్‌కౌంటర్ కచ్చితంగా బూటకమేనని అన్నారు. ఎన్‌కౌంటర్ జరగగానే దాని విషయం ముఖ్యమంత్రికి లేఖ రాశానని, అది వివరించడానికి మృతుల తల్లిదండ్రులను రాజధానికి తీసుకువెళ్లానని ఆయన అన్నారు. "రాయపూర్ లోనూ, ఢిల్లీలోనూ ఉన్నవాళ్లు, ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు ఈ ప్రాంతానికి చెందినవాళ్లు కాదు గనుక నక్సలైట్లనూ పోలీసులనూ మాత్రమే చూస్తారు. మధ్యలో ప్రజలు ఉన్నారని చూడరు" అని ఆయన అన్నారు. ఈ ఎన్‌కౌంటర్ మీద వివాదం వల్లనే జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ను బదిలీ చేశారని ఆయన అన్నారు. పోలీసు కథనాన్ని ఏ ఒక్కరూ నమ్మడం లేదని, తాను స్వయంగా వెళ్లి వాస్తవాలు పరిశీలించానని ఆయన అన్నారు.

కాని బిజాపూర్ కొత్త ఎస్ పి గోవర్ధన్ ఠాకూర్ మాత్రం గత ఎస్ పి బదిలీ మామూలుగా జరిగిందేనని, దానికీ ఎన్‌కౌంటర్ కూ ఏమీ సంబంధం లేదని అన్నారు. ఎన్‌కౌంటర్ గురించి మాట్లాడడానికి ఆయన ఎంతమాత్రం సిద్ధపడలేదు. అది జరిగినప్పుడు తాను ఎస్ పి ని కాదు గనుక దాని గురించి తానేమీ చెప్పలేనని అన్నారు.

రోడ్లు – మేజిస్ట్రేట్ విచారణ

మేజిస్ట్రేట్ విచారణ జరుగుతున్నందువల్ల ఎన్‌కౌంటర్ మీద తానేమీ వ్యాఖ్యానించనని జిల్లా కలెక్టర్ కె డి కుంజన్ అన్నారు. కాని ఆ ఎన్‌కౌంటర్ బూటకం కాదని తాను అనుకుంటున్నానన్నారు. తన పాలనాకాలంలో జిల్లాలో నిర్మించిన రోడ్ల జాబితా ఇస్తూ, ఈ రోడ్లు ఆదివాసులను అభివృద్ధి పథంలోకి తీసుకొస్తాయని తాను బలంగా నమ్ముతున్నానన్నారు. పాఠశాలల సంగతి, ప్రాథమిక ఆరోగ్యం సంగతి ఏమిటని అడిగినప్పుడు అవి కూడ చేస్తామన్నారు. కాని అభివృద్ధి పనులను ముందుకు తీసుకుపోవడానికి రోడ్లే మొదటి ప్రాధాన్యత అన్నారు. కాని ఆదివాసులు మాత్రం రోడ్లు తమ ప్రాంతంలోకి మరింత ఎక్కువగా బలగాలను తీసుకువస్తాయని రోడ్ల పట్ల అనుమానాలతో ఉన్నారు. పాఠశాలలను తిరిగి తెరవాలనీ, ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పాలనీ వాళ్లు అన్నారు.

ఇటువంటి ఘటనలు జరిగినప్పుడల్లా మెజిస్టీరియల్ విచారణలు జరగడం సర్వసాధారణం. బిజాపూర్ జిల్లాలోనే ప్రస్తుతం అటువంటి పది విచారణలు జరుగుతున్నాయి. మెజిస్టీరియల్ విచారణాధికారి ఎ ఆర్ రాణా కూడ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనిచేసే ఒక ప్రభుత్వాధికారి. బొడగ/తాడ్బల్ల "ఎన్‌కౌంటర్" గురించి మాట్లాడుతూ ఆయన పోలీసుల నుంచి సాక్ష్యాలు సేకరించడం పూర్తయిందని, గ్రామస్తుల సాక్ష్యాల కోసం ఎదురుచూస్తున్నానని అన్నారు. ఈ సాక్ష్యాల సేకరణ ప్రక్రియ గురించి ప్రశ్నించగా, బైరాంగఢ్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో గ్రామస్తులకు సమన్లు పంపడం జరిగిందని అన్నారు. "ఎన్‌కౌంటర్" లో పాల్గొన్నది కూడ అదే పోలీస్ స్టేషన్ సిబ్బంది గనుక వారు ఆ సమన్లు ఇవ్వడానికి గ్రామానికి వెళ్లనేలేదు. నది ఒడ్డున ఉన్న వారం సంత నుంచి తమను పోలీస్ స్టేషన్ కు తీసుకుపోయి కొన్ని తెల్ల కాగితాల మీద తమతో బలవంతంగా సంతకం చేయించుకున్నారని కొందరు మృతుల కుటుంబ సభ్యులు చెప్పారు. మిగిలిన కుటుంబాల సభ్యులను కూడ తీసుకురమ్మని వారికే చెప్పారని అన్నారు.

కొత్త ప్రభుత్వంలో విధానం మారిందా?

ముఖ్యమంత్రిని కలవడానికి ప్రయత్నించి, ఆయనతో ముఖాముఖీ కుదరక, మేం ప్రభుత్వ రాజకీయ సలహాదారు వినోద్ వర్మ ను కలిశాం. ఆయన గతంలో జర్నలిస్టుగా ఈ సంఘర్షణా ప్రాంతంలోనే పనిచేశారు. 2017ఒక్క సంవత్సరం లోనే అప్పటి చత్తీస్ గఢ్ ప్రభుత్వం 14 మంది జర్నలిస్టులను అరెస్టు చేయగా, అలా అరెస్టయినవారిలో ఆయన కూడ ఉన్నారు. 2018 చివరలో ప్రభుత్వం మారినప్పుడు ఆయన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయ సలహాదారు అయ్యారు.

"మేం నక్సలైట్ల పట్ల మెతక వైఖరి అవలంబించడం లేదు. వాళ్లను రాజ్యానికి శత్రువులుగానే పరిగణిస్తూ ఉంటాం" అని ఆయన స్పష్టంగా చెప్పారు. "అంతేకాదు, వాళ్లతో శాంతి చర్చలనేవేమీ ఉండవు" అన్నారు. "ఇంతకాలమూ ఆ ప్రాంతంలో తుపాకులే మాట్లాడుతూ ఉండేవి. ఇప్పుడు మేం అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలతో మాట్లాడడానికి ప్రయత్నిస్తున్నాం" అన్నారు. మరి ఈ కొత్త అభివృద్ధి కార్యక్రమ ప్రణాళికలో ఇలా చిన్నపిల్లలను చంపిన ఎన్‌కౌంటర్ ఎట్లా ఇముడుతుంది? ఆ విషయం మాట్లాడడానికి తాను సమర్థుడిని కానంటూ ఆయన "దశాబ్దాలుగా ఒక పని పద్ధతికి అలవాటుపడిన అధికారుల మానసికస్థితిని మార్చడం అంత సులభం కాదు" అన్నారు.

పోలీసుల్లో నేరస్తులను సహించబోమన్న డిజిపి డిఎం అవస్తి

ప్రస్తుత చత్తీస్‌గఢ్ డిజిపి డిఎం అవస్తి అంతకుముందు నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల బాధ్యుడిగా ఉండేవారు. దోపిడీ ఎక్కువగా సాగుతున్నప్పుడు, రాజ్యం ఆ ప్రాంతాలకు చేరుకునే అవకాశం లేనప్పుడు నక్సల్స్ ఆదివాసుల దగ్గరికి చేరగలిగారని ఆయనన్నారు. అప్పుడు ఆదివాసులను అటవీ అధికారులు, పోలీసు బలగాలు వేధించేవారని కూడ ఆయన ఒప్పుకున్నారు. "భద్రతా బలగాలతో నక్సల్స్ ను నిర్మూలించలేం" అని ఆయన అన్నారు. పోలీసుల వైపు నుంచి కూడ కొన్ని పొరపాట్లు జరిగాయని ఒప్పుకుంటూ, అటువంటి సిబ్బందిని శిక్షించడం కూడ జరిగిందని ఆయనన్నారు. "యూనిఫామ్ లో ఉన్న నేరస్తులను సహించబోం పోలీసుల్లో ఉన్న నేరస్తులను ఏరి పారవేయడానికి మేం కృతనిశ్చయంతో ఉన్నాం" అని ఆయనన్నారు.

(రచయిత ఇండిపెండెంట్ జర్నలిస్టు) వీ

పార్టీ ఫిరాయింపులు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

***అధికార పార్టీ ప్రలోభాలకు లొంగిపోయి స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారే రాజకీయ నాయకును రీకాల్ చేసే అధికారం ప్రజలకు ఉండాలని అంటున్నారు* గొడితాల వెంకటేశ్వర్లు**

వేదలు, అసహాయులు, బలహీనులు అయిన ప్రజల నుండి ఓట్లు కొనుక్కొని ప్రభుత్వాలను మేమే ఏర్పాటు చేస్తాం. వాళ్లు బిచ్చగాళ్లు – కృపలాని.

అప్పుడు నా ప్రజలు బిచ్చగాళ్లు గాదు వాళ్ల ఓట్లను అడుక్కునే మీరే అతి పెద్ద బిచ్చగాళ్లు – అంబేద్కర్.

ఓటు ద్వారా ప్రభుత్వాధినేతను ఎన్నుకునే విధానాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన సందర్భంలో అంబేద్కర్‌కు కృపలానికి మధ్య జరిగిన ఆసక్తికర చర్చ అది. ఈ దేశంలో రాక్షసుల కడుపులో నుండి రాజులు పుట్టేవారు ఇప్పటివరకు, ఇకనుండి ఓటు ద్వారా బ్యాలెట్ బాక్స్‌లో నుండి రాజులు పుట్టేలా చేశానని అంబేద్కర్ అన్నప్పుడు వారి మధ్యసాగిన సంభాషణా సారాంశమది.

ప్రజాస్వామ్యంలో రంగు వెలిసిన పార్టీలు – సిద్ధాంతాలు

అతిపెద్ద ప్రజాస్వామ్యంలో అంబేద్కరిచ్చిన ఓటు అనే ఆయుధం ఎప్పుడో మొక్కవోయింది. ఈ దేశంలోని ఏలికలు ప్రజలను బిచ్చగాళ్లను చేసి ప్రజాస్వామ్యాన్ని ఎన్నికల్ని ఓటును అపహాస్యం చేశారు. ఈ దేశంలో బహుళపార్టీ వ్యవస్థతో ప్రజాస్వామ్య వ్యవస్థ పరిఢవిల్లుతుందని భావించారు తొలితరం నాయకులు. కాని రానురాను పార్టీలు వ్యవస్థాపిత సిద్ధాంతాలకు నైతిక విలువలకు తిలోదకాలిచ్చాయి. తొలినాళ్లలో కాంగ్రెస్ కమ్యూనిస్టులు మాత్రమే ఎన్నికల్లో పోటీపడి ప్రతినిధుల్ని ఎన్నుకోవడానికి సిద్ధాంత ప్రాతిపదికన పోరాటం చేసేవారు. గెలిచినా ఓడినా, అధికారం ఉన్నా లేకపోయినా సిద్ధాంతాలకు కట్టుబడి బాధ్యాతాయుతంగా ప్రజల ఆశలు ఆశయాలకనుగుణంగా నడుచుకునేవారు.

అనంతర కాలంలో రాష్ట్రాల్లో స్థానిక సమస్యల పట్ల కేంద్రంలో ఉన్న ప్రభుత్వాల శీతకన్నుతో ప్రాంతీయ భావాల వెల్లువతో అస్థిత్వ పోరాటాలు మొదలై క్రమంగా అవి రాజకీయ పార్టీలుగా సంతరించుకొని స్థానిక పార్టీలుగా వేళ్లానుకున్నాయి.. అవి అక్కడి ప్రజల మనోభావాల కనుగుణంగా నడుచుకోవడానికి కృషి చేస్తున్నట్లు తమ అస్థిత్వాన్ని స్థిరీకరించుకోవడం జరిగింది. అలాగే వివిధ కారణాలు అంటే కులం, మతం, వర్గం పేరుతో వ్యక్తిగత ప్రయోజనాలు నెరవేరని సందర్భాల్లో పలుపార్టీలు పుట్టుకొచ్చాయి. క్రమంగా ఏ సిద్ధాంతంతో ఏర్పడినా ఏ లక్ష్యంతో ఏర్పడినా చివరికి అధికారమే పరమావధిగా మారింది. అధికారం కోసం, అధికారం అనుభవించడం కోసం ఎన్ని పిల్లిగంతులైనా వేయడానికి పార్టీలు సిద్ధపడడం మొదలైంది. మరీ ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అటు మహారాష్ట్ర, గుజరాత్ నుండి బెంగాల్ దాకా దాదాపు దేశమంతా ప్రాంతీయ సమస్యల ప్రాతిపదికగా పార్టీలు వెల్లువెత్తి కాలక్రమంలో సిద్ధాంతాలు వదిలేసి రంగు వెలిసిపోయాయి.

ప్రజాప్రతినిధులు – విలువలు

ప్రజాస్వామ్యంలో పార్టీలే కీలకం. ప్రజలు ఆయా పార్టీల అభ్యర్థులను, స్వతంత్రులను చట్ట సభలకు పంపాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో జరిగే ఎన్నికల్లో ప్రజలు తమ ఆశలు నెరవేర్చే, ప్రజల పట్ల, ప్రజాసేవ పట్ల అంకితభావం కల్గిన నాయకునిగా భావించి తమకు నచ్చిన పార్టీ అభ్యర్థిని తమ ప్రతినిధిగా ఎన్నుకోవడం జరుగుతుంది. అంటే ఆ ప్రజా ప్రతినిధి ఆ నియోజక వర్గంలోని ప్రజల ఓట్లతో జన్మించినవాడు. ప్రజాప్రతినిధిగా వేలాదిమంది ఆశలకు ప్రాతినిధ్యంగా నిలబడాల్సినవారు తన పుట్టుకను కాలరాసి, ప్రజల మనోభావాలను కాలదన్ని పార్టీ సిద్ధాంతాలకు నీళ్లొదిలి స్వప్రయోజనాల కోసమో, అధికారం కోసమో నిస్సిగ్గుగా పార్టీలు మారుతున్నారు. నైతిక విలువలకు నమ్ముకున్నవారికి పంగనామాలు పెట్టి ఫిరాయింపుదారి పట్టడం ప్రజలను మోసం చేయడం గాక మరేమవుతుంది. వీళ్లకు రాజ్యాంగం మీద, రాజకీయ విలువల మీద, ప్రజాస్వామ్యం మీద కనీస గౌరవం లేదని ప్రజలు నవ్వుకోవడం తప్ప ఏం చేయగలరు. ఇప్పుడు దేశంలో నీతిమాలిన వర్తమాన రాజకీయ చరిత్ర నడుస్తోంది.

పార్టీలు – పరస్పర ఫిరాయింపులు

అంకెల గారడీ ప్రజాస్వామ్యంలో వ్యక్తిత్వం లేని వ్యక్తులు కేవలం అంకెలుగా మిగిలిపోతున్న తరుణంలో ప్రజాస్వామ్యం తెల్లబోతోంది. ఒక పార్టీలో ఒక పార్టీ గుర్తు మీద గెలిచి, వాళ్లకోసం రాత్రింబవళ్లు కష్టపడి చివరికి కొట్లుకు చచ్చి పగిలిన తలల రక్తపు గాయాలు ఆరకముందే మరోపార్టీలోకి మారడం నిర్లజ్జగా జరిగిపోతోంది. నిజానికి ఒక పార్టీ అధికారానికి కావాల్సిన అంకెలతీరానికి చేరువగా ఉన్నప్పుడు ఒకటో రెండో అవసరమైతే అభ్యర్థించి, సిద్ధాంత ప్రాతిపదికన ఒప్పించో అధికార పీఠాన్ని అధిరోహిస్తే ప్రజలు కూడా కాసింత సంతోషించేవారు. అంతేగాని తనకుతానే అధికారం కోసం మారిపోవడం, ఎదుటివాడు రమ్మనగానే ఎగేసుకొని వెళ్లడం ఒక ప్రజాప్రతినిధికి ఉండాల్సిన లక్షణం కాదు.

ఫిరాయింపులకు ఎవరిని తప్పుపట్టాలి? పార్టీలనా? వ్యక్తులనా? రమ్మని పిలిచేవారినా? ఎటువంటి జంకూగొంకూ లేకుండా ఫిరాయింపుకు పాల్పడేవారే ప్రథమ దోషులు ప్రధాన దోషులు కూడా. ఐతే పార్టీలు ఇందుకు అతీతమేమీకాదు. రాజకీయ స్థిరత్వం పేర ఇతర పార్టీల ప్రతినిధులను తమ పార్టీలకు ఆహ్వానించడం కూడా నైతిక నేరమే. ఎదుటి పక్షాన్ని నిర్వీర్యం చేసే క్రమంలో ప్రతిపక్షమే లేకుండా చేయాలనుకోవడం అత్యంత దుర్మార్గం. ఇటీవల తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో జరిగిన ఫిరాయింపుల పర్వం ఇటువంటిదే.

గతంలో ఉద్యమకాలంలో కాంగ్రెస్ పార్టీ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జరిగిందిదే. తనకు కావాల్సినంత బలం ఉన్నా ఎదుటివారి ఉనికి లేకుండా చేయాలనే తలంపు ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు లాంటిది. ఎంతోమంది టిఆర్ఎస్ ప్రజాప్రతినిధుల్ని వై.ఎస్. రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ పార్టీలో కలుపుకోవడం అనంతరకాలంలో రాష్ట్రావిర్భావం తర్వాత అధికారంలోకి వచ్చిన టిఆర్ఎస్ అదే మార్గాన్ని ఎంచుకుంది. అదేమంటే గతంలో నాకు చేయలేదా? పైగా కొత్త రాష్ట్రం కనుక రాజకీయ స్థిరత్వం కోసం మేం కృషి చేస్తున్నాం అంటూ వల్లించడం మొదలుపెట్టింది. 2014 నాటి పరిస్థితి అట్లాంటి ప్రోత్సాహానికి ఊతమిచ్చిందా, 2019 ఎన్నికల్లో కావాల్సినంత మెజారిటి సంపాదించినా ప్రతిపక్షాన్ని మిగలనీయ కూడదనుకోవడం కక్షపూరితమైన నిరంకుశత్వానికి పరాకాష్ఠే కాకుండా ప్రజల పక్షాన పోరాడే గొంతుక లేకుండా చేయడమే అందులోని ఆంతర్యం.

నిజానికి ప్రతిపక్షం, ప్రజావ్యతిరేకమైన ప్రభుత్వ విధానాలను ఎప్పటికప్పుడు కనిపెట్టి విధాన పరమైన సిద్ధాంతాల నుంచి విలువల ఆధారంగా విమర్శిస్తూ, ప్రభుత్వ తప్పుడు విధానాలపై ప్రజలను చైతన్యపరుస్తూ ప్రజాఉద్యమాలు నిర్మాణం చేయడం ప్రతిపక్షం బాధ్యత. కాని అధికారానికి దూరమైన అరఘడియ కూడా భరించలేని స్థితిలో కొంతమంది ఉన్నారు. వాళ్లకు పార్టీతో సంబంధం లేదు. అలాంటి వారు కేవలం చెట్టుపేరు చెప్పుకొని కాయలమ్ముకోవడానికే పార్టీలోకి వస్తారు. వాళ్లకు ఏ పార్టీ అయినా ఒక్కటే. అధికారంలో ఉండాలి అంతే. కాగా ప్రభుత్వం తను చేస్తున్న పనులకు అడ్డు తగలకుండా ఉండడానికి అవతలి పార్టీ ప్రతినిధులకు అడ్డుకట్ట వేయడానికి ఎన్ని కుయుక్తులైనా పన్నడానికి సిద్ధమవుతుంది. గెలిచిన మరుక్షణం నుండే బేరసారాలు మొదలుపెట్టడం, వారి ఆస్తిపాస్తులపై నిఘావేయడం రాజ్యాంగబద్ధ వ్యవస్థల ద్వారా ఒత్తిళ్లు తేవడం అనివార్యంగా పార్టీ మారే దుస్థితికి నెట్టివేయడం తద్వార నోరు కట్టివేయడం జరుగుతోంది. ఇట్లా తమ వ్యక్తిగత ప్రయోజనాలకో బలవంతంగానో లేక బలహీన పరిస్థితుల్లోనో పార్టీలు మారడం సులభమై పోయింది. ఇది ప్రజల అభిమానానికి పాతర వేయడమే కాదు నమ్మిన ప్రజలను నయవంచన చేయడమే. ఇందుకు అన్ని పార్టీలు నిందార్హమైనవే.

ఎందుకిలా జరుగుతోంది?

అధికారదాహం, స్వార్థం, డబ్బు, స్వప్రయోజనాలే ఫిరాయింపులకు మూలమవుతున్నాయి. రాజకీయ నాయకులు పదవికోసం వ్యక్తిత్వాన్ని విలువలను ఫణంగా పెట్టిన తర్వాత ఎవరైనా వారిని ఉపయోగించు కోవాలనుకోవడంలో ఆశ్చర్యమేముంటుంది. కుంభకోణాలకు పాల్పడడం, అక్రమాలకు, కబ్జాలకు దిగడం, ప్రభుత్వం కన్నుగప్పి చేస్తున్న వ్యాపారవేత్తలు ప్రజాప్రతినిధులైనపుడు తమ ఉనికిని కాపాడుకోవడానికి ఫిరాయింపులకు తలవంచడం పరిపాటైపోయింది. దీనికితోడు అధికారంలో ఉన్నవారు బెదిరింపులకు దిగడం, ఊపిరి సల్పకుండా చేయడంతో పార్టీ మారే స్థితికి దిగజారిపోవడం జరుగుతుంది. అధికారబలం, అర్థబలం ఇందుకు తోడ్పడుతోంది. అంతేగాక ప్రజాభీష్టం మేరకు ఎన్నికైనవాడు పార్టీ మారినా తన పదవి పోతుందనే భయం లేకపోవడం మరొక కారణం. సాధారణంగా మెజారిటి గల పార్టీ అధికారం హస్తగతమైన తర్వాత సభ నిర్వహణకు ఎన్నుకునే స్పీకర్ కూడా అధికార పార్టీకి చెందిన వారే అవుతారు కనుక ప్రజాప్రతినిధుల ఫిరాయింపులపై నిర్ణయం స్పీకర్‌దే కనుక నిర్భయంగా పార్టీ మారడం జరిగిపోతుంది. రాజీనామాలిచ్చినా ఆమోదం పొందేవన్నీ భరోసా, పదవీ కాలమంతా పార్టీ మారినా పదవి పోకుండా అధికారాన్ని అనుభవించే వెసులుబాటు లభిస్తుంది గనుక ఇలా జరిగిపోతుంది. గత ఆంధ్రప్రదేశ్, తెలంగాణా శాసనసభా కాలమే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. అధికారంలో ఉన్న పార్టీకి ఉండే వెసులుబాటు, కూడ బెట్టుకునే సౌకర్యం ప్రతిపక్షానికి ఉండదు. అంతమాత్రాన పార్టీ మారడం సమంజసం కాదు. కాగా గల్లీ నుండి ఢిల్లీ దాకా వార్డుమెంబరు నుండి ప్రధానమంత్రి దాక పార్టీ ఫిరాయింపులకు వస్తాను పలుకుతూ తమ పార్టీల ద్వారాలు బార్లాతెరిచి ఉంచామని నిస్సిగ్గుగా మాట్లాడుతుంటే ప్రజలు ఎవరిని నిందించాలి?

ఏం చేయాలి? ఎలా చేయాలి?

పార్టీలు మారినపుడు తమ బలగం పలుచబడుతున్నప్పుడు నెత్తినోరూ కొట్టుకుంటూ గవర్నర్ బంగళాకో, న్యాయస్థానానికో పరుగులు పెడతాయి. ఆయా పార్టీలు, పార్టీ ఫిరాయింపులు ఆపండనో, వారి పదవులు రద్దు చేయమనో కోరుతాయి. నిజానికి ఏ పార్టీ చిత్తశుద్ధితో పార్టీ ఫిరాయింపుల నిరోధానికి కృషి చేయడం లేదు. ఎందుకంటే రేపు అవి చేసేది అదే పని గనుక. ఈ ఫిరాయింపులు మొత్తం రాజకీయ వ్యవస్థనే భ్రష్టు పట్టిస్తున్నాయి. దీన్ని నిరోధించాలంటే పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని బలోపేతం చేయాలి. ఏదో ఒక దశలో ఈ చట్టం రూపుదిద్దుకొని నిర్దాక్షిణ్యంగా అమలు జరగకపోతే భారతదేశం అప్రజాస్వామిక ఇష్టారాజ్యమై అంతర్జాతీయంగా అభాసుపాలైపోయే ప్రమాదం ఉంది. ఈ చట్టానికి రాజకీయ పార్టీలు చేయూత నివ్వడం దురాశే అవుతుంది గనుక ఎవరు పూనుకోవాలి? అందుకు వోటర్లు ముందుకు రావాలి. రాజకీయ నిబద్ధత గల నాయకులు ముందుకు రావాలి. బాధిత పార్టీలు ప్రజల దగ్గరికి వెళ్లాలి. ప్రజలు అసంఘటితంగా ఉంటారు కాబట్టి వారిని సంఘటితపరిచి ప్రజా ఉద్యమాలు నిర్మించాలి. ఫిరాయింపుదారు లపై ఒత్తిడి తెచ్చేలా ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాన్ని తీసుకురావాలి. శాసనసభ్యుల నైతిక ప్రవర్తనా నియమావళిని రూపొందించాలి. డబ్బు ప్రాధాన్యతను తగ్గించి అధికారదాహం కోసం వెంపర్లాడే వాళ్లకు టిక్కట్లు ఇచ్చే సంస్కృతికి చరమగీతం పాడాలి. రాజకీయ పార్టీలు ప్రజల మనోభీష్టాలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే వాటి ద్వారా ఎంపికైన ప్రజా ప్రతినిధుల పదవిని రద్దు చేసేలా ప్రజల చేతిలో రీకాల్ చేసే అధికారం ఉండాలి.

ముగింపు

ఇటీవల పార్టీ ఫిరాయింపులపై చాలాచోట్ల భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వల్లె వేస్తున్నట్లు నిజంగానే పార్టీ మారగానే పదవి కోల్పోవాలి. విశ్వసనీయతలేని నాయకులు రాజకీయాల్లో ఉండే అర్హతను కోల్పోవాలి. భారత ప్రజాస్వామ్యంలో ఆందోళనకరంగా మారిన పార్టీ ఫిరాయింపులు విలువలకు విశ్వసనీయతకు నిలువెత్తు పాతరేస్తున్నాయి. ఈ ధోరణి మారకపోతే విధ్వంసకర రాజకీయ భూకంపాలకు ఈ నేల గురిగాక తప్పదు. ఈ పరిణామాలకు స్వస్తి పలుకకపోతే, సరికొత్త ప్రమాణాలు నెలకొల్పుకోకపోతే నైతిక విలువలకు, రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండకపోతే ఆచరణీయం కాని రాజకీయమే రాజ్యమేలడం కాయం.

(రచయిత ఉపాధ్యాయులు, డిటిఎఫ్ సభ్యులు) వీ

కోర్టు తీర్పులు - న్యాయాన్యాయాలు

***న్యాయస్థానాల్లో తీర్పులకు ఏళ్లతరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉందనీ, చివరకు సామాన్యులకు న్యాయం అందకుండా పోతున్నదనీ, న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసం సన్నగిల్లుతోందనీ, అవి రాజకీయ స్వార్థ ప్రయోజనాలకే ఎక్కువగా ఉపయోగపడుతున్నాయనీ అంటున్నారు* లోకే రాజ్ పవన్**

గుజరాత్ మారణహోమం జరిగి 27 సంవత్సరాలు గడిచి పోయాయి. అయినా ఆ మతోన్మాదపు భయోత్పాత నీడలు ఇంకా దేశమంతటా పరుచుకునే ఉన్నాయి. ఆ మారణహోమపు మెట్ల మీది నుంచే నరేంద్రమోడీ గుజరాత్ ముఖ్యమంత్రి స్థాయి నుంచి ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగాడు. మరోవైపు ఆ అల్లర్ల బాధితులకు సంబంధించిన కేసులు మాత్రం దీర్ఘకాలంగా జాప్యానికి గురవుతూ బాధితులకు నిరాశ కలిగిస్తూనే వస్తున్నాయి. అయితే ఈ దరిమిలా ఇటీవల బిల్కీస్ బానో కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కొందరికి ఊరటను, మరికొందరికి బాధను కలిగించింది. ఒకసారి ఈ కేసు పూర్వాపరాలను చూద్దాం.

2002 ఫిబ్రవరి 27న అయోధ్య నుంచి అహ్మదాబాద్‌కు వెళ్లే సబర్మతి ఎక్స్‌ప్రెస్ ప్రయాణికుల సామర్థ్యం 1100 కాగా ఆ రోజున అందులో దాదాపు పదిహేదు వందల మంది కరసేవకులు ప్రయాణించారు. మరో 300 మంది ఇతరులు ప్రయాణించారు. కరసేవకుల సంఖ్య ఎక్కువగా ఉన్న ఈ రైలు ఆగిన ప్రతి స్టేషన్‌లోనూ కరసేవకులు కిందకు దిగుతూ పెద్దపెట్టున 'మందిర్ వహీ బనాయేంగే', జైశ్రీరామ్, 'ముస్లిం భారత్ చోడో', 'దూద్ మాంగే తో ఖీర్ దేంగే-కశ్మీర్ మాంగేతో చీర్ దేంగే' లాంటి ఉద్రేకపూరిత నినాదాలు చేస్తూ దుందుడుకుగా వ్యవహరిస్తూ వచ్చారు. అంతేకాకుండా రైలులోని రిజర్వ్‌డ్ సీట్లను కూడా వాళ్లే ఆక్రమించుకున్నారు. రైలు గోద్రా స్టేషన్లో ఆగాక అక్కడ ఒక యువతితో అసభ్యంగా ప్రవర్తించారు. రైలులోకి లాక్కుపోయే ప్రయత్నం చేశారు. కానీ స్థానిక ముస్లిం అమ్మకందారులు జోక్యం చేసుకొని ఆమెను విడిపించారు.

గోద్రా స్టేషన్ దాటాక, కొందరు కరసేవకులు ఇంకా రైలు ఎక్కలేదని రైలులో ఎవరో చైన్ లాగారు. కరసేవకులు ఎక్కాక మళ్లీ రైలు బయలుదేరింది. అయితే సిగ్నల్ పాలియా దగ్గరికి వచ్చాక మళ్లీ రైలు ఆగిపోయింది. ఈసారి ఎవరైనా చైన్ లాగారా లేదా దానంతట అదే రైలు ఆగిపోయిందా అనే విషయంపై స్పష్టత లేదు. రైలు ఆగగానే బయట నుంచి కొందరు ఆ రైలుపై రాళ్లు రువ్వారు. ఈ రాళ్ల దాడి నుంచి తప్పించుకోవడానికి ప్రయాణికులు అద్దాలు, తలుపులు పెట్టుకున్నారు.

నిజానికి రైలు ప్రయాణించే చోటు భూమికి దాదాపు 10 నుంచి 15 ఫీట్ల ఎత్తులో ఉంటుంది. అంత ఎత్తుకు కింది నుంచి రాళ్లు రువ్వడం చాలా కష్టసాధ్యమైన పని. ఒకవేళ రాళ్లు రువ్వాలంటే, రువ్వినట్టు చెబుతున్న ఆ రెండువేల మంది అంత ఎత్తుకు వచ్చి రాళ్లు వేయాల్సిందే. కానీ అది అసాధ్యం. ఎందుకంటే ఆ ఎత్తులో రైలు ముందు అంతమంది నిలుచునే స్థలమే లేదు. కనుక ఈ రాళ్లు ఎక్కడి నుంచి వేశారు, ఎవరు వేశారు అనే విషయంపైన స్పష్టత లేదు. ఇదిలా ఉండగా ఉన్నట్టుండి ఎస్-6 బోగీలో మంటలు చెలరేగాయి. అప్పటికే కిటికీలు, తలుపులు మూసి ఉండడంతో ఆ బోగీలో ఉన్న ప్రయాణికులు ఎటు వెళ్లాలో అర్థం కాని పరిస్థితిలో అయోమయంలో పడిపోయారు. మగవాళ్లు వెస్టిబ్యూల్ మార్గాల ద్వారా బయటికి వచ్చారు. కానీ అలా రాలేని మహిళలు, చిన్నపిల్లలు ఆ బోగీలో ఇరుక్కుపోయారు. మొత్తం 59 మంది మరణించారు.

అయితే ఈ మొత్తం వ్యవహారంలో అనేక అనుమానాలు కలుగు తున్నాయి. మొత్తం 11 బోగీలు ఉన్న ఆ రైలులో కేవలం ఎస్-6 బోగీ మాత్రమే ఎందుకు తగలబెట్టారు? రెండువేల మంది ముస్లింలు కరసేవకులను లక్ష్యం చేసుకుంటే, వాళ్లు రైలు అంతటా ఉండగా కేవలం ఎస్-6 బోగీ మాత్రమే ఎందుకు తగలబెట్టారు? తప్పించుకొని బయటికి వచ్చిన కరసేవకుల మీద ఎలాంటి దాడులు జరగలేదు. ఒకవేళ కరసేవకులు లక్ష్యంగా చేసుకుంటే దాడులు జరగాలి కదా! ఈ అనుమానాలన్నీ చూస్తుంటే ఈ పని అక్కడ ముస్లింలు చేసిందిగా కాకుండా ప్రణాళికాబద్ధంగా శాంతిభద్రతలను విఘాతపరచడానికి ఇంకెవరో చేసిందిగా కనిపిస్తుంది.

ఆ తర్వాత గోద్రాలో ముస్లింలు కరసేవకులను చంపారని ప్రచారం చేస్తూ గుజరాత్‌లోని అనేక ప్రాంతాల్లో విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ కార్యకర్తలు దాడులకు దిగారు. అప్పటికే అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడీని హత్య చేయడానికి పూనుకున్నారనే కారణంగా పదహారు సంవత్సరాల ఇష్రత్ జహాన్‌ను, ఆ తర్వాత సోహ్రాబుద్దీన్‌ను, అతని భార్య కౌసర్‌బిని అత్యాచారం చేసి బూటకపు ఎన్‌కౌంటర్‌లలో చంపించిన నరేంద్రమోడీ, అమిత్ షాల జోడి వాటికి కొనసాగింపుగా ఈ పోస్ట్ గోద్రా అల్లర్లను దగ్గరుండి ప్రణాళికాబద్ధంగా నిర్వహింపచేశారు.

బిజెపి దాని అనుబంధ సంస్థల కార్యకర్తలు, పోలీసులు, అధికార యంత్రాంగం మొత్తం ఈ అల్లర్లకు ప్రత్యక్షంగా, పరోక్షంగా తమ మద్దతునిచ్చాయి. ఈ దాడులు కేవలం ముస్లింలు, వారు నివసించే ప్రాంతాలు, వారి దుకాణాలు, వారి నివాసాలు లక్ష్యంగా సాగాయి. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 6 వరకు సాగిన ఈ దాడుల్లో వేలాది మంది ముస్లింలు మరణించారు. వేలాది మంది గాయపడ్డారు. ఎంతోమంది రెఫ్యూజీ క్యాంపుల్లో తలదాచుకున్నారు.

అహ్మదాబాద్ గుల్బర్గా హౌసింగ్ సొసైటీలో మాజీ ఎంపి, కాంగ్రెస్ నాయకుడు ఎహసాన్ జాఫ్రీని ఆయన భార్య, స్థానికుల ముందే చంపారు. తనను కాపాడమని ఆయన ఎల్‌కె అద్వానీ (అప్పటి కేంద్ర హోమ్ మంత్రి), నరేంద్రమోడీలకు, స్థానిక పోలీసులకు దాదాపు 200 సార్లు ఫోన్ చేసినా వాళ్లు ఎవరూ స్పందించలేదు. అతన్ని చంపాక అతని ఇంటిని తగులబెట్టారు. ఆయన భార్య జకియా జాఫ్రీ, కుమార్తె మిష్రిన్ జఫ్రీలు ఇప్పటికీ న్యాయ పోరాటం చేస్తున్నారు. నరోడా పాటియాలో 15 వేల మందితో కూడిన సాయుధ గుంపు స్త్రీలను, పిల్లలను

మూకుమ్మడిగా చంపింది. దాదాపు 150 మందికి పైగా మరణించారు. నరోడాలో పళ్ల మార్కెట్లపై పడి అక్కడి ముస్లిం వ్యాపారస్తులను చంపారు. అహ్మదాబాద్ వడోదరా చుట్టుపక్కల అన్ని ప్రాంతాల్లోనూ ముస్లిం నివాసాలపై దాడులు చేశారు. వడోదరలో బెస్ట్ బేకరీ వద్ద 14 మందిని సజీవంగా దహనం చేశారు. జహీర షేక్ కుటుంబాన్ని ఆమె భర్తతో సహా బెస్ట్ బేకరీలో తగలబెట్టారు.

ఇక ఇప్పటి కేసులో బాధితురాలైన బిల్కిస్ బానో పైన అత్యాచారం చేసి ఆమె కుటుంబ సభ్యులను 14 మందిని చంపేశారు. బిల్కిస్ బానో గుజరాత్‌కు చెందిన ఓ సాధారణమైన ఇల్లాలు. అహ్మదాబాద్‌కు దగ్గరలోని దహోద్ జిల్లా రంధికాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి. అది ఆమె పుట్టిల్లు. ఆ నాటికి ఆమె వయసు 19 సంవత్సరాలు. మూడున్నర సంవత్సరాల ఒక పాప ఉండగా అప్పటికి ఆమె ఐదు నెలల గర్భవతి కూడా. గుజరాత్‌లో చెలరేగుతున్న అల్లర్ల సందర్భంలో దుండగులు వాళ్ల ఇల్లును తగలబెట్టగా వాళ్ల కుటుంబం అంతా మొదట ఆ గ్రామ సర్పంచ్ ఇంట్లో, తర్వాత చునాడి అనే గ్రామంలోని పాఠశాలలో, తర్వాత కువ్జాల్ అనే గ్రామంలోని ఒక మసీదులో ఆశ్రయం పొందారు. ఈ రోజుల్లోనే ఆమెకు వరుస చెల్లెలు అయిన షమీంకు ఒక మంత్రసాని ఇంట్లోనే ప్రసవం అయి పాప పుట్టింది.

ఆ తర్వాత సురక్షితంగా ఉండడానికి దగ్గరలోని ముస్లిం మెజారిటీ గ్రామమైన పెన్నివల్ వరకు వెళ్లడానికి ఎవరికీ తెలియని ఒక అడవి మార్గం గుండా ట్రక్కులో తన 17 మంది కుటుంబ సభ్యులతో కలిసి పారిపోతుండగా మార్చ్ 3న వారిపై రెండు లారీల గుంపులు దాడి చేశాయి. ఆమె కుటుంబ సభ్యులు 14 మందిని వాళ్లు చంపేశారు. మూడున్నర సంవత్సరాల ఆమె పసి కూతురు సలేహా తలను నేలకు బాది క్రూరంగా చంపేశారు.

బిల్కిస్‌పై ముగ్గురు అత్యాచారం చేశారు. నిజానికి వాళ్లు ఆమె ఇంటి చుట్టుపక్కల ఉండే వాళ్లే. అత్యాచారం జరుగుతుండగా వారిని అడిగింది, 'రోజూ నేను మిమ్మల్ని చూస్తుంటాను, మీరు మా ఇంటికి పాల కోసం వస్తుంటారు, నేను మిమ్మల్ని చాచా అని పిలుస్తుంటాను, మరి మీరెందుకు నాపై ఈ విధంగా చేస్తున్నారు' అని అడిగింది. అయినా కనికరం లేని వాళ్లు ఆమెపై క్రూరంగా అత్యాచారం జరిపారు. చనిపోయిందనుకుని వదిలిపెట్టి వెళ్లిపోయారు. కానీ ఆమె చనిపోలేదు. స్పృహ మాత్రం కోల్పోయింది.

మూడు గంటల తర్వాత స్పృహలోకి వచ్చింది. పక్కనున్న లంగా వేసుకుని దగ్గరలోని కొండ వెనుక దాక్కుంది. మరుసటి రోజు దగ్గర ప్రాంతంలోని ఓ గిరిజన గ్రామానికి వెళ్లింది. అక్కడ ఒక కుటుంబం ఆమెను చేరదీసింది. అక్కడి మహిళలు ఆమెకు బట్టలు ఇచ్చారు. ఆ తర్వాత ఆమె లింఖేడా పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. జరిగిన దారుణంపై ఆమె పోలీసులకు కంప్లైంట్ చేసింది. కానీ కేసు నమోదు చేసుకోవడానికి పోలీసులు నిరాకరించారు. హెడ్ కానిస్టేబుల్ సోమభాయ్ గోరా కేసు నమోదుకు అస్సలు ఒప్పుకోలేదు. సరైన సాక్ష్యాధారాలు లేవన్నారు. కేసు పెట్టమని ఒత్తిడి తెస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించారు. ఆమెను స్థానిక పునరావాస శిబిరానికి పంపించారు. బిల్కిస్ భర్త కూడా ఆమెను అక్కడే కలుసుకున్నాడు.

ఈ వ్యవధిలో అంటే రెండు రోజుల తర్వాత విషయం అంతా మీడియా వాళ్లకు తెలిసింది. దాంతో పోలీసులు కేసు నమోదు చేసుకోక తప్పలేదు. కేసు నమోదు అయ్యాక రెండు రోజులకు ఆమెను గోధ్రా సివిల్ ఆసుపత్రికి వైద్య పరీక్షల నిమిత్తం పంపించారు. మరోవైపు చనిపోయిన ఆమె కుటుంబ సభ్యులకు సరైన సమయంలో పోస్టుమార్టం నిర్వహించలేదు. దాంతో శవాలు కుళ్లిపోయాయి. ఆ కుళ్లిన శవాలనే ఎవరికీ తెలియకూడదని వాటి తలలను తీసేసి, ఎవరూ గుర్తించకుండా త్వరగా శిథిలం కావడం కోసం శరీరాల్లో ఉప్పును కూరి జనాలు ఎవరు వెళ్లలేని దుర్భరమైన ప్రదేశంలో, ఒక దట్టమైన అడవిలో, ఒక కుంటలో ఒక శవం మీద మరొక శవాన్ని వేసి ఇతర సామూహిక శవాల మధ్యలో పూడ్చి పెట్టారు. పోలీసులకు భయపడి ఇవన్నీ స్థానికులే చేసినట్టు ఆ తర్వాత తెలిసింది.

అయినా సరే ఆమె మొండిగా నిలబడింది. ఆమె భర్త యాకూబ్ రసూల్ ఆమెకు చేదోడుగా నిలిచాడు. కానీ ఏడాది తర్వాత తగిన ఆధారాలు లేవంటూ మెజిస్ట్రేట్ కేసును మూసివేశారు. దాంతో 2003 డిసెంబర్‌లో ఆమె నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు వెళ్లింది. న్యాయం చేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ ఆధారంగా కేసుపై విచారణ జరపాల్సిందిగా సుప్రీంకోర్టు సిబిఐని ఆదేశించింది. అహ్మదాబాద్‌లో విచారణ ప్రారంభమైంది.

అయితే సాక్షులను తారుమారు చేయడం, వారికి హాని చేయడం లాంటి చర్యలను సిబిఐ చేస్తుందేమో అనే అనుమానంతో విచారణను ముంబై హైకోర్టుకు మార్చమని ఆమె కోరింది. ఆమె కోరిక మేరకు కేసు విచారణను అహ్మదాబాద్ నుంచి ముంబైకి మార్చారు. జనవరి 2004లో సిబిఐ నిందితులందరినీ అరెస్టు చేసింది. శవాన్ని తవ్వి తీసి కేసుకు అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించింది. అదే సంవత్సరం 13 మందిని దోషులుగా నిర్ధారిస్తూ ట్రయల్ కోర్టు తీర్పు చెప్పింది. వీరిలో 11 మందికి యావజ్జీవ శిక్ష పడింది. కోర్టు తీర్పును సవాలు చేస్తూ నిందితులు ముంబై హైకోర్టుకు వెళ్లారు.

దోషులుగా ట్రయల్ కోర్టు నిర్ధారించిన వారికి మరణశిక్ష విధించాలంటూ ముంబై హైకోర్టులో జూలై 2011లో సిబిఐ పిటిషన్ వేసింది. యావజ్జీవ శిక్షపడ్డ 11 మంది అప్పీళ్లపై ముంబై హైకోర్టు 2016 జూలైలో విచారణ ప్రారంభించింది. డిసెంబర్‌లో తీర్పును రిజర్వ్ చేసింది. దోషులుగా తేలిన మరో ముగ్గురికి మరణ శిక్ష విధించాలని కోరుతూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా తీర్పును రిజర్వ్ చేసింది. ట్రయల్ కోర్టు విధించిన 11 మందికి మే 2017లో యావజ్జీవ శిక్షను ముంబై హైకోర్టు ఖరారు చేసింది. కొంతమంది పోలీసులు డాక్టర్లను నిరపరాధులుగా పేర్కొంటూ కింది కోర్టు ఇచ్చిన తీర్పును తోసిపుచ్చింది. విధి నిర్వహణ చేయకుండా తప్పించుకొని, సాక్ష్యాలను తారుమారు చేసినందుకు గాను సెక్షన్ 218, 201ల కింద పోలీసులు, డాక్టర్లకు కూడా కోర్టు శిక్ష విధించింది.

అయితే దోషులుగా తేలిన ముగ్గురికి మరణ శిక్ష విధించాలని సిబిఐ చేసిన డిమాండ్‌ను ముంబై హైకోర్టు తోసిపుచ్చింది. హడావిడిగా పోస్టుమార్టం చేయడాన్ని, ఘటన జరిగిన మొదటి రోజే వైద్య పరీక్షలకు పంపకపోవడాన్ని, శరీరాలను కృశింప చేసే ప్రయత్నం చేయడాన్ని కోర్టు తీవ్రంగా తప్పు పట్టింది. ఈ శిక్షకు గురైన వారిలో ఒకరైన ఐపిఎస్ అధికారి రామ్‌సింగ్ బగోర తన శిక్షపై స్టే తెచ్చుకోవడానికి ప్రయత్నించగా కోర్టు అనుమతించలేదు.

అయితే బిల్కిస్ తన న్యాయ పోరాటాన్ని ఆపలేదు. ఈ 17 ఏళ్లలో ఆమె అనేక కష్టనష్టాలకు గురైంది. తరచు ఇల్లు మార్చాల్సి రావడం, పిల్లలను పదేపదే పాఠశాలలు మార్చాల్సి రావడం, బెదిరింపులకు గురికావడం, ఆ కారణంగా అజ్ఞాతంలో బతకాల్సి రావడం వంటి ఎన్నో కష్టాలను, ఇబ్బందులను ఎదుర్కొన్నది. అయినా ఆమె ఏనాడూ ధైర్యాన్ని కోల్పోలేదు. కాలానికి ఎదురొడ్డి నిలిచింది. ఈ క్రమంలో తనకు నష్టపరిహారంగా ఇచ్చిన ఐదు లక్షల రూపాయలను తిరస్కరించింది.

17 సంవత్సరాల అలుపెరుగని పోరాటం తర్వాత 50 లక్షల రూపాయల పరిహారంతో పాటు సర్కారీ ఉద్యోగం, ఉండడానికి ఇల్లు ఏర్పాటు చేయాలని తాజాగా ఏప్రిల్ 23న సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఆమె కోరుకున్న ప్రాంతంలో ఉండడానికి ఏర్పాట్లు చేయాలని ఏప్రిల్ 23న జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ సంజీవ్ కన్నాల ధర్మాసనం సర్కారును ఆదేశించింది. అయితే నిందితులకు శిక్ష పడిందని కొందరు సంతోషిస్తున్నా అసలు నిందితులు మాత్రం ఇప్పటికీ తెరవెనకే ఉన్నారు.

విషాదం ఏమిటంటే ఆ మారణహోమాన్ని నిర్వహించిన అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడీ ఈ రోజు దేశానికి ప్రధాన మంత్రిగా ఉన్నాడు. అప్పటి అమిత్ షా ఈ రోజు దేశాన్ని పాలిస్తున్న ప్రధాన రాజకీయ పార్టీ భారతీయ జనతా పార్టీకి జాతీయ అధ్యక్షుడిగా ఉన్నాడు. 17 సంవత్సరాల సుదీర్ఘ కాలం తర్వాత బిల్కిస్ బానోకు న్యాయం జరిగిందని చాలామంది సంతోషిస్తున్నారు. గాని కేవలం పాత్రదారులకు మాత్రమే శిక్ష పడింది గానీ, సూత్రధారులు ఇంకా బహిరంగ జీవితంలో శిక్షలు పడకుండా మిగిలే ఉన్నారని గుర్తించవలసియున్నది. మొత్తంగా ఒక నిరక్షరాస్యురాలైన, ఒక సాదాసీదా గృహిణి అయిన ఒక మహిళ న్యాయం కోసం మొక్కవోని ధైర్యంతో ఉన్మాద రాజకీయాలతో తలపడుతూ 17 సంవత్సరాలు సుదీర్ఘ పోరాటం చేయడం మాత్రం ఈ దేశంలో జరుగుతున్న మరెన్నో న్యాయ పోరాటాలకు ఊతమివ్వగలదు.

దీర్ఘకాలికంగా కోర్టులో కొనసాగిన మరో కేసు గురించి ఇప్పుడు చూద్దాం. పనాయికులం సిమీ కేసుగా చెప్పబడే ఈ కేసు పూర్తి బూటకమైన కేసు. 2006 ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం రోజున అబ్దుల్ రాసిక్, నిజాముద్దీన్, షమ్మస్‌లను నిషేధిత స్టూడెంట్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి) తో సంబంధాలు కలిగి ఉంటూ ఆ సంస్థ సభ్యులతో ఒక రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేశారనే కారణంతో కేరళలోని కొచ్చికి సమీపంలోని పనాయికులంలో అరెస్టు చేశారు. ఈ అరెస్టును నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) నిర్వహించింది.

నిజానికి పై ముగ్గురు అక్కడ 'భారత స్వాతంత్రోద్యమంలో ముస్లింల పాత్ర' అనే అంశంపై ఒక సెమినార్‌ను ఏర్పాటు చేశారు. అది కూడా పూర్తి బహిరంగంగా. కానీ దాన్ని ఎన్ఐఎ పూర్తిగా మార్చివేసి సిమీతో రహస్య సమావేశం ఏర్పాటు చేసినట్టుగా ఒక కల్పనను జోడించింది. ఇక అరెస్టు తర్వాత 13 సంవత్సరాలు వాళ్లు అన్యాయంగా జైలు జీవితం గడిపారు.

అబ్దుల్ రాసిక్ మలయాళం సాహిత్యంలో పోస్ట్ గ్రాడ్యుయేట్. జర్నలిజంలో శిక్షణ పొందినవాడు. అతని భార్య ఒక ఐటి ప్రొఫెషనల్. ఇంతటి ఉన్నత విద్యార్హతలు కలిగిన ఆ భార్యా భర్తలతో ఎన్ఐఏ చాలా అనాగరికంగా వ్యవహరించింది. సాధారణంగా ఎన్ఐఏ కేసుల్లో ముద్దాయిలను బలవంతంగా అప్రూవర్‌గా మారుస్తుంటారు. ఇక్కడ కూడా అదే జరిగింది. ఈ అక్రమ అరెస్టులను మీడియా చాలా అవమానకరంగా రిపోర్ట్ చేసింది. ముఖ్యంగా కేరళ కౌముది, మంగళం పత్రికలు చాలా అభ్యంతరకర కథనాలు ప్రచురించాయి. ఇదేమిటని రాసిక్ నేరుగా వెళ్లి అడగగా కించిత్తు పశ్చాత్తాపమైనా లేకుండా అది న్యూస్ ఏజెన్సీ వాళ్ల నుండి వచ్చిన వార్త అని బుకాయించారు.

అట్లా మీడియా వాళ్ల కుటుంబ పరువు మొత్తాన్ని బజారున పడేసింది. ఇక ఎన్ఐఏ, వాళ్లపై అన్ లాఫుల్ ఆక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్ (ఉపా), ఐపిసి 124-ఏ దేశద్రోహ చట్టం(సెడిషన్) కింద కేసులు నమోదు చేసింది. జైళ్లలో ఇలా అన్యాయంగా ఎన్ఐఎ చేత కేసులు మోపబడిన ఇతరుల సంఖ్య వందల్లో ఉంది. వాళ్లంతా ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గుతూ ఎన్ఐఏ కోర్టు చేత అన్యాయమైన తీర్పులకు గురవుతూ, తప్పుడు శిక్షలు అనుభవిస్తూ బతుకులీడుస్తున్నారు.

భోపాల్ జైలు ఇందుకు ఒకానొక ఉదాహరణ. ఆ జైలులో ఎక్కడెక్కడి ప్రాంతాల వాళ్లో ముస్లింలు, పేదలు అన్యాయమైన కేసుల్లో ఇరికించబడి తప్పుడు శిక్షను అనుభవిస్తుంటారు. చాలా కేసుల్లో లాగానే ఈ కేసు విషయంలోనూ ఎన్ఐఏ కోర్టు తీర్పు అదే తప్పుడు పద్ధతిలో వచ్చింది. నవంబర్ 2015లో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు వీరికి సిమీతో సంబంధాలు ఉన్నట్టుగా ధ్రువీకరిస్తూ శిక్ష విధించింది.

కానీ దాదాపు 13 సంవత్సరాల సుదీర్ఘ కాలం తర్వాత కేరళ హైకోర్టు తన ఇటీవలి 2019 ఏప్రిల్ 12న ఇచ్చిన తీర్పులో వీరిని నిర్దోషులుగా ప్రకటించింది. వీరు నేరం చేసినట్టుగా ఎలాంటి ఆధారాలు లేవంటూ, కేసు సాంతం ఎన్ఐఏ వ్యవహరించిన తీరును హైకోర్టు తప్పుపట్టింది. ఇట్లా తప్పుడు కేసులు బనాయించడాన్ని ప్రశ్నించకుండా ప్రత్యేక కోర్టు అమాయకులకు శిక్ష విధించడాన్ని హైకోర్టు 'సీరియస్ ఎర్రర్'గా పరిగణించింది.

అయితే ఈ కేసులో అమాయకులకు శిక్ష తప్పినందుకు సంతోషిస్తూనే, ఎన్ఐఎ తప్పుడు కేసుల బారినపడి జైళ్లలో మగ్గుతున్న అనేకమంది ఖైదీలకు కూడా విముక్తి కలిగించేలా కోర్టులు ప్రత్యేక చొరవ తీసుకుంటే గాని నిర్దోషులు అన్యాయపు కేసుల్లోంచి బయటపడే అవకాశం లేదు.

ఇలాంటిదే ఇటీవలి మరో కేసును కూడా చూద్దాం. అబ్దుల్ మిర్ ఒక మెడికల్ ప్రాక్టీషనర్. అతనిది చక్కని కుటుంబం. సంతోషవంతమైన జీవితం. కానీ 1994 మే 28న అతన్ని భూసావల్ పోలీసులు అన్యాయంగా అరెస్టు చేశారు. అయోధ్యలో బాబ్రీ మసీదును కాల్చిన ఘటనకు ప్రతీకారంగా అల్ జిహాద్ తంజీమ్ అనే సంస్థ ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నదని, అందులో పాలుపంచుకుంటున్నారని అభియోగాన్ని మోపి మిర్‌తో పాటు మరో పది మందిని అరెస్ట్ చేశారు. ఇదే సమయంలో నిషేధిత సిమీ కార్యకర్త జమీల్ అహ్మద్ ఖాన్‌ను అరెస్ట్ చేసి అతనితో సంబంధాలు కలిగి ఉన్నారనే కారణాన్ని చూపుతూ మిర్ సోదరున్ని, అతనితో పాటు మరికొందరిని కూడా అరెస్టు చేసి ఈ కేసును వారి పైన పెట్టారు. మిర్‌తో పాటు పదిమందిపై టాడా కింద పెట్టబడ్డ కేసులో అరెస్ట్ అయిన వారందరినీ పోలీసులు నిరంతరం చిత్రహింసలు పెడుతూ వచ్చారు.

మిర్ అరెస్టయినప్పుడు అతని భార్య గర్భిణి. ఆ తర్వాత ఆమె ఒక అమ్మాయికి జన్మనిచ్చింది. అయితే ఈ విషయాన్ని మిర్‌కు చెప్పడానికి పోలీసులు అనుమతించలేదు. ఇంత అమానవీయంగా వ్యవహరించిన పోలీసులు చిత్రహింసల విషయంలో ఎంత క్రూరంగా వ్యవహరిస్తారో మనం అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ఈ కేసులోని న్యాయాన్యాయాలను పరిశీలించకుండా మీడియా కూడా అరెస్ట్ అయిన వాళ్లందరినీ ఉగ్రవాదులుగానే చూస్తూ వచ్చింది.

1994లో అరెస్టు చేస్తే 1998లో చార్జిషీటు పెట్టారు. 25 సంవత్సరాల్లో ఎంతో మంది న్యాయమూర్తులు, న్యాయవాదులు మారుతూ వచ్చారు. ప్రతిసారీ వారికి సరైన న్యాయ సహాయం లభించలేదు. చివరికి జమైత్ ఉలేమా ఏ హింద్ అనే ఎన్జిఒ వారికి న్యాయ సహాయం అందించడానికి ముందుకు వచ్చింది. మొదట భూసావల్ కింది కోర్టులో ఉన్న కేసు ఆ తర్వాత థానేకు, తర్వాత నాసిక్‌కు మారుతూ వచ్చింది. చివరికి 2019 ఫిబ్రవరి 27న కోర్టు వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు చెప్పింది. ఇది సంతోషకరమైన విషయమే అయిననూ ఈ కేసు విషయమై వాళ్లు దాదాపు 25 సంవత్సరాలు జైలులో మగ్గిపోయారు.

సుప్రీంకోర్టులో న్యాయం ఎండమావియేనా?

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై వచ్చిన లైంగిక ఆరోపణలపై వాస్తవాలను వెల్లడించకుండా జరిపిన విచారణలో దాటవేసిన తీరుతో న్యాయవ్యవస్థపై నమ్మకం పోయిందని, న్యాయం కోసం మరో పోరాటం చేయాలనీ అంటున్నారు రాజేంద్రబాబు అర్విణి

తీర్ప నార్పలేని తీర్పరితనమేల?
కూర్ప విప్పలేని నేర్పరేల
పెట్టి పొయ్యలేని వట్టిబీరములేల?
విశ్వదాభిరామ వినరవేమ

అప్పుడెప్పుడో వేమన రాసిన ఈ పద్యం భారతదేశ అత్యున్నత న్యాయ స్థానంగా భావించబడే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గోగోయ్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలను విచారించడానికి ఏర్పాటైన ముగ్గురు (సుప్రీం) న్యాయమూర్తుల కమిటీ చేసిన కన్నీటి తుడుపు విచారణకు సరిగ్గా సరిపోతుంది. సుప్రీంకోర్టులో ఆమె ఒక సాధారణ (3వ తరగతి) ఉద్యోగిని. ఆమెను సాక్ష్యాత్తు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లైంగిక వేధింపులకు గురిచేశాడని ఆరోపణ. సుప్రీంకోర్టు జడ్జీలకు అఫిడవిట్ రూపంలో ఒక లేఖ రాస్తు ఆమె లైంగికంగా తాను లోబడనందుకు తాను, తన కుటుంబ సభ్యులు ఎంత సంక్షోభానికి గురయ్యారో తేదీలతో సహా వివరించింది. ఇవన్నీ దాచేస్తే దాగని సత్యాలు. అన్నింటికీ సుప్రీంకోర్టు రికార్డులలో, పోలీస్ స్టేషన్‌లలో, ఇతర ఆఫీసులలో ఆధారాలు నిక్షిప్తమై ఉన్నాయి. ఆమె పేర్కొన్నదాని ప్రకారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి 2018 అక్టోబర్ 11న ఆమెను లైంగిక వేధింపులకు గురిచేశాడు. ఆ తర్వాత ఆమెకు సుప్రీంకోర్టు అధికార గణం నుండి బాధలు ప్రారంభమయ్యాయి. అవి బాధలు కాదు ఉపద్రవాలే! పది రోజుల తర్వాత ఆమెను కారణాలు ఏమీ లేకుండానే వేరే వేరే శాఖలకు రెండుసార్లు బదిలీ చేశారు.

మరొక వారంలో ఆమె ప్రవర్తనా నియమావళి అతిక్రమించిందని సంజాయిషీ అడుగుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తర్వాత కొద్ది రోజులకే మూడవ సారి మరొక శాఖకు బదిలీ చేశారు. అలా నెల రోజులలో మూడు సార్లు బదిలీలకు గురిచేసి, ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన ఆరోపణకు ఆమె ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేదని తెలుపుతూ, నవంబర్ 27న ఆమెను విధులలోంచి సస్పెండ్ చేశారు. ఆ తర్వాత ఒక నెలలోపే ఆమె మీద మోపిన నేరాలు రుజువయ్యాయని డిసెంబర్ 18న నోటీసు ఇచ్చి, డిసెంబర్ 21న ఆమెను ఉద్యోగం నుంచి బర్తరఫ్ చేశారు.

వేధింపులు ఆమెకు మాత్రమే కాదు, ఆమె భర్తకు, ఆమె మరిది (ఆమె భర్త తమ్ముడు)కి, మరిది వరుస అయిన ఇంకో బంధువుకూ తప్పలేదు. ఆమె భర్త ఢిల్లీ పోలీసు శాఖలో హెడ్ కానిస్టేబుల్. మరిది కూడా అందులోనే సాధారణ పోలీసు. ఆమె భర్తను మొదట నేర పరిశోధన శాఖ నుండి ట్రాన్స్‌ఫర్ చేశారు. డిసెంబర్ 8న ఆమె భర్తను, మరిదిని టెల్‌ఫోన్‌లోనే ఉత్తర్వులు జారీ చేసి సస్పెండ్ చేశారు. ఆ తర్వాత రెండు రోజులకు గాని సస్పెన్షన్ ఉత్తర్వులు ఇవ్వలేదు. ఆ తర్వాత కొద్ది రోజులకు 'గౌరవనీయ ప్రధాన న్యాయమూర్తి కార్యాలయానికి అనవసరంగా మాటి మాటికీ టెలిఫోన్ చేస్తున్నావన్న' నేరారోపణపై విచారణ జరిపారు. ఒకరోజు ఆమెను, ఆమె భర్తను ఢిల్లీ తిలక్ మార్గ్ పోలీసు స్టేషన్‌కు పిలిపించి, అక్కణ్నుంచి ఛీఫ్ జస్టిస్ ఇంటికి తీసుకెళ్లి, ప్రధాన న్యాయమూర్తి భార్య కాళ్లమీద పడేట్టుగా బలవంతపెట్టారు. అక్టోబర్ 11న ఈ లైంగిక వేధింపుల సంఘటన జరిగింది. అంతకు 3 రోజుల ముందు అక్టోబర్ 8న బాధితురాలి సమీప బంధువు అయిన ఒక వ్యక్తిని స్వయంగా ప్రధాన న్యాయమూర్తియే జూనియర్ కోర్ట్ అటెండర్‌గా నియామకం చేశాడు. వేధింపులలో భాగంగా అతన్ని కూడా ఉద్యోగం లోంచి బర్తరఫ్ చేశారు.

ఇంత జరిగిన తర్వాత ఈ సంవత్సరం మార్చ్ 3న నవీన్ కుమార్ అన్న వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై తిలక్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 2017 జూన్‌లో సుప్రీంకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని లైంగిక వేధింపుల బాధితురాలు రు. పది లక్షలు లంచం అడిగారని, అందుకుగాను రు. 50,000 ఆమెకు ఇచ్చానని ఆ ఫిర్యాదు సారాంశం. ఆ ఎఫ్ఐఆర్ ఆధారంగా పోలీసులు రాజస్థాన్‌లోని తమ గ్రామంలో ఉంటున్న బాధిత భార్య భర్తలని అరెస్టు చేసి, ఆమెకు బేడీలు వేసి గ్రామం నుండి తీసుకువచ్చి క్రూరంగా, అమానుషంగా వ్యవహరించారు. బాధితురాలిని రెండు రోజుల అనంతరం మార్చ్ 12న బెయిల్‌పై విడుదల

అంటే యావజ్జీవ శిక్ష కంటే ఎక్కువ కాలం. ఇంతకంటే అన్యాయం ఇంకెక్కడ ఉంటుంది? ఇప్పుడు వాళ్లు కోల్పోయిన మానవ హక్కులను, పౌరహక్కులను ఎవరు తిరిగి తెచ్చిస్తారు?

ఇవీ ఈ మధ్యకాలంలో వచ్చిన మూడు కోర్టు తీర్పులు. వీటన్నింటిలో ఒక పోల్చదగిన విషయం ఏమిటంటే పోలీసులు సాధారణ ప్రజలకు పూర్తి వ్యతిరేకంగా వ్యవహరిస్తుంటారు. ఆ ప్రజలు న్యాయంపై విశ్వాసంతో ఏళ్లకేళ్లు జీవితంలోని విలువైన కాలాన్ని కోల్పోతూనో, శిక్షలు అనుభవిస్తూనో, పోరాటాలు చేస్తూనో ఓపికగా న్యాయం కోసం ఎదురు చూస్తుంటారు. చివరగా బిల్కిస్ విషయంలో పాక్షికంగా, మిగిలిన వారి విషయంలో సంపూర్ణంగా న్యాయం వారిని వరించింది. అయితే ఇక్కడితో ఆగకుండా కోర్టులు అసలు నిందితులు ఎంతటి పెద్ద స్థాయిల్లో ఉన్నా వారికి శిక్ష విధించడం, అక్రమమైన కేసుల్లో అన్యాయంగా శిక్ష అనుభవిస్తున్న అమాయక పౌరులను విడిపించడం, ఊపా లాంటి దుర్మార్గ చట్టాలను ఉపసంహరించుకునేలా ప్రభుత్వాలను ఆదేశించడం చేస్తే గానీ ఈ దేశంలో న్యాయం మరింతగా ప్రజలకు చేరువ కాదు.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

చేశారు. ఈ వివరాలన్నీ బాధితురాలు సుప్రీంకోర్టు జడ్జీలకు ఇచ్చిన ఫిర్యాదు పత్రంలో ఉన్నాయి. వాటన్నింటిని ఆధారాలతో సహా అమె అర్జీలో పేర్కొంది. ఇంత సతాయింపుకు గురయిన ఆ మహిళ చివరికి సివంగిలాగా ఆలోచించి తనకున్న న్యాయ విజ్ఞానాన్ని అనుసరించి జడ్జీలకు అర్జీ పెట్టుకుంది.

ఆరోపణలు వచ్చిన వెంటనే తాను సెలవుపై వెళ్లి, ఈ ఆరోపణలలో వాస్తవాలను త్వరితగతిన నిగ్గుతేల్చండి అని సుప్రీంకోర్టుకే రంజన్ గోగోయ్ విన్నవించుకుని ఉండి ఉంటే ప్రజల దృష్టిలో సుప్రీంకోర్టు హోదా పెరిగి ఉండేది. వ్యక్తిగతంగా ఆయన ప్రతిష్ట ఇనుమడించి ఉండేది. అట్లా కాకుండా నిందితుడే న్యాయమూర్తిని నియమించుకున్నట్లుగా ఆయనే త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసి, ముందు తన తరపున తానే వాదన వినిపించి ఇక మీరు ప్రజలకు మీ నిర్ణయం చెప్పండి అని నిర్దేశించి ప్రధాన న్యాయమూర్తి హోదాలోనే కొనసాగుతున్నాడు. ఇది నైతికంగా సమర్థనీయమైన చర్యకాదు. ఆ కమిటీ కూడా పారదర్శకంగా విచారణ చేపట్టలేదు. జడ్జి స్థానంలో ఉన్నవాళ్లు నైతికంగా శక్తివంతులైన వాళ్లుగా ఉండాలి. ప్రజా జీవితంలో ఎలాంటి ఆరోపణలకు తావు లేని విధంగా వారి ప్రవర్తన ఉండాలి. అలాంటిది సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పైనే అసభ్యకరంగా ప్రవర్తించారని ఆరోపణలు రావడం, ఆ ఆరోపణల పైన న్యాయమూర్తుల కమిటీ తూతూ మంత్రంగా తనపని ముగించి నిందితునికి క్లీన్‌చిట్ ఇవ్వడం ప్రజాస్వామిక దేశంలో న్యాయ వ్యవస్థకే కళంకం.

బాధితురాలు తనకు న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో తొలుత విచారణకు హాజరయ్యారు. ఆదిలోనే ఈ కమిటీ న్యాయాన్యాయాలు తేల్చడానికి ఏర్పడలేదన్న అపనమ్మకం ఆమెకు ఏర్పడ్డది. దాంతో ఆ కమిటీ విచారణను ఆమె బహిష్కరించింది. కమిటీ విచారణ వీడియో లేదా కనీసం ఆడియో రికార్డింగ్ అయినా జరగాలని డిమాండ్ చేసింది. విచారణ విధి విధానాలేమిటో తనకు తెలియపరచాలని కోరింది. కమిటీ విచారణ, వారి భాష తనకు సరిగ్గా అర్థం కావడం లేదని, వినిపించడం కూడా లేదని, అందుకని ఒక సీనియర్ వకీలును సహాయకునిగా తీసుకుంటానంది. ఆమె అభ్యర్థనలన్నింటిని కమిటీ తోసిపుచ్చింది. తత్ఫలితంగా తనకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని ఆమె కమిటీ విచారణను బహిష్కరించింది. ఇది విచారణ కాదు, ఇష్టా గోష్టిగా చేస్తున్న తంతు మాత్రమే అని, ముగ్గురు జడ్జీలు బెదిరిస్తున్నట్లుగా ప్రశ్నలడుగుతున్నారని పత్రికా ముఖంగా ప్రకటించింది.

ఫిర్యాదు దారుకు ఇన్ని అభ్యంతరాలు ఉన్నా, అస్సలు పారదర్శకత లేకుండా నిందితుని వాదన మాత్రమే విని ఏకపక్షంగా ప్రధాన న్యాయమూర్తి నిర్దోషి అని కమిటీ ప్రకటించింది. ప్రధాన న్యాయమూర్తికి తనకు మధ్య జరిగిన వాట్సాప్ మెసేజ్‌లు, ఫోన్ కాల్ డేటా సాక్ష్యాలుగా తెప్పించాలన్న ఆమె అభ్యర్థనను కూడా కమిటీ ఖాతరు చేయలేదు. ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు ఎవరిమీదనైనా ఎలాంటి విచారణ నైనా కొనసాగించాలని గతంలో తాను ఇచ్చిన మార్గదర్శకాలను సుప్రీంకోర్టు తానే ఉల్లంఘించింది. బాధితురాలు తన ఆరోపణలు రుజువు పరచుకోవడానికి ఆధారాలతో సిద్దంగా ఉన్నప్పటికీ ఆమెది అరణ్య రోదనగానే మిగిలిపోయింది. ఆమె, ఆమె కుటుంబ సభ్యులు న్యాయం కోసం ఎవరిని ఆశ్రయించాలి? ఉన్నత స్థానంలో ఉన్నవాళ్లు చట్టానికి అతీతులయితే ఇక సమన్యాయం ఎండమావియే అయితే, ఇది ప్రజాస్వామికమని ఎలా భావించాలి? అన్న ప్రశ్నలు జవాబులేని ప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయి.

సుప్రీంకోర్టులో ఉద్యోగం పొందడానికి అడ్వాన్సుగా 2017లో రు. 50,000 బాధితురాలికి ఇచ్చినట్లు నవీన్ కుమార్ అన్న వ్యక్తి ఫిర్యాదు చేశాడు. చట్ట ప్రకారం లంచం ఇవ్వడం కూడా నేరమే కదా! మరి నవీన్ కుమార్‌పై కూడా క్రిమినల్ కేసు నమోదు చేయాలి కదా! దాని ఊసేలేదే. 2017 జూన్‌లో ఆయన లంచం ఇచ్చి ఉంటే 2019 వరకు ఆయన గాని, పోలీసులు గాని ఎందుకు ఊరుకున్నారు? సందర్భాను సారంగా ఆ ఫిర్యాదు ఈ సమయంలో బయటికి రావడం ఏమిటి? ఇవన్నీ సమాధానం లేని ప్రశ్నలు. ఈ ఆరోపణల కిస్సా బయటికి రాగానే రంజన్ గోగోయ్ సుప్రీంకోర్టు వ్యవస్థను బలహీనపరచే ప్రయత్నాలు జరుతున్నాయని ప్రకటించి, మొత్తం సమస్యను దారిమళ్లించి క్లిష్టతరం చేసే ప్రయత్నం చేశాడు. లైంగిక వేధింపుల ఆరోపణలు తనపై వస్తే, ఈ విషయంలో న్యాయ వ్యవస్థ మొత్తాన్ని ఇరికించే ప్రయత్నం చేయడంలోనే ఆయన వ్యక్తిత్వంలో డొల్లతనం బయటపడింది. హోదాతో, పదవితో నిమిత్తం లేకుండా ఎవరికి ఎవరిమీదనైనా మోహం కలగవచ్చు. కాని మనం నాగరిక సమాజంలో జీవిస్తున్నామన్న స్పృహ, సామాజిక కట్టుబాట్లకు లోబడి ఉండాలన్న అవగాహన లేకపోతే మానవ సమాజం పోకడ కుంటుపడుతుంది.

సమాజంలో పెద్ద మనుషులు న్యాయంగా, నిష్పాక్షికంగా ఉండాలి. అలా వ్యవహరించాలి. అలా ఉండడమే కాదు, ఒక రోల్ మోడల్‌గా అందరికీ కనిపించాలి కూడా. సమాజానికి మార్గదర్శకంగా ఉండడం కోసం ప్రపంచం ముందు తన న్యాయ సమ్మతమైన జీవితాన్ని పలువురు గ్రహించేలా నడుచుకోవాలి. లండన్ కార్య స్థలంగా పనిచేసే 'ఇంటర్నేషనల్ బార్ అసోసియేషన్' అన్న న్యాయవాదుల సంస్థ ఒకటి ఇటీవల చేసిన సర్వేలో న్యాయ వ్యవస్థలో, ఆ వృత్తిలో ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు లైంగిక వేధింపులకు గురవుతున్నారన్న విషయం బయటపడింది. వేధింపులకు గురవుతున్న న్యాయ వ్యవస్థలోని మహిళలలో 75 శాతం మంది అసలు ఫిర్యాదు చేయరన్న సంగతి కూడా ఈ సర్వేలో వెల్లడైంది. అంతర్జాతీయంగానే ఈ పరిస్థితి ఉన్నప్పుడు, ఒక సాధారణ మహిళ, బర్తరఫ్‌కు గురయిన మూడవ తరగతి ఉద్యోగిని, పోలీస్ హెడ్ కానిస్టేబుల్ భార్య తనకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పైనే ఫిర్యాదు చేయడం ప్రోత్సహించదగ్గ విషయం.

కొంతకాలంగా భారతదేశంలో రాజ్యాంగ వ్యవస్థలు ఒక్కొక్కటి నిర్వీర్యం కావడం మనం చూస్తున్నాం. సుప్రీంకోర్టు కూడా ప్రధాన న్యాయమూర్తి అనుమానాస్పద ప్రవర్తన ద్వారా అగౌరవానికి గురికావడం మంచి పరిణామం కాదు. ఆరోపణను గురించి విచారించడానికి ప్రత్యేక న్యాయమూర్తుల కమిటీ వ్యవహరించిన తీరువల్ల న్యాయ వ్యవస్థ నిష్కా పట్యంగా, నిష్పక్షపాతంగా, నిక్కచ్చితంగా వ్యవహరించగలదా అన్న అనుమానాలకు తావిస్తున్నది.

'దేవుడా.... రక్షించు నా దేశాన్ని, పెద్ద మనుషుల నుండి, పెద్ద పులుల నుండి, నీ రెండు నాలుకలు సాచి బుసలు కొట్టే, నిర్హేతుక కృపా సర్పాల నుండి...' అని అరవయ్యేళ్ల క్రితమే కవి బాలగంగాధర్ తిలక్ దేవుడికి మొర పెట్టుకున్నాడు. కవితాత్మకంగా దేవుణ్ని రక్షించమని కవి వేడుకున్నాడు గాని, ఆయన ఉద్దేశం కూడా కనిపించని దేవునిపై భారం వేయడం కాదు. రచయితలు, ప్రజాస్వామ్య ప్రియులు, సాంస్కృతిక రంగం నుండి పెద్ద పులుల లాంటి పెద్ద మనుషులు పాటిస్తున్న రెండు నాల్కల ధోరణికి వ్యతిరేకంగా సాంస్కృతిక పోరాటం చేయాలి.

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్) వీ

సంఘ్‌పరివార్ వదిలిన బాణం ప్రజ్ఞాసింగ్

దేశ ప్రజలను చీల్చి హిందూ రాజ్యాన్ని స్థాపించాలనే కుట్రలో భాగంగా సంఘ్ పరివార్ వదిలిన ఒకానొక బాణమే సాధ్వి ప్రజ్ఞాసింగ్ అంటున్నారు **బి. రామకృష్ణ**

మొన్నటి పార్లమెంట్ ఎన్నికలలో మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నియోజకవర్గం నుండి సాధ్వి ప్రజ్ఞాసింగ్ థాకూర్ బిజెపి అభ్యర్థిగా పోటీ చేశారు. భారత ఆధ్యాత్మిక, తాత్విక, నాగరికత, సాంస్కృతిక విలువలకు ప్రతీకగా ఆమెను భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటించారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ కొరకు ఆమె అవతారమెత్తినట్లుగా ప్రచారం చేశారు. ఆమె కాషాయ వస్త్రాలు ధరించి సన్యాసినిగా ప్రకటించుకుంటూ రాజకీయాలు మాట్లాడుతుంటారు. 2008లో మాలెగావ్‌లో జరిగిన పేలుళ్ల కేసులో ఆమె ప్రధాన నింధితురాలు. అనారోగ్య కారణాల రిత్యా సాధ్వి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ 2017లో బెయిల్ పొందారు. అనారోగ్యంతో ఉన్న ప్రజ్ఞాసింగ్ ఎన్నికల్లో ప్రచారం ఎలా చేయగలుగుతారని ఆమె కోర్టును తప్పుదోవ పట్టించిందని మాలెగావ్ బాంబు పేలుళ్ల బాధితులు కోర్టులో సవాల్ చేశారు. కాని ఫలితమేమీ లేదు. ఆమె ప్రచార కార్యక్రమంలో తలమునకలై పోయింది. ఇదే సందర్భంలో గాంధీని చంపిన నాథూరమ్ గాడ్సేను దేశభక్తుడని ఎప్పటికీ దేశ భక్తుడేనని కుండ బద్దలు కొట్టి చెప్పింది. ఇవే మాటలను ఇప్పటికీ హిందూ మహాసభ బలంగానే చెబుతున్నది. అక్కడక్కడ హిందూ మహాసభ కార్యకర్తలు గాంధీ హత్య కావించబడిన రోజు 30 జనవరిని పండుగలాగా జరుపుతుంటారు. స్వీట్లు పంచుతుంటారు. నాథూరామ్ గాడ్సేను హీరోగా కీర్తిస్తుంటారు. గాడ్సేకు గుళ్లు కట్టాలనీ ప్రయత్నాలు జరిగాయి. ఈ క్రమంలో ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ ఏ భావజాలానికి ప్రతీకగా నిలుచున్నదో స్పష్టం అవుతున్నది.

సావర్కర్, గాడ్సేలు, సావర్కరేయులు ఆశించిన అమానుషమైన బ్రాహ్మనీయ ఫాసిస్టు హిందూ దేశంగా ఈ దేశం మారాలని, కులాల పీడన, పితృస్వామిక పురుషాధిపత్య భావజాలం, దుర్మార్గమైన మనువాదాన్ని స్థిరీకరించాలని స్పష్టం చేయదలుచుకున్నదన్నమాట. ఈ దేశంలోని భిన్న సంస్కృతులు, జాతులు, మతాలు, కాకుండా ఒకే సంస్కృతి ఒకే మతం ఉండాలనే ప్రమాదకర ఫాసిస్టు విధానాల్లో భాగంగా ప్రజ్ఞాసింగ్ ఠాకూర్‌ను ఎగదోస్తున్నారు.

ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ విద్యార్థి దశలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) లో చేరి తర్వాత కాలంలో మధ్యప్రదేశ్ ఎబివిపి రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. ఆ తరువాత రాష్ట్ర వాదిసేన, హిందూ జాగరణ్ మంచ్, భజరంగ్ దళ్ మహిళా విభాగం అయిన దుర్గావాహినిలో, వందేమాతరం జనకళ్యాణ్ సమితిలో వ్యవస్థాపక సభ్యులుగా అభినవభారత్ సంస్థలో పని చేసింది. 2019 ఏప్రిల్ 17న బిజెపిలో చేరింది. ఈ సంస్థలన్నీ కూడా సంఘ్ పరివార్‌లో భాగమేననేది జగమెరిగిన సత్యమే. 2008లో మాలెగావ్‌లో జరిగిన బాంబు పేలుళ్ల ఘటనలో లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ శ్రీకాంత్ పురోహిత్ పేలుడు సామాగ్రి ఆర్‌డిఎక్స్‌ను సప్లై చేయగా బాంబులు పెట్టడానికి మనుషులను ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ ఏర్పాటు చేసిందని పోలీసులు చార్జ్‌షీట్‌లో నమోదు చేశారు. బాంబు పేలుళ్లలో వాడిన మోటార్ సైకిల్ ప్రజ్ఞాసింగ్‌దేనని తేలింది. మహారాష్ట్ర ఆంటి టెర్రరిస్టు స్క్వాడ్ (ఎటిఎస్) అధిపతి హేమంత్ కర్కరే అక్టోబర్ 2008లో సాధ్వి ప్రజ్ఞాసింగ్‌ను మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్‌డ్ క్రిమినల్ యాక్ట్ (ఎంసిఓసిఏ) కింద అరెస్ట్ చేసి విచారణ సాగించాడు. ఈ ఘటనకు అభినవ భారత్ అనే హిందుత్వ సంస్థ బాధ్యురాలని తేలింది.

మహారాష్ట్ర యాంటి టెర్రరిస్ట్ స్క్వాడ్ అధినేత ప్రజ్ఞాసింగ్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్న హేమంత్ కర్కరే అనేక వత్తిళ్లకు గురయ్యాడు. కర్కరేకు దగ్గరగా ఉండే ఇతర పోలీసు అధికారులు అతడు మాలెగావ్ పేలుళ్లకు కారణమైన హిందుత్వ సంస్థ అభినవ భారత్‌ను విచారిస్తున్నదానిపై వ్యతిరేకంగా ఉన్నారని తనవద్ద ప్రస్తావించాడని, అయితే నీ ఉద్యోగ దర్మాన్ని ఒక మంచి హిందువుగా నిర్వర్తించమని ఇందులో బాధపడాల్సిందేమి లేదని చెప్పినట్లుగా అప్పటి ముంబై పోలీస్ కమిషనర్ జులియో రిబిరో ప్రస్తావించారు. అదే సమయంలో బిజెపి సీనియర్ నాయకుడు ఎల్.కె. అద్వాని అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు ప్రజ్ఞాసింగ్‌ను పోలీసు హింసలకు గురిచేయకుండా చూడాలని కోరారు.

2008 సెప్టెంబర్ 29న మాలెగావ్‌లో జరిగిన పేలుళ్లపై చేసిన కుట్రను, దానికి సంబంధించి అరెస్టయిన వారి పాత్రను వివరిస్తూ హేమంత్ కర్కరే 2008 నవంబర్ 26న మొదటిసారిగా టి.వి. ఇంటర్వ్యూ ఇచ్చాడు. సరైన దిశలో విచారణ కొనసాగుతున్నదని ముగించాడు. ఈ ఇంటర్వ్యూ ఇచ్చిన కొన్ని గంటల తర్వాత ముంబైలో బాంబుదాడులు, కాల్పులు జరుగుతున్నాయన్న వార్త తెలిసింది. ఇతర ఇద్దరు సీనియర్ పోలీస్ అధికారులతో కలిసి బుల్లెట్ ప్రూఫ్ జాకెట్, హెల్మెట్ ధరించి క్వాలీస్ జీపులో ఆ ప్రాంతానికి వెళుతుండగా పాకిస్తాన్ పౌరుడైన అజ్మల్ కసబ్ అతని సహచరుడు ఇస్మాయిల్‌ఖాన్ కాల్పులు జరపడంతో ఈ ముగ్గురూ చనిపోయారని రికార్డుల్లో నమోదయ్యింది. అయితే హేమంత్ కర్కరే కసబ్ కాల్పుల్లో చనిపోలేదని, సర్వీస్ రివాల్వర్‌తో కాల్చబడ్డాడని, ఆ సమయంలో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ హెల్మెట్‌లు ఏమయ్యాయనే అనుమానాలు వచ్చాయి. భోపాల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సందర్భంలో హేమంత్ కర్కరే తన శాపం వల్లె చనిపోయాడని ప్రజ్ఞాసింగ్ అన్న మాటలు పై అనుమానాలను బలపరుస్తున్నట్లుగా ఉన్నాయి.

హేమంత్ కర్కరే హత్య తరువాత మాలెగావ్ పేలుళ్ల కేసులో పురోగతి

మందగించింది. 2008 నవంబర్ 26నాటి ముంబయి ఘటన తరువాత ఎన్ఐఏ ఏర్పాటయింది. 2011లో మాలెగావ్ కేసును ఎన్ఐఏ చేపట్టింది. సంవత్సరాలుగా విచారణ చేసిన ఎన్ఐఏ ముంబయి ఏటిఎస్ చేపట్టిన విచారణలో లోపాలున్నాయని మే 2016లో అభిప్రాయపడింది. 2014లో కేంద్రంలో ప్రధానమంత్రిగా నరేంద్రమోడీ, మహారాష్ట్రలో దేవేంద్ర పడ్నవీస్ ముఖ్యమంత్రిగా బిజెపి ప్రభుత్వాలు ఏర్పడిన తరువాత ఈ కేసు బలహీన పడుతుండడం, నిందితులందరిని విడుదల చేసేందుకు తీవ్రమైన ప్రయత్నాలు జరిగాయని స్పష్టం అవుతున్నది. 2015లో ఎన్ఐఏ ప్రజ్ఞాసింగ్‌కు క్లీన్ చిట్ ఇచ్చింది.

దీనికి కొన్ని నెలల ముందు ఈ కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్న రోహిణి సాలియన్ పబ్లిక్‌గా ఒక స్టేట్ మెంట్ ఇచ్చారు. అందులో 2014లో బిజెపి ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడిన తరువాత ఈ కేసు విషయంలో నిందితుల పట్ల కఠినంగా ఉండొద్దని ఎన్ఐఏ అధికారుల నుండి తనపై ఒత్తిళ్లు వచ్చాయని తెలిపారు. ప్రజ్ఞాసింగ్ తదితరులపై ఏటిఎస్ చేపడుతున్న విచారణను 2008లో నరేంద్రమోదీ, కల్నల్ పురోహిత్‌ను అనవసరంగా లక్ష్యంగా చేసుకున్నారని రాజ్‌నాథ్‌సింగ్ అదే సంవత్సరంలో ఏటిఎస్ విచారణను వ్యతిరేకించాడు. వీరి వాదనలకు అనుకూలంగా ఎన్ఐఏ విచారణలు ఉండడం అనేది అది ఎవరు చేతిలో పావుగా మారిందో అర్థం చేసుకోవచ్చు. ఈ కేసులో కీలక నిందితుడుగా ఉన్న కల్నల్ పురోహిత్‌కు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంతో తొమ్మిది సంవత్సరాలు జైల్లో ఉన్న తరువాత తిరిగి సైన్యాధికారిగా ఉద్యోగంలో చేరిపోయాడు. మాలెగావ్ పేలుళ్లకు సంబంధించి ఎంసిఓసిఏ, ఐపిసి, యుఏపిఏల ప్రకారం కేసులు నమోదయ్యాయి. నేషనల్ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీ(ఎన్ఐఏ) 2017లో ప్రజ్ఞాసింగ్ పై ఎంసిఓసిఎను ఉపసంహరించింది. ఏప్రిల్ 2017లో ఆమెకు అనారోగ్య కారణాలపై ముంబై హైకోర్ట్ బెయిల్ ఇచ్చింది.

స్వామి అసిమానంద స్వయం ఒప్పుకోలులో ఆమెను 2008లో మాలెగావ్ పేలుళ్లు, 2007లో రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గా, హర్యానాలోని పానిపట్ వద్ద సంఝౌతా రైలులో బాంబు పేలుళ్లలో కీలక పాత్రదారిగా, కుట్ర దారుగా పేర్కొన్నాడు. 2008లో అరెస్టనప్పటి నుండి 2017లో విడుదలయ్యే వరకు మొత్తంగా 9 సంవత్సరాలు ప్రజ్ఞాసింగ్ జైలులోనే ఉన్నారు.

2007లో రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గ వద్ద జరిగిన బాంబు పేలుళ్ల కేసుకు సంబంధించి 2017లో ఎన్ఐఏ ప్రజ్ఞాసింగ్, నాగ్‌పూర్ ప్రాంత ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు ఇంద్రేష్ కుమార్‌లకు క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ కేసులన్నింటి విచారణ కాలంలో సాక్షులు ఒకప్పుడిచ్చిన సాక్ష్యానికి వ్యతిరేకంగా సాక్ష్యం చెబుతుంటారు. అలా కాని పక్షంలో హత్య చేయబడుతుంటారు. దానికి ఉదహారణగా డిసెంబర్ 2007లో అభినవ భారత్ సంస్థలో ఒకరైన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త సునీల్ జోషి హత్యను చూడొచ్చు.

2006లో మాలెగావ్ నుండి 2008లో మాలెగావ్ వరకు అభినవ భారత్ జరిపిన పేలుళ్ల సంఘటనలన్నింటిలో కూడా తొలుత అరెస్ట్ కాబడింది, పోలీసుల హింసలకు బలైంది, తప్పుడు కేసుల్లో ఇరికించబడి భవిష్యత్ చదువులను, ఉద్యోగాలను జీవితాలను కోల్పోయింది ముస్లింలే. ఈ ఘటనల్లో రెండు వందల వరకు చనిపోయారు, వెయ్యికి పైగా తీవ్రంగా గాయాల పాలైంది ముస్లింలే. దీనికి బాధ్యులుగా చెప్పుకొన్న వారు బాధ్యులుగా గుర్తింపబడిన హిందుత్వ సంస్థ అభినవ్ భారత్ సభ్యులు నేర విచారణ సందర్భంగా సరైన సాక్ష్యాధారాలు లేవనే సాకుతో నిరపరాధులుగా విడుదలవుతుంటారు.

మరి ఈ ఘటనలకు బాధ్యులెవరో, వారికి శిక్షలు ఎప్పుడు పడతాయోనని ఎదురు చూసే వారికి ఎప్పటికీ కూడా సమాధానం దొరకదు. దీనివల్ల ముస్లిం వర్గాలలో అసంతృప్తులు, అభద్రత పెరిగి విపరీత పరిణామాలకు దారితీస్తే బాధ్యులెవరవుతారు.

ప్రభుత్వాన్ని నడిపే వారి ఆలోచనలు ఆచరణల ఆధారంగా నేర విచారణ ప్రక్రియలు మారుతుంటాయని, అనుకున్న వారిని తప్పించడం, వద్దనుకున్నవారికి శిక్షలు పడేలా చేయడం జరుగుతుందని ఈ సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. వేళ్లమీద లెక్కింపగలిగే హేమంత్ కర్కరే వంటి అధికారులు నిజాయితీగా ఉంటే ఉండవచ్చు. రాజకీయ, ఆర్థిక, మాఫియా ఇతరేతర వత్తిళ్ల నుండి దూరంగా ఉండే అవకాశాన్ని, ఉన్న సందర్భాలను కాదనలేం. కాని వారి ప్రభావం చెప్పుకోదగిన స్థాయిలో ఉండదనేది తెలుసుకోదగిన విషయమే. అటువంటి వారిని సరిగ్గా పనిచేయనివ్వరు. వారు బదిలీల పేరుతో వేధించబడుతుంటారు. బెదిరింపులకు, దాడులకు, హత్యలకు గురవుతుంటారు. చివరకు వారి గొంతుకలు మూగబోతుంటాయి. ఈ నేపథ్యంలో కోర్టుల్లో న్యాయ విచారణలు ఎంతో పక్షపాత ధోరణిలో జరుగుతాయని వాటిపై విశ్వాసం కలిగి ఉండడం కష్టమేనని ఎవరైనా అనుకుంటే తప్పెవరిది అవుతుంది.

సన్యాసులంటే సర్వస్వం త్యాగం చేసిన వారుగా, అసూయ, ఈర్ష్యా, ద్వేషాలకు, కోపతాపాలకు, స్వార్థాలకు, రాగానురాగాలకు, భావావేశాలకు, కులమత ప్రాంతాలకు అతీతులుగా, చీమకు సహితం హాని తలపెట్టని వారిగా తమను తాము మరిచి ముక్తి మార్గంలో దైవైక్యం చెందడానికి పరితపించే వారుగా చూడబడుతుండడం ఒక ఆనవాయితీ. కంద మూలాలు తింటూ అడవుల్లో నిస్వార్థంగా, మనుషులకు దూరంగా సంసార భవ బంధాలను తెంచుకుని, తాము శుష్కింప చేసుకుంటూ మోక్షాన్ని పొందడానికి జీవితాన్ని అర్పణం చేసుకునే వారిగా సాధువులు, సంతులు, సన్యాసులు, యోగులు, ఋషులు మొదలగువారు చూడబడుతుంటారు. నేడు సాధువుల, యోగుల, స్వాముల అర్థాలు మారిపోయినట్లున్నాయి. స్వామీజీగా చెప్పుకునే పరిపూర్ణానంద బిజెపిలో చేరిన తరువాత, చేరక ముందు కూడా రాజకీయాలు మాట్లాడుతుంటాడు. ధర్మం పేరుమీద, సనాతన ధర్మ పరిరక్షణ పేరు మీద కాషాయం ధరించి సన్యాసుల, సన్యాసినీల రూపంలో ఎంఎల్ఏ, ఎంపిలు, మంత్రులు, ముఖ్యమంత్రులుగా ముందుకు రావడం ఇటీవలి పరిణామంగా చూడొచ్చు. నేడు సన్యాసులుగా, స్వాములుగా, సాధ్వీలుగా చెప్పుకుంటున్న కొందరు బాంబులు వేసి ప్రజలను హత్యలు చేస్తారు. మనుషుల్ని చంపుతారు. అబద్దాలను ఆడుతుంటారు. విపరీతమైన రాగద్వేషాలు, అసహనాలను, పరమత దూషనలను, విద్వేష రాజకీయాలను పుంఖాను పుంఖాలుగా ప్రచారం చేస్తుంటారు. సనాతన ధర్మం పేరుమీద అమానవీయమైన పితృస్వామిక, బ్రాహ్మణీయ భావజాల విషాన్ని చిమ్ముతుంటారు. కొందరు టి.వి.లను స్థాపించి, మరికొందరు వ్యాపారాలు చేసుకుంటూ ఇతర మతాలను బూచిగా చూపిస్తూ దోషులుగా, నేరస్తులుగా, చిత్రీకరిస్తూ బాబాలుగా, యోగులుగా, సన్యాసులుగా చలామణి అవుతున్నారు. ఈ కోవలోకి వచ్చేవారి జాబితా పెరుగుతూ పోతున్నది.

సర్వ ఆస్తులను, భవ బంధాలను, సంసారిక జీవితాలను వదిలి ఏ గుళ్లల్లోనో, పగుళ్లలోనో, కొండల్లోనో, గుట్టల్లోనో, అడవుల్లోనో తమకు తోచిన విధంగా పూజలనో, భక్తి అనో కృష్ణా, రామా అనుకుంటూనో కాలం వెళ్లదీయాల్సిన వారు అధునాతన సౌకర్యాలను అనుభవిస్తూ ఓట్ల రాజకీయం చేస్తున్నారు. అంతా దైవాదీనం అనుకునే వీరికి అధికారాలెందుకో, రాజకీయాలెందుకో, పదవులెందుకో, ఆస్తులెందుకో, పరమత ద్వేషాలెందుకో, అసహనాలెందుకో అని ఆలోచిస్తే దీని వెనుక పెద్ద కుట్ర, దీర్ఘకాలిక ప్రణాళికే ఉందని అర్థం చేసుకోవచ్చు.

హిందూ ధర్మం పేరుమీద అమానవీయమైన, అమానుషమైన అసమానతలు, దోపిడీ పీడనలను కొనసాగించడం, కులాలుగా విభజించి పుట్టుకతోనే ఒకరు తక్కువ, మరొకరు ఎక్కువని, అది సహజమని అదంతా దైవ సృష్టేనని, అది పూర్వ జన్మల ఫలితాలనే పుక్కిటి పురాణాలను ప్రచారం చేయడం అనేది అలవోకగా తరతరాలుగా వేల ఏండ్లుగా జరుగుతున్నది. భర్త చనిపోతే భార్యను భర్త చితిపై బలవంతంగానైనా సరే వేసి సజీవ దహనం చేసిన చరిత్రను గొప్పగా చిత్రీకరించిన, వితంతు వివాహాలను నిషేధించిన, బాల్య వివాహాలను జరిపించిన, దేవదాసి వ్యవస్థను పోషించిన, కొందరికే చదువులనిచ్చిన, మరెందరినో కూలీలుగా, దాసీ, దాసులుగా, కట్టు పుట్టు బానిసలుగా చేసిన చరిత్ర ఈ దేశానిది అంటే ఆశ్చర్యం అవసరం లేదు. వీటికి వ్యతిరేకంగా సాంఘిక ఉద్యమాలు, ప్రతిఘటనలు వచ్చాయి. బసవేశ్వరుడు, వేమన, వీరబ్రహ్మం, పెరియార్, నారాయణ గురు, సాహు మహరాజ్, జ్యోతిరావ్ పూలే, అంబేద్కర్ వంటి వారు దేశవ్యాప్తంగా పలుచోట్ల ఎందరెందరో ఈ దాష్టికాలను ప్రతిఘటిస్తూ వచ్చారు. వీటన్నింటి సమాహారాలను పెరియార్, పూలే, అంబేద్కర్ల రచనల్లో, ఆచరణల్లో సంచయనం కావడం గమనించవచ్చు.

ఓవైపు పూలే, అంబేద్కర్లను కీర్తిస్తూనే వారి సాంఘిక కార్యాచరణలను పూర్తిగా పెడతోవ పట్టిస్తూ వారు వ్యతిరేకించిన హిందూ తాత్వికతను ప్రత్యక్షంగా, పరోక్షంగా కుటిల దుర్మార్గాలతో, కుతంత్రాలతో, కుట్రలతో ముందుకు తెస్తూ ఒక దీర్ఘకాలిక ప్రణాళికతో, మిషన్‌లా అన్ని వైపుల నుండి పకడ్బందిగా దూసుకు వస్తున్నది సంఘ్ పరివార్. దీనికి చరిత్రలో మూలాలుగా హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, వాటికంటే ముందు హిందూ రాష్ట్రీయ దళ్, అభినవ భారత్ సొసైటీ మొదలగునవి పనిచేశాయి.

హిందూ మహాసభ అధ్యక్ష స్థానం పదవి పూర్తి అయ్యే పదేళ్ల ముందే సావర్కర్ హిందూ రాష్ట్ర దళ్‌ను ఏర్పాటు చేశాడు. ముస్లింలతో, గాంధీ అనుయాయులతో, గాంధీతో తలపడడానికి హిందువులకు మిలిటరీ శిక్షణ ఇవ్వడం, హిందూ రాష్ట్ర దళ్ కార్యక్రమంగా ఉండేది. హిందు రాష్ట్ర దళ్ హిందూత్వ భావాలు కలిగిన మహారాష్ట్ర బ్రాహ్మణులను ప్రత్యేకించి పూనా నుండి ఆకర్షించింది. ఈ సంస్థ ఆర్ఎస్ఎస్ సమర్థవంతంగా పనిచేయట్లేదని భావించేది. దీనికి బ్రిటిష్ సైన్యంతో కూడా సంబంధాలు ఉండేవి. ఈ సంస్థ బాంబులను తయారు చేయడం, తుపాకులను ఉపయోగించడంపై వాలంటీర్లకు శిక్షణనిచ్చేది. ఇందులో శిక్షణనిచ్చే కీలక వ్యక్తి నారాయణ ఆప్టే. ఇతను బ్రిటిష్ ఆర్మీలో అసిస్టెంట్ టెక్నికల్ రిక్రూటింగ్ అధికారిగా పనిచేశాడు. నారాయణ ఆప్టే, నాథూరామ్ గాడ్సేలు గాంధీ హత్యకు రూపకర్తలు అనేది తెలిసిన విషయమే. వీరితో పాటుగా గాంధీ హత్యలో కుట్రదారులుగా దిగంబర్ గాడ్కే, గోపాల్ గాడ్సే, విష్ణుకర్‌కరే, మదన్‌లాల్ పాహువా ఉన్నారు. వీరందరూ హిందూ మహాసభ సభ్యులే. హిందూ రాష్ట్ర దళ్ పని గాంధీ హత్యతో అంతమైందని అనుకోవచ్చు. ఈ హత్య కంటే ముందే 1934లో అంటరానితనానికి వ్యతిరేకంగా గాంధీ ప్రసంగిస్తున్న పూనాలోని మున్సిపల్ టౌన్ హాల్‌లో ఈ సంస్థ బాంబు వేసింది. నాగ్‌పూర్ ప్రాంత సావర్కరీయుడైన బి.ఎస్. ముంజే ఇటలీలో ముస్సోలిని కలిశాక ముస్సోలినీ ప్రారంభించిన 'బలిల్లా' ఉద్యమంతో ప్రేరేపితుడై 1935లో బోంస్లే మిలిటరీ స్కూల్‌ను స్థాపించాడు.

ఇటలీలో మజ్జిని స్థాపించిన 'యంగ్ ఇటలీ' స్ఫూర్తితో వినాయక్ దామోదర్ సావర్కర్ 1905లో అభినవ భారత్ సొసైటీని స్థాపించాడు. ఈ సంస్థ 1952లో మూతపడింది. దీని స్ఫూర్తితో అభినవ్ భారత్ అనే సంస్థ 2006లో పుట్టుకొచ్చిందని అనుకోవచ్చు. దీంట్లో ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ ముఖ్య భూమికను నిర్వహించింది. ఈ సంస్థను స్థాపించడంలో రిటైర్డ్ ఆర్మీ మేజర్ రమేష్ ఉపాధ్యాయ, భారత సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్‌గా పనిచేస్తున్న ప్రసాద్ శ్రీకాంత్ పురోహిత్‌లు ప్రధాన భూమికను పోషించారు. సవార్కర్‌చే స్థాపించబడిన అభినవ్ భారత్ సొసైటీ సాయుధ మార్గాన్నే నమ్మింది. అప్పట్లో అది కొన్ని సాయుధ చర్యలు చేసినట్లు చరిత్రలో నమోదు అయ్యాయి. నేటి అభినవ్ భారత్ సంస్థకు 2008లో హిమనీ సావర్కర్ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఈమె సావర్కర్ మేనల్లుడి భార్య, అలాగే నాథూరామ్ గాడ్సే తమ్ముడు గోపాల్ గాడ్సేకు కూతురు.

అభినవ్ భారత్, భజరంగ్ దళ్, హిందూ వాహిని, సనాతన సంస్థ దుర్గావాహిని మరెన్నో ముసుగు సంస్థలు పేరున్నవి లేనివిగా దాడులు చేసే సంస్థలలో, శక్తులలో ఒకప్పుడు అభినవ భారత్ సొసైటీ, హిందూ రాష్ట్ర దళ్, హిందూ మహాసభలను నడిపిన సావర్కర్ బతికే ఉన్నాడంటే అతిశయోక్తి కాదు.

మధ్యప్రదేశ్ కేంద్రంగా 2006 నుండి 2008 వరకు అభినవ భారత్ సంస్థ దేశవ్యాప్తంగా పలు చోట్ల బాంబు పేలుళ్ల కుట్రలను అమలు చేసింది. 2006 సెప్టెంబర్ 8న మాలెగావ్‌లో మసీదు దగ్గర శుక్రవారం ప్రార్థనలు అయ్యాక బాంబులు పేల్చారు. ఆ పేలుళ్లలో 37 మంది ముస్లింలు చనిపోయారు. 2007 ఫిబ్రవరి 17,18 తేదీల మధ్య రాత్రి ఇండియా పాకిస్థాన్‌ల మధ్య నడిచే ఒకే ఒక రైలు సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌లోని రెండు కోచ్‌లలో బాంబులు పేల్చగా 68 మంది ముస్లింలు చనిపోయారు. ఈ దుర్ఘటన హర్యానాలోని పానిపట్ వద్ద జరిగింది. 2007 మే 18న శుక్రవారం హైదరాబాద్‌లోని మక్కా మసీద్‌లో ప్రార్థనలు జరుగుతున్న సందర్భంలో బాంబులు పేల్చారు. ఆ ఘటనలో 9 మంది చనిపోయారు. 2007 అక్టోబర్ 11న రాజస్థాన్‌లోని అజ్మీర్‌లోని అజ్మీర్ షరీఫ్ దర్గా వద్ద సాయంత్రం ఇఫ్తార్ సమయంలో బాంబులు పేల్చడంతో ముగ్గురు చనిపోయారు. 2008 సెప్టెంబర్ 29న మహారాష్ట్రలోని మాలెగావ్‌లో రంజాన్ రోజులలో బాంబులు పేల్చారు. ఆ పేలుళ్లలో ఆరుగురు చనిపోయారు. అదేరోజు గుజరాత్‌లోని అహ్మదాబాద్ దగ్గరలోని అరవల్లి జిల్లా ముఖ్య పట్టణం మెడాసాలో జరిగిన పేలుళ్లలో ఇద్దరు చనిపోయారు.

దేశంలోని వివిధ ప్రాంతాలలో అభినవ భారత్ జరిపిన బాంబు పేలుళ్లకు తామే కారణమని ప్రధాన సూత్రదారిగా ఉన్న స్వామి అసిమానంద స్వయంగా ఒప్పుకున్నాడు. ఈ పనులు చేసి పెట్టమని ఆర్ఎస్ఎస్ నాయకుడు మోహన్ భగవత్ ఇంద్రేష్‌కుమార్‌లు చెప్పారని

అసిమానంద తన ఒప్పుకోలులో స్పష్టం చేశాడు. ఈ విషయాన్ని సంఘ్ పరివార్ గాని బిజెపి గాని ఒప్పుకోదు. దీన్ని ఆర్ఎస్ఎస్, బిజెపిలు ఖండించాయి. అసలు వారి చరిత్ర ఆచరణ అంతా కూడా అబద్దాలతో కూడుకున్నదే కదా. స్పష్టమైన సాక్షాదారాలుండీ, ఏ వత్తిళ్లు లేకుండానే స్వయంగా ఈ విషయాన్ని కారవాన్ మ్యాగజైన్ జర్నలిస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశాడు. 2011 డిసెంబర్ 20న పంచకుల జిల్లా కోర్టు హర్యానాలో కొద్దిసేపు మాట్లాడి ఇంటర్వ్యూకి అనుమతి పొంది 2012 జనవరి 10న, 2013 జూన్ 22న, 2014 జనవరి 9న, 2014 జనవరి 17న మొత్తం మూడు సంవత్సరాలలో నాలుగు సార్లు జైలులో కలిసి ఇంటర్వ్యూ చేశారు. కాని తరువాత తాను చెప్పలేదని మాట మార్చాడు. అప్పుడు కారవాన్ యాజమాన్యం అసిమానందతో జరిపిన సంభాషణ ఆడియోను విడుదల చేస్తూ తాను ప్రచురించిన ఇంటర్వ్యూ అబద్ధపుది కాదని నిజమైనదేనని అసిమానంద స్వయంగా ఏ వత్తిళ్లు లేకుండానే స్వేచ్ఛగానే ఆయన అంగీకారంతోనే చెప్పిన విషయాలే అవని స్పష్టం చేసింది.

అభినవ భారత్‌లోని ముఖ్య నాయకులుగా చెప్పబడుతున్న మేజర్ రమేష్ ఉపాధ్యాయ లెఫ్టినెంట్ కల్నల్ శ్రీకాంత్ ప్రసాద్, పురోహిత్, సుధాకర్ చతుర్వేది, సాధ్వి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్, ఇంద్రేష్ కుమార్, స్వామి అసీమానంద, సునీల్ జోషీలకు బిజెపితో దగ్గరి సంబంధాలున్నాయి. ఆర్ఎస్ఎస్ కార్యకర్త అయిన సునీల్ జోషిని మధ్యప్రదేశ్‌లోని దేవస్ జిల్లాలో తన సహచరులే అంతమొందించారని జ్యుడిషియల్ మెజిస్ట్రేట్‌కు సమర్పించిన చార్జ్ షీట్‌లో పోలీసులు పేర్కొన్నారు. సునీల్ జోషి అరెస్ట్ ద్వారా దేశంలో సంఝౌతా ఎక్స్‌ప్రెస్ నుండి అజ్మీర్ దర్గా వరకు జరిగిన పలు బాంబు పేలుళ్ల వివరాలు ఎక్కడ బయట పడతాయోననే అనుమానం, భయాందోళనలతో అతన్ని చంపేశారని, ఇందులోని సూత్రదారుల్లో మాలెగావ్ పేలుళ్లలో నిందితురాలిగా ఉన్న ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ ఉన్నారని పోలీసుల చార్జ్‌షీట్‌లో తెలిపారు.

ప్రధాన నిందితురాలిగా, అనుమానితురాలిగా గుర్తింపబడిన ప్రజ్ఞాసింగ్‌ను, తదితరులను 23 అక్టోబర్ 2008న అరెస్ట్ చేశారు. కాని 2009 మార్చ్ 25న ఈ కేసును మూసేస్తూ నిందితులను అందరినీ విడుదల చేశారు. మళ్లీ 2010లో ఈ కేసును తిరగదోడారు. 2011లో ప్రజ్ఞాసింగ్ ఠాకూర్‌కు అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. కాని ఆమె అప్పటికే మాలెగావ్ పేలుళ్ల కేసులో పాల్గొన్న నిందితురాలిగా జైల్లో ఉన్నారు. ఇండోర్ హైకోర్టు ఈ కేసును నేషనల్ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీ(ఎన్ఐఏ)కి బదిలీ చేసింది. నరేంద్రమోడీ ప్రధానమంత్రి అయ్యాక ఈ కేసు తిరిగి దేవస్ జిల్లా కోర్టుకు బదిలీ చేయబడింది. సెప్టెంబర్ 2015లో దేవస్ జిల్లా కోర్టు ఠాకూర్‌తో సహా ఇతర నిందితులను నిరపరాధులుగా ప్రకటించింది.

స్వామి అసిమానంద తాము చేసిన చర్యలను దాచే ప్రయత్నం చేయలేదు. రిపోర్టర్లతో ఈ విషయాలను పంచుకోవడమే కాకుండా సంఝౌతా ఎక్స్‌ప్రెస్ రైలులో జరిగిన పేలుళ్లలో తన పాత్రను ఒప్పుకుంటూ భారత రాష్ట్రపతికి ఒకటి, హాఫీజ్ సయీద్‌ను సంస్కరించాలని ఉందని పాకిస్తాన్ అధ్యక్షునికి మరొక ఉత్తరం రాశాడు. తనకు తానుగా తాను చేసిన నేరాలను గురించి బహిరంగంగా ఒప్పుకున్న ఒప్పుకోలు ఉన్నప్పటికీ కూడా అన్ని బాంబు పేలుళ్ల సంఘటనా కేసుల నుండి అసిమానందతో పాటు మిగతా అభినవ భారత్ సభ్యులు అందరూ నిర్దోషులుగా ప్రకటింపబడ్డారు. ఇది ఈ దేశంలోని రాజ్య యంత్రాంగం, నేర విచారణ సంస్థలు, న్యాయవ్యవస్థలు పనిచేస్తున్న తీరును స్పష్టం చేస్తున్నది. కోర్టు వ్యవహారాల చట్రంలో సాక్ష్యాధారాలు లేవని ఈ నేరాలు నిరూపించబడవు కాని, ఏ నేరమూ చేయని సాయిబాబాకు శిక్ష పడుతుంది. వరవరరావు ఇతర మేధావులు జైళ్లలో మగ్గుతుంటారు. ఛత్తీస్‌గఢ్, దండకారణ్యంలోని ఆదివాసులు ఏ నేరం చేయకుండానే జైళ్లలో నిర్బంధించబడతారు. శిక్షించబడుతుంటారు. ఈ వ్యవహారమంతా ద్వంద్వ ప్రమాణాలను సూచిస్తుంది. వర్గ సమాజంలో న్యాయం ఆధిపత్య వర్గాలకే అనుకూలంగా ఉంటుందని ఈ సంఘటనలు నిరూపిస్తున్నాయి.

ఈ బాంబు పేలుళ్ల వెనుక సామాజిక రాజకీయ ప్రయోగం జరుగుతున్నదని అర్థం చేసుకోవచ్చు. పరమత పక్షాలను చంపడాన్ని ముందుకు తెస్తూ దానికి సాధికారతను సంపాదించే ప్రయత్నం జరుగుతున్నది. హిందుత్వను మరింత హింసాయుతంగా మార్చడం 2002లో ఇలాంటి ప్రయోగమే గుజరాత్‌లో జరిగింది. దాని ద్వారా ఆ రాష్ట్రంలో బిజెపికి రాజకీయ లబ్ధి చేకూరింది. అప్పటి నుండి నేటి వరకు కూడా బిజెపియే అధికారంలో ఉంటూ వస్తున్నది. మిలిటెంట్ సంస్థలను స్థాపించి వాటి ద్వారా బెదిరింపులు, హత్యలు చేయిస్తూ తమ దీర్ఘకాలిక హిందూ రాష్ట్రం, అఖండ భారత్ అనే లక్ష్యాలను చేరుకోవడానికి ప్రయత్నం జరుగుతున్నది. ఈ సంస్థలు హత్యలు చేయగానే, బాంబులు పేల్చి జనాన్ని చంపిన తరువాత వాటితో తమకేమి సంబంధం లేదని ఆర్ఎస్ఎస్, బిజెపిలు ప్రకటిస్తుంటాయి. మరోవైపు వాటిని హిందువుల ధర్మాగ్రహమని నర్మగర్భంగా మాట్లాడుతుంటారు.

ముస్లింలను టెర్రరిస్టులుగా, విదేశీయులుగా చూపెడుతూ మతపర మైనారిటీల ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారు. అనేక ప్రాంతాలలో ఘర్‌వాపసీ పేరుతో, ఆదివాసీ ప్రాంతాలలో వనవాసి కళ్యాణ ఆశ్రమాల ద్వారా మత మార్పిడులు చేస్తున్నారు. మతపరమైన ధృవీకరణ చేస్తున్నారు. అవిద్య, నిరుద్యోగం, ఉపాధి లేమి, సమాజ సంపద పంపకం అనే వాటి గురించి ఏమి మాట్లాడకుండా దోపిడీ పూరిత పెట్టుబడిదారీ, పెత్తందారీ, భూస్వామ్య ప్రైవేటు, కార్పొరేట్, సామ్రాజ్యవాద శక్తులతో మిలాఖతై దేశ సంపదను అత్యధికంగా ఉన్న దళితులు, ఆదివాసులు, వెనుకబడిన కులాలు బలహీన వర్గాలు, ముస్లింలు, క్రిస్టియన్‌లు తదితర ఈ దేశ ప్రజలందరికీ చెందకుండా కొద్దిమందికి అప్పనంగా అందించే యంత్రాంగంగా ఇవాళ బిజెపి ముందుకొస్తున్నది. దాన్ని వెనకనుండి సంఘ్ పరివార్‌ను నడిపిస్తున్నది.

సంఘ్ పరివార్ ప్రయోగశాల నుండి, దాని అమ్ముల పొది నుండి వదలబడుతున్న బాణాలలో ఒక బాణమే ప్రజ్ఞాసింగ్ ఠాకూర్. ఆమె భోపాల్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి గెలుపొంది భవిష్యత్‌లో కీలకమైన మంత్రి స్థానంలోకి వచ్చే అవకాశాన్ని కాదనలేము. సంఘ్ పరివార్ ఆడుతున్న దీర్ఘకాలిక, ప్రణాళికాబద్ధమైన ఆటలో తాత్కాలికంగానైనా విజయవంతం అవుతుండడాన్ని అర్థం చేసుకోవచ్చు. దీన్ని కట్టడి చేయవల్సిన అవసరం ఈ దేశ ప్రజలది. వారిని చైతన్య పరచి ఉన్నతమైన విలువలతో కూడిన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావల్సిన పరిస్థితిలో మనమున్నాం అన్నది మర్చిపోలేము.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

శ్రీలంకలో నరమేధానికి మూలాలు

శ్రీలంకలో జరుగుతున్న ఆత్మాహుతి దాడులకు మూలాలు ఆ దేశ పాలకులు సింహళీయుల ఆధిపత్య భావజాలాన్ని ప్రోత్సహిస్తూ మైనారిటీలపై కొనసాగిస్తున్న దాడుల్లోనే ఉన్నాయని అంటున్నారు ఎ. నర్సింహా రెడ్డి

శ్రీలంకలో ఏప్రిల్ 21న క్రైస్తవులకు ప్రధానమైన ఈస్టర్ పర్వదినాన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న చర్చిలతో పాటు ఫైవ్‌స్టార్ హోటళ్లను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడులతో వరుస బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు. శ్రీలంక రాజధాని కొలంబోతో పాటు నెగోంబో, బట్టికలోవా నగరాల్లోని మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో దాడులు జరిగాయి. ఇందులో మూడు ప్రముఖ చర్చిలు, మూడు ఫైవ్‌స్టార్ హోటళ్లు ఉన్నాయి. జూ వద్ద, మరో ఇంట్లో కూడా ఉగ్రవాదులు పేలుళ్లకు పాల్పడ్డారు. నెగోంబోలోని సెయింట్ సెబాస్టియన్ చర్చిలో అత్యధిక ప్రాణనష్టం జరిగింది. ఇక్కడ దాదాపు 90 మంది మృతి చెందారు. శ్రీలంక రాజధాని కొలంబోలోని సెయింట్ ఆంటోనీస్ చర్చిలో అధిక సంఖ్యలో 104 మంది చనిపోగా, మరో 100 మంది గాయపడ్డారు. బట్టికలోవా పట్టణంలోని జియోన్ చర్చిలో మూడో పేలుడు జరిగింది. పేలుడు దాటికి దాదాపు 27 మంది మరణించారు. వందల మంది గాయపడ్డారు.

ఇదే సమయంలో కొలంబోలోని మూడు ఫైవ్‌స్టార్ స్టార్ హోటళ్లు ద షాంగ్రిలా, ద సినమన్ గ్రాండ్, ద కింగ్స్‌బరీలో బాంబులు పేలాయి. సినమన్ గ్రాండ్ హోటల్‌లోని రెస్టారెంట్ వద్ద ఒక ఆత్మాహుతి బాంబర్ తనను తాను పేల్చేసుకున్నాడు. ఈ ఘటనల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు మృతి చెందారు. అనేకమంది గాయపడ్డారు. ఈ హోటళ్లకు విదేశీ పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. కొలంబో దక్షిణ ప్రాంతంలోని దేహీవాలా జువలాజికల్ గార్డెన్ (జంతు ప్రదర్శనశాల) సమపంలోని రిసెప్షన్ హాల్‌లో ఏడో పేలుడు జరిగింది. బహిరంగ ప్రాంతంలో పేలుడు జరుగడంతో ఇద్దరు మృతి చెందారు. ఎనిమిదో పేలుడు కొలంబోకు ఉత్తరాన శివార్లలో ఉన్న ఒరుగోదవట్టాలో జరిగింది. అక్కడ గాలింపుల్లో భాగంగా పోలీసు బృందం ఒక భవనంలోకి ప్రవేశించినప్పుడు మాటువేసిన ఆత్మాహుతి దళ సభ్యుడు తనను తాను పేల్చేసుకున్నాడు. దీంతో ఆ భవన కాంక్రీటు శకలాల కింద పడి ముగ్గురు పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. మొత్తం 8 వరుస పేలుళ్లలో 290 మందికి పైగా మృతి చెందారు. మరో 500 మందికి పైగా గాయపడ్డారు. ఈ పేలుళ్లలో మొత్తం 33 మంది విదేశీయులు మరణించారు. చనిపోయిన వారిలో 10 మంది భారతీయులు ఉన్నారు.

శ్రీలంకలో చర్చిలు, విలాస హోటళ్లను లక్ష్యంగా చేసుకొని జరిగిన వరుస బాంబు పేలుళ్లు తమ పనేనని ఉగ్రవాద ముఠా ఇస్లామిక్ స్టేట్(ఐసిస్) ప్రకటించుకొంది. ఆ ముఠా తరపున ప్రచారం చేసే 'అమఖ్' అనే వార్తా సంస్థలో ఈ ప్రకటన వచ్చింది. ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ పోరాట సభ్యులు ఈ దాడులను నిర్వహించారు అని ఐసిస్ 'అమఖ్'లో ప్రకటించుకుంది. ఆత్మాహుతి బాంబర్ల పేర్లను అబు ఉబయదా, అబు అల్ ముఖ్తార్, అబు ఖలీల్, అబు హమ్జా, అబు అల్ బరా, అబు మహ్మద్, అబు అబ్దుల్లాగా ప్రకటించుకుంది. జిహాదీ కార్యకలాపాలను పర్యవేక్షించే 'సైట్ ఇంటిలెజెన్స్ గ్రూప్' అనే సంస్థ ఐసిస్ ప్రకటనను వెలుగులోకి తెచ్చింది. మొత్తంగా చూస్తే మతపరమైన విశ్వాసాలు కాస్తా విద్వేషంగా రూపుదిద్దుకోవడం, ఆ విద్వేషం అంతిమంగా ఉన్మత్త స్థితికి చేరడం తాజా దాడుల్లో కనబడుతుంది.

శ్రీలంకలో మైనారిటీ ముస్లింలు ఐసిస్ వంటి సంస్థల వైపు మొగ్గు చూపడానికి రెండు కారణాలు ఉన్నాయి. ఇస్లామిక్ స్టేట్ భావజాలానికి ఆకర్షితులై కొందరు, భావోద్వేగాలతో మరికొందరు వెళ్లారు. వీరంతా వీడియోల ద్వారా ఇస్లామేతరులపై దాడులు నిర్వహించాలని రెచ్చగొట్టే ప్రసంగాలకు ఆకర్షితులైనవారే. శ్రీలంకలోని అతివాద సంస్థలైన బొదు బాలసేన (బిబిఎస్), రావణ బాల్య (ఆర్‌బి) వంటి సంస్థలు దంబుల్లా, అల్తగామా, కాండీ ప్రాంతాల్లో ముస్లిం మైనారిటీలపై దాడులకు పాల్పడ్డాయి. బిబిఎస్ అతివాద సింహళ జాతీయ భావజాలానికి రాజపక్సె కుటుంబం మద్దతు ఉందన్న విషయం శ్రీలంకలోని ప్రతి ఒక్కరికీ తెలుసు. తీవ్రవాద ముఠాలకు రాజపక్సె పరోక్షంగా సహాయాన్ని అందించినట్టు సమాచారం. ఆ ముఠాలోని కొందరు సిరియా వెళ్లి ఐసిస్ నాయకుల వద్ద శిక్షణ పొందినట్టు కూడా ముందుగా సమాచారం అందినా సిరిసేన ప్రభుత్వం సకాలంలో స్పందించలేదు. మైనారిటీల ఆగ్రహం కారణంగా ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతుందన్న విషయాన్ని ఎల్‌టిటిఇ అనుభవం వల్ల శ్రీలంకకు బోధపడినట్లు లేదు.

వలస పాలన కాలంలో సింహళీయ–తమిళ–ముస్లిం సమస్యలు ఎట్లుండినా రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత శ్రీలంకకు 1948 ఫిబ్రవరి 4న బ్రిటిష్ వలస నుండి స్వాతంత్ర్యం లభించిన తర్వాత శ్రీలంక జాతి నిర్మాణానికి కృషి చేయడానికి బదులు మెజారిటీ సింహళీయులు అక్కడ సింహళ జాతి నిర్మాణానికి పూనుకోవడం మైనారిటీ తమిళ, ముస్లిం, క్రిస్టియన్ల పట్ల వివక్షకు దారితీసింది. 2017 జనాభా లెక్కల ప్రకారం మొత్తం శ్రీలంక జనసంఖ్య రెండు కోట్ల ఇరవై లక్షలు, వారిలో 70 శాతం బౌద్ధులు. 12.6 శాతం హిందూ తమిళులు, 9.7 శాతం ముస్లింలు, 7.6 శాతం క్రైస్తవులు. ప్రపంచంలో ఏ మూలనైనా ఉగ్రవాదం ప్రబలిందంటే దాని వెనుక అమెరికా సామ్రాజ్యవాదం తప్పకుండా ఉంటుంది. తాలిబాన్లను పెంచి పోషించింది ఆ దేశమేనన్నది బహిరంగ రహస్యం. తీరా బిన్ లాడెన్ అమెరికాలోని ప్రపంచ వాణిజ్య సంస్థ పైనే దాడి చేసేసరికి టెర్రరిజంపై పోరాటమంటూ అమెరికా దండెత్తుతోంది. ఇరాక్‌పై అమెరికా యుద్ధం తరువాత కొత్త తీవ్రవాద సంస్థలు పుట్టుకొచ్చి ప్రపంచాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. ఈస్టర్ పర్వదిన సందర్భంగా ముస్లిం తీవ్రవాద శక్తులు చెలరేగి సృష్టించిన విషాదానికి ఈసారి శ్రీలంక కొనసాగింపుగా మారింది!

న్యాయబద్ధమైన ఎల్‌టిటిఇ ఉద్యమం అణచివేత

శ్రీలంకలో మైనార్టీలపై మెజార్టీ బుద్ధిస్టు అధిపత్యం వివిధ రూపాల్లో కనిపిస్తుంది. జాతుల సమస్య, మత సమస్య చాలా తీవ్రంగానే ఉంది.

ప్రభుత్వం సింహళ బాషకు, బౌద్దానికి ప్రాధాన్యం ఇవ్వడం అల్ప సంఖ్యాకవర్గాల వేర్పాటువాద పోరాటానికి దారితీసింది. ఎప్పుడో మనదేశం నుంచి శ్రీలంకకు వెళ్లి స్థిరపడ్డ తమిళులపై స్థానిక సింహళీయుల అణచివేతలో నుంచి ఎల్‌టిటిఇ పుట్టుకొచ్చింది. 1983 నుంచి 2009 వరకు ప్రత్యేక తమిళ రాష్ట్ర స్వతంత్ర ప్రతిపత్తి డిమాండుతో శ్రీలంక ప్రభుత్వానికి ఎల్‌టిటిఇ మధ్య సాగిన సుదీర్ఘ అంతర్యుద్ధంలో దాదాపు లక్ష మంది మరణించారు. లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టిటిఇ) శ్రీలంకలో ప్రత్యేక తమిళరాష్ట్రం కోసం 30 ఏళ్లపాటు ఉద్యమించింది. అయినా ఎల్‌టిటిఇ ఎన్నడూ విదేశీ పర్యాటకులపై దాడులు చేయలేదు. 2009 మే 19న ఎల్‌టిటిఇ నాయకుడు ప్రభాకరణ్‌ను శ్రీలంక సైన్యం దారుణంగా హతమార్చింది.

ఒక లౌకిక ఉద్యమమైన తమిళ ఉద్యమం ప్రధానంగా తమిళం మాట్లాడే భాషా ప్రాతిపదికపైన ఏర్పడ్డది. వారు హిందువులు కావచ్చు లేదా క్రిస్టియన్‌లైనా కావచ్చు అది ఏర్పడిన తొలినాళ్లలో, వారి శ్రేణులలో తమిళం మాట్లాడే ముస్లింలను కూడా చేర్చుకున్నారు. ఈ మహా తమిళ ఉద్యమాన్ని శ్రీలంక మిలటరీ తీవ్రంగా అణచివేసింది. 1985 నుండి తమిళ ముస్లిం, ముస్లింయేతర తమిళుల మధ్య చీలిక తెచ్చేందుకు నిర్దిష్టమైన చర్యలు తీసుకుంది. కరైతీవు గ్రామంపై ముస్లింల దాడులను భద్రతా బలగాలు ప్రోత్సహించాయి. అవి దశాబ్దాల పాటు తమిళ-ముస్లిం సంబంధాలు చెడగొట్టేందుకు దోహదపడ్డాయి. 26 ఏళ్లపాటు అవిచ్ఛిన్నంగా శ్రీలంకలో సాయుధ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. తమిళ టైగర్లు సాగించిన ఆత్మాహుతి దాడులు, కీలక నేతలను లక్ష్యంగా చేసుకుని సాగించిన దాడులు ఆ దేశాన్ని ఊపిరాడనీయకుండా చేశాయి. అదంతా పదేళ్లక్రితం మాట.

తమిళ ప్రత్యేక రాష్ట్రం కొరకు చేపట్టిన అంతర్యుద్ధానికి కారణమైన తమిళ టైగర్ల సంస్థ ఎల్‌టిటిఇ అక్కడే పుట్టి పెరిగి విస్తరించింది. సింహళ జాతీయతను రెచ్చగొట్టి, మైనారిటీలుగా ఉన్న తమిళ సంతతి ప్రజలపై వివక్ష అమలు చేయడంతో రేగిన అసంతృప్తి క్రమేపీ ఉద్యమ రూపం ధరించి స్వయంపాలన అడిగేవరకూ వెళ్లింది. తమిళ ఉద్యమ సంస్థలు లేవనెత్తిన అంశాలను చక్కదిద్దేందుకు శ్రీలంకలోని ప్రభుత్వాలు ఏ మాత్రం శ్రద్ధ పెట్టని కారణంగా అది సాయుధ పోరాటాన్ని విశ్వసించే ఎల్‌టిటిఇ తదితర సంస్థల ఆవిర్భావానికి దోహదపడింది. కానీ ఇప్పుడు ముస్లిం తీవ్రవాద ఉదంతాల మూలాలు వేరు. మతపరమైన విశ్వాసాలు కాస్తా విద్వేషంగా రూపుదిద్దుకోవడం, ఆ విద్వేషం అంతిమంగా ఉన్మత్త స్థితికి చేరడం తాజా దాడుల్లో కనబడుతుంది.

ఎల్‌టిటిఇ ఉద్యమం అణచివేతకు గురైన తరువాత సింహళ జాతివాదం అక్కడి బౌద్ధ గురువులతో కలిసి ముస్లింలను అణచివేసే ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఫలితంగా నేషనల్ తౌహిత్ జమాత్ (ఎన్‌టిజె) ఆవిర్భవించింది. శ్రీలంకలో ఉన్న 'ముస్లింల్లో కొందరు తీవ్రవాద ధోరణులను వ్యక్తపరచేవారున్నారు. శ్రీలంక తూర్పు కోస్తా తీరానికి సమీపంలో బాంబు పేలుళ్లు జరిగిన బట్టికలోవాకు దగ్గరలోనే కట్టన్ కుడి అనే పట్టణం ఉంది. స్థానిక ముస్లిం సమాజంలో అనేకమంది సౌదీతరహా ఇస్లాం ప్రభావానికి లోనై ఉన్నారు. ఈ ద్వీపంలో ఒకప్పుడు మధ్యేవాదులుగా ఉండే సూఫీ ముస్లింలపై 'మహ్హబీ దురాక్రమణ" గురించి ఎంతగానో రాయబడింది. అయితే ఇప్పుడు టెర్రర్ ప్రమాదం ఇస్లామిస్ట్ తీవ్రవాదుల నుండే తప్ప తమిళ టైగర్ల నుండి కాదని నిర్ధారణకొచ్చారు.

తమిళ ప్రత్యేక రాష్ట్రం కోసం సాగిన ఉద్యమం తీవ్ర అణచివేతకు గురై సద్దు మనిగాక కూడా తమిళులపై 2009 నుంచి దాడులు జరుగుతున్నాయి. 2010లో ప్రముఖ కార్టూనిస్ట్ ప్రజీత్ ఎక్నాలి గోడ బలవంతంగా అదృశ్యానికి గురయ్యాడు. 26 ఏళ్ల సుదీర్ఘ అంతర్గత ఘర్షణల సమయంలో అనేక మంది అదృశ్యానికి గురయ్యారు. 1980వ దశకం నుండి ప్రపంచంలోనే అత్యధికంగా 80 వేల నుంచి 1 లక్ష మంది వరకు ఆ దేశంలో అదృశ్యానికి గురయ్యారు. బాధిత కుటుంబాలు ఇంకా తమ వారెక్కడ ఉన్నారో చెప్పమని ఆందోళన చేస్తూనే ఉన్నారు. 2006 నాటి 'ట్రింకో ఫైవ్' కేసుగా పేరొందిన సంఘటనలో ఐదుగురు తమిళ్ విద్యార్థులను బలవంతంగా శ్రీలంక స్పెషల్ టాస్క్ ఫోర్స్ వారు చంపివేశారనే ఆరోపణలున్నాయి. 2006లోనే ముత్తూర్‌లో ఫ్రెంచ్ సహాయ సంస్థ ఏక్షన్ కంట్రీ లా ఫైమ్‌కు చెందిన 17 మంది సిబ్బందిని హత్య చేశారనే ఆరోపణలున్నాయి. వారి కుటుంబ సభ్యులు ఇంకా న్యాయం చేయాలని కోరుతున్నారు. 2012లో వెలికాడా జైలులో 27 మందిని చంపిన ఆరోపణలు, 2008-2009లలో కొలంబో నుంచి నావికాదళం 11 మంది యువకులను అపహరించడం, 2006లో తమిళ రాజకీయ వేత్త నటరాజ రవిరాజ్‌ను హత్యా కావించడమూ, 2009లో 'బూది సండే లీడర్' సంపాదకుడు లసంత విసీక్రమతుంగేను హత్య చేయడం వంటివి కేవలం కొన్ని ఉదాహరణలు మాత్రమే.

శ్రీలంకలో పరివర్తన న్యాయం అమలు చేస్తామని ప్రభుత్వం జెనీవాలో ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలికి హామీ ఇచ్చి నాలుగేళ్లు అవుతున్నా ఇంకా ఆ దిశలో చెప్పుకోదగిన ప్రయత్నం చేయడం లేదు. నేరాలకు పాల్పడిన వారిని శిక్షించకపోవడంతో దేశంతో జాతి, మతపర ఉద్రిక్తతలు పెరిగి సామాజిక విభజనకు దారితీస్తున్నట్లు గత సంవత్సరం ముస్లింల గృహాలు, వ్యాపారాలు, ప్రార్థన స్థలాలపై జరిగిన దాడులు వెల్లడి చేస్తున్నాయి. శ్రీలంకలో తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిని వదిలివేస్తున్నంతకాలం, హింసాయుత వాతావరణం నుండి శ్రీలంక బయట పడలేదని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆసియా డైరెక్టర్ బిరాజ్ పట్నాయక్ స్పష్టం చేశారు.

బుద్ధిస్టు - ముస్లింల మధ్య ఘర్షణలు

కొన్నేళ్ల క్రితం శ్రీలంకలో బౌద్ధం పేరుతో 'బోడు బాలసేన' (బిబిసి) అనే ఉన్మాద సంస్థ ఏర్పడ్డది. వీరికి మనదేశంలోని ఆర్ఎస్ఎస్‌తో భావసారూప్యత, స్నేహ సంబంధాలు ఉన్నాయి. వీరిరువురికి ముస్లింలు టార్గెట్. ఆర్ఎస్ఎస్ హిందూ సాంస్కృతిక జాతీయవాదం బోధిస్తే, బాలసేన సింహళీయుల జాతీయ సాంస్కృతిక వాదాన్ని బోధిస్తుంది. ఒకరి సమావేశాలకు ఒకరు హాజరవుతున్నారు. మయన్మార్ రోహింగ్యాల పట్ల ద్వేషాన్ని వెల్లగక్కుతున్నారు. ముస్లిం మతస్తులు తమ జనాభాను పెంచుకొని శ్రీలంక ద్వీపాన్ని మొత్తం ఆక్రమిస్తారని అబద్దాలు, రెచ్చగొట్టే ప్రచారాలు బిబిసి సాగిస్తోంది. అయినా ప్రభుత్వం వీరిని కట్టడి చేయడం లేదు. మైనార్టీలపై సింహళ-బౌద్ధ ఫాసిస్టు విధానాలు అమలు పరుస్తున్నారు. 2014 జూన్‌లో దేశ నైరుతి ప్రాంతంలోని కాలుతర జిల్లాలో ముస్లింల ఇండ్లపై, వ్యాపార సంస్థలపై దాడులు సాగాయి. ఈ దాడుల్లో నలుగురు మరణించగా, ఎనభైమంది గాయపడ్డారు. ఇవి మత కలహాలుగా మారి ఎనిమిది వేల మంది ముస్లింలు, రెండు వేల మంది సింహళులు నిరాశ్రయులయ్యారు. 2018 ఫిబ్రవరి 26 నుంచి మార్చి 10 వరకు ముస్లింలపై, మసీదులపై, వ్యాపార సంస్థలపై దాడులు సాగాయి.

ఎల్‌టిటిఇ అణచివేతకు గురైన తరువాత శ్రీలంక బుద్దిస్టు జాతీయవాదులు (బోడు బాలసేన) ముస్లింలు, క్రైస్తవులపై దాడులకు తెగబడడం ఆరంభించారు. ఈ దాడులను నియంత్రించే విషయంలో ప్రభుత్వమూ, సైన్యమూ ఉదాసీనంగా వ్యవహరిస్తుండడం, వారిని

సమర్థిస్తుండడంతో దేశవ్యాప్తంగా ఈ దాడులు హెచ్చుతూ, ప్రతిఘటించలేని నిస్సహాయ స్థితిలోకి మైనారిటీలు జారుకున్నారు. ఇప్పటికే సింహళ భాషలో ముస్లిం వ్యతిరేక ప్రసంగాలు ప్రచారంలో ఉన్నాయి. ఇప్పుడు లంక ప్రభుత్వం అనుమానిస్తున్న నేషనల్ తౌహిత్ జమాత్ (ఎన్‌జెటి)కు దేశంలో మత ప్రశాంతతను భగ్నం చేసిన చరిత్ర ఉన్న మాట నిజం. బుద్ధుడినీ, బౌద్ధాన్నీ విమర్శిస్తూ ఈ సంస్థకు చెందినవారు పలుమార్లు దేశంలో మత ఘర్షణలకు కారకులైనారు. గత ఏడాది బుద్ధుని విగ్రహాలను ధ్వంసం చేసి, మత ఉద్రిక్తతలను రగల్చి కొన్ని రోజుల పాటు అత్యయిక స్థితి విధించాల్సిన పరిస్థితి సృష్టించారు కూడా.

శ్రీలంకలో ఇస్లామిక్ ఛాందసవాదం కొత్తకాదు. 2009లో ఎల్‌టిటిఇ పతనమైన తరవాత సమస్య మరోరూపంలో ముందుకొచ్చింది. 70 శాతం జనాభా గల బౌద్ధులకు, మైనార్టీ ముస్లింలకు మధ్య దూరం పెరుగడం మొదలైంది. ఇది క్రమంగా దాడుల వరకు వెళ్లింది. 2012లో బుద్ధ గురువు అయగమ్మ సమితతోపాటు ఆయన డ్రైవర్‌ను కల్‌తార జిల్లాలోని దర్గా పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. దీనికి సంబంధించి పోలీసులు ముగ్గురు ముస్లిం యువకులను అరెస్టు చేశారు. ఇది ఇరు వర్గాల మధ్య అల్లర్లకు దారి తీసింది. 2014లో మరోమారు ఇదే పట్టణంలో మతకలహాలు చెలరేగాయి. పోలీసుల కాల్పుల్లో ఏడుగురు మరణించారు. క్రమంగా చుట్టుపక్కల ప్రాంతాలకూ ఘర్షణలు విస్తరించాయి. తరవాత నేషనల్ తోహీద్ ఇబ్రహీం (ఎన్.టి.ఐ) , జమ్మయాతుల్ మల్లత్తు ఇబ్రహీం (జె.ఎం.ఐ) అనే ముస్లిం తీవ్రవాద సంస్థలు పుట్టుకొచ్చాయి. ఇవి మతపరమైన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవి. ఛాందసవాదాన్ని ప్రేరేపించేవి. తాజా పేలుళ్ల వెనక ఎన్‌టిఐ ఉన్నట్లు గుర్తించారు. ఈ సంస్థకు తమిళనాడులోని తైహీద్ జమాత్ సంస్థతోనూ సంబంధాలు ఉన్నాయి.

ఇటీవలి రాజకీయ సంక్షోభం

శ్రీలంకలో అసలు సమస్య అక్కడి నాయకత్వపు వైఫల్యాలు, ఆధిపత్యం పోరులో ఉంది. ప్రధాని విక్రమ సింఘే, అధ్యక్షుడు సిరిసేన మధ్య విబేధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో విక్రమ సింఘేను ప్రధాని పదవి నుంచి తొలగించి రాజపక్సేను ఆయన స్థానంలో నియమించి ఉన్నత న్యాయస్థానం నుంచి శ్రీలంక అధ్యక్షుడు సిరిసేన మొట్టికాయలు తినడం పర్యవసానంగా మళ్లీ విక్రమ సింఘేకు ప్రధాని బాధ్యతలు అప్పజెప్పక తప్పని పరిస్థితి తలెత్తడం తెలిసిందే. అప్పటి ఆ విబేధాలు వారిద్దరి మధ్య కొనసాగుతున్నాయని ఈ నేపథ్యంలో అక్కడి భద్రతా వ్యవస్థ దారుణంగా దెబ్బతిన్నదని ఈ పేలుళ్లు దాని పర్యవసానాలేనని భావించడం ఆక్షేపణీయం కాదు. శాంతిభద్రతలు అధ్యక్షుడు సిరిసేన తనవద్దనే ఉంచుకున్నారు.

శ్రీలంకలో అధ్యక్షుడు సిరిసేన, ప్రధాని విక్రమ్‌సింఘేల మధ్య రాజకీయ ఘర్షణ కొనసాగుతోంది. శ్రీలంక రాజకీయ అనిచ్చితి కారణంగానే కాకుండా, అంతర్జాతీయ పరిణామాలు శ్రీలంకలో ఉద్రిక్తతలకు దారితీశాయి. మయన్మార్‌లోని రోహింగ్యాలపై దాడులకు పురికొల్పిన బౌద్ధ తీవ్రవాది ఆషిన్ విరాతుకు శ్రీలంకలోని 'బోదు బాలసేన'తో సంబంధాలు ఉన్నాయి. థాయిలాండ్‌లో కూడా బౌద్ధ–ముస్లిం ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. మలేషియాలో కూడా ఈ రెంటి మధ్య ఉద్రిక్తతలు ఉన్నాయి. తూర్పు ఆసియాలో బౌద్ధ–ముస్లిం వైరుధ్యం పెంచే అంతర్జాతీయ పన్నాగం ప్రభావం శ్రీలంక మీద పడ్డది. శ్రీలంకలో బౌద్ధమే కాదు. ముస్లిం మతంలోనూ తీవ్రవాద ధోరణులు పెంచడం ఈ కుట్రలో భాగమే. సూఫీ ఇస్లాం స్థానంలో తీవ్రవాద భావజాలం చోటు చేసుకుంటున్నది. ముస్లింలపై ఈ అంతర్జాతీయ ప్రభావం మూలంగానే శ్రీలంకలో క్రైస్తవులపై దాడి జరిగింది. ఏది ఏమైనా ప్రభుత్వాలు మతపరమైన విద్వేషాలను నిష్పాక్షికంగా నిరోధించని పక్షంలో ఏదో ఒక రూపంలో తీవ్రవాదం పుట్టుకొస్తుందన్నది ప్రపంచ చరిత్ర చెపుతున్న పాఠం. తీవ్రవాదానికి మూలాలు జాత్యహంకారంతో, సామాజిక, ఆర్థిక, రాజకీయాంశాలతో ముడిపడి ఉన్నందున అణచివేత మీద ఆధారపడి తీవ్రవాదాన్ని కట్టడి చేయడం సాధ్యం కాదేమో!

కొలంబో పేలుళ్ల గాయం మానక ముందే మానవ హక్కుల ఉల్లంఘన సమస్య మైత్రిపాలకు పులి మీద పుట్రలా చుట్టుకుంది. ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ మానవ హక్కుల ఉద్యమకారులు, నేపాల్, పాకిస్తాన్ జర్నలిస్టులు కొందరు మైత్రిపాలకు ఒక సంయుక్త లేఖ రాస్తూ ఉగ్రవాదుల వేట పేరిట సామాన్యుల హక్కులకు భంగం కలిగించవద్దని కోరారు. శ్రీలంకలో రాజపక్సె అధ్యక్షునిగా కొనసాగిన కాలంలో లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈలం (ఎల్‌టిటిఇ) కార్యకర్తలను ఏరివేసేందుకు అప్పటి ప్రభుత్వం హక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్టు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ నిర్ధారించింది. మళ్లీ అలాంటి ఉల్లంఘన జరుగుతున్నట్టు సమాచారం అందడం వల్లనే హక్కుల ఉద్యమకారులు, జర్నలిస్టులు ఈ లేఖను విడుదల చేశారు. ఈ నేపథ్యం నుంచి చూస్తే శ్రీలంక అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా తయారైంది.

ముగింపు

శ్రీలంకలో ఈస్టర్ పండుగ రోజున ముస్లీం తీవ్రవాదులు చేసిన దాడులు న్యూజిలాండ్‌లోని క్రైస్టు చర్చి నగరంలో ఒక మసీదుపై దాడిచేసి 50 మందిని పొట్టనబెట్టుకున్న ఉదంతానికి ప్రతీకారమనడం ఒక సాకు మాత్రమే. కొన్నేళ్లుగా విధ్వంసానికి పథక రచన చేయకుండా ఇదంతా సాధ్యమయ్యేది కాదు. న్యూజిలాండ్ దాడికి, శ్రీలంక దాడులకు మధ్య నిండా నెలరోజుల వ్యత్యాసం కూడా లేదు. ఇంత తక్కువ వ్యవధిలో అవసరమైన మనుషుల్ని పోగేసుకొని వారికి ఉన్మాదాన్ని నూరిపోయడం, బాంబులు, ఇతర మారణాయుధాలు అవసరమైన చోట్లకు తరలించడం వీలుకాదు. శ్రీలంకకు భారీయెత్తున పర్యాటకులు వస్తుండడం, అందులో పాశ్చాత్య దేశాలకు చెందినవారు గణనీయంగా ఉండడం, తగిన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం, నిఘా సంస్థలు ఏమరుపాటుగా ఉండడం వంటివన్నీ క్షుణ్ణంగా గమనించిన తర్వాతే తీవ్రవాదులు ఆ దేశాన్ని లక్ష్యంగా ఎంచుకున్నారని, దాడులకు అదును కోసం ఎదురుచూశారని మొత్తం ఘటనల క్రమం చూస్తే అర్థమవుతుంది.

శ్రీలంకలో ఎంత ఘర్షణాత్మక వాతావరణమున్నా ఇప్పటివరకు ముస్లింలు, క్రైస్తవుల మధ్య ఎప్పుడూ పొరపొచ్చాలు రాలేదు. దశాబ్ద కాలంగా బుద్దిస్టులకు, ముస్లింల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. వాస్తవానికి దాడులకు సూత్రాధారిగా భావిస్తున్న ఎన్‌టిజె చీఫ్ జహ్రాన్ హషీమ్ విద్వేష ప్రసంగాలతో అందరినీ రెచ్చగొడుతున్నాడని నాలుగేళ్లక్రితం ఒకసారి, ఏడాదిక్రితం మరోసారి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని శ్రీలంక ముస్లిం మండలి ఉపాధ్యక్షుడు హిల్మే అహ్మద్ చెబుతున్న మాటలు వింటే ఆశ్చర్యం కలుగుతుంది. ఈ దాడులు ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించడానికి చేసినట్టు భావించవచ్చు.

తీవ్రవాదుల దాడుల పర్యవసానాలు మరణాలతో, విధ్వంసంతో ఆగిపోవడం కాదు వారికి కావలసింది. అవి సమాజంలో శాశ్వతంగా విద్వేషాగ్నులు రగల్చాలి. ఒక భయానక వాతావరణాన్ని సృష్టించాలి.

బ్రిటన్‌ను వణికిస్తున్న బ్రెగ్జిట్ సంక్షోభం

***యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలగడానికి చేసుకున్న బ్రెగ్జిట్ ఒప్పందం సంక్లిష్టంగా మారిందనీ, అది బ్రిటన్‌లో తీవ్ర ఆర్థిక సంక్షోభానికి, రాజకీయ అనిశ్చితికి దారితీస్తోందనీ అంటున్నారు* సంతోష్**

గత మూడు సంవత్సరాలుగా బ్రిటన్ చరిత్రలో ఎన్నడూ ఎరుగని రాజకీయార్థిక సంక్షోభం ఎదుర్కొంటోంది. 2016 జూన్ 23న ఇయు నుండి తప్పుకోవాలని బ్రెగ్జిట్‌పై రెఫరెండం జరిగినప్పుడు బ్రిటన్‌లోని ఇంగ్లండ్, వేల్స్, స్కాట్లాండ్ ఇయు నుంచి వైదొలగాలని ఓటేస్తే... ఉత్తర ఐర్లాండ్ పౌరులు మాత్రం ఇయుకు అనుకూలంగా తీర్పునిచ్చారు. ఇయు నుంచి తప్పుకోవాలని తీసుకున్న నిర్ణయం శరాఘాతమవుతుందని, ముందు నుయ్యి... వెనక గొయ్యి అన్న చందంగా మారుతుందని బ్రిటన్‌కు ఆలస్యంగా అర్థమైంది. ప్రపంచవ్యాప్తంగా మితవాదులు, ఛాందసవాదులు బలపడుతున్న దశలో బ్రిటన్‌లో యుకె ఇండిపెండెంట్స్ పార్టీ (యుకె ఐపి) ఇయు నుంచి బయటకు రావాలన్న నినాదం అందుకుంది. దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు ఇదే పరిష్కారమని ప్రచారం చేసింది. 51.9 శాతం ప్రజలు బ్రెగ్జిట్‌కు అనుకూలంగా ఓటు వేశారు. ఇయు నుండి బ్రిటన్ బయటకు రావడాన్ని బ్రిటన్ ఎగ్జిట్ (బ్రెగ్జిట్)గా పిలుస్తారు.

బ్రెగ్జిట్ నేపథ్యం

1971 జనవరి 1న ఇంగ్లండ్, వేల్స్, స్కాట్లండ్, ఉత్తర ఐర్లండ్, జిబ్రాల్టర్ ఐరోపా ఆర్థిక సమాజం(ఇఇసి)లో చేరి ఒక ప్రాంతీయ ఆర్థిక కూటమిగా అవతరించాయి. 1957 రోమ్ ఒప్పందం దీనికి ప్రాతిపదిక. ఇది మార్కెట్ కోసం ఏర్పడింది. సభ్య దేశాల మధ్య సరుకులు, పెట్టుబడి, సేవలు, ప్రజలు స్వేచ్ఛగా రాకపోకలు సాగించేందుకు సరిహద్దులు బార్లా తెరిచి ఉంచేలా చూడడం దీని లక్ష్యం. 1993 నాటికి కొత్తగా యూరోపియన్ కూటమి (ఇయు) ఏర్పడింది. దీనిలో ఆర్థిక సమాజం విలీనమైంది. అప్పటి నుంచి ఇది యూరోపియన్ యూనియన్ (ఇయు)గా మారింది. 2009లో ఇయు ఫ్రేమ్‌వర్క్ పరిధిని విస్తరించిన తరువాత అది సూపర్‌స్టేట్‌గా అవతరించింది. ఉమ్మడి ఆర్థిక ప్రయోజనాలే లక్ష్యంగా బయల్దేరిన ఇయు క్రమంగా సైనిక, రాజకీయ రంగాలకు విస్తరించింది. ఉమ్మడి కరెన్సీ, ఇయు సెంట్రల్ బ్యాంకు (ఇసిబి), ఇయు న్యాయస్థానం (ఇసిజె)లను సొంతంగా ఏర్పాటు చేసుకుంది.

1990లో ఈ యూరోపియన్ యూనియన్ దేశాలు ప్రత్యేక కరెన్సీని ఏర్పాటు చేసుకుని పరస్పర సహకారానికి నడుం బిగించాయి. ఆ 28 దేశాల పౌరులకు యథేచ్ఛగా ఆయా దేశాలకు వెళ్లి వచ్చేందుకు పాస్‌పోర్టు కూడా అక్కర్లేదు. పైగా ఎవరైనా ఏ దేశానికైనా అనుమతులు అవసరం లేకుండా, ఆంక్షలతో పనిలేకుండా ఎక్కడైనా స్థిరపడవచ్చు. ఆనాటి ఒప్పందాలే ఈరోజు బ్రిటన్ పాలిట శాపంగా మారాయి.

2010 తర్వాత పలు ఐరోపా దేశాల్లో ఆర్థిక ప్రగతి కుంటుపడటంతో ఆయా దేశాల్లో నిరుద్యోగం పెరిగింది. ఉన్నత చదువులు, ఉపాధి కోసం అంతా బ్రిటన్ దారి పట్టడంతో ఆ దేశంలో కొత్త మైగ్రేషన్ సమస్య తలెత్తింది. ఇదిలా ఉంటే గల్ఫ్ తదితర ఆసియా దేశాల నుంచి కూడా వేలసంఖ్యలో శరణార్థులు తరలి వస్తుండడం బ్రిటన్‌కు గోరుచుట్టుపై రోకటిపోటులా తయారైంది. దీంతో స్థానికేతరులతోపాటు స్థానికులకు సైతం ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లాయి. ఈ తలనొప్పిని భరించలేక చివరకు బ్రిటన్ ఐరోపా యూనియన్ నుంచే తప్పుకోవాలనుకుంది.

28 దేశాలతో కూడిన ఇయు కూటమిపై జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు నిర్ణయాత్మక శక్తిగా వ్యవహరిస్తున్నాయి. 1973 నుంచి యునైటెడ్ కింగ్‌డమ్ (బ్రిటన్)కు ఇది ఇబ్బందికరంగా మారింది. దీంతో బ్రిటన్ అమెరికాతో ప్రత్యేక సంబంధాలను ఏర్పరచుకుంది. బ్రిటన్ ప్రాబల్యాన్ని అడ్డుకోవడంలో మరో కీలక సాధనం నాటో. ఈ పరిస్థితుల్లో ఇయులో బ్రిటన్ కొనసాగడంపై కన్సర్వేటివ్ యూనియనిస్టు పార్టీ (టోరీ పార్టీ)లో విభేదాలు పొడచూపాయి. అదే సమయంలో ప్రపంచీకరణ ఆర్థిక విధానాల వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి మితవాద శక్తులు ఇయు సభ్యత్వంపై వివాదాన్ని లేవనెత్తాయి. తద్వారా తమ జాతివాదం, వలస వ్యతిరేకత ఎజెండాను తెరపైకి తెచ్చాయి.

1993లో ఏర్పడిన ఇయు నుంచి బ్రిటన్ బయటకు రావాలని పట్టుబట్టిన పార్టీల్లో యుకె ఇండిపెండెంట్ పార్టీ ప్రధానమైంది. పెట్టుబడిదారీ వ్యవస్థ వైఫల్యాన్ని కప్పిపుచ్చడానికి మితవాద శక్తులు వలసలను ఒక సాకుగా చూపనారంభించాయి. వలసల చారిత్రక

మనుషులు పరస్పరం కలిసిమెలిసి ఉండే వాతావరణాన్ని ధ్వంసం చేయాలి. ఒకరిపై ఒకరికి అనుమానాలు కలిగించాలి. తీవ్రవాదం ఒక మతానికో, ప్రాంతానికో చెందినది కాదు. అది సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకు పాలకులకు ఉపయోగపడేలా పనిచేస్తుంటాయి. కొన్నిసార్లు మతతత్వ, జాతీయ ఉన్మాదంతో దాడులకు పాల్పడుతుంటాయి. అమెరికా, భారత్, యూరప్ దేశాల్లోనూ మితవాద, మతవాద శక్తులు బలం పెంచుకుంటున్నాయి. శ్రీలంక ఇందుకు మినహాయింపు ఏమీ కాదు. శ్రీలంక దాడుల నుంచి గ్రహించాల్సింది ఇదే. తీవ్రవాదం మానవాళికే శత్రువు. అందువలన సమాజం మొత్తం ఏకమై అవిశ్రాంతంగా పోరాడితే తప్ప అది సులభంగా అంతరించదు. తీవ్రవాదంపై పోరాడడమంటే తీవ్రవాద మూలాలపై ప్రగతిశీల ప్రజాతంత్ర శక్తులన్నీ కలిసికట్టుగా పోరాడాలి.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

నేపథ్యాన్ని గురించి చెప్పకుండా వీటిని గుడ్డిగా వ్యతిరేకించడమే తమ విధానంగా పెట్టుకున్నాయి.

ప్రపంచీకరణ నేపథ్యంలో కోర్ దేశాలుగా జర్మనీ ఫ్రాన్స్‌ల ఎదుగుదల, మధ్య ప్రాచ్యంలో (ఇరాక్, లిబియా) సామ్రాజ్యవాద యుద్ధాల ఫలితంగా యూరప్‌కు పెరిగిన శరణార్థుల ఫలితంగా బ్రిటన్ తీవ్ర సంక్షోభంలో పడింది. బ్రెగ్జిట్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేసిన అప్పటి ప్రధాని డేవిడ్ కామెరాన్ మెజారిటీ ప్రజాభిప్రాయం బ్రెగ్జిట్‌వైపే ఉండడంతో 2016 జూలై 13న ప్రధాని పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో థెరిసా మే బ్రిటన్ ప్రధాని అయ్యారు. ఆమె అప్పటి నుంచీ రెండేళ్లపాటు ఇయు నేతలతో చర్చలు జరిపి బ్రిటన్ ఇయు నుంచి వైదొలిగేందుకు అనువుగా వాణిజ్య, ఆర్థిక, ఎగుమతి దిగుమతులు, ప్రవాసులు, తదితర రంగాల్లో ఈ వేర్పాటు సక్రమంగా జరిగేందుకుగాను ఇయుకు చెందిన 27 దేశాలతో 2018 నవంబర్ 25న 585 పేజీల బ్రెగ్జిట్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దాన్నే బ్రెగ్జిట్ ఒప్పందంగా పిలుస్తున్నారు.

అస్బాన్ ఒప్పందం–2007లో ఆర్టికల్ 50 ప్రకారం ఇయు నుంచి బయటకు వచ్చే ప్రక్రియను 2017 మార్చ్ 29న థెరిసా మే ప్రారంభించారు. ఇయు నుండి బయటకు వెళ్లాలనే దేశం కొన్ని విషయాలను అమలు చేయాలి. 1) బహిష్కరించిన దేశం, ముందుగా ఇయుకు రాజ్యాంగ పరంగా నోటీసు ఇవ్వాలి. 2) నోటీసు తర్వాత రెండు సంవత్సరాల పాటు భవిష్యత్తు గురించి చర్చలను ఇయు జరుపుతుంది. 3) ఎగ్జిట్‌కు ఇయు ఆమోదం పొందితే భవిష్యత్తులో ఉండబోయే వాణిజ్య లావాదేవీలు గురించి ఒప్పందం కుదుర్చుకో వచ్చును. 4) బ్రెగ్జిట్ రెఫరెండం తర్వాత ఇయు నుండి ఎన్ని సంవత్సరాల్లో బ్రిటన్‌ను సాగనంపాలన్న స్పష్టత లేదు. డొనాల్డ్ ట్రంప్ మాత్రం 7 సంవత్సరాలు పట్టినా ఆశ్చర్యపోనవసరం లేదని అప్పట్లో అన్నాడు.

ఇయు నుండి విడిపోవడానికి బ్రిటన్ ప్రధాని థెరిసా మే ఇయుతో కుదుర్చుకున్న బ్రెగ్జిట్ ఒప్పందాన్ని స్వంత పార్టీ సభ్యులు ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ఇయు భాగస్వామ్యాన్ని వదులుకుంటున్నందువల్ల అందుకు పరిహారంగా బ్రిటన్ 3,900 కోట్ల పౌండ్లు చెల్లించాలని ముసాయిదా నిర్దేశిస్తోంది. దీంతోపాటు బ్రిటన్‌లో భాగంగా ఉన్న ఉత్తర ఐర్లాండ్ ఇయు నిబంధనలే వర్తించాలని అది కోరుతోంది. ప్రధానంగా ఈ రెండు అంశాలనూ అటు లేబర్ పార్టీ, ఇటు కన్సర్వేటివ్ పార్టీలోని అత్యధికులు గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. ప్రధాని థెరిసా మే బ్రెగ్జిట్ ఒప్పందాన్ని పార్లమెంట్ ఆమోదానికి తొలుత 2019 జనవరి 15న, పిదప 2019 మార్చి 12న మూడవసారిగా 2019 మార్చి 29న ప్రయత్నించగా మొదటిసారి 230 ఓట్ల తేడాతోనూ, రెండవసారి 149 ఓట్ల తేడాతోనూ, మూడవసారి 58 ఓట్ల తేడాతోనూ బ్రెగ్జిట్ ప్రతిపాదన ఓడిపోయింది.

తొలుత బ్రెగ్జిట్‌ను వ్యతిరేకించిన లేబర్ పార్టీ ఇప్పుడు 'జాతి ఐక్యత' పేరుతో రాజీ ధోరణి ప్రదర్శిస్తున్నది. మితవాద పార్టీలు మాత్రం బ్రెగ్జిట్‌ను బలపరుస్తున్నాయి. మళ్లీ రెఫరెండంకు వెళ్లాలని పట్టుబడుతున్నాయి. బ్రెగ్జిట్ ఇన్ని కష్టాలు తెచ్చిపెడుతుందని థెరిస్సా అనుకుని ఉండదు. అది దేశాన్ని ఈ దుస్థితికి నెడుతుందని అప్పట్లో ఎవరూ ఊహించి ఉండకపోవచ్చు. యూరోపియన్ సమాఖ్య నుండి ఏదైనా దేశం విడిచి వెళ్లిపోవాలంటే అంత సులభం కాదు. బ్రిటన్ పదే పదే బ్రెగ్జిట్ గడుపు పొడిగించమని కోరడం, అందుకు ఇయు సిద్ధపడడం సభ్య దేశాలకు రుచించడం లేదు. ప్రపంచీకరణ ఉత్తర దక్షిణ, పశ్చిమ తూర్పు దేశాల మధ్య, దేశాల్లోని ప్రజల మధ్య ఆర్థిక అసమానతలను పెంచింది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అమెరికా, జర్మనీ–ఫ్రాన్స్ శిబిరాల మధ్య విడిపోగా వీరిద్దరి మధ్య యుకె పరిస్థితి అగమ్యగోచరంగా కనబడుతుంది. ఒకప్పటి రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం ఉనికి కోసం ఇవాళ నానా తంటాలు పడుతోంది.

మొదట బ్రెగ్జిట్ కోసం ఏర్పరచుకున్న నిబంధనల ప్రకారం బ్రిటన్ 2019 మార్చి 29 నాటికి ఇయు నుంచి వైదొలగవలసి ఉంది. కానీ థెరిస్సా మే ఇయుతో కుదుర్చుకున్న బ్రెగ్జిట్ ఒప్పందాన్ని బ్రిటన్ పార్లమెంటు దిగువ సభ తిరస్కరించింది. దానివల్ల బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని విమర్శిస్తూ ప్రతిపక్ష లేబర్ పార్టీ సభ్యులే కాకుండా, అధికార పార్టీ ఎంపిలు, మే కేబినెట్‌లోని కొందరు మంత్రులు కూడా ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కొందరు మంత్రులు రాజీనామాలు కూడా చేశారు. ఈ ఒప్పందాన్ని దిగువ సభలో ఓడించడమే కాకుండా థెరిస్సా మే పై రెండుసార్లు అవిశ్వాస తీర్మానం కూడా సభలో ప్రవేశపెట్టారు. అయితే బ్రెగ్జిట్ ఒప్పంద తీర్మానం ఓడిపోయినా మే మాత్రం రెండుసార్లూ విశ్వాస పరీక్షలో నెగ్గారు. తర్వాత ఆమె మూడోసారి కూడా బ్రెగ్జిట్ ఒప్పందాన్ని సభలో ప్రవేశపెట్టి విఫలమయ్యారు.

2019 మార్చి 14న దిగువ సభలో బ్రెగ్జిట్ ఒప్పందం లేకుండానే బ్రిటన్ ఇయు నుంచి వైదొలగాలని ప్రతిపాదన థెరిస్సా మే ప్రవేశపెట్టారు. ఆ ప్రతిపాదనను కూడా సభ్యులు తోసిపుచ్చారు. అనంతరం బ్రెగ్జిట్ కోసం రెండోసారి యూకేలో రెఫరెండం నిర్వహించాలన్న ప్రతిపాదన ప్రవేశపెట్టగా దాన్ని కూడా సభ భారీ మెజారిటీతో తిరస్కరించింది. మొత్తం మీద మార్చి 29 నాటికి బ్రెగ్జిట్ జరగలేదు. కాబట్టి బ్రిటన్ వైదొలగడానికి గడువు పొడిగించాలని మే ఇయు నేతలను కోరారు. బ్రెగ్జిట్ ఒప్పందాన్ని యథాతథంగా ఆమోదిస్తే బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటుందని పలువురు నాయకులు, ప్రజలు కూడా భావిస్తున్నారు. అందుకే బ్రెగ్జిట్ ప్రక్రియను ఎలా అమలు చేయాలన్న విషయంలో విభేదాలు తారస్థాయికి చేరాయి. బ్రెగ్జిట్ అనుకూలురతో పాటు బ్రెగ్జిట్ వ్యతిరేకులు కూడా దానికి అడ్డు పడుతున్నారు. ఒప్పందాన్ని మార్చేందుకు ఇయు అంగీకరించడం లేదు.

యూరోపియన్ యూనియన్ (ఇయు) నుంచి బ్రిటన్ విడిపోయేందుకు ఉద్దేశించిన బ్రెగ్జిట్‌కు గడువు 2019 మార్చి 29తో ముగియనుండగా బ్రిటన్ విజ్ఞప్తి మేరకు దాన్ని మొదట ఏప్రిల్ 12వ తేదీ దాకా ఇయు తాత్కాలికంగా పొడిగించింది. మళ్లీ మరో ఆరు నెలల పాటు, అంటే 2019 అక్టోబర్ 31 దాకా పొడిగిస్తున్నట్లు ఏప్రిల్ 11న ప్రకటించింది. బెల్జియంలోని బ్రస్సెల్స్‌లో 28 ఇయు దేశాలు సమావేశమై ఈ అంశంపై చర్చలు జరిపి పై నిర్ణయం తీసుకున్నాయి. అంటే బ్రిటన్ ఇయు నుంచి అక్టోబర్ చివరిదాకా వైదొలగదు. కాబట్టి నిబంధనల మేరకు మే 23న జరుగనున్న ఇయు ఎన్నికల్లో బ్రిటన్ పాల్గొనవలసి ఉంటుంది. అయితే ఈ పొడిగింపు వల్ల బ్రిటన్ ఇప్పటికిప్పుడు ఎలాంటి ఒప్పందం లేకుండా ఇయు నుంచి వైదొలగవలసిన పరిస్థితి తప్పింది.

ఇయును కాదని బ్రిటన్ ఎగ్సిట్ అయితే

ఇయు దేశాల నుండి 30 శాతం వరకూ ఆహార పదార్థాలు యుకెకు వస్తున్నాయి. అవి ఆగిపోతే నిత్యావసర వస్తువుల ధరలు ప్రియం కావచ్చు. ఇయు దేశాలకు వెళ్లాలంటే చాలా నిబంధనలు భవిష్యత్తులో వర్తింపవచ్చు. సెలవులలో అనేక లక్షలాది మంది ఇయు దేశాలకు ప్రయాణం చేస్తుంటారు. 2017 సంవత్సరంలో 5 కోట్ల నలభై ఏడు లక్షల మంది ఇయు దేశాలకు వెళ్లారు. ఇకపై వీసా నిబంధనలు పాస్‌పోర్టు నిబంధనలు వర్తిస్తాయి. ఐర్లాండుకు ప్రయాణించినా ఈ షరతులు వర్తింపవచ్చును. యూరోపియన్ ఆరోగ్య బీమా బ్రిటన్‌కు వర్తించదు. ఆరోగ్య బీమాకు అదనంగా చెల్లించవలసి వస్తుంది. కార్లలో ప్రయాణించే వారు అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సు పొంది ఉండాలి. ఇయు దేశాల నుండి దిగుమతి అవుతున్న మందులకు కొరత ఏర్పడి ధరలు పెరగవచ్చు. సరైన సమయంలో సరైన మందులు రోగులకు దొరకవు. ఇయు దేశాల పౌరులతో సమానంగా ఆరోగ్య బీమా పొందలేని పరిస్థితులేర్పడతాయి. ఇదే తరహాలో యుకెలోని ఇయు దేశాల పౌరులకు నివాస షరతులు వర్తిస్తాయి. గనుక రాకపోకలు తగ్గే అవకాశాలుంటాయి. 2017 సంవత్సరం లెక్కల ప్రకారం కోటి 30 లక్షల యుకె పౌరులు మిగిలిన 27 ఇయు దేశాలలో నివసిస్తున్నారు. వీరికి వేరే ఇయు దేశాల్లో స్థిర నివాసముండాలంటే వీసా నిబంధనలు వర్తించే అవకాశం ఉంటుంది.

ఇప్పటి వరకూ ఇయు షరతుల వలన, సదుపాయాల వలన ఒక దేశం నుండి వేరొక దేశానికి నియంత్రణ లేని, సుంకాలు లేని వస్తువులను ఎగుమతి దిగుమతి చేసుకొంటున్నారు. కానీ బ్రెగ్జిట్ ఒప్పందాలు లేకుంటే అధిక సుంకాల వలన ధరలు విపరీతంగా పెరిగి, వాణిజ్యం సన్నగిల్లే అవకాశాలుండవచ్చును. ఈ వాణిజ్యం 87 శాతం వస్తువుల ఎగుమతులు దిగుమతులకు వర్తిస్తుంది. అయితే ప్రజల కొనుగోలు శక్తి పెరిగితే స్థానిక పరిశ్రమలు అభివృద్ధి చెందే అవకాశాలుంటాయి. మదుపుదారుల ఆసక్తి తగ్గటంతో ఇప్పటికే యూకేలో గడిచిన 5.6 సంవత్సరాల నుండి మందకొడిగా సాగుతున్న భవన నిర్మాణం, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు మరింత క్షీణించదానికి అవకాశాలు ఏర్పడతాయి. సెల్‌ఫోన్ల రోమింగ్ ఛార్జీలు, ఫోన్ల ధరలు పెరిగే అవకాశాలుంటాయి. కలైస్, డున్‌కిర్క్ వంటి ముఖ్యమైన నౌకాశ్రయాల్లో కస్టమ్స్ తనిఖీలతో రవాణా జాప్యమేర్పడుతుంది.

ఇదే విధంగా యుకెలో చదువుతున్న ఇయు విద్యార్థులు, ఇయులో చదువుతున్న యూకే విద్యార్థుల భవితవ్యం కూడా ప్రశ్నార్థకంగా ఉంటుంది. ఇయు – యూకేల మధ్య బ్రెగ్జిట్ ఒప్పందం గాని లిస్బాన్ ఒప్పందంలోని ఆర్టికల్ 50ననుసరించి గాని ఇరుపక్షాలు అంగీకరించని పరిస్థితుల్లో 21 నెలల సన్నాహ వ్యవధిని యూకే కోల్పోవటంతో వాణిజ్య బ్యాంకింగ్ రంగాలలో ఇతర సామాజిక రంగాలలో ఒక షాక్‌లా తగిలింది ఇప్పటికిప్పుడే కోల్కోవడం కష్టమవు తుందని నిపుణులు చెబుతున్నారు.

ఉత్తర ఐర్లాండ్ సమస్య

ఐర్లాండు ఇయులో సభ్యదేశం. 1998 వరకూ ఐరిష్ రిపబ్లిక్ – ఐర్లాండుల మధ్యనున్న ఘర్షణల సమస్య గుడ్‌ఫ్రైడే ఒప్పందంతో ముగిసింది. ఐరిస్ ఐర్లాండుల మధ్య సరిహద్దు తనిఖీలను ఎత్తివేశారు. ఐరిష్ రిపబ్లిక్ యూకే భాగస్వామి. యూకే ఇయు నుండి వైదొలిగితే మరలా సరిహద్దు వద్ద వాణిజ్య భద్రత కోసం కస్టమ్స్ చెక్‌పోస్టులను పెట్టవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. కానీ యుకె ఐర్లాండులు ఈ చెక్‌పోస్టులను వ్యతిరేకిస్తున్నాయి. ఇయు మాత్రం ససేమిరా అంటున్నది. ఇదొక నూతన సమస్యను తెస్తున్నది.

చెక్‌పోస్టు ఏర్పాటు చేయకపోతే 'బ్యాక్ డోర్' ద్వారా యూకే ఇయు దేశాలతో వాణిజ్యం చేస్తుందనేది వాదన. శరణార్థులు, తీవ్రవాదులు యూకేలోకి ప్రవేశిస్తారని బ్రెగ్జిట్ అనుకూలుర వాదన. ప్రస్తుతం ఈ అంశం చర్చలలో ఎటూ తేలటం లేదు. కొంతకాలమైన స్వేచ్ఛా వాణిజ్యం యూకే, ఐర్లాండుల మధ్య జరగాలనేది ప్రస్తుతం యూరోపియన్ యూనియన్–యూకేల మధ్య ప్రతిపాదిత చర్చల సారాంశం.

ఇయు సింగిల్ మార్కెట్, కస్టమ్స్ యూనియన్ నుంచి నిష్క్రమించిన తరువాత బ్రిటన్–ఇయు మధ్య సంబంధాలపై కుదుర్చుకున్న ఒప్పందం, రాజకీయ డిక్లరేషన్ బ్రిటన్ ప్రజలకు నష్టదాయకంగా ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బ్రెగ్జిట్‌ను వ్యతిరేకించే వారంతా ఇయులోనే బ్రిటన్ కొనసాగాలని కోరుకునేవారు కాదు. వీరిలో భిన్న ధోరణులు ఉన్నాయి. వలస వ్యతిరేకత, జాతి దురహంకారమే ఎజెండాగా ఉన్న యుకెఐపి వంటి మితవాద శక్తులు ఇయు నుంచి బయటకు వస్తే వలసలకు అడ్డుకట్ట వేయవచ్చని భావిస్తున్నాయి. పాలక కన్సర్వేటివ్‌లో కొందరు ఇయుతో కొనసాగితేనే మంచిదని వాదిస్తున్నారు. లేబర్ పార్టీ, వామపక్షాలు బ్రిటన్‌పై ఇయు రుద్దుతున్న పొదుపు చర్యలు, కార్మిక హక్కులనుహరించే చట్టాలకు స్వస్తి పలకాలని కోరుకుంటున్నాయి. 3,900 కోట్ల పౌండ్లు ఇయుకు పరిహారంగా చెల్లింపు, ఇయు చట్టాలను బ్రిటన్‌పై రుద్దదానికి, వీటో చేయడానికి ఇయుకు అధికారం దఖలు పరచడం, బ్రిటన్‌లోను, యూరపులోను నివసిస్తున్న యూరపుయేతర ప్రజల సంగతి గురించి ప్రజానుకూల బ్రెగ్జిట్ కావాలని అవి కోరుతున్నాయి.

ఇయుతో థెరిసా మే కుదుర్చుకున్న ఒప్పందం బ్రిటన్ ప్రజల ప్రయోజనాలకు భంగకరమని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు. ప్రతిపక్ష నాయకుడు జెరిమీ కార్బిన్‌ను థెరిసా కలిసి మద్దతు అభ్యర్థించారు. ఆ ప్రయత్నం బెడిసికొట్టిన నిస్సాహాయ పరిస్థితుల్లో థెరిస్సా మే రాజీనామా చేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.

బ్రెగ్జిట్ ఒప్పందం అంత తీవ్రమైనదేమి కాదని థెరిసా మే అంటున్నప్పటికీ స్వపక్ష, విపక్ష ఎంపిలు అంగీకరించడంలేదు. ఈ డీల్ అక్టోబర్ 31 లోగా పార్లమెంట్ ఆమోదం పొందడంలో విఫలమైతే బ్రిటన్ ముందు మూడే మూడు మార్గాలున్నాయి. 1) తిరిగి బ్రెగ్జిట్ రిఫరెండం నిర్వహించడం 2) థెరిస్సా మే ప్రధాని బాధ్యత నుంచి తప్పుకోవడం, కొర్బిన్ నేతృత్వంలో మైనార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం. 3) పార్లమెంట్‌కు ఎన్నికలు నిర్వహించడం తప్ప మరో ప్రత్యామ్నాయం బ్రిటన్ ప్రధాని థెరిసా మేకు లేదు. ఎందుకంటే ప్రజాభిప్రాయం, ప్రజాప్రయోజనం అన్నింటికంటే ముఖ్యం.


మొత్తంగా చూస్తే బ్రిటన్ ఆర్థిక సంక్షోభం, రాజకీయ అనిశ్చితిని ఎదుర్కొంటుంది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

గోదావరిలోయ ప్రతిఘటనా పోరాటాల స్వరం

- ఎం. శ్రీనివాస్

రెండు చారిత్రక సందర్భాలకు పురుడుపోసిన రోజు మే 5. ఒకటి కారల్‌మార్క్స్ జన్మించిన సందర్భం కాగా, రెండవది ప్రపంచ శ్రామిక వర్గ పోరాటాలకు దిక్సూచి మేడే పర్వదినం ఆవిర్భవానికి నాంది పలికిన సందర్భం. సరిగ్గా అదే రోజున 2019 మే 5న మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో కామ్రేడ్ అరుణోదయ రామారావు అన్న భౌతికంగా మన నుండి దూరం అయ్యాడు. రామన్న మన మధ్య భౌతికంగా లేకపోయినా ఆయనకున్న మార్క్సిజం – లెనినిజం – మావోయిజం పట్ల ప్రగాఢమైన విశ్వాసం, సడలింపు లేని కమ్యూనిస్టుగా కడవరకు సాగిన అంకితభావం భవిష్యత్ తరాల విప్లవోద్యమ శ్రేణులకు భరోసాగా ఉంటుంది. కామ్రేడ్ రామారావన్న గురించి కొన్ని విషయాలు గుర్తుచేసుకోవడం మన బాధ్యతగా భావిస్తున్నాను. అన్న మరణానికి ముందు రెండు వారాల కాలవ్యవధిలో



జరిగిన రెండు ప్రత్యేక ప్రస్తావన విషయాలను గుర్తుచేసుకోవడం అవశ్యకమైనది. ఆయన మరణించడానికి వారం రోజులకు ముందే అంటే ఏప్రిల్ 30న ఉదయం 9 గంటలకు మా ఇంట్లో కలుసుకున్నాం. రామారావన్న వచ్చీరావడమే "హా .. శీనన్న ... వెంటనే ఎమ్మెస్ నాకు పుస్తకం ఇస్తే వెళ్లిపోతాను" ... అరె వచ్చి ... నిమిషం కాలేదు.... వెళ్దామన్నా ... నేను కూడా ఆఫీసుకు వస్తాను... ఇంతలో నా జీవిత సహచరిణి మణిమాల మా దగ్గరకు వస్తూ అన్నా ... రామారావన్న నమస్తే .... అమ్మా ... నమస్తే ... నమస్తే ... అరుణక్క బాగుందా అన్నా ? .... ఆమెకేందమ్మా బ్రహ్మాండంగ ఉంది... ఏంటి సంగతులు అమ్మా .... ? అన్నా టిఫిన్ చేయండి... లేదు ... లేదు ... మా అరుణమ్మ ఇడ్లీ చేసింది.... ముందు రెండు ఇండ్లీల్లో కారం పొడిలో మంచి నెయ్యి వేసుకుని తిన్న... ఆ తరువాత మరో రెండు ఇండ్లీలు తిన్న.... మంచి కాఫీ తాగి వచ్చాను... నాకేమీ వద్దు... సరే ... అంటూ ..... మీ ఆయన ఎప్పుడూ ఏదో ఒకటి రాస్తూనే ఉంటాడు .... ఏం పనిలేదన్నట్టు... తర్వాత నేను ఆయన అడిగిన పుస్తకం ఇచ్చాను. ఏప్రిల్ 22న పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభలో ఆవిష్కరించిన (పార్టీ ప్రచురించిన) "ప్రతిఘటనా పోరాటం" బుక్ అది. ఆ పుస్తకాన్ని రెండు, మూడు సార్లు తిరిగేసి నాతో మాట్లాడటం మొదలు పెట్టాడు.

1984 చీలిక, 13 సంవత్సరాల ఉద్యమ సమీక్ష మొదలు, పగిడేరు ఘటన, సిరిసిల్ల, జగిత్యాల ఉద్యమాల విషయాలు క్లుప్తంగా చెప్పాడు. ఆ సమయంలో రామారావన్న ఎంతో భావోద్వేగానికి గురయ్యాడు. మొఖం గంభీరంగా మారింది. కళ్ల వెంట పటపట మంటూ కన్నీరు కారడం, జీరబోయిన తడపడే గొంతుతో నిమిషం పాటు మౌనంగా ఉండిపోయాడు. – ఆ సమయంలో ఆయన ముఖ కవళికలు గమనిస్తే ఆయనది ఎంతటి సున్నిత మనస్తత్వమో అర్థం చేసుకోవచ్చు. ఇలా భావోద్రేకాలకు గురైన సందర్భాలెన్నో. భావోద్రేకాల ఉద్రిక్తతల నడుమ ఏనాడూ గాడి తప్పలేదు. సిరిసిల్లా, జగిత్యాల ఉద్యమాల గురించి చర్చిస్తున్నప్పుడు ఆయన చెప్పకనే చెప్పిన విషయం ఏమిటంటే నేటికీ ఆ ఉద్యమాలను సమీక్షించుకోలేక పోయామనీ ... రేఖా మాత్రంగానైనా దీని సమీక్ష తాలూకు విషయాలు 13 సంవత్సరాల ఉద్యమ సమీక్షలో గమనించవచ్చుననీ చెబుతూ, పుల్లారెడ్డిగారు ప్రతిఘటనా పోరాట అవగాహనకు రావడానికి, ఆ లైన్ తీసుకొవడానికి సిరిసిల్లా, జగిత్యాల ఉద్యమ ఆచరణ అనుభవమే కీలకాంశంగా ఉన్నదని చెప్పాడు.

మరో సంఘటన ఏప్రిల్ 25న రామన్న నేను కలిసి వీక్షణం ఎడిటర్ వేణన్న వద్దకు వెళ్లాం. వీక్షణం ఆఫీస్‌లో గడిపిన 15–20 నిమిషాలు వ్యవధిలో వేణన్న మాతో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో పత్రికల నిర్వహణ చాలా సంక్లిష్టంగా మారిందని, భవిష్యత్తులో పత్రికలను నడప గలుగుతామా? అంటూ ఒకింత బాధను వ్యక్తం చేసాడు. నిజమే సార్... తప్పదు... నడపాలి... స్వరాన్ని పెంచి ఏమంటవ్ శీను... అంటూ రామన్న ప్రజాపక్షం వహించే పత్రికలను బతికించుకోవాలి. మా సహకారం ఉంటుంది సార్. అందరం కలిసి ప్రయత్నాలు చేద్దామంటూ చెప్పిన ఆ సందర్భాంలో పీడిత ప్రజల పక్షం వహించే పత్రికలను పరిరక్షించుకొని నిలబెట్టుకోడానికి రామన్న పడిన తపన ఆయన ఆరాటం ఏనలేనిదిగా ఆయన మొఖంలో గోచరించింది. ఇదే విషయాన్ని ఏప్రిల్ 30న, మే 2న స్వయంగాను, ఫోన్‌లో కలిసినప్పుడు ప్రస్తావిస్తూ వేణన్న

అరుణోదయ రామారావుకు వీక్షణం నివాళి

వీక్షణం ప్రారంభం నుంచీ పాఠకుడిగా, అభిమానిగా ఉన్న రామారావు గత ఏడెనిమిది సంవత్సరాలుగా రెగ్యులర్‌గా వీక్షణంలోని రచనలు చదువుతూ, అభిప్రాయాలు ప్రకటిస్తూ, ఏ రచనలు ఉండాలో సూచిస్తూ వీక్షణం శ్రేయోభిలాషిగా పత్రిక నిర్వహణకు దోహదం చేశారు. వీక్షణం ఆర్థిక పరిస్థితి సన్నగిల్లుతున్నదని తెలుసుకొని గత ఐదారు నెలలుగా మిత్రుల నుంచీ, దాతల నుంచీ విరాళాలు సేకరించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు.

ఎటువంటి పరిస్థితుల్లోను వీక్షణం ఆగిపోకూడదని నిరంతరం ఆశ్వాసం ప్రకటిస్తూ ఉండేవారు. రామారావు ఆకస్మిక మరణం వీక్షణం పత్రికకు, వీక్షణం సిబ్బందికి, సంపాదకుడికి వ్యక్తిగతంగా ఒక పెద్ద ఆఘాతం. రామారావు నాలుగున్నర దశాబ్దాల పాటు ఏ ప్రజా కళకు, ప్రజా రాజకీయాలకు అంకితమయ్యారో, ఎంత నిబద్ధతతో పనిచేశారో సగౌరవంగా గుర్తు చేసుకుంటూ, ఆయనకు కన్నీటి నివాళి అర్పిస్తూ వీక్షణం ఆయన అభిమానించిన మార్గంలోనే కొనసాగుతుందని హామీ ఇస్తున్నాం.

– సం.

వద్ద చెప్పిన విషయాన్ని ఏం చేద్దాం అని అడిగినప్పుడు కమిట్ అయిన విషయంపట్ల ఆయనకున్న జవాబుదారీతనం, చిత్తశుద్ధిని గమనించవచ్చు.

కర్నూలు జిల్లా ఆలూరు మండలం మొగలవల్లి గ్రామంలో 1955లో జన్మించిన రామారావన్న 1972లో విప్లవ రాజకీయ సాంస్కృతి కోద్యమంలోకి ప్రవేశించే క్రమం ఆరంభమైంది. అదే జిల్లా బొల్లవరంకు చెందిన సిపిఐ (ఎం-ఎల్) పార్టీ అగ్రశ్రేణి నాయకులు, నక్సల్బరీ పోరాట వారసత్వపు పోరుబిడ్డ నీలం రామచంద్రయ్యగారి పిలుపు మేరకు హైదరాబాద్‌కు వచ్చాడు. విప్లవ సాంస్కృతికోద్యమ మహాసేనాని కానూరి వెంకటేశ్వరరావుకు జతగలిశాడు. అమ్మ లాంటి అరుణోదయకు పేగుబంధమయ్యాడు. పార్టీ మార్గదర్శకత్వంలో కామ్రేడ్ జంపాల చంద్రశేఖర ప్రసాద్ సారథ్యంలో స్థాపితమైన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక తొలినాళ్ల నుండే సాంస్కృతికోద్యమ నిర్మాణ కార్యకలాపాలలో నూతన విప్లవకర కళారూపాలను ఆవిష్కరించడం, ప్రదర్శించడం వంటి ప్రక్రియలో సమరశీలమైన కృషి, చురుకైన పాత్రను పోషిస్తూ వచ్చాడు. పేదలతో పెనవేసుకొని గోదారమ్మ వరవడిలో 'అడవి ఏడ్చింది.. పెద్దన్న ఏడాని..' రాగాలాపన చేస్తూ సాగినోడు. పెద్దన్న (సిపి) ప్రతిఘటనా పోరు వారసత్వాన్ని మోసుకుంటూ తల్లడిల్లే ఆదివాసులకు అండగా విప్లవ జెండాయే అజండా అంటూ 'మేరిమీ కొండల్లో మెరిసిందీ మేఘం... కురుపాము కొండల్లో కురిసిందీ వర్షం...' అంటూ వుద్దానంలో నడియాడిన పాణిగ్రాహి, తామాడ చినబాబుల సాంస్కృతికోద్యమ వారసత్వాన్ని కొనసాగించినవాడు. తెలుగు నేలపై విప్లవ ప్రజా ప్రాచుర్యం పొందిన గొప్ప గాయకుడు రామన్న. ప్రసిద్ధ గాయకుడు ఘంటశాల గొంతును మరిపించే రీతిలో ఆయన గాత్రం ఉండేదంటూ అనేక మంది మిత్రుల ద్వారా విన్నాను. పీడిత వర్గ రాజకీయ సాంస్కృతికోద్యమంలో మడమ తిప్పని అరుదైన విప్లవ ప్రజా కళాకారుల్లో ఒకడుగా నిలిచిన వాడు రామన్న. పాణిగ్రాహి సుబ్బారావు, కానూరి వెంకటేశ్వరరావు వంటి విప్లవ ప్రజా సంస్కృతికోద్యమ మహాసేనానులకు నిజమైన వారసుడుగా నిలిచినవాడు.

సత్యానికి, సమరానికి సన్నిహిత సహవాసి మన సత్తెన్న. సత్తెన్న అంటే ఎరుగని వారుంటారు. కానీ అరుణోదయ రామారావన్న అంటే సర్వ జనమెరిగిన నామం. 70వ దశకంలో హైదరాబాద్‌లో అడుగిడిన సత్తెన్న బతుకు దెరువుకోసం భాగ్య నగరానికి రాలేదు. బతుకు మార్పుకోసం వచ్చాడు. ఉద్యమ ప్రస్థానంలో పాటల పూదోటలో అరుణోదయ రామారావుగా వికసించాడు. "పార్టీకి, ప్రజలకు మధ్య వారధి ఆయన పాట. విప్లవ పాట ప్రజలను సమీకరిస్తుంది, నిలబెదుతుంది. పార్టీ వారిని సంఘటిత పరిచి పోరాటానికి పదిలపరిచి పదును పెడుతుందని" నమ్మిన రామారావన్న పొడి పొడి పదాలకు బాణీలు కడుతూ పాటలుగా మలిచినవాడు. ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో జైలు నిర్బంధంలో ఉన్న సిపిఐ (ఎం-ఎల్) కార్యకర్త, అవిద్యవంతుడైన అంగడి చెన్నయ్య గారు పోలీసుల కాల్పుల్లో అమరుడైన రామనర్సయ్య మరణ వార్త విని రాసుకున్న పొడిపొడి పదాలకు (మధుసుదన్‌రాజ్ ఆదేశాల మేరకు) మాసబ్‌ట్యాంక్ హాస్టల్ గదిలో బాణీ కట్టి అద్భుతమైన పాటగా ఆవిష్కరించాడు రామన్న. అదే... అన్న అమరుడురా.. మన రామనర్సయ్య... పాట. అలా వందల పాటలకు బాణీ కట్టినవాడు. రాగం మీద జీవితాన్ని నడపడం అంటే ఇదేనేమో. రాగం మీద పాటను నడిపినవాడు. పాటల పూదోటలో రాగాల జలమై జన సముద్రంలో గానాలాపన చేసినవాడు. మనిషి మేరుపర్వతమే. కానీ మనసు మాత్రం సున్నితమైనది. గొంతులో రాగం నాట్యం చేస్తుంటే, మునివేళ్ల మధ్య సంగీత శృతులు కదులుతూనే వుండేవి. అది నిరంతర ప్రక్రియగా మారింది. ఒక ప్రజా కవి అన్నట్లు 'పాటను రాగం మీద నడిపినవాడు. రాగానికి జీవితాన్ని కట్టి పాటయ్యాడు'. నిజమే రామన్న నాలుగున్నర దశాబ్దాల విప్లవ సాంస్కృతికోద్యమ జీవిత ప్రస్థానం దీనినే వాస్తవీకరించింది. ఉన్నత శిఖరాలకు ఎదిగిన ఈ విప్లవ సాంస్కృతికోద్యమ సేనాని నిగర్వి. రామారావన్నది వెన్నెలాంటి మనసు. వెన్నెలలాంటి విశాల హృదయం. ఆయన పలకరింపులో ఉండే గంభీరతతో కూడిన ప్రేమ, ఆప్యాయతలు బహుశా ఆయనకే సొంతం. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఎవరితోనైనా కలిసిపోయే తత్వమాయనది. పాటకు రాగం ఆయన. రాగానికి జీవం ఆయన. జనపదులు ఆయన ఆయుధం. ప్రజా యుద్ధం ఆయన మార్గం. ప్రతిఘటన పోరాటాల స్వరాలాపన ఆయన ఆచరణ. జనవాసాలలో జనపదులనడుమ నడియాడిన ఆయన అడుగులు మార్క్స్ టు మావో మార్గాన్ని నిర్దేశిస్తున్నాయి. ఆయన గానాలాపన బతుకు విముక్తి కోసం సాయుధంగా సాగమంటుంది. వర్గ పోరులో రణతంత్రం లేకుండా విప్లవోద్యమంలో విస్తృత ప్రజాసమూహాల భాగస్వామ్యంలేకుండా ఆశయ సాధనలో, కర్తవ్యాల సాకారంలో లక్ష్యం సాధ్యపడదు. బలమైన క్యాడర్‌తో కూడిన యంత్రాంగం లేకుండా విప్లవోద్యమ నిర్మాణంలోనూ, రణతంత్రం అమలులోనూ పటిష్టవంతమైన విప్లవకర నిర్మాణాలు లేకుండా నిజమైన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు ... అంతిమంగా విముక్తి అసాధ్యమని నమ్మిన విప్లవకారుడు రామారావు అన్న.

మలివిడత తెలంగాణ ఉద్యమంలో మధ్యంతర కల్లోల కలుషితాలకు, కాసుల ప్రవాహానికి మకిలీ కాలేదు. కొట్టుకపోలేదు. దొరగడీలకు కంఠాన్ని గంటగా మార్చలేదు. ప్రభువుల పల్లకీ మోసే బోయీగా మారలేదు. పీడిత ప్రజా పల్లకీకి బోయిని మాత్రమేనని సాటి చెప్పిన మనిషి. అన్నార్తులను, అభాగ్యులను తట్టిలేపి, నిలబెట్టి ప్రశ్నింపచేసే కంఠం నాదన్నవాడు రామారావు. సత్యమనే జీవసారం కలిగిన బండవాదనలతో, అమరుల అమరత్వంతో రూపుదిద్దుకున్న మొండితనంతో జన హృదయాల్లో అపారమైన అభిమానాన్ని కూడగట్టుకొని స్థానాన్ని పదిలపరుచుకున్నవాడు. విప్లవ కార్యచరణ అంటే పత్రికల్లో పేర్లు, ఫోటోలు అని భావించిన వాడూ కాదు. అందుకోసం ఆరాటపడినవాడూ కాదు. వ్యక్తిగా ప్రచార ప్రాచుర్యం కోసం పాకులాడిన వాడు కాదు. ఫేస్‌బుక్‌లు, వాట్సప్‌లకు మరిగిన వాడూ కాదు. వేదికల కోసం వెంపర్లాడినవాడూ కాదు. ఒక రచయిత అన్నట్టు సిద్ధాంత, రాజకీయ జ్ఞానభావాలను మోసి పంచినవాడే తప్ప నాలుగు రాళ్లు పోగేసుకున్నవాడు కాదు. కాసుల రాశుల మీద సుఖవంతమైన జీవితానికి తెరలేపాలని అనుకున్నవాడూ కాదు. టివి తెరల మీద నిత్యం నిలవాలని ఉబలాట పడినవాడు కాదు. ప్రజలతో మమేకమై వారి నుండి నేర్చుకొని వారి కోసం పనిచేయడమన్న పాఠాన్ని ఆకలింపు చేసుకున్నవాడు. ప్రజల్లో నిలవాలన్న తాపత్రయమే తప్ప ఆ మనిషికి వేరే ఆలోచన తన మేధో పొరలను కూడా తాకనివ్వలేదు. అందుకే దొరగడీలు ఆయన నివాసం కాలేదు. పీడిత వర్గాల జనవాసాలు ఆయన నివాసాలుగా మారాయి.

కామ్రేడ్ రామారావు అన్నతో నాకు అనుబంధం, దగ్గర సాన్నిహిత్యం ఉన్నది. నాతో చాలా సరదగా ఉండేవాడు. రాజకీయ, సాహిత్య సాంస్కృతిక విషయాలు చర్చకు వచ్చినప్పుడు చర్చలో తన వాదన ఖరాఖండిగా ఉండేది. తనకు ఏదైనా సందేహం కలుగుతే దాని నివృత్తి కోసం విప్లవోద్యమ మేధో శ్రేయోభిలాషులతో ఆయన చర్చించడాన్ని నేను అనేక సార్లు ప్రత్యక్షంగా గమనించాను. కీలకమైన సందర్భాలలో రాజకీయ అభిప్రాయాలలో నిక్కచ్చిగా, దృఢంగా ఉండేవాడు. అనేక

మూలమలుపుల్లోనూ మడమ తిప్పని విప్లవ సాంస్కృతికోద్యమ సేనానిగా, నాయకుడిగా స్థిరంగా నిలబడ్డాడు. పీడిత ప్రజల విప్లవగానాలపన నుండి గతి తప్పలేదు. విప్లవ రాజకీయ సాంస్కృతికోద్యమం నుండి జారిపోలేదు. 'ఉద్యమ ప్రస్థానంలో అనేక గాయాలవుతాయి కానీ, విప్లవకర వర్గ రాజకీయాల నుండి గతి తప్పొంద్దంటాడు' రామారావన్న. బహుశా 90వ దశకం పూర్వార్థంలో అనుకుంటా తాను పనిచేస్తున్న నాటి విప్లవ పార్టీ నుండి నిర్మాణ పరంగా, రాజకీయంగా విభేదించి బయటకు వచ్చి మూడు నాలుగేళ్ల 'విశ్రాంతంగా' ఉన్నా తన విప్లవ రాజకీయ నిబద్ధతకు భంగం కలగకుండా సామాజిక విప్లవ కార్యకలాపాలలో అవిశ్రాంతంగా తన కృషిని కొనసాగించాడు. పీడిత ప్రజల ముఖ్యంగా వారి ఆట-పాటల పట్ల నిబద్ధత కలిగి అంకిత భావంతో పనిచేసిన విప్లవ సాంస్కృతికోద్యమ సేనాని రామన్న. భారత దేశంలో వేల వేల సంవత్సరాలుగా వేళ్లానుకున్న కుల సమస్యకు సాపేక్షికంగా సరైన పరిష్కారం మార్క్సిస్టు దృక్పథంతో, సైద్ధాంతికంగానూ, ఆచరణాత్మకంగానూ జరగవలసినంతగా కృషి జరగడం లేదని నాతో అనేక సందర్భాలలో ఆ విషయం చర్చకు వచ్చినప్పుడు చెప్పేవాడు. విప్లవ పీడిత ప్రజా రాశులలో భాగమైన బహుజన సామాజిక వర్గాల్ని బలంగా సమీకరించుకోవడంలో క్షేత్రస్థాయిలోనే కాదు ... పై స్థాయిలోనూ సీరియస్‌గా ఆలోచించాల్సిన అంశమని అనేవాడు. అణగారిన సామాజికవర్గాల సమీకరణకు సరైన రాజకీయ దృక్పథంతో కూడిన ఉద్యమ కార్యాచరణ ఉండాలనీ, అది ఉన్నా ఆచరణాత్మక ఫలితాలలో ఉండే ప్రతికూలతలకు మూలాలను పట్టుకుని అధిగమించాలనే వాడు. ఉద్యమం దైనందిన జీవిత ఆచరణలో అదొక నిరంతర ప్రక్రియగా ఉండాలనే వాడు, ఆ విషయాలను తరచుగా నాతో చర్చించేవాడు.

రామన్న వ్యక్తిత్వం, నిబద్ధత, నిజాయితీల గురించి ఒకమాట... అది 1999 సంవత్సరం. పిడిఎస్‌యు ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భం కూడా. సంస్థ రజితోత్సవాలు జరపాలని పిడిఎస్‌యు రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. రజితోత్సవాల సభల నాటికి పిడిఎస్‌యు 25 ఏండ్ల ఉద్యమ చరిత్రను, జార్జి ఉద్యమ జీవితంపై పుస్తకాలు తీసుకు రావాలని జార్జి స్థూప నిర్మాణం చేయాలని కార్యవర్గం నిర్ణయించింది. జార్జి ఉద్యమ జీవితంపై పుస్తకం తేవడానికి జార్జి మిత్రులను, ఉద్యమ సహచరుల, సమకాలీకుల నుండి తగిన సమాచార సహకారాన్ని సమకూర్చుకోవల్సి ఉంటుంది. ఇందుకు సరైన మార్గదర్శకంగా వహించగలిగే వ్యక్తి ఎవరన్నది ప్రశ్నగా మా ముందుకు వచ్చింది. ఈ విషయాన్ని జార్జి సహచరుడు, నాడు మరో విప్లవ పార్టీలో కొనసాగుతున్న బి. ప్రదీప్, ప్రజపంథా పత్రిక బాధ్యతలు చూస్తున్న గోవర్ధన్‌ల వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించగా పాత వాళ్లందరినీ కలపగలిగే, మాట్లాడించగలిగే వ్యక్తి ఒక అరుణోదయ రామారావు అని చెప్పారు. ఆ విధంగా 1999 జూలై చివరి వారంలో రామారావు అన్న సహకారంతో కొంతమంది జార్జి మిత్రులను, నాటి ఉద్యమ సహచరులైన సిరిల్‌రెడ్డి, లలిత, గీతా రామస్వామి, అంబిక తదితర సమకాలీకులను కలవగలిగాను. ఇక్కడే రామారావన్నతో సాన్నిహిత్య బాంధవ్యం ఏర్పడింది. అయితే, పిడిఎస్‌యు 25 ఏండ్ల ఉద్యమ చరిత్ర పుస్తకాన్ని, జార్జి స్థూప నిర్మాణాన్ని పూర్తి చేయగలిగాం. జార్జి ఉద్యమ జీవితం చరిత్రకు సంబంధించి కొంత సమాచారాన్ని సేకరించినప్పటికీ కారణాలేమైనప్పటికీ పుస్తకంగా తీసుకురాలేకపోయాం. ఇదే విషయాన్ని అనేక సందర్భాల్లో రామారావన్న 'నన్ను ఉరుకులు పెట్టిచ్చావ్.. అనుకున్న అసలైన పని చేయలేకపోయాం.. బాధాకరమే..' అని అంటుండేవాడు. విప్లవ ప్రజాసంఘాల్లో పనిచేస్తున్న కార్యకర్తలు, ఆర్గనైజర్లే కాదు నాయకులు అనారోగ్యానికి గురైనప్పుడు డాక్టర్లను సూచించడంలోనూ వైద్య సౌకర్యం కోసం సహాయపడటంలోనూ ఆయనకు ఆయనే సాటి. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ఉండే ఈ నిబద్ధత, ఆయన మానవీయతకు నిదర్శనం.


నాలుగున్నర దశాబ్దాలుగా తన జీవితాన్ని విప్లవోద్యమానికి, విప్లవ ప్రజా సాంస్కృతిక కళా రంగానికి నిఖార్సయిన అంకిత భావంతో పని చేసిన నిస్వార్థ విప్లవకారుడు. తెలుగు నేల పులకించిన అరుదైన విప్లవ కళాకారుల్లో ప్రథమ వరుసలో ఒకడిగా నిలిచినవాడు. ప్రజా కళలను విప్లవీకరింపచేసి పీడిత, తాడిత ప్రజల జీవితాలు ప్రతిఫలించడం కోసం జీవితాన్నే గానం చేసినవాడు. విప్లవోద్యమానికి పాటయ్యాడు. పాటకు సరైన సరుకుగా తనను తాను ఆవిష్కరించుకున్నాడు. రామారావు అన్న పాటల రాగం గోదావరి కల్లోలిత ప్రాంతం బాటై నడిచి బాధితులకు భరోసానిచ్చింది. బీదల బీడీ అక్కలను ఉద్యమ అక్కున చేర్చుకొని హక్కుల రణంలో నడిపింది. రైతు కూలీలను సంఘపోల్ల సన్నిధిలోకి చేర్చింది. కార్మికవర్గాన్ని కదన రంగానికి కూడగట్టి నడిపించింది. ఇక ఒక మనిషి భౌతికంగా మనలో కలిసి ఉన్నప్పుడు పెద్దగా పట్టించుకోము ఆయన గురించి మాట్లాడుకోవడానికి ఆసక్తి చూపం. తనకున్న శక్తి సామర్థ్యాలు, ప్రజల్లో ఆయన చేస్తున్న కృషి ముఖ్యంగా నిర్దిష్ట బాధ్యతలు కలిగిన రంగంలో పోషిస్తూ వచ్చిన పాత్ర గురించి చర్చించుకోం. కానీ, భౌతికంగా దూరం అయిన తరువాత ఆయన మంచి చెడుల గురించి చర్చించడానికి చూపే చొరవ, ఆసక్తి, తాపత్రయం అంతింతగా ఉండదు. ఇదే గతంలో సాపేక్షంగా కానూరి తాత విషయంలోనూ నేడు రామారావన్న విషయంలోనూ కనబడుతుంది. ఒక మాట మాత్రం చెప్పగలను. ఇది మంచి చెడుల గురించి చర్చించే సందర్భం కాదు సమయం అంతకంటే కాదు. ఇదే రామారావన్నకు మనం అర్పించే నిజమైన నివాళులు.

(రచయిత ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి) వీ

వచ్చే సంచికలలో...

- రంగు మారనున్న రాష్ట్ర రెవెన్యూ చట్టం - డా. ఎ. పున్నయ్య
- నియాంగిరి బాక్సైట్ వేదాంత వశమవుతుందా? - ఎన్. నారాయణరావు
- కనీస వేతన నిర్ధారణపై కమిటీ సిఫారసులు - ఎం. శ్రీనివాస్
- మానవతా స్ఫూర్తిలేని విద్యా వ్యవస్థ - డా. కత్తి పద్మారావు

పశ్య రామిరెడ్డి మృతి




తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు పశ్య రామిరెడ్డి(94) మే17న కన్నుమూశారు. ఆయన కోదాడకు వెళ్లి వస్తుండగా తీవ్రమైన గుండెపోటు రావడంతో మరణించారు. రామిరెడ్డి 1925లో నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో జన్మించారు. చిన్నతనం నుంచే వామపక్ష భావజాలానికి ఆకర్షితులై కమ్యూనిస్టు పార్టీలో చేరి వివిధ హోదాల్లో పని చేశారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రధాన భూమిక పోషించారు. రైతాంగ పోరాట దళాలకు కొరియర్‌గా వ్యవహరించారు. 60 ఏళ్లుగా కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసిన రామిరెడ్డి. 30 ఏళ్లుగా హుజూర్‌నగర్ పట్టణ సిపిఐ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు.

కడెం సమ్మయ్య కన్నుమూత



సుప్రసిద్ధ మందహెచ్చు కళాకారుడు కడెం సమ్మయ్య (60) కన్నుమూశారు. ఆయన వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట్ మండలం లక్నెపల్లిలో మందహెచ్చు ప్రదర్శననిస్తూనే గుండెపోటుకు గురై మే 19న మృతిచెందారు. సమ్మయ్య స్వస్థలం జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపూర్ మండలంలోని నారాయణ్‌పూర్ గ్రామం. దశాబ్దాలుగా మందహెచ్చు కళకే ఆయన జీవితాన్ని అంకితం చేశారు. పశువుల మందను పెంచేందుకు యాదవులు 7 రోజుల పాటు మందహెచ్చు ప్రదర్శన క్రతువును నిర్వహిస్తారు. మందహెచ్చులు కూడా యాదవుల్లో ఒక వర్గం. వీరు కాటమరాజుకు చెందిన 56 బొమ్మలను చూపుతూ కథ చెపుతారు. తాళ్లపత్రాలను చదువుతూ... కథలు చెప్పడంలో సమ్మయ్య నిష్ణాతుడు. దేశ వ్యాప్తంగా మూడు వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన రాజీవ్ ప్రతిభా అవార్డును అందుకున్నారు.

కులశేఖరరావు మృతి




ప్రముఖ కవి, విమర్శకుడు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వాధ్యక్షుడు ఆచార్య మడుపు కులశేఖరరావు(88) మృతిచెందారు. కెనడాలోని ఒంటారియోలో కొడుకు వద్ద కొంతకాలంగా ఉంటున్న కులశేఖరరావు మే 20న గుండెనొప్పితో చనిపోయారు. కులశేఖరరావు పూర్వ రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నెక్కరి మేడిపల్లి గ్రామంలో 1932 జూన్ 25న జన్మించారు. ఆయన తెలంగాణలో తొలితరం సాహితీవేత్తగా, విమర్శకుడిగా గురింపు పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బిఏ, ఎంఏ (తెలుగు) చదివారు. ఆంధ్రవచన వాఙ్మయ వికాసంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. తెలుగు వచన సాహిత్యంపై ఆయన చేసిన పరిశోధన కొత్త పరిశోధనలకు మార్గదర్శిగా నిలిచింది. ఉస్మానియా తెలుగు శాఖలో మూడున్నర దశాబ్దాలపాటు వివిధ విభాగాల్లో సేవలందించారు. 1992లో ఓయులో పదవీ విరమణ చేశారు.

సూర్యప్రకాశ్ మృతి



ప్రముఖ చిత్రకారుడు, ఆయిల్, అక్రిలిక్ పేయింటింగ్స్, అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్‌లో నిపుణులు, సెంటర్ ఫర్ సెల్యులర్ బయాలజీ, ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రుల సంస్థాగత కళాకారుడు చెరుకుమల్లి సూర్యప్రకాశ్ (80) మే 22న మరణించారు. ఆయన ఖమ్మం జిల్లాలోని మదిరలో జన్మించారు. మదిరలోనే పాఠశాల, ఇంటర్ విద్యను పూర్తి చేశారు. 1961లో హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ కళాశాల నుంచి డిగ్రీ పట్టా పొందారు. కుంచెపై మమకారంతో ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా వదులుకున్నారు. సూర్యప్రకాశ్ 50 ఏళ్ల క్రితమే ఆటోమొబైల్ వ్యర్థాలు, పాత ఇనుప వస్తువులతో కళాకృతులను రూపొందించే ప్రక్రియను ప్రారంభించారు. దీనికి జాతీయ స్థాయి గుర్తింపు దక్కింది. యూరోపిన్ ఆర్ట్‌కు చెందిన డాట్ ఆర్ట్‌లో కూడా సూర్యప్రకాశ్ ప్రయోగాలు చేశారు. 1970లలో శ్రీనగర్ కాలనీలో 'సూర్య ఆర్ట్స్ గ్యాలరీ'ని ప్రారంభించి ఔత్సాహిక చిత్రకారులను ప్రోత్సహించారు.

పిపిసి జోషి మృతి



సిపిఐ సీనియర్ నేత పిపిసి జోషి అనారోగ్యంతో హైదరాబాద్‌లో పుప్పాలగూడలోని తన స్వగృహంలో మే 26న మృతిచెందారు. ఆయన విశాలాంధ్ర జనరల్ మేనేజర్‌గా, ఢిల్లీలోని సిపిఐ కేంద్ర కార్యాలయంలో కోశాధికారిగా, పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్ మేనేజర్‌గా ఆయన వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించారు. తొలితరం అమరవీరులు పేరేప మృత్యుంజయుడు కొడుకుగా, బాల్యం నుంచి కమ్యూనిస్టు రాజకీయాలలో కొనసాగిన జోషి చివరి వరకు ఆ విలువలతో జీవించారు. గత రెండు దశాబ్దాలుగా హైదరాబాద్‌లో ప్రాచీ పబ్లికేషన్స్ పేరుతో ఎన్నో విలువైన పుస్తకాలు ప్రచురించారు.

డేవిడ్ హార్వే: పెట్టుబడి - 7 ప్రధాన వైరుధ్యాలు

పెట్టుబడిదారీ వ్యవస్థ తనలోని పదిహేడు అంతర్ వైరుధ్యాల వల్ల పతనం దిశగా పయనిస్తుందని డేవిడ్ హార్వే చేసిన విశ్లేషణలోని ఏడు ప్రాథమిక వైరుధ్యాలను వివరిస్తున్నారు **రమేష్ పట్నాయక్**

వైరుధ్యం 3 – ఆస్తి

'వ్యక్తిగత ఆస్తి, పెట్టుబడిదారీ రాజ్యం'

ఈ అధ్యాయంలో డేవిడ్ హార్వే వ్యక్తిగత ఆస్తికి, పెట్టుబడిదారీ రాజ్యానికి ఉన్న వైరుధ్యాన్ని పరిశీలిస్తాడు. అందుకై ముందుగా వ్యక్తిగత ఆస్తిని వివరించాడు. అదే విధంగా 'వ్యక్తిగత ఆస్తికి', 'ఉపయోగించుకునే హక్కుకు' ఉన్న వ్యత్యాసాన్ని పరిశీలించాడు. మనం గూడా ముందుగా అవే విషయాలను పరిశీలిద్దాం. వ్యక్తిగత ఆస్తి అంటే వ్యక్తులందరికీ ఉండే ఆస్తి కాదు. కమ్యూనిస్టు మ్యానిఫెస్టోలో (పుట 52) రాసినట్లు 90 శాతం మందికి లేకుండా చేయడం వలననే పదిశాతం మంది చేతిలో ఉండే ఆస్తి. ఈ నాడది 99 శాతం మంది చేతిలో లేకుండా చేయడం వలననే ఒక శాతం చేతులలో చేరిన ఆస్తిగా మారింది. నివసించడం కొరకు వారసత్వంగా వచ్చిన లేదా కొనుగోలు చేసిన ఇల్లు, అలాగే స్వంతంగా వాడుకోవడానికి కొనుగోలు చేసిన మోటారు వాహనం ఇవేవి ఉత్పత్తి సాధనాలు కావు. ఆస్తి సంబంధాల గురించి చర్చించినప్పుడు మనం ఉత్పత్తి శక్తులైన భూమి, పరిశ్రమల గురించి మాట్లాడుతున్నామన్న విషయం గమనంలో ఉండాలి. ప్రధానంగా ఇతరుల శ్రమను దోపిడీ చేసే ఉత్పత్తి సందర్భాల గురించి మనం ఇక్కడ మాట్లాడుతున్నాం. మరొక్క విషయం, ఈస్టిండియా కంపెనీ భారతదేశానికి రావడానికి ముందు ఉన్న పరిస్థితిని చూద్దాం. అప్పుడు అడవి ఉత్పత్తులు వాడుకోవడానికి అడవిలో జీవించే గిరిజనులకు చుట్టుప్రక్కల వారికి – అందరికీ ఎటువంటి ఆటంకం లేని హక్కు ఉండేది. అడవిలో చెట్లు నరికి కూడా వాడుకోవచ్చు. అడవిలో మరిన్ని చెట్లు పెరిగేవి. ఒక్క మాటలో చెప్పాలంటే అడవి ఎవరి స్వంత ఆస్తి కాదు. దాని ఉత్పత్తులను అందరూ వాడుకోవచ్చు. అడవిలో గిరిజనులు కొండవాలులో పోడుచేస్తారు. ఒకటి రెండు సంవత్సరాలు పోడు చేసిన భూమిని విడిచిపెట్టి మరొక దగ్గర పోడు చేస్తారు. ముందటి భూమి వారి ప్రైవేటు ఆస్తి కాదు. రెండవ భూమి కూడా వారి ప్రైవేటు ఆస్తి కాదు. అసలు ప్రైవేటు ఆస్తి అన్న భావనే వారికి లేదు. వారికి గాలి నీరు వలే భూమికూడా ఒక ప్రకృతి వనరే. (ప్రస్తుత కాలంలో నీరు, గాలి కూడా ప్రైవేటు ఆస్తి అయిపోతున్న విషయం సరే). భూమి మనుషుల శ్రమద్వారా ఏర్పడినది కాదు. ఆ కారణంగానే భూమిని ఉపయోగించుకునే హక్కు ఉందిగాని సొంతం చేసుకునే హక్కు ఆనాడు లేదు. డేవిడ్ హార్వే 'నేను ఉపయోగించను, ఉపయోగించలేను కాని అది నాదే, నా అనుమతి లేకుండా వేరెవరూ దానిని ఉపయోగించ కూడదు.' అనే పరిస్థితి లేకపోవడమే స్వంత ఆస్తి హక్కు లేకపోవడమ'ని నిర్వచించాడు. అందుకే ఉపయోగించుకునే హక్కు వేరు, స్వంత ఆస్తి లేదా ప్రైవేటు ఆస్తి హక్కు వేరు. ఇప్పటికీ భారతదేశం వంటి వివిధ 'వెనుకబడిన దేశాలలో' ఉమ్మడి వనరులు వివిధ స్థాయిలలో ఉన్నాయి. గ్రామ కంఠాలలో అందరూ తమ పశువులను మేపుకుంటారు. గ్రామ చెరువుల నుంచి అందరూ తమ పొలాలకు నీరు పెట్టుకుంటారు. అవి ఎవరికీ స్వంతం కావు. అయితే అందరికీ వాడుకునే హక్కు ఉంటుంది.

పెట్టుబడిదారీ వర్గం ప్రజలందరూ ఉపయోగించుకునే హక్కుగల సమిష్టి వనరులను పెట్టుబడిదారులు వ్యక్తిగత ఆస్తిగా మార్చివేసింది. డేవిడ్ హార్వే 'సమిష్టి వనరులను ఎన్‌క్లోజర్ చేసే అంటే, అందరూ ఉపయోగించుకునే హక్కును రద్దుచేసే నిందాపూర్వకమైన ప్రక్రియ మారకం, వాణిజ్యాలకు ఆధారభూతమైన వ్యక్తిగత ఆస్తి హక్కుల ప్రథమ ఆధిపత్యానికి దారితీసింద'ని, ఇది 'రాజ్యాధికారంచే మద్దతు ఈయబడిన ప్రక్రియ' అని అంటాడు. 'ప్రైవేటు ఆస్తి వ్యవస్థ ఇంకా ప్రధాన ఆస్తి సంబంధంగా ఏర్పడక ముందు పెట్టుబడి వృద్ధిచేయడానికి అవసరమైన ఆవరణలను తెరవడంలో రాజ్యం యొక్క అణచివేత శక్తి ఒక ప్రధానమైన పాత్ర పోషించదనడానికి కావలసినన్ని ఆధారాలున్నాయ'ని డేవిడ్ హార్వే అంటాడు. ఇక్కడ మనం కొంత వివరంగా చూడడం అవసరం కావచ్చు. పెట్టుబడిదారీ వ్యవస్థ శ్రమదోపిడీతో వచ్చే లాభాలతోనే నిరంతరయంగా పెరగవచ్చు. అందుకు కావలసింది కార్మికుల అందుబాటు, ముడిసరుకుల అందుబాటు, కొనుగోలుదారుల అందుబాటు (మార్కెట్ అందుబాటు) అనేవి ఎటువంటి లోటులేకుండా ఉండాలి. అయితే పెట్టుబడిదారుల సంపద లాభాలతోనే పెరగలేదు. పెట్టుబడిదారీ వర్గం ప్రకృతి వనరులను, భూమిని పెద్ద ఎత్తున కబ్జాచేసి పెట్టుబడిని పెంచుకుంది. దీనినే ఆదిమ సంచయనం (ప్రిమిటివ్ అక్యూములేషన్) అంటారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రవేశించినప్పుడు భూమి ప్రధాన ఉత్పత్తి సాధనంగా ఉంటుంది. భూస్వాముల భూమికి భాటకం చెల్లించడం పెట్టుబడిదారులకు కష్టంగా ఉండేది. ఆ పైన భూస్వాములు భాటకం వసూళ్లను అధికాధికం చేసేవారు. అందుకే భూస్వాముల భూములను స్వంతం చేసుకోవాలని పెట్టుబడిదారులు గట్టి ప్రయత్నాలు చేసారు. ఈ మొత్తం ప్రక్రియను వివరించడానికి ఇక్కడ అవకాశం లేకపోయినా గ్రామాలలో సమిష్టి వనరులు, పేద రైతులు భూములు, చివరికి భూస్వాముల భూముల పెట్టుబడిదారుల వశమయినాయి. ఈ ప్రక్రియ అమ్మకాలు, కొనుగోళ్లుగా మాత్రమే సాగలేదు. ఈ ప్రక్రియలో అధికాధికంగా పెట్టుబడిదారులకు వంత పాడిన రాజ్యం బలప్రయోగాన్ని కూడా విస్తారంగానే ఉపయోగించింది. ప్రధానంగా అందరివీ అయిన సమిష్టి వనరులను పెట్టుబడిదారులు వ్యక్తిగత ఆస్తిగా మార్చడంలో చాలా కుతంత్రాలు, కుతర్కాలతో పాటు విస్తృత స్థాయిలో బలప్రయోగం కూడా జరిగింది.

పెట్టుబడిదారీ వ్యవస్థ పేద రైతుల, వృత్తికారుల ప్రైవేటు ఆస్తిని నిజానికి గుర్తించదు. బూర్జువాల ప్రైవేటు ఆస్తిని మాత్రమే పవిత్రమైనదిగా భావిస్తుంది. గ్రామ సమిష్టి వనరులను స్వంతం చేసుకోవడానికి

పెట్టుబడిదారులకు ఒక సిద్ధాంతం అవసరమయ్యింది. ఈ సందర్భంగా డేవిడ్ హార్వే జాన్ లాకే ఉపయోగించిన 'రిస్ నల్లియస్' సింద్ధాంతాన్ని ఎత్తిచూపాడు. రిస్ నల్లియస్ అనేది లాటిన్ పదబంధం. దీని అర్థం 'ఎవరికీ చెందనిద'ని. కాని గ్రామ కంఠాలు ఎవరికీ చెందనివి కావు.అవి నిజానికి అందరికీ చెందినవి. కాని జాన్ లాకే, ఆనాటి బూర్జువా మేధావులు ఈ 'ఎవరికీ చెందనిది' అనే సిద్ధాంతాన్ని గ్రామ కంఠాలకు ఇతర సమిష్టి వనరులకు ఆపాదించారు. పెట్టుబడిదారులు గ్రామీణులకు తృణమో పణమో చెల్లించి గ్రామ సామూహిక ఆస్తులను స్వంతం చేసుకున్నారు. అయితే ఈ నిర్వచనం అక్కడితో ఆగలేదు. రాజకీయ ఆర్థిక శాస్త్రంలో మార్కెట్‌లో అమ్మకం కొరకు ఉత్పత్తి చేయడాన్నే సామాజిక విలువలను సృష్టించడం అంటారు అన్న విషయం తెలిసిందే. అట్టి నిర్వచనంపై ఆధారపడి రైతు తన వాడకానికి ఉత్పత్తిచేసే భూమి సామాజిక విలువలను ఉత్పత్తిచేయడం లేదని చూపి, అట్టి భూమి కూడా, నయానా భయానా, పెట్టుబడిదారునికి చెందవలసిన భూమిగా పరిగణించబడింది. మార్కెట్ కొరకు ఉత్పత్తిచేయనందుకు ఐర్లాండు రైతుల భూమిని బ్రిటిష్ బూర్జువాలు 'న్యాయబద్ధంగానే' స్వంతం చేసుకున్నారని డేవిడ్ హార్వే ఎత్తి పొడిచాడు. అమెరికాలోనైతే భూములు తీసుకోవడమేగాక స్థానిక ప్రజలను తరిమివేశారని హార్వే ఎత్తిచూపాడు. ఇప్పుడు ఆఫ్రికాలో అదే జరుగుతుందని చెప్పాడు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఇటువంటి దాష్టీకమే జరుగుతున్న విషయం మనం గమనిస్తూనే ఉన్నాం. భూమి వంటి ప్రకృతి వనరులను వ్యక్తిగత ఆస్తిగా మార్చిన ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రైవేటు ఆస్తి హక్కును జీవసంబంధ ప్రక్రియలకు కూడా విస్తరించిందని, వివిధ రంగాలలో పరిశోధనా ఫలితాలను మేథో సంపత్తి హక్కుల పేరుతో ప్రైవేటు హక్కుగా మార్చుకుంటున్నారని డేవిడ్ హార్వే వివరించాడు. ఈ ప్రైవేటు ఆస్తి హక్కుల వ్యవస్థ వైరుధ్యాలతో కూడుకుని ఉందని హార్వే ప్రతిపాదించాడు.

'ఒక వైపు వ్యక్తిగత ప్రైవేటు ఆస్తి హక్కులను నిర్నిబంధంగా అనుభవించడం అనేదానికి లేదా అలా భావించబడుతున్న దానికి, రెండవ వైపు ఆ హక్కును నిర్వచించడం, దానికి చట్టబద్ధ రూపం ఇవ్వడం, దానిని సామాజిక నియమంగా మార్చడం అందుకై అణచివేతతో కూడుకున్న రాజ్యం యొక్క నియంత్రణను నిర్వహించడం వంటి వాటిని సమిష్టిగా చేపట్టవలసిన అవసరానికి మధ్య ఉన్న వైరుధ్యం అన్నింటికంటే మొదటిదీ, స్పష్టంగా కనిపించేదీ'ను అంటాడు డేవిడ్ హార్వే. ఒక్క మాటలో చెప్పాలంటే కొద్దిమంది చేతిలో పెట్టుబడిగా మారిపోయిన వ్యష్టి ఆస్తిని నిరాస్థిపరులతో కూడుకున్న సమిష్టిపై ఆధారపడి రాజ్యం కాపాడవలసి ఉంటుంది. ఈ వైరుధ్యం చివరికి పెట్టుబడిదారీ వ్యవస్థకు చేటుచేయక తప్పదని అంటాడు డేవిడ్ హార్వే. ఇదే విషయాన్ని మరొక విధంగా 'కేంద్రీకృత రాజ్యం వికేంద్రీకృత వ్యష్టి ఆస్తిని కాపాడవలసి వస్తుంద'ని చెప్తాడు. ఈ వ్యక్తీకరణ అంత సరిగా ఉన్నట్లు లేదు. మనం కొంత వివరంగా చూస్తే, రాజ్యం ప్రజలందరిదని, అటువంటి రాజ్యం సమిష్టికి వ్యతిరేకంగా వ్యష్టి ఆస్తిని కాపాడవలసి రావడం వైరుధ్యం అంటాడు రచయిత. హార్వే అభిప్రాయం అలా ఉండగా, రాజ్యం ప్రజలందరిదీ కాదని, సమిష్టిది కాదని, రాజ్యం వర్గ అణచివేత సాధనమని, పెట్టుబడిదారీ వ్యవస్థలో రాజ్యం కార్మిక వర్గాన్ని అణచివేయడానికి పెట్టుబడిదారీ వర్గం చేతిలో ఉన్న సాధనమని మార్క్స్ వివరించాడు. ఇది చరిత్ర ఋజువు చేసిన విషయం. సమిష్టి తరపున పనిచేస్తుందనుకున్న రాజ్యం ఎటువంటి పక్షపాతం లేకుండా న్యాయ పాలన చేస్తుందనుకునే రాజ్యం వస్తుగతంగా సమిష్టి సాధనం కాక పోవడంలోనే వైరుధ్యం ఉంది. ఈ అసలు విషయాన్ని హార్వే లేవనెత్తలేదు. అయితే రాజ్యానికి కావలసిన సాధన సంపత్తి ప్రజలందరూ ప్రభుత్వం ద్వారా సమకూరుస్తున్నారని, ఆ కారణంగా ప్రజలు తలచుకున్నప్పుడు రాజ్యాన్ని నియంత్రించగలరని రచయిత భావిస్తాడు. ప్రజలు సమిష్టిగా తలచుకుంటే రాజ్యానికి గడ్డుకాలం వచ్చినట్లే. మనం తప్పకుండా హార్వేతో అంగీకరించవచ్చు. అయితే ప్రజలు తమకు తాము సంఘటితం కాకుండా, సాయుధులు కాకుండా, అంతిమ విశ్లేషణలో సంఘటిత సాయుధబలమైన రాజ్యాన్ని ఎదుర్కోగలరా అన్నదే 70 సంవత్సరాలుగా జరుగుతున్న చర్చ. హార్వే సమిష్టికి ప్రాతినిథ్యం వహిస్తూన్న రాజ్యం అంటాడు. మనం సమిష్టిదిగా ప్రచారం చేయబడుతున్న రాజ్యం అంటాం. పెట్టుబడి దారీ వ్యవస్థలో రాజ్యం తనకు తాను సమిష్టికి ప్రతినిధిని అని ప్రచారం చేసుకుంటూ, సమిష్టిచే పోషించబడుతూ ప్రజలకు వ్యతిరేకంగా పెట్టుబడిదారీ వర్గానికి సేవ చేస్తుందనేది వాస్తవం. పెట్టుబడి రాజ్యాన్ని కూలగొట్టే సాయుధ విప్లవం కార్మిక రాజ్యాన్ని స్థాపించినప్పుడు కూడా రాజ్యం ప్రజలందరిదీ అవ్వదు. అది అత్యధిక ప్రజానీకానిది అయినప్పటికీ పెట్టుబడిదారులకు ప్రాతినిథ్యం వహించదు. పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పనిచేస్తుంది. వర్గ రహిత సమాజం ఏర్పడినప్పుడు రాజ్యం దుల్లిపోతుంది. ప్రపంచ సంఘం ఏర్పడుతుంది. రాజ్యం ఉనికిలో ఉన్నన్నాళ్లు, వర్గరాజ్యంగానే ఉంటుంది. ప్రజలందరి రాజ్యం అనే భావనకు అర్థంలేదు. పెట్టుబడిదారీ రాజ్యం కూల్చబడి కార్మిక రాజ్యం స్థాపించబడిన విషయాన్ని రాజ్యం తనను తాను ప్రజాభిప్రాయానికి సర్దుకోవడంగా హార్వే పరిగణించదలచుకుంటే మనకు అభ్యంతరం ఉండనవసరం లేదు. అయితే అటువంటి వ్యక్తీకరణ రాజకీయ కార్యాచరణకు ఎందుకూ పనికిరాదు. అది నడుస్తున్న చరిత్రకు దూరంగా నిలబడి మాట్లాడడం. అమెరికాలో లేదా మరొక దేశంలో రాజ్య వర్గలక్షణం మార్పుచెందడం ఎన్నికల ద్వారా సాధ్యం అని భావిస్తే అది సహజంగానే చర్చనీయాంశం. ఏది ఏమైనా సమిష్టిచే పోషించబడుతున్న రాజ్యం సమిష్టికి వ్యతిరేకంగా వ్యష్టి ఆస్తిని (పెట్టుబడిని) కాపాడడంలో వైరుధ్యం ఉందనేది వాస్తవం.

డేవిడ్ హార్వే 'ప్రజాస్వామ్యయుతంగా వ్యాపనం చేయబడిన ఆస్తి హక్కు (ఇక్కడ ఓనర్‌షిప్ అన్న పదాన్ని వాడాడు) పై ఆధారపడి అందరికీ వ్యక్తిగత ఆస్తిగల వ్యక్తుల ప్రపంచం అనే బూర్జువా ఊహాజనిత స్వప్నం ఏదైతే ఉందో అది, బలమైన కార్పొరేషన్లకు, సంస్థలకు కూడా వ్యక్తులకిచ్చే హక్కులు ఇవ్వడంతో భ్రష్టు పట్టింద'ంటాడు. కార్పొరేట్లను కూడా లీగల్ వ్యక్తులుగా గుర్తించి వాటికి కూడా వ్యక్తులకు వర్తించే ప్రాథమిక హక్కులను విస్తరించడంతో, వ్యక్తులను కార్పొరేటు సంస్థలను ఒకే బరిలో పెట్టి పోటీ పడమనడంతో సహజంగానే కార్పొరేటు సంస్థల ముందు వ్యక్తులు నిలబడలేరు కాబట్టి తమ హక్కులను కోల్పోతారన్న విషయాన్ని డేవిడ్ హార్వే ఇక్కడ ప్రత్యేకంగా లేవనెత్తాడు. మోన్‌సాంటో కార్పొరేట్ కంపెనీతో సన్నకారు రైతు పోటీపడవలసి వస్తే కష్టమే కదా! అయితే నిర్నిబంధమైన బూర్జువా స్వేచ్ఛల వ్యవస్థలో అదే జరుగుతుంది. బూర్జువా సిద్ధాంత వేత్తలు 'రాజ్యం చేసే పని ప్రైవేటు ఆస్తి రక్షణ, వ్యక్తుల లేదా సంస్థల మధ్య జరిగే ఒప్పందాలను ఏక పక్షంగా ఎవరూ ఉల్లంఘించ కుండా కాపలా కాయడం, వ్యక్తి స్వేచ్ఛల పరిరక్షణ అని, నైట్‌వాచ్ మన్ పని' అని చెప్తారు. దీనిని డేవిడ్ హార్వే ఖండించాడు.

(ఇంకా ఉంది)

(రచయిత విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు)

హెచ్‌ఆర్‌సి ముందు టిఆర్‌టి అభ్యర్థుల నిరసన

రెండేళ్ల క్రితం ఉపాధ్యాయ భర్తీ పరీక్ష (టిఆర్‌టి)కి ఎంపికైన 8,792 మందికి పోస్టింగులు కేటాయించకపోవడంతో ఏప్రిల్ 30న మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సి) కార్యాలయం ముందు మౌనదీక్ష చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. కారుణ్య మరణాల కోసం తమకు అనుమతించాలని హెచ్‌ఆర్‌సిని ఆశ్రయించినా స్పందన రాకపోవడంతో మౌన దీక్షకు దిగినట్లు తెలిపారు. ప్రభుత్వం పథకం ప్రకారం టీచర్ల పోస్టులు భర్తీ చేయకుండా ప్రభుత్వ పాఠశాలలను మూసివేసేందుకు కుట్ర పన్నిందని ఆరోపించారు. రాష్ట్రంలో 50 వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలుంటే కేవలం 8792 పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించి ఎంపికైన వారికి ఇవ్వడం లేదన్నారు. ఆందోళన కారులను పోలీసులు ఆరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. టీచర్ పోస్టులకు ఎంపికైన వారిని తక్షణమే పోస్టింగ్ ఇవ్వాలని మే 26న ఉపాధ్యాయ సంఘాలు ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహించాయి.

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం సదస్సు

ఓటర్లను ప్రలోభపెట్టే అభ్యర్థులను ఎన్నికల్లో పోటీ చేయకుండా వారిపై నిషేధం విధించేలా చట్టాలను రూపొందించాలని అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ వ్యవస్థాపకుడు త్రిలోచన్ శాస్త్రి అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రెండో వార్షికోత్సవం సందర్భంగా ఏప్రిల్ 29న నిర్వహించిన సదస్సులో పాల్గొన్నారు. పాలక పార్టీలు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాయన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలు అవసరమని, అవి డబ్బే ప్రధానంగా కార్యకలాపాలు కొనసాగించడం దారుణమన్నారు. 28 శాతం ఓట్లు వచ్చిన పార్టీలు అధికారం చేపడుతున్నా యన్నారు. ఎన్నికల నిబంధనలన్నీ రాజకీయ పార్టీలకు అనుకూలంగా ఉన్నాయన్నారు. వాస్తవాలను ప్రజలముందు ఉంచే జర్నలిస్టులపై కేసులు నమోదుచేయడం, అక్రిడిటేషన్లు రద్దుచేసే పరిస్థితి నెలకొందన్నారు. టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులుగా నగునూరి శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కె. విరాహత్ అలీ తిరిగి ఎన్నికయ్యారు.

ప్రజాస్వామిక వాదుల విడుదల కోరుతూ ధర్నాలు

విరసం ఆధ్వర్యంలో ఏప్రిల్ 28 నుండి 30 వరకు మూడు రోజుల పాటు కర్నూలు, విజయవాడ నగరాల్లో ధర్నాలు, ఏప్రిల్ 28న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభ జరిగింది. రచయితలు సమాజ చైతన్యానికి గుర్తని, వరవరరావు, సాయిబాబ తదితరుల అరెస్టు సిద్ధాంతాలకు అతీతంగా అందరూ ఖండించాలని వక్తలు అన్నారు. రచయితల అరెస్టు కేవలం వారి వ్యక్తిగత సమస్య, వారున్న ఉద్యమాల సమస్య మాత్రమే కాదని, సమాజంలో జీవిస్తున్న ప్రజలందరి సమస్య అన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా ప్రజా పోరాటాలు పోగు చేసిన ప్రజాస్వామిక విలువలు, సంస్కృతి, హక్కులు అన్నిటినీ పాలకులు ధ్వంసం చేస్తున్నారని అన్నారు. బాధ్యతాయుతంగా ప్రజల గురించి ఆలోచించే వాళ్లను ప్రధాని హత్యకు కుట్రపన్నారని ఆరోపించి అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు.

ధర్నా చౌక్‌లో మహాగర్జన

డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని పంజగుట్టలో కూల్చిన చోటనే నిర్మించాలని కోరుతూ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో కూడిన 'అంబేద్కర్‌వాదుల మహాగర్జన' మే 8న హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో జరిగింది. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ తెరాస ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు అంబేద్కర్‌కు మాల వేయనిది కెసిఆర్ మాత్రమేనన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమిని పంచుతానని మభ్యపెట్టి మోసం చేశారన్నారు. దళిత, బడుగు, బలహీన వర్గాల వ్యతిరేక కెసిఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించేంతవరకు పోరాడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు.

తెలంగాణ విద్యార్థి వేదిక నిరసన

సాయిబాబా, వరవరరావులను విడుదల చేయాలని లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మే 17న తెలంగాణ విద్యార్థి వేదిక నిరసన ప్రదర్శన నిర్వహించింది. ప్రశ్నించే గొంతులను ప్రభుత్వాలు అణిచేయడం దారుణమని విమర్శించారు. నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల, ప్రజాస్వామిక వాదులపై నిర్బంధం తీవ్రమైందని ఆరోపించారు. భీమా కోరేగావ్ కుట్ర కేసును ఎత్తివేయాలని ఆ కేసులో నిర్బంధించిన వారిని వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోర్టులు ప్రభుత్వాలకే అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ధర్నా

తెలంగాణలో విద్యారంగం సంక్షోభంలో పడిందని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ కార్యదర్శి ప్రొ. హరగోపాల్ అన్నారు. 26 మంది ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇంటర్ ఫలితాల్లో అవకతవకలకు వ్యతిరేకంగా మే 7న ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలకు బాధ్యులెవరనే అంశాన్ని ప్రభుత్వం ఇప్పటికీ తేల్చకపోవడం దారుణమన్నారు. ఇంటర్మీడియట్ బోర్డులో జరిగిన అవకతవ కలపై సమగ్ర విచారణ చేయాలని, గ్లోబరీనా సంస్థపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

ఆంధ్రప్రదేశ్‌లోని 175 అసెంబ్లీ స్థానాలకు, 25 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 11న ఎన్నికలు జరిగాయి. మే 23న వెలువడిన ఫలితాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి 151 స్థానాలను గెలుచుకుంది. తెలుగుదేశం పార్టీ 23 స్థానాలు, జనసేన పార్టీ 1 స్థానాన్ని గెలుచుకున్నాయి. 25 లోక్‌సభ స్థానాల్లో వైసిపి 22, తెలుగుదేశం పార్టీ 3 స్థానాలను గెలుచుకున్నాయి.

రాస్తారోకో చేస్తున్న రైతులు

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని పలు గ్రామాల రైతులు మే 20న రబీ ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో చేశారు. గోనెసంచుల కొరతతో ధాన్యం కొనుగోల్లు నిలిచిపోయాయి. దీంతో జోగాపూర్, మల్యాల, చందుర్తి, ఆశిరెడ్డిపల్లెకు చెందిన రైతులు గోనెసంచులు తెప్పించి కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ చందుర్తి సింగిల్ విండో కార్యాలయానికి వచ్చి రాస్తారోకోచేశారు. కొనుగోలు కేంద్రాల్లో 20 రోజుల క్రితం విక్రయించిన ధాన్యం డబ్బులు ఖాతాల్లో జమ కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు జిల్లా కేంద్రంలోని పిఏసిఎస్ ఎదుట ఆందోళనకు దిగారు. మెదక్ మార్కెట్ యార్డ్ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన 270 మందిలో 15 మందికి మాత్రమే డబ్బులు వచ్చాయి మిగతావారికి ఇప్పటివరకు డబ్బులు రాలేదు.

డిటిఎఫ్ కాళేశ్వరం యాత్రను అడ్డుకున్న పోలీసులు

డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సభ్యులైన ఉపాధ్యాయులకు మూడురోజుల అధ్యయన తరగతులను మే 21 –23 మధ్య ఏర్పాటు చేసుకొని, మూడో రోజు ముగింపుగా కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శించాలని నిర్ణయించింది. మంచిర్యాల జిల్లా కమిటీ నిర్వహణలో జరిగిన రెండు రోజుల అధ్యయన తరగతుల తరువాత మూడో రోజు మే 23న ఉదయమే 60 మంది ఉపాధ్యాయులు కాళేశ్వరం ప్రాజెక్టు చూడడానికి బస్సులో బయలుదేరారు. గత నాలుగు సంవత్సరాలుగా కాళేశ్వరం ప్రాజెక్టును ఒక యాత్రా స్థలంగా మార్చి ఎందరో యాత్రికులను అక్కడికి తీసుకువెళ్లిన ప్రభుత్వం స్వతంత్రంగా ఉపాధ్యాయులు సందర్శించాలని అనుకోవడాన్ని మాత్రం అంగీకరించలేకపోయింది. మంచిర్యాల నుంచి బయలుదేరిన బస్సు కొద్ది దూరం వెళ్లగానే జైపూర్ పోలీసు స్టేషన్‌లో బస్సును ఆపి ఉపాధ్యాయులను ఆరు గంటల పాటు నిర్బంధించి వేధించారు. వీ

దాడులు, ఎన్‌కౌంటర్‌లు

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలోని కుర్‌ఖెడా వద్ద జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులను నిలిపివేయాలని మావోయిస్టులు రోడ్డు నిర్మాణ సంస్థకు చెందిన 36 వాహనాలకు నిప్పుపెట్టారు. ఇదే ప్రాంతంలో జవాన్లు ప్రయాణిస్తున్న వాహనాన్ని లక్ష్యంగా చేసుకొని మే 1న మావోయిస్టులు ఐఇడి బాంబు పేల్చారు. దీంతో 15 మంది జవాన్లు, ఒక డ్రైవర్ మృతిచెందారు. ఇన్‌ఫార్మర్ల నెపంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కరిగుండం గ్రామానికి చెందిన ఇద్దరు గిరిజనులను మే 5న మావోయిస్టులు కిడ్నాప్‌చేసి విచారణ అనంతరం చంపేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా దుమ్ముగూడెంలో రోడ్డు నిర్మాణానికి ఉపయోగిస్తున్న 6 వాహనాలకు మే 5న మావోయిస్టులు నిప్పంటించారు. ఒడిశాలోని కొరాపుట్ జిల్లా కిటువాకంఠి అటవీ ప్రాంతంలో మే 8న జరిగిన ఎదురు కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ, సుక్మా జిల్లాల సరిహద్దుల్లో అరన్‌పూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మరణించారు.

ఇష్రత్ కేసులో వంజారా, అమీన్‌లకు విముక్తి

ఇష్రత్ జహాన్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసు నుంచి గుజరాత్ మాజీ ఐపిఎస్ అధికారులు డి.జి. వంజారా, ఎన్.కె. అమీన్‌లకు విముక్తి లభించింది. వీరి ప్రాసిక్యూషన్‌కు గుజరాత్ ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో.. తమను ఈ కేసు నుంచి డిశ్చార్జి చేయాలని ఇద్దరూ సిబిఐ ప్రత్యేక కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వీరి ప్రాసిక్యూషన్‌ను అనుమతించనందున డిశ్చార్జి దరఖాస్తులను అనుమతిస్తున్నానని, కేసు విచారణ ప్రక్రియ నుంచి వీరి పేర్లను తొలగిస్తున్నామని మే 2న న్యాయమూర్తి జెకె పాండ్య వెల్లడించారు.

సిజెఐకి క్లీన్‌చిట్‌పై నిరసన

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సిజెఐ) జస్టిస్ రంజన్ గొగోయ్‌కి లైంగిక వేధింపుల కేసులో జస్టిస్ ఎస్.ఎ. బోబ్డే నేతృత్వాన గల త్రిసభ్య అంతర్గత విచారణ కమిటీ క్లీన్‌చిట్ ఇవ్వడంపై నిరసనలు కొనసాగుతున్నాయి. కోర్టు వెలుపల మహిళా న్యాయవాదులు, స్వచ్ఛంద, హక్కుల సంస్థల ప్రతినిధులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. విచారణ నిష్పక్షపాతంగా నిర్వహించాలని హక్కుల కోసం పోరాడుతున్న 300 మందికి పైగా మహిళలు డిమాండ్ చేశారు. నివేదికను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఇది 'చీకటి, విచారకరమైన రోజు' అని అభివర్ణించారు. సిజెఐపై నివేదికను బహిర్గతం చేయకపోవడం న్యాయవ్యవస్థ విశ్వసనీయతకు మాయని మచ్చగా మిగిలిపోతుందని అన్నారు. సిజెఐ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మహిళా న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు సుప్రీంకోర్టు ముందు ఏప్రిల్ 7న ఆందోళన చేశారు.

లోక్‌సభ ఎన్నికల పోటీలో నేర చరితులు

లోక్‌సభ 542 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 8,049 మంది పోటీలో ఉండగా వారిలో 1,500 మందిపై క్రిమినల్ కేసులు ఉండగా 1,070 మంది అత్యాచారాలు, హత్యలు, అపహరణలు, మహిళలపై నేరాలు వంటి తీవ్రమైన కేసులు ఎదుర్కొంటున్నారు. వీరిలో 80 శాతం మంది కోటీశ్వరులే. బిజెపి తరపున 433 మంది పోటీ చేస్తుండగా 175 మంది (40 శాతం)పై క్రిమినల్ కేసులు ఉన్నాయి. కాంగ్రెస్ నుంచి 419 మంది పోటీలో ఉండగా వారిలో 164 (39 శాతం) మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. బిఎస్‌పికి చెందిన 381 మంది అభ్యర్థుల్లో 85 మంది (22 శాతం), సిపిఎం 69 మంది అభ్యర్థుల్లో 40 మంది (58 శాతం), ఇండిపెండెంట్లు 3,370 మంది అభ్యర్థుల్లో 400 మంది (12 శాతం) అభ్యర్థులపైన క్రిమినల్ కేసులు ఉన్నాయని ఎడిఆర్ సంస్థ మే 13న వెల్లడించింది. 2009 ఎన్నికల్లో 15 శాతం మంది నేరచరితులుండగా 2014లో వారి సంఖ్య 17 శాతానికి... ప్రస్తుతం 19 శాతానికి పెరిగింది.

అరుణాచల్ ప్రదేశ్‌లో 11 మంది కాల్చివేత

అరుణాచల్ ప్రదేశ్‌లో నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్ (ఎన్ఎస్‌సిఎన్)సంస్థ సభ్యులు నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌డిపి)కి చెందిన ఖోనా సిటింగ్ ఎంఎల్ఏ తిరంగ్ అబోహ్(42) ప్రయాణిస్తున్న కాన్వాయ్‌పై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో అబోహ్ సహా ఏడుగురు కుటుంబ సభ్యులు నలుగురు భద్రతా సిబ్బంది చనిపోయారు. ఖోనా జిల్లాకు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న బోగాపనీ ప్రాంతంలో మే 21న ఈ ఘటన జరిగిందని పోలీసులు అధికారులు తెలిపారు.

పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

పార్లమెంట్‌లోని 542 స్థానాలకు ఏడు దశలుగా జరిగిన ఎన్నికల్లో బిజెపి అత్యధిక స్థానాలు సాధించింది. ఎన్‌డిఏ-348 స్థానాల్లో బిజెపి-303, శివసేన-18, జెడి(యు)-16, ఎల్‌జెపి-6, అన్నాడిఎంకె-1, అప్నాదల్-2, అకాలీదళ్-2 స్థానాల్లో గెలుపొందాయి. యుపిఏ-94 స్థానాల్లో కాంగ్రెస్-52, డిఎంకె-23, ఎన్‌సిపి-4, ముస్లింలీగ్-3, నేషనల్ కాన్ఫరెన్స్-4, ఇతరులు-8 స్థానాల్లో గెలుపొందారు. ఇతర పార్టీలైన బిఎస్‌పి-10, ఎస్‌పి-5, ఆర్ఎల్‌డి-1, సిపిఐ-2, సిపిఎం-3, ఆర్ఎస్‌పి-1, వైఎస్ఆర్‌సిపి-22, టిడిపి-3, తృణముల్-22, బిజెడి-13, టిఆర్ఎస్-9, యుడిఎఫ్-1, ఎంఐఎం-2, ఆప్-1, ఇతరులు-6 స్థానాల్లో గెలుపొందారు. ఒడిశాలోని 146 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బిజూ జనతాదళ్ 113, కాంగ్రెస్-9, బిజెపి-23, ఇతరులు-1 స్థానంలో గెలుపొందారు. ఒడిశాలో నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్ ఐదోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనుంది. సిక్కింలోని 32 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్-15, సిక్కిం క్రాంతికారి మోర్చా-17 స్థానాల్లో గెలుపొందింది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని 60 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బిజెపి-40, కాంగ్రెస్-7, నేషనల్ పీపుల్స్ పార్టీ-4, ఇతరులు-9 స్థానాల్లో గెలుపొందారు.

గుజరాత్‌లో ఘోర అగ్నిప్రమాదం

గుజరాత్‌లోని సూరత్‌లో ఓ నాలుగు అంతస్తుల భవనంలో మే 23న ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇరవై రెండు మంది విద్యార్థులు మరణించారు. నాలుగు అంతస్తులో కోచింగ్ సెంటర్ నడుస్తోంది. తరగతులు జరుగుతుండగా ఒక్కసారిగా మంటలు, పొగ చుట్టుముట్టడంతో భయంతో కొంతమంది విద్యార్థులు దారిలేక కిటీల నుంచి కిందికి దూకేశారు. కొంతమంది మంటలకు ఆహుతి అయ్యారు.

జర్నలిస్టులపై దాడులు

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పశ్చిమ బెంగాల్‌లో జర్నలిస్టులపై భౌతిక దాడులకు పాల్పడడం ఎంత మాత్రం సహించరానిదని ఎడిటర్స్ గిల్డ్ అభిప్రాయపడింది. పాత్రికేయులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎడిటర్స్ గిల్డ్ ఎన్నికల సంఘానికి (ఇసి)కి విజ్ఞప్తి చేసింది. జర్నలిస్టులపై దాడులు గర్హనీయమనీ, ముఖ్యంగా ఎన్నికలపై నిష్పక్షపాతంగా వార్తలు సేకరించే పాత్రికేయులపై దాడులు జరపరాదని ఎడిటర్స్ గిల్డ్ తెలిపింది. వీ

స్పెయిన్ ఎన్నికలు

స్పెయిన్ పార్లమెంట్‌కు ఏప్రిల్ 28న ఎన్నికలు జరిగాయి. మొత్తం 350 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో సోషలిస్ట్ వర్కర్స్ పార్టీ (పిఎస్ఒఇ) 123 సీట్లు సాధించింది. ప్రతిపక్ష పీపుల్స్ పార్టీ (పిపి)కి 66 సీట్లు వచ్చాయి. వామపక్ష పొడెమస్ పార్టీకి 42 సీట్లు వచ్చాయి. మితవాద ఒక్స్ పార్టీ 24 సీట్లు గెలుచుకుంది. సిటిజన్స్ పార్టీ 57, కెటలానియా ఇండిపెండెంట్ పార్టీ 13 సీట్లు గెలుచుకున్నాయి. పిఎస్ఒఇ నేత, ప్రధాని పెడ్రో శాంచేజ్ మరోసారి ప్రధాని పదవి చేపట్టారు.

జపాన్ నూతన చక్రవర్తి నరుహిటో

జపాన్ చక్రవర్తి అకిహిటో తన బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఏప్రిల్ 30న జపాన్ రాజధాని టోక్యోలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 1989లో అకిహిటో జపాన్ చక్రవర్తిగా బాధ్యతలు స్వీకరించారు. అనారోగ్యం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మే 1న ఆయన పెద్ద కుమారుడు యువరాజు నరుహిటో జపాన్ 126వ చక్రవర్తిగా బాధ్యతలు స్వీకరించారు.

చిలీలో ఆందోళనలు

చిలీలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోలన బాట పట్టారు. ఏప్రిల్ 30న రాజధాని శాంటియాగోలో దాదాపు అరవై వేల మందికి పైగా యూనివర్సిటీ, హైస్కూల్ విద్యార్థులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎడ్యుకేషన్ లోన్స్‌కు సంబంధించి బ్యాంకులు విద్యార్థుల నుంచి అధిక శాతం వడ్డీలు వసూలు చేస్తుంటాయి. బ్యాంకులపై ప్రభుత్వ నియంత్రణ ఏమీ లేదు. బ్యాంకుల అధిక మొత్తంలో వడ్డీలు వసూలు చేయడంతో చదువు భారంగా మారింది. విద్యా విధానాల్లో మార్పులు తీసుకువస్తానని చెప్పి అధ్యక్ష పదవి చేపట్టిన సెబాస్టియన్ పినేరా మాట తప్పారని విద్యార్థులు విమర్శిస్తున్నారు. వెంటనే విద్యావ్యవస్థ అభివృద్ధి కోసం బడ్జెట్‌లో అదిక మొత్తంలో నిధులు కేటాయించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

అల్బేనియాలో నిరసనలు

అల్బేనియాలో ప్రధాని ఈది రమాకు వ్యతిరేకంగా తీవ్ర నిరసనలు మొదలయ్యాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈది రమా తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ప్రజలు ఆందోళనలు చేశారు. రాజధాని టిరాన్‌లో వేలాది మంది నిరసనకారులు ప్రధానికి వ్యతిరేకంగా నినాదాలు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసనలో పాల్గొన్నారు. ఈదిపై న్యాయవిచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

మేడే రోజున కార్మికుల ప్రదర్శనలు

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా వివిధ దేశాల్లో కార్మికులు నిరసన ప్రదర్శలు చేశారు. ఫ్రాన్స్, దక్షిణ కొరియా, ఫిలిప్పైన్స్, మలేషియా, ఇండోనేషియా, తైవాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, బర్మా మొదలైన దేశాలలో కార్మికులు ర్యాలీ తీశారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో పెద్ద ఎత్తున కార్మికులు ఆందోళనలు చేపట్టారు. అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రన్ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. ర్యాలీలో కార్మిక సంఘాలతో పాటు ఎల్లోవెస్ట్ ఉద్యమకారులు కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దక్షిణ కొరియాలో కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు భార్యీ ర్యాలీ నిర్వహించారు. కార్మికులకు మెరుగైన వసతులు కల్పించాలని, వైద్య సదుపాయాలు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో వస్త్ర పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు తమ సమస్యల గురించి ప్రస్తావిస్తూ, నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో కుటుంబ పోషన భారంగా మారిందని, జీతాలను పెంచి తక్షణమే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పనామా ఎన్నికలు

పనామా అధ్యక్ష పదవికి మే 5న ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో డెమొక్రాటిక్ రెవల్యూషనరీ పార్టీ (పిఆర్‌డి) నేత లారెంటినో నిటో కార్టిజో గెలుపొందారు. ఆయనకు 33.35 శాతం ఓట్లు వచ్చాయి. ఆయన సమీప ప్రత్యర్థి డెమొక్రటిక్ చేంజ్ పార్టీ నేత రోములో రౌక్స్‌కు 31 శాతం ఓట్లు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థి రికార్డో లొంబానాకు 19 శాతం ఓట్లు పడ్డాయి.

రాయిటర్స్ జర్నలిస్టుల విడుదల

2017లో మయన్మార్‌లో రోహింగ్యా ముస్లింలపై భద్రతా బలగాలు, బౌద్ధ మతస్తులు కలిసి జరిపిన హింసాకాండపై పరిశోధనాత్మక కథనాలు ప్రచురించి జైలు నిర్బంధానికి గురైన ఇద్దరు జర్నలిస్టులను ప్రభుత్వం మే 7న విడుదల చేసింది. వా లోన్, క్యావ్‌సో వూ అనే ఇద్దరు రాయిటర్స్ జర్నలిస్టులు మయన్మార్‌లో రోహింగ్యా ముస్లింలపై జరుగుతున్న నరమేధం, అఘాయిత్యాలపై వరుస కథనాలు ప్రచురించారు. దీంతో ప్రభుత్వం వీరిద్దరికి ఏడేండ్ల జైలు శిక్ష విధించింది. ఈ అక్రమ నిర్బంధాన్ని నిరసిస్తూ ప్రపంచవ్యాప్తంగా నిరసనలు జరిగాయి. ప్రపంచ దేశాల ఒత్తిడితో మయన్మార్ దేశాధ్యక్షుడు విన్‌మైంట్ ఈ ఇద్దరికి క్షమాభిక్షను ప్రకటించారు.

గ్రీస్ ప్రభుత్వానికి విశ్వాస పరీక్ష

గ్రీస్ ప్రధాని అలెక్సి సిప్రాపై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. మే 10న జరిగిన ఈ విశ్వాస పరీక్షలో మొత్తం 300 మంది సభ్యులున్న అసెంబ్లీలో 289 మంది పాల్గొన్నారు. ప్రభుత్వానికి అనుకూలంగా 153 మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 136 మంది ఓటు వేశారు. ప్రభుత్వ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు ఈ అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి.

ఆస్ట్రేలియా ప్రధానిగా మోరిసన్

ఆస్ట్రేలియా పార్లమెంట్‌లోని 151 స్థానాలకు మే 18న ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ 78 స్థానాలను గెలుచుకున్నది. దీంతో ప్రస్తుత ప్రధాని స్కాట్ మోరిసన్ మూడవ సారి ప్రధానమంత్రి పదవిని చేపట్టారు. మొత్తం 151 సీట్లకు 1.6 కోట్లమంది ఆస్ట్రేలియన్లు ఓటు వేశారు. ప్రతిపక్ష లేబర్ పార్టీకి 67 సీట్లు వచ్చాయి.

బంగ్లాదేశ్‌లో సమ్మె

బంగ్లాదేశ్‌లోని ప్రభుత్వ జనపనార మిల్లులోని కార్మికులు సమ్మెబాట పట్టారు. మూడు నెలలుగా తమకు జీతాలు రావడం లేదని, అధిక వడ్డీలకు అప్పులు చేసి రోజులు వెల్లదీస్తున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మే 14 నుంచి ప్రారంభమైన ఈ సమ్మెలో 27 ప్రభుత్వ జనపనార తయారీ మిల్లులోని 80 వేల మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొంటున్నారు. కనీసం రంజాన్‌కు ముందుగా తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

ఎల్లో వెస్ట్ ఉధృతం

ఫ్రాన్స్‌లో గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న ఎల్లో వెస్ట్ (పసుపు కోటు) ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రన్ ఇంధనంపై పన్ను పెంచడం, ఆర్థిక సంస్కరణలు అమల్లోకి తీసుకొస్తానని ప్రకటించడంతో ఈ ఉద్యమం మొదలైంది. మే 26న పారిస్, బ్రస్సెల్స్, ఏమిన్స్ మొదలైన నగరాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బ్రస్సెల్స్‌లో ఆందోళకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ జరిగింది. నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులు పెద్ద ఎత్తున బాష్పవాయువును ప్రయోగించారు. ఈ ఘర్షణలో కొంతమంది ఆందోళనకారులు తీవ్రంగా గాయపడ్డారు. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం: ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(ఏప్రిల్ 1 నుండి ఏప్రిల్ 30, 2019 వరకు తెలంగాణలోని 10 జిల్లాలు (968), ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలలో (865) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1833)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	2	2	-	16	21	12	13	5	4	3	2	1	1	3	29	32	-	-	-	4	13
హైదరాబాద్	-	-	-	13	9	4	7	4	3	5	8	9	4	6	18	13	-	-	-	-	4
కరీంనగర్	-	3	2	5	6	2	3	2	1	2	1	3	2	3	15	13	-	-	-	-	6
ఖమ్మం	-	-	-	6	10	1	2	-	1	4	1	1	2	5	28	12	-	-	-	-	10
మహబూబ్‌నగర్	-	2	-	4	7	-	4	3	2	-	4	4	10	8	42	6	-	-	-	-	6
మెదక్	1	19	2	4	2	9	3	1	1	3	3	2	4	17	21	14	-	-	-	3	4
నల్గొండ	-	2	1	4	7	3	5	2	1	3	2	1	2	4	17	12	-	-	-	-	5
నిజామాబాద్	-	3	-	6	8	4	3	1	2	4	2	4	-	5	23	17	-	-	-	-	3
వరంగల్	-	9	1	4	3	5	2	1	1	3	5	4	2	11	16	19	-	-	-	3	1
వికారాబాద్	-	2	-	4	6	3	5	2	2	3	3	6	4	3	19	16	-	-	-	-	7
తెలంగాణ	**3**	**42**	**6**	**66**	**79**	**43**	**47**	**21**	**18**	**30**	**31**	**35**	**31**	**65**	**228**	**154**	**-**	**-**	**-**	**10**	**59**
అనంతపురం	-	1	-	9	16	1	2	-	-	1	-	5	8	10	42	-	-	-	-	-	9
చిత్తూరు	-	-	-	3	4	4	7	-	1	2	3	3	11	3	21	3	-	-	-	-	13
కడప	-	-	-	1	3	-	-	-	-	1	1	1	-	-	4	7	-	-	-	-	-
గుంటూరు	-	-	-	5	3	2	4	2	3	3	2	4	2	6	17	13	-	-	-	-	4
కృష్ణా	-	-	-	4	3	4	3	1	1	3	3	2	1	3	21	17	-	-	-	-	3
కర్నూలు	-	2	-	3	5	2	3	2	2	4	2	3	1	2	23	19	-	-	-	-	2
తూర్పు గోదావరి	-	-	-	7	8	3	3	2	4	8	-	-	4	4	30	16	-	-	-	1	-
ప్రకాశం	-	-	-	2	4	2	3	-	1	2	1	3	-	4	18	13	-	-	-	-	4
శ్రీకాకుళం	-	-	-	2	5	2	3	1	1	5	-	-	1	2	16	9	-	-	-	-	2
పశ్చిమ గోదావరి	-	-	-	5	6	2	3	1	1	2	-	2	2	3	14	12	-	-	-	-	3
నెల్లూరు	-	-	-	4	3	1	2	-	1	3	3	2	2	1	17	15	-	-	-	-	5
విజయనగరం	-	-	-	4	2	2	4	2	1	2	1	2	-	2	16	9	-	-	-	-	5
విశాఖపట్నం	-	-	-	8	12	1	3	-	1	3	2	-	6	-	26	11	-	-	-	11	4
ఆంధ్రప్రదేశ్	**-**	**3**	**-**	**57**	**74**	**26**	**40**	**11**	**17**	**39**	**18**	**27**	**38**	**40**	**265**	**144**	**-**	**-**	**-**	**12**	**54**


వీక్షణం విడిప్రతి కొనుగోలు కోసం

మీ సమీపంలోని ఈ కింది న్యూస్‌స్టాల్స్‌లో వీక్షణం విడిప్రతి కొనుక్కోవచ్చు

రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ (సోల్ డిస్ట్రిబ్యూటర్)	అబిడ్స్, హైదరాబాద్	96666 80857
నవోదయ బుక్‌హౌస్	కాచిగూడ, హైదరాబాద్	90004 13413
సహచర బుక్‌మార్క్	బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్	98483 48173
బాల రాజేశ్వర బుక్ డిపో	నల్లకుంట బస్ స్టాప్ హైదరాబాద్	9705055738
వెంకటేశ్వర బుక్‌స్టాల్, స్టేషనరీ	నల్లకుంట, శంకర్‌మఠ్ హైదరాబాద్	040-66131071
ఫస్ట్ లక్కీ పాన్‌షాప్	విద్యానగర్ సిగ్నల్స్ హైదరాబాద్	9848672831
సుధాకర్ బుక్‌స్టాల్	సన్‌మాన్ హోటల్ పక్కన, తార్నాక హైదరాబాద్	9949337605
వెంకటేశ్వర బుక్‌స్టాల్	రామ్‌నగర్ గుండు హైదరాబాద్	9502964995
భవాని బుక్‌స్టాల్	శివం రోడ్ హైదరాబాద్	9849836996
శ్రీభవాని బుక్‌స్టాల్	శివం రోడ్ (ఇండియన్ బ్యాంక్ దగ్గర) హైదరాబాద్	9640712555
ఓరియన్ బుక్‌స్టాల్	అంబర్‌పేట్ (శ్రీరమణ టాకీస్ దగ్గర) హైదరాబాద్	7702535137
అరవింద్ బుక్ స్టాల్	రామంతాపూర్ (టివి స్టూడియో ఎదురుగా) హైదరాబాద్	8977995537
నేషనల్ బుక్‌హౌస్	అబిడ్స్, హైదరాబాద్	9394495189
దుర్గా భవన్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9030656640
డైమండ్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9885127491
రాజు రామ్‌దాస్ బుక్‌స్టాల్	మెహదీపట్నం, హైదరాబాద్	7799244409
రిలయబుల్ బుక్ సెంటర్	నానల్‌గూడ, హైదరాబాద్	040-23512447
ఇస్పెక్ట్రం బుక్‌హౌస్	లంగర్‌హౌజ్, హైదరాబాద్	98486 68354
శ్రీ లక్ష్మి బుక్‌స్టాల్	హైదర్‌గూడ, హైదరాబాద్	98855 81249
మల్లికార్జున బుక్‌స్టాల్	దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్	90594 40756
సుధీర్ బుక్‌స్టాల్	తార్నాక, హైదరాబాద్	95426 04166
లడ్డు బుక్‌స్టాల్	పంజగుట్ట, హైదరాబాద్	99492 15135
వినోద్ బుక్‌స్టాల్	సరూర్‌నగర్, హైదరాబాద్	95536 03603
రాజారెడ్డి బుక్‌స్టాల్	చందానగర్ బిఎచ్ఇఎల్	93466 07648
నవ తెలంగాణ బుక్ హౌస్	చిక్కడపల్లి, హైదరాబాద్	...
నవ తెలంగాణ బుక్ హౌస్	బాగ్‌లింగంపల్లి-సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్	...
నవ తెలంగాణ బుక్ హౌస్	నామ్‌దేవ్‌వాడ, నిజామాబాద్	...
నవ తెలంగాణ బుక్ హౌస్	సుందరయ్య భవన్, నల్గొండ	...
నవ తెలంగాణ బుక్ హౌస్	జగ్‌జీవన్‌నగర్, న్యూ బస్‌స్టాండ్, మహబూబ్‌నగర్	...
నవ తెలంగాణ బుక్ హౌస్	బాప్టిస్ట్ చర్చ్ కాంప్లెక్స్, మొదటి అంతస్తు, హనుమకొండ	...
నవ తెలంగాణ బుక్ హౌస్	పాత సిపిఐ (ఎం) ఆఫీస్, బాలాజీనగర్, ఖమ్మం	...
రాజ్ బుక్స్ స్టేషనరీ	ఓల్డ్ బస్‌స్టాండ్ దగ్గర, మెదక్ రోడ్, సిద్దిపేట్	87905 60097
అక్షర బుక్ వరల్డ్, ఎటిసి మార్కెటింగ్	న్యూ టౌన్, మహబూబ్‌నగర్	90102 10464
శ్రీ స్వయం రాజరాజేశ్వర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుస్నాబాద్	90592 85948
భాస్కర్ పాన్ షాప్ & జనరల్ స్టోర్	కోహెడ	95021 82545
భండారి కిష్టయ్య బుక్‌స్టాల్	ఫైర్‌స్టేషన్ దగ్గర, గోదావరిఖని	98497 93836
గణేష్ బుక్‌స్టాల్	కళాభారతి ఎదురుగా, కరీంనగర్	97019 99007
వినయ్ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మంచిర్యాల	94407 57503
పాండు బుక్‌స్టాల్, కూల్‌డ్రింక్స్	ఆర్‌టిసి కాంప్లెక్స్, మిర్యాలగూడ	98857 38144
శరత్ బుక్‌స్టాల్	షాప్ నం. 3, ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుజూరాబాద్	98662 73720
సత్యసాయి బుక్‌స్టాల్	ఖమ్మం	79890 81728
రాజన్న బుక్ స్టాల్	హనుమకొండ చౌరస్తా	93955 07773
ఎ.ఎచ్. వీలర్ బుక్‌స్టాల్	వరంగల్ రైల్వే స్టేషన్	70757 59274
మహాకవి శ్రీశ్రీ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, పార్వతీపురం	73825 60366
మణి బుక్‌స్టాల్	సండేమార్కెట్, నెల్లూరు	73862 23538
సురేష్ బుక్‌స్టాల్	శివాలయం వీధి, ప్రొద్దటూరు	81210 02112
క్రిసెంట్ న్యూస్ ఏజెన్సీ	కడప	98852 35846
పద్మావతి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, అనంతపూర్	73965 09767
అనేక బుక్‌స్టాల్	ఏలూరు రోడ్డు, విజయవాడ	92472 53884
మైత్రి బుక్‌హౌస్	మజీద్ వీధి, అరండల్‌పేట, విజయవాడ	98486 31604
రాజేష్ బుక్‌సర్వీస్	ఆర్‌టిసి బస్‌స్టేషన్ కాంప్లెక్స్, విశాఖపట్నం	99483 19842
వి. భాస్కర్ న్యూస్‌పేపర్ ఏజెన్సీ	డాబా గార్డెన్, విశాఖపట్నం	99482 90318
రాఘవేంద్ర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, ఒంగోల్	90595 23091
శ్రీదేవి సాయి కూల్‌డ్రింక్స్, కమ్యూనికేషన్స్	దేవి చౌక్, రాజమండ్రి	98489 84394

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 215 - June 2019 • ISSN 2231-6892
• RNI Regn.No.APTEL/2003/11482 • Published on 27/5/2019 • Postal Regn. No. HD/1100/2017-19

Date of Posting : 29th, 30th



వరవరరావు కవిత్వ విశ్లేషణ

వ్యక్తిత్వమే కవిత్వం


పాణి

మలుపు ప్రచురణలు

పేజీలు: 114 వెల: రు. 100

ప్రతులకు: **మలుపు బుక్స్**
ఫ్లాట్ నం. 302, 3వ ఫ్లోర్, ఎంఎస్‌కె టవర్స్,
స్ట్రీట్ నం. 11, హిమాయత్‌నగర్,
హైదరాబాద్-029; ఫోన్: 9866559868

Advt.



భారతదేశ చరిత్ర

సామాజిక సాంస్కృతిక దృక్పథం

డా. కత్తి పద్మారావు

లోకాయత ప్రచురణలు

పేజీలు: 586 వెల: రు. 500

ప్రతులకు: **కత్తి స్వర్ణకుమారి**
లోకాయత ప్రచురణలు, లుంబినీవనం,
అంబేద్కర్ కాలనీ, పొన్నూరు-522124, గుంటూరు జిల్లా
ఫోన్: 9849741695; ఈమెయిల్: padmaraokathi@yahoo.co.in

Advt.




అరుణోదయ రామారావు స్మృతిలో

నా కోసం

ఎదురుచూడు...

పేజీలు: 264
వెల: రు. 150



అరుణోదయ రామన్న యాదిలో..

పేజీలు: 96
వెల: రు. 50

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య
ప్రచురణలు

ప్రతులకు:
మార్క్స్ భవన్, 658, విద్యానగర్, 7వ లైన్, హైదరాబాద్.
నవ తెలంగాణ బుక్ హౌస్, చిక్కడపల్లి, హైదరాబాద్.
నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్.
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

Advt.

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao